

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



యూరియా కొరతపై ప్రభుత్వం దృష్టి
రాష్ట్రానికి రావాల్సింది లక్షా 50 వేల టన్నులు
దీనికోసం కేంద్రంతో నిరంతర సంప్రదింపులు
10 రోజుల్లో 31,632 టన్నుల రాక!
12

శుక్రవారం | 22-8-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 128 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, బహుళపక్షం, తిథి: చతుర్థశి ఉ.11:56 తదుపరి అమావాస్య, నక్షత్రం: ఆశ్లేష రా.12:17 తదుపరి మఖ, వర్జ్యం: మ.1:01-2:37, దుర్ముహూర్తం: ఉ.8:33-9:23, మ.12:42-1:32, అమృతఘడియలు: రా.10:40-12:17, రాహుకాలం: ఉ.10:30-12:00, సూర్యోదయం: 6:03, సూర్యాస్తమయం: 6:32 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

బీమాపై ధీమా!

మధ్యతరగతి ప్రజలకు భారీ ఊరట
ఆరోగ్య, టెర్మ్ పాలసీలకు పూర్తి ప్రయోజనం
పెట్టుబడుల తరహా సాధారణ, యులిప్ పాలసీల విషయంలో 'రిస్క్' మేరకే మినహాయింపు

జీఎస్టీలో ఇకపై 2 శ్లాబులే!

ప్రస్తుత 4 పన్ను శ్లాబులను 5%, 18%కు కుదించే ప్రతిపాదనలకు మంత్రుల బృందం ఓకే
జీఎస్టీ కౌన్సిల్ తుది నిర్ణయమే తరువాయి
90% నిత్యావసరాల ధరలు తగ్గే అవకాశం
దిగిరానున్న గృహోపకరణాలు, వాహనాల ధరలు
దీపావళికల్లా అమల్లోకి తెచ్చేలా కేంద్రం చర్యలు

ఆరోగ్య, జీవిత బీమాపై జీఎస్టీ పూర్తిగా మినహాయింపు

జీఎస్టీ కౌన్సిల్‌కు మంత్రుల బృందం సిఫారసు
పాలసీల ప్రీమియం 18% తగ్గే చాన్స్



న్యూఢిల్లీ, ఆగస్టు 21: అడ్డగోలు వైద్య ఖర్చులతో కుటుంబాలు కుదేలవకుండా తక్కువ ప్రీమియంతోనే ఆరోగ్య బీమా అందబోతోంది. అనుకోనిదేదైనా జరిగితే కుటుంబాలు రోడ్డునపడకుండా ఆదుకునే జీవిత బీమాకు అయ్యే వ్యయం తగ్గబోతోంది. ఏళ్ల నుంచీ ఉన్న బీమా ప్రీమియంలపై వస్తుసేవల పన్ను (జీఎస్టీ) మినహాయింపు డిమాండ్ తీరబోతోంది. మధ్యతరగతి జీవితాలకు ఊరట కలగబోతోంది. బీమా ప్రీమియంలపై జీఎస్టీని పూర్తిగా తొలగించాలని జీఎస్టీ హేతుబద్ధీకరణపై ఏర్పాటైన మంత్రుల బృందం తాజాగా సిఫారసు చేసింది. ఇది అమల్లోకి వస్తే దేశంలో బీమా ప్రీమియంలు 18 శాతం వరకు తగ్గే అవకాశముంది. దీనికితోడు జీఎస్టీ నుంచి పేద, మధ్యతరగతి వర్గాలకు ఉపశమనం లభించేదిశగా మరో ముందడుగు పడింది. జీఎస్టీ నాలుగు పన్ను రేట్లను రెండు శ్లాబుల (5%, 18%)కు కుదించే ప్రతిపాదనలను మంత్రుల బృందం ఆమోదించింది. దీనిపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో కూడిన జీఎస్టీ కౌన్సిల్ తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. వచ్చే నెలలో జీఎస్టీ కౌన్సిల్ సమావేశం జరగనుంది. పన్ను రేట్ల హేతుబద్ధీకరణ, బీమా ప్రీమియంలపై పన్ను మినహాయింపు ప్రతిపాదనలపై చర్చించి.. అవసరమైన

మిగతా 2వ పేజీలో...

ఎన్నిసార్లు చెప్పినా వినరేం?



గాడితప్పుతున్న ఎమ్మెల్యేలపై సీఎం సీరియస్

పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవు!
ఆ తర్వాత బాధపడి ప్రయోజనం ఉండదు
వారిని కంట్రోల్ చేసే బాధ్యత పూర్తిగా మీదే
మీ పరిధిలోని ఎమ్మెల్యేలను హెచ్చరించండి
ఇన్‌చార్జి మంత్రులకు చంద్రబాబు ఆదేశం
చెడు వ్యాపించినంత వేగంగా మంచి జనంలోకి వెళ్లదు
మనం చేసిన మంచిపై చర్చ జరగాలి
కానీ ఎమ్మెల్యేల వివాదాలపై జరుగుతోంది
ఇది మంచి పరిణామం కాదు
రాష్ట్రంలో క్రిమినల్ మాఫియా..
ప్రభుత్వంపై బురదజల్లడమే వారి పని
ఫైళ్ల క్లియరెన్స్‌లో వేగం పెంచండి: సీఎం


మంత్రివర్గ సమావేశంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, సీఎస్, మంత్రులు

అమరావతి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): 'ఎమ్మెల్యేలు గాడి తప్పుతున్నారు. విమర్శలు.. వివాదాలకు తావులేకుండా పనిచేయాలని ఎన్నిసార్లు చెప్పినా పెడచెవిన పెడుతున్నారు. కొంత మంది ఎమ్మెల్యేల వ్యవహారశైలి కారణంగా ప్రభుత్వం చేస్తున్న మంచి జనంలోకి వెళ్లడం లేదు. చెడు వ్యాపించినంత వేగంగా మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లలేం. పదే పదే తప్పులు పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవు. ఆ తర్వాత బాధపడి ప్రయోజనం ఉండదు. ఈ విషయాన్ని ఇన్‌చార్జి మంత్రులు మీ పరిధిలోని ఎమ్మెల్యేలకు చెప్పాలి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టంచేశారు. గురువారం మంత్రివర్గ సమావేశం సందర్భంగా కొందరు ఎమ్మెల్యేల వ్యవహార శైలిని ఆయన ప్రస్తావించి అసహనం వ్యక్తం చేశారు. మనం ఎప్పుడు


మిగతా 13వ పేజీలో...

నాలా చట్టం రద్దుకు ఆర్డినెన్స్

దాని స్థానంలో డెవలప్‌మెంట్ చార్జీలు వసూలు
పర్యాటక ప్రాజెక్టులకు ప్రభుత్వ భూములు
కుప్పం, దగదర్తిల్లో గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టులు
మండలి వెంకటకృష్ణారావు అధికార భాషా కమిషన్‌గా భాషా సంఘం పేరు మార్పు 13
రాజధాని గ్రామాల్లో 904 కోట్లతో వసతులు
టెన్నిస్ సాకేత్‌కు డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగం
క్యాబినెట్ సమావేశంలో కీలక నిర్ణయాలు

అర్హులైన వారి పింఛన్ రద్దు కాదు

దివ్యాంగులెవరూ ఆందోళన చెందవద్దు
పింఛన్లపై సమీక్షలో చంద్రబాబు భరోసా
గత ప్రభుత్వంలో అడ్డదారిలో సర్టిఫికెట్లు
వాటితో అనర్హులకు పింఛన్లు
ముఖ్యమంత్రికి వివరించిన అధికారులు



అమరావతి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): పింఛన్ల విషయంలో అర్హులైన దివ్యాంగులెవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పెద్దఎత్తున దివ్యాంగ పింఛన్లు తొలగిస్తున్నారంటూ ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో గురువారం సచివాలయంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పథకంపై అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. గత ప్రభుత్వంలో

మిగతా 13వ పేజీలో...

అర్హులైన దివ్యాంగులకు అన్యాయం జరగనివ్వం

సచివాలయాల్లో జాబితాల ప్రదర్శన
పింఛన్లు తొలగిస్తే రీవెరిఫికేషన్ కోరవచ్చు
ప్రభుత్వం కూడా సమగ్ర పరిశీలన చేస్తుంది
దివ్యాంగుల పింఛన్లపై లోకేశ్ స్పష్టీకరణ
పింఛన్ల తొలగింపును ఆయన దృష్టికి తెచ్చిన మంత్రులు 13


చీఫ్ జస్టిస్ గవాయ్

కోర్టులు చేతులు కట్టుకుని కూర్చోవాలా?

గవర్నర్లు బిల్లుల్ని నిరవధికంగా నిలిపివేస్తే చట్టసభలు నిర్వీర్యమవుతాయి
రాజ్యాంగ విధులు నిర్వర్తించాల్సిన వారు ఆ పనిచేయనప్పుడు జోక్యం చేసుకోవద్దా?
సొలిసిటర్ జనరల్‌ను నిలదీసిన సీజేఐ
బిల్లుల ఆమోదానికి గవర్నర్‌కు, రాష్ట్రపతికి రాజ్యాంగంలో కాలపరిమితి లేదు: ఎస్‌జీ
అయితే తప్పు జరిగినప్పుడు దిద్దుబాటు ఉండాల్సిందేనని సీజేఐ స్పష్టీకరణ
తదుపరి విచారణ 26వ తేదీకి వాయిదా

న్యూఢిల్లీ, ఆగస్టు 21: అసెంబ్లీ ఆమోదించి పంపిన బిల్లులను ఆమోదించకుండా గవర్నర్లు నిరవధికంగా నిలిపివేస్తే చట్టసభలు నిర్వీర్యమైపోతాయని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ స్పష్టంచేశారు. ఆ పరిస్థితుల్లో జోక్యం చేసుకునే అధికారం కోర్టుకు ఉండదా అని ప్రశ్నించారు. రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు తమ విధులు నిర్వర్తించకపోతే న్యాయస్థానాలు చేతులు కట్టుకుని కూర్చోవాలా అని కేంద్రం తరఫు సీనియర్ న్యాయవాది, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను నిలదీశారు. బిల్లుల ఆమోదానికి రాష్ట్రపతి, గవర్నర్లకు నిర్దిష్ట కాలవ్యవధిని సుప్రీంకోర్టు నిర్దేశించవచ్చా అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాజ్యాంగంలోని 143(1) అధికరణ కింద సర్వోన్నత న్యాయస్థానం

మిగతా 2వ పేజీలో...

కి'లేడీ' అరాచకాలపై దర్యాప్తు ముమ్మరం

అరుణ ఫోన్ రికార్డింగ్స్ పరిశీలన
రౌడీషీటర్ శ్రీకాంత్‌పైనా ఆరా
నెల్లూరు పోలీస్ గెస్ట్‌హౌస్‌లో రోజంతా ఏఎస్పీ విచారణ
డబ్బు తీసుకుని మోసగించిందని అరుణపై బెజవాడవాసి ఆరోపణ
నెల్లూరు వచ్చి ఫిర్యాదు చేయాలని అధికారుల సూచన 14

సరికొత్తగా అవేర్ 2.0

వాతావరణ మార్పులను 7 రోజుల ముందే పసిగట్టి ముందస్తు సమాచారం
ఆధునిక వ్యవస్థ సిద్ధం 13

ఐదేళ్లలో భారత్-రష్యా వాణిజ్యం ₹8.72 లక్షల కోట్లకు

ద్వైపాక్షిక సమావేశంలో కీలక లక్ష్య నిర్దేశం
మన మధ్య సుంకాల భారాన్ని తగ్గించుకుందాం
విదేశాంగ మంత్రి జైశంకర్.. పుతిన్‌తో భేటీ 2


సోనియా, పవార్, ఖర్గే, ప్రియాంక సమక్షంలో నామినేషన్ దాఖలు చేస్తున్న జస్టిస్ సుదర్శన్‌రెడ్డి

ఇండీ అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి నామినేషన్

వెంట వచ్చిన సోనియా, రాహుల్, పవార్
కేజ్రీవాల్ ఇంటికి వెళ్లి కలిసిన సుదర్శన్‌రెడ్డి 12
ఎంపీలు నిర్భయంగా ఓటేయాలని కేజ్రీ పిలుపు


విజయ్ సభకు భారీగా హాజరైన జనం

కేంద్రంలో మూడోసారి ప్రధానిగా గెలిచిన మోదీ.. ప్రజలకు మంచి చేయడానికి అధికారంలోకి వచ్చారో, లేక మైనారిటీ ప్రజలకు వ్యతిరేకంగా కుట్రలు, కుతంత్రాలు పన్నేందుకు వచ్చారో అర్థం కావడం లేదు.
- విజయ్

మా సైద్ధాంతిక శత్రువు బీజేపీ

ఏకైక రాజకీయ శత్రువు డీఎంకే.. ఈ రెండు పార్టీలను తరిమికొట్టడమే లక్ష్యం

స్టాలిన్.. వెరీ వెరీ వరస్ట్ అంకుల్
అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ
ఏ పార్టీతోనూ పొత్తులు ఉండవు
రాజకీయాల్లో తేల్చుకునేందుకే వచ్చా
మదురై సభలో టీవీకే అధినేత విజయ్
నీట్ పరీక్షలు రద్దు చేయాలని డిమాండ్
సభకు భారీఎత్తున వచ్చిన ప్రజానీకం



చెన్నై, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): తమ సైద్ధాంతిక శత్రువు బీజేపీ అని, ఏకైక రాజకీయ శత్రువు డీఎంకే అని 'తమిళగ వెట్రి కళగం'(టీవీకే) అధినేత, సినీనటుడు విజయ్ ప్రకటించారు. వచ్చే ఏడాది జరిగే తమిళనాడు శాసనసభ ఎన్నికల్లో ఈ రెండు పార్టీలను తరిమికొట్టడమే తన ప్రధాన లక్ష్యంగా పేర్కొన్నారు. గురువారం మదురై సమీపంలో జరిగిన పార్టీ ద్వితీయ మహానాడుకు భారీగా తరలివచ్చిన జనసందోహాన్ని ఉద్దేశించి

మిగతా 2వ పేజీలో...

లిక్కర్ స్కామ్‌లో మరో 13.29 కోట్లు జప్తు



ఈ ఆస్తులన్నీ ఏ1 రాజ్ కసిరెడ్డివే
సిట్‌కు ప్రభుత్వం అనుమతి
తెలంగాణలో 30 ఎకరాల భూమి
గచ్చిబౌలిలో 326 చ.గ. స్థలం
మార్కెట్ విలువ 50 కోట్లపైనే
బ్యాంకు ఖాతాలో మరో 3 కోట్లు
ఇప్పటికే పలు ఆస్తులు, నగదు సీజ్
ఇతర నిందితుల ఆస్తులూ గుర్తింపు
మొత్తం విలువ రూ.120 కోట్లు

అమరావతి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో జరిగిన 3,500 కోట్ల రూపాయల మద్యం కుంభకోణంలో ప్రధాన సూత్రధారి కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి(ఏ-1)కి చెందిన మరికొన్ని ఆస్తులు, బ్యాంకు ఖాతాలు జప్తు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందానికి (సిట్) అనుమతి మంజూరు చేసింది. ఇందులో రూ.3 కోట్ల నగదుతో పాటు ప్రభుత్వ లెక్కల ప్రకారం రూ.10.29 కోట్ల విలువైన ఆస్తులు ఉన్నాయి. అయితే మార్కెట్ విలువ ప్రకారం ఆస్తులు యాభై కోట్లకు పైగా

మిగతా 14వ పేజీలో...



డీఎస్సీ మెరిట్ జాబితా నేడే!

అధికారిక వెబ్‌సైట్లలోనే సమాచారం పొందాలి
వ్యక్తిగత లాగిన్ ద్వారా కాల్ లెటర్లు అందిస్తాం
వెరిఫికేషన్‌కు ముందు సర్టిఫికెట్లు అప్‌లోడ్ తప్పనిసరి
మెగా డీఎస్సీ కన్వీనర్ కృష్ణారెడ్డి వెల్లడి 14

నవంబరులో భాగస్వామ్య సదస్సు

14, 15 తేదీల్లో ఏయూలో నిర్వహణకు నిర్ణయం 12
లాజిస్టిక్ హబ్‌గా ఏపీ.. తీరంలో ప్రతి 50 కి.మీ.కు పోర్టు లేదా హార్బర్
పోర్టుల అభివృద్ధికి ఏపీఎం టెర్మినల్స్‌తో సీఎం సమక్షంలో ఎంవోయూ

మహిళల ఓట్లకు ఎసరు?

ఊరి నుంచి శాశ్వతంగా వెళ్లిపోయిన క్యాటగిరీలో భారీగా మహిళల ఓట్ల తొలగింపు

- వలస రాష్ట్రంలో ఓటరుగా నమోదయ్యారో లేదో చూడకుండా ఊళ్లో ఓటుకు ఎసరు
- బిహార్ ఓటర్ల జాబితా ప్రక్షాళనలో జరిగిందిదే

న్యూఢిల్లీ, ఆగస్టు 21: బిహార్‌లో ఇటీవల ఎన్నికల సంఘం నిర్వహించిన ఓటర్ల జాబితా ప్రత్యేక పరిశీలన కార్యక్రమం(ఎస్ఐఆర్)లో చిరునామా నుంచి శాశ్వతంగా వెళ్లిపోయిన విభాగంలో పురుషుల ఓట్ల కన్నా మహిళల ఓట్లను ఎక్కువగా తొలగించినట్లు తేలింది. 40 ఏళ్లకన్నా తక్కువ వయసు ఓటర్లలో ఈ పరిస్థితి ఉందని హిందూ పత్రిక నిర్వహించిన అధ్యయనంలో వెల్లడైంది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎస్ఐఆర్ ద్వారా తొలగించిన 65 లక్షల ఓటర్ల వివరాలను, కారణాలను ఎన్నికల సంఘం ప్రజలకు అందుబాటులో ఉంచింది. అత్యధికంగా ఓట్ల తొలగింపు జరిగిన తొమ్మిది నియోజకవర్గాల వివరాలను అధ్యయనం చేసిన హిందూ పత్రిక పలు సంచలన విషయాలను వెల్లడించింది. ఈ ఏడాది జనవరి 1న సిద్ధం చేసిన ఓటర్ల జాబితా నుంచే కొత్తగా ఏడు లక్షల మహిళల ఓట్లను తొలగించినట్లు తెలిపింది. 18-39 మధ్య వయస్సులో చిరునామా నుంచి శాశ్వతంగా వెళ్లిపోయిన విభాగంలో పురుషుల కన్నా మహిళలను 2-3 రెట్లు ఎక్కువ మందిని తొలగించారు. ఇలా తొలగించిన వారు మొత్తం మీద మహిళలు 62.6 శాతం ఉంటే, పురుషులు 37.4 శాతం ఉన్నారు. ఇంత భారీ సంఖ్యలో మహిళల తొలగింపులు ఉన్నాయంటే వివాహం అయి, వేరే రాష్ట్రాలకు వెళ్లిన మహిళలను తొలగించి ఉంటారని భావిస్తున్నారు. కనిపించలేదు, మరణించారు, ఇతర ప్రాంతాల్లో ఓటరుగా నమోదయ్యారు అనే కారణాలతో తొలగించిన విషయంలో మహిళలు, పురుషుల మధ్య గణాంకాల్లో భారీ తేడా లేదు. అక్షరాస్యత తక్కువగా ఉండటం వల్ల మహిళలు ఎన్యూమరేషన్ ఫారాలు నింపకపోవడం వల్ల ఇలా జరిగిందని కూడా చెప్పడానికి లేదు. అక్షరాస్యత అధికంగా ఉన్న ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

పురుషుల ఓట్లను ఎప్పుడో తొలగించారా?

2011 జనాభా లెక్కల ప్రకారం చూస్తే 38.5 లక్షల మంది పురుషులు, 36.02 లక్షల మంది మహిళలు వివాహం, ఉపాధి, కుటుంబం ఇతర కారణాలతో బిహార్ విడిచి ఇతర రాష్ట్రాలకు వెళ్లారు. స్త్రీ పురుషుల వలస విషయంలో అంతరం 14 ఏళ్లలో మరింత పెరిగి ఉండాలి. కానీ, మహిళల పేర్లే ఎక్కువగా చిరునామా నుంచి శాశ్వతంగా వెళ్లిపోయిన జాబితాలో ఉన్నాయి. ఎస్ఐఆర్ గణాంకాలు నిజమని నమ్మితే ఇతర రాష్ట్రాలకు తరలిపోయిన బిహారీ పురుష ఓటర్లను గతంలోనే భారీ ఎత్తున తొలగించి ఉంటారని, మహిళలను ఇప్పుడు తొలగించి ఉంటారని భావించాల్సి వస్తుంది. వాళ్లు ఇతర రాష్ట్రాల్లో ఓట్లు పొందారో లేదో చూడకుండా ఓట్లు తొలగించి ఉండటం ఎంతవరకు సమంజసం అనే ప్రశ్న కూడా ఉద్భవిస్తుంది.

లోకం తీరు



ఐదేళ్లలో భారత్-రష్యా వాణిజ్యం రూ.8.72 లక్షల కోట్లకు పెంపు

- ద్వైపాక్షిక సమావేశంలో ఇరు దేశాల నిర్ణయం

మాస్కో, ఆగస్టు 21: అమెరికా సుంకాల నేపథ్యంలో భారత్-రష్యా కీలక నిర్ణయం తీసుకున్నాయి. రానున్న ఐదేళ్లలో ఇరు దేశాల మధ్య వాణిజ్యాన్ని రూ.8.72 లక్షల కోట్ల(100 బిలియన్ డాలర్లు)కు పెంచాలని నిర్ణయించాయి. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య జరుగుతున్న వాణిజ్య విలువతో పోలిస్తే.. ఇది 50% ఎక్కువ అని భారత విదేశాంగశాఖ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం భారత్‌కు రష్యా 4వ అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉంది. రష్యాకు భారత్ రెండో అతిపెద్ద వాణిజ్య భాగస్వామి. బ్రిక్స్ దేశాలపై అమెరికా సుంకాల నేపథ్యంలో భారత విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ రష్యాలో మూడ్రోజుల పాటు పర్యటిస్తున్న విషయం తెలిసిందే.! ఈ సందర్భంగా మాస్కోలో జరిగిన 'భారత్-రష్యా బిజినెస్ ఫోరం'లో, గురువారం రష్యా అధ్యక్షుడు పుతిన్, ఆ దేశ విదేశాంగ మంత్రి సెర్గే లావ్రోవ్‌లతో వేర్వేరుగా జరిగిన ద్వైపాక్షిక సమావేశాల సందర్భంగా జైశంకర్ మాట్లాడారు. ప్రస్తుతం సంక్లిష్టంగా మారిన భౌగోళిక రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో 'పరస్పరం ఆధారపడిన సుస్థిర భాగస్వాముల' అవసరం ఏర్పడిందన్నారు. అమెరికాను.. ట్రంప్ సుంకాలను నేరుగా ప్రస్తావించకుండా.. "ఈ పరిస్థితులను అధిగమించేందుకు మన(బ్రిక్స్ దేశాల) నాయకులు నిత్యం చర్చలు జరపాలి. మన మధ్య సుంకాల భారం తగ్గాలి" అని అభిప్రాయపడ్డారు.

చైనా మార్కెట్లలో భారత్‌కు స్వాగతం

- భారత్‌పై ట్రంప్ 50% సుంకాలు దారుణం
- చైనా రాయబారి ఫేయ్‌హోంగ్ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, ఆగస్టు 21: ట్రంప్ సుంకాల నేపథ్యంలో భారత్‌కు చైనా అండగా నిలిచింది. ఇప్పటికే వాణిజ్యాన్ని రెట్టింపు చేయాలని భారత్-రష్యా నిర్ణయించగా.. ఇప్పుడు చైనా కూడా తమ మార్కెట్లలోకి భారత్‌కు స్వాగతం పలికింది. భారత్‌లోని చైనా రాయబారి షూ ఫేయ్‌హోంగ్ ఈ విషయాన్ని వెల్లడించారు. గురువారం న్యూఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఫేయ్‌హోంగ్.. భారత్‌పై అమెరికా 50% సుంకాలను విధించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ సుంకాలు దారుణమన్నారు. "భారత్-చైనా ఇప్పుడు పరస్పర అనుమానాస్పద ధోరణిని వీడి.. వ్యూహాత్మక విశ్వాసాన్ని నెలకొల్పాలి. అభివృద్ధి వ్యూహాలను పెపొందించుకోవాలి. ఇరుదేశాలు శత్రువుల్లా కాకుండా.. భాగస్వాముల్లా పనిచేయాలి. ఇరుదేశాల మధ్య ఉన్న వివాదాలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలి" అని ఆయన వ్యాఖ్యానించారు. భారత్‌లో ఉత్పత్తి అయ్యే నిత్యావసరాల కోసం చైనా మార్కెట్ల తలుపులను తెరుస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ప్రధాని మోదీ చైనా పర్యటన గురించి విలేకరులు ప్రస్తావించగా.. షాంగై సహకార సంస్థ(ఎస్‌సీవో) శిఖరాగ్ర సమావేశం నేపథ్యంలో మోదీ పర్యటనకు తాము ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. ఆసియాలోనే చైనా, భారత్ డబుల్ ఇంజన్ ఆర్థిక వ్యవస్థలుగా ఉన్నాయని, ఇరు దేశాల ఐక్యత ప్రపంచానికి లబ్ధి చేకూరుస్తుందన్నారు.

ఇజ్రాయెల్‌తో సంబంధాలు తెంచుకోవాలి

- అమెరికాలో మైక్రోసాఫ్ట్ ప్రధాన కార్యాలయం వద్ద నిరసనలు

వాషింగ్టన్, ఆగస్టు 21: అమెరికా వాషింగ్టన్‌లోని రెడ్‌మండ్ మైక్రోసాఫ్ట్ ప్రధాన కార్యాలయం ప్రాంగణంలో పాలస్తీనీయన్లకు మద్దతుగా నిరసనకు దిగిన ఆ కంపెనీకి చెందిన 18 మంది ఉద్యోగులను పోలీసులు అరెస్టు చేశారు. మైక్రోసాఫ్ట్ రూపొందించిన సాంకేతికతను వాడుకొనే గాజాలో ఇజ్రాయెల్ మారణహోమానికి పాల్పడుతోందంటూ 35మందితో కూడిన బృందం రెండు రోజులుగా ఈ ఆందోళనలు చేపట్టింది. ఇజ్రాయెల్‌తో మైక్రోసాఫ్ట్ వ్యాపార సంబంధాలు తెంచుకోవాలని డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలోనే కంపెనీ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. అక్కడికి చేరుకున్న పోలీసులు వారిని వెళ్లిపోవాలని సూచించినా వెనక్కి తగ్గలేదు. మైక్రోసాఫ్ట్ బోర్డుపై రంగులు పూసి నినాదాలతో హోరెత్తించారు. దీంతో 18 మంది ఉద్యోగులను పలు అభియోగాల కింద పోలీసులు అరెస్టు చేశారు.

ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడి

- 574 డ్రోన్లు, 40 క్షిపణులతో దాడి.. ఒకరు మృతి

కీవ్, మాస్కో, ఆగస్టు 21: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్యవర్తిత్వంలో శాంతి చర్చలకు యత్నాలు కొనసాగుతున్న వేళ రష్యా ఉక్రెయిన్‌పై భీకర దాడి చేసింది. 574 డ్రోన్లు, 40 క్షిపణులతో భారీ స్థాయిలో విరుచుకుపడింది. ఉక్రెయిన్ పశ్చిమ ప్రాంతంలోని ల్వివ్ నగరంతో సహా పలు చోట్ల జరిపిన ఈ దాడిలో ఒకరు మృతి చెందగా, 22 మందికి గాయాలయ్యాయి. 26 భవనాలు దెబ్బతిన్నాయి. పౌరులే లక్ష్యంగా రష్యా ఈ దాడులు జరిపిందని ఉక్రెయిన్ ఆరోపించింది.

చైనాను ఎదుర్కోవాలంటే భారత్ లాంటి మిత్రుడు ఉండాలి: నిక్కీ హేలీ

న్యూఢిల్లీ, ఆగస్టు 21: చైనాను ఎదుర్కోవాలంటే అమెరికాకు భారత్ వంటి ఒక మిత్రుడు తప్పనిసరిగా ఉండాలని అమెరికా మాజీ దౌత్యవేత్త నిక్కీ హేలీ స్పష్టం చేశారు. 2024 అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష రేసులో ట్రంప్‌పై పోటీ చేసిన ఆమె ఈ మేరకు తాజాగా రాసిన ఆర్టికల్ బుధవారం ఒక ఆంగ్ల మేగజైన్‌లో ప్రచురితమైంది. భారత్‌తో సంబంధాల విషయంలో తిరోగమన వైఖరిని వీడాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను ఆమె కోరారు. ఆసియాలో చైనా ఆధిపత్యానికి అడ్డుకట్ట వేయగల ఏకైక దేశంతో వాణిజ్య వివాదాలు పెట్టుకోవడం వ్యూహాత్మక తప్పిదం అవుతుందని తేల్చిచెప్పారు. భారత్ చేస్తున్న చమురు కొనుగోళ్లు ఉక్రెయిన్‌పై రష్యా దాడికి నిధులు సమకూరుస్తున్నాయనే ట్రంప్ వాదనను ఆమె సమర్థించారు. అయితే, భారత్‌ను విలువైన స్వేచ్ఛాయుత, ప్రజాస్వామిక భాగస్వామిగా మాత్రమే పరిగణించాలని, చైనాలాంటి శత్రువుగా భారత్‌ను పరిగణించకూడదని ఆమె సూచించారు.

సైబర్ నేరాల్లో సీబీఐ దర్యాప్తునకు రాష్ట్రాల అనుమతి అవసరం లేదు!

- కేంద్రానికి పార్లమెంటరీ స్థాయీసంఘం సిఫారసు

న్యూఢిల్లీ, ఆగస్టు 21: సైబర్ నేరాల్లో సీబీఐ దర్యాప్తునకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వాల సమ్మతి అవసరం లేకుండా, 'ఢిల్లీ ప్రత్యేక పోలీసు చట్టం, 1946'ను సవరించాలని (ఈ చట్టం ప్రకారమే సీబీఐ ఏర్పాటైంది) హోంశాఖ వ్యవహారాలపై ఏర్పాటైన స్థాయీ సంఘం కేంద్రప్రభుత్వానికి సిఫారసు చేసింది. సంబంధిత నివేదికను బుధవారం పార్లమెంటు ఉభయ సభల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టింది. విచారణలో భాగంగా తమకు సీబీఐ సమర్పించిన వాదనలను స్థాయీసంఘం తన నివేదికలో ఉటంకించింది. సైబర్ నేరాల్లో దర్యాప్తు ప్రారంభించినప్పుడు వెలుగులోకి వచ్చే ప్రాథమిక సాక్ష్యాధారాలపై లోతైన పరిశోధన జరపాల్సి వచ్చినప్పుడు.. రాష్ట్రాల అనుమతి తీసుకోవటం, వేర్వేరు రాష్ట్రాల్లో వేర్వేరు నిబంధనలు, చట్టాలు ఉండటం దర్యాప్తునకు తీవ్ర అవరోధంగా నిలుస్తున్నాయని సీబీఐ పేర్కొంది. ప్రస్తుతం దేశంలో సీబీఐ దర్యాప్తునకు 8 రాష్ట్రాలు అనుమతి నిరాకరించాయని, అందుకు కారణాలేమిటో ఆయా రాష్ట్రాలను సంప్రదించి తెలుసుకోవాలని కేంద్రానికి స్థాయీసంఘం సూచించింది. ఓవైపు ఈ సూచన చేస్తూనే.. మరోవైపు, రాష్ట్రాల అనుమతి ప్రసక్తే లేకుండా సంబంధిత చట్టాన్ని సవరించాలని సిఫార్సు చేసింది.

బీమాపై ధీమా!

(మొదటి పేజీ తరువాయి)



మార్పు చేర్పులు చేసి, ఆమోదించనుంది. దీపావళికి ప్రత్యేక బహుమతి ఇస్తానన్న ప్రధాని మోదీ ప్రకటనకు అనుగుణంగా.. అలోగానే ఈ మార్పులన్నీ అమల్లోకి తీసుకువచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం కసరత్తు ముమ్మరం చేసింది. దేశంలో సాధారణ ప్రజలపై పన్ను భారం తగ్గించడం, జీఎస్టీ పన్ను రేట్ల హేతుబద్ధీకరణ చేపట్టనున్నట్టు ప్రధాని మోదీ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రకటించిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించి బిహార్ ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి కన్వీనర్‌గా ఏర్పాటు చేసిన మంత్రుల బృందం పలు ప్రతిపాదనలను పరిశీలించి, ఆమోదించింది. ప్రస్తుతం జీఎస్టీలో 5%, 12%, 18%, 28% శ్లాబులు ఉండగా.. ఇందులో 12%, 28% శ్లాబులను పూర్తిగా ఎత్తివేసి, వాటి పరిధిలో ఉన్న వస్తుసేవలను 5%, 18% పన్ను రేట్లలోకి సర్దుబాటు చేయనున్నారు. ఇక కొన్నిరకాల విలాసవంతమైన, హానికరమైన వస్తువులపై 40శాతం ప్రత్యేక పన్నును వసూలు చేస్తారు. జీఎస్టీ హేతుబద్ధీకరణపై ఏర్పాటు చేసిన మంత్రుల బృందంలో సామ్రాట్ చౌదరితోపాటు యూపీ, బెంగాల్, కేరళ ఆర్థిక మంత్రులు సురేశ్‌కుమార్ ఖన్నా, చంద్రిమ భట్టాచార్య, కేఎన్ బాలగోపాల్, రాజస్థాన్ ఆరోగ్య మంత్రి గజేంద్రసింగ్, కర్ణాటక రెవెన్యూ మంత్రి కృష్ణ బైరెగౌడ సభ్యులుగా ఉన్నారు.

బీమా పాలసీలపై పూర్తిగా పన్ను ఎత్తివేత..!

జీఎస్టీ శ్లాబులను రెండుకు కుదించే కేంద్ర ప్రతిపాదనలను మంత్రుల బృందం ఆమోదించిందని సామ్రాట్ చౌదరి వెల్లడించారు. వ్యక్తిగత ఆరోగ్య బీమా, జీవిత బీమా పాలసీలపై జీఎస్టీని పూర్తిగా మినహాయించాలని జీఎస్టీ కౌన్సిల్‌కు సిఫార్సు చేశామని తెలిపారు. దీనిపై జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. ప్రస్తుతం ఆరోగ్య, జీవిత బీమా పాలసీల ప్రీమియంపై 18శాతం జీఎస్టీ వసూలు చేస్తున్నారు. దీనిని పూర్తిగా ఎత్తివేస్తే పాలసీల ప్రీమియం ఖర్చు ఒక్కసారిగా దిగి వస్తుందని, మధ్యతరగతి వర్గాలకు ఆరోగ్య భద్రత, ఆర్థిక భద్రత కలుగుతాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఇక విలాసవంతమైన కార్లు, సిగరెట్లు వంటి హానికర ఉత్పత్తులను 40% పన్ను రేటులో చేర్చాలని ప్రతిపాదించినట్టు యూపీ ఆర్థిక మంత్రి సురేశ్‌కుమార్ ఖన్నా తెలిపారు. పన్ను రేట్లలో మార్పుల వల్ల రాష్ట్రాలకు ఆదాయం తగ్గిపోయి, తిరిగి ప్రజల సంక్షేమంపై ప్రభావం పడుతుందని.. తగ్గే ఆదాయాన్ని కేంద్రం భర్తీ చేయాలని కోరుతున్నామని బెంగాల్ ఆర్థిక మంత్రి చంద్రిమ భట్టాచార్య తెలిపారు.

90శాతం నిత్యావసరాలు చవక!

ప్రస్తుతం 12శాతం శ్లాబులో ఉన్న నిత్యావసరాల్లో 90శాతానికిపైగా 5శాతం పన్నురేటుకు మారుతాయని, దీనితో నిత్యావసరాల ధరలు తగ్గుతాయని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం 28శాతం శ్లాబులో ఉన్న గృహోపకరణాలు, వాహనాల్లో చాలా వరకు 18శాతం పన్ను రేటుకు మారుతాయని, దీనితో వాటి ధరలూ తగ్గే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.

బీమాపై జీఎస్టీ మినహాయింపుతో ప్రయోజనమెంత?

ప్రస్తుతం బీమా పాలసీల ప్రీమియంపై 18శాతం జీఎస్టీ ఉంది. బీమా కంపెనీలు ఈ పన్ను మొత్తాన్ని కలిపి ప్రీమియం చార్జీలను నిర్ధారించి, వసూలు చేస్తున్నాయి. ఇప్పుడు జీఎస్టీ మినహాయిస్తే.. ఆ మేరకు ప్రీమియం చార్జీలను తగ్గించాల్సి ఉంటుంది. ఉదాహరణకు రూ.ఐదు లక్షల ఆరోగ్య బీమా పాలసీకి ఏడాది ప్రీమియం రూ.20 వేలు అయితే.. కంపెనీలు జీఎస్టీ కలిపి రూ.23,600 వినియోగదారు నుంచి వసూలు చేస్తాయి. రూ.3,600 జీఎస్టీని ప్రభుత్వానికి జమ చేస్తాయి. ఇప్పుడు జీఎస్టీని పూర్తిగా మినహాయిస్తే.. వినియోగదారుల నుంచి రూ.20 వేలు ప్రీమియం మాత్రమే వసూలు చేయాల్సి ఉంటుంది. అయితే బీమా కంపెనీలు పన్ను మినహాయింపు మొత్తాన్ని వినియోగదారులకు అందిస్తాయా? లేక ఏదో ఒక అదనపు సేవ అనో, బీమా మొత్తాన్ని పెంచుతామనో చెప్పి ప్రీమియం తగ్గించుకుండా ఉంటాయా? అన్న సందేహాలు నెలకొన్నాయని పన్నుల నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే బీమా కంపెనీలు పన్ను మినహాయింపు మొత్తాన్ని తప్పనిసరిగా వినియోగదారులకు బదలాయించేలా కేంద్ర ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికే విజ్ఞప్తి చేశాయి.

సాధారణ పాలసీలకు మినహాయింపు ఉండదా?

మరోవైపు ఆరోగ్య బీమా, టెర్మ్ పాలసీల (కట్టిన సొమ్మును తిరిగివ్వకుండా, తక్కువ ప్రీమియంతోనే అత్యధిక బీమా కల్పించే పాలసీల)కు మాత్రమే మినహాయింపును వర్తింపజేయవచ్చని.. పెట్టుబడుల తరహాలో చేసే సాధారణ జీవిత బీమా, యూలిప్‌ల వంటి పాలసీలకు వర్తింపజేయకపోవచ్చని పన్నుల నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఒకవేళ వర్తింపజేసినా.. ఆ పాలసీల ప్రీమియంలో పెట్టుబడికి కాకుండా 'రిస్క్' కవరేజీ కింద ఉండే మొత్తాన్ని మాత్రమే మినహాయించవచ్చని ధ్రువ అడ్వైజర్స్ పార్ట్‌నర్ నిపుణుడు జిగ్నేష్ ఘెలాని తెలిపారు. ఇక బీమా కంపెనీలు పూర్తిగా 18శాతం మినహాయింపును వినియోగదారులకు బదిలీ చేయకపోవచ్చని.. పాలసీ నిర్వహణ వ్యయాలు, కమీషన్లపై చెల్లించే జీఎస్టీ భారాన్ని వినియోగదారులపైనే వేయవచ్చని ఈవై ఇండియా ట్యాక్స్ పార్ట్‌నర్ సంస్థ నిపుణుడు సౌరభ్ అగర్వాల్ పేర్కొన్నారు. కంపెనీలు చెల్లించే పన్నులకు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ ఇస్తే.. ప్రీమియంలపై జీఎస్టీ మినహాయింపు పూర్తి ప్రయోజనం వినియోగదారులకు అందుతుందని తెలిపారు. అలాకాకున్నా కనీసం 15శాతం వరకు ప్రీమియం చార్జీలు తగ్గే అవకాశం ఉంటుందని వెల్లడించారు.

ఆ యువ నేతలతో రాహుల్‌కు ఇబ్బంది

- అందుకే పార్లమెంటులో వారికి చాన్స్ ఇవ్వడం లేదు: మోదీ



న్యూఢిల్లీ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్రతిభ కలిగిన యువ నాయకులు కాంగ్రెస్ పార్టీలో ఉన్నా, ఒక కుటుంబం అభద్రతకు గురవుతుండటం వల్ల వారికి పార్లమెంటులో మా ట్లాడే అవకాశం రావడం లేదంటూ.. సోనియా గాంధీ పరివారాన్ని ఉద్దేశించి ప్రధాని నరేంద్రమోదీ పరోక్షంగా వ్యాఖ్యానించారు. వారిలోని చురుకుదనం రాహుల్‌గాంధీని అభద్రతకు, ఇబ్బందికి గురిచేస్తున్నదన్నారు. పార్లమెంటు సజావుగా సాగేందుకు ప్రతిపక్షాలు సుముఖంగా ఉన్నప్పటికీ కొంతమంది వ్యక్తుల మూలంగా మొత్తం వర్షాకాల సమావేశాలు భగ్నమయ్యాయని మోదీ అన్నారు. గురువారం ఉభయసభల సమావేశాలు నిరవధికంగా వాయిదా పడిన తర్వాత ఆయన ఎన్డీయే పార్టీల నేతలకు తేనీటి విందు ఇచ్చా రు. కీలకమైన బిల్లులు ఆమోదం పొందేలా చేసినందుకు మిత్రపక్షాల నేతలను మోదీ అభినందించారు.

మేక్రాన్‌తో మోదీ చర్చలు

ఉక్రెయిన్, పశ్చిమాసియాల్లో యుద్ధ పరిస్థితులపై ప్రధాని మోదీ గురువారం ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మేక్రాన్‌తో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా మోదీ ఎక్స్‌లో పోస్టు పెడుతూ "నా మిత్రుడు అధ్యక్షుడు మేక్రాన్‌తో చాలా మంచి సంభాషణ జరిగింది. ఉక్రెయిన్, పశ్చిమ ఆసియాల్లోని ఘర్షణలకు శాంతియుత పరిష్కారాలు కనుక్కొనే దిశగా అభిప్రాయాలు పంచుకున్నాం. భారత్-ఫ్రాన్స్‌ల వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు కట్టుబడి ఉన్నాం" అని పేర్కొన్నారు.

పార్లమెంటు నిరవధిక వాయిదా

ముగిసిన వర్షాకాల సమావేశాలు

- 12 బిల్లులకు లోక్‌సభ.. 15 బిల్లులకు రాజ్యసభ ఆమోదం

న్యూఢిల్లీ, ఆగస్టు 21: బిహార్‌లో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్), ఆపరేషన్ సిందూర్ సహా పలు అంశాలపై అధికార, విపక్షాల నడుమ వాగ్యుద్ధాలతో అట్టుడికిన పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ముగిశాయి. ఉభయసభలూ నిరవధికంగా వాయిదా పడ్డాయి. గురువారం ఉదయం 11 గంటలకు లోక్‌సభ ప్రారంభం కాగానే విపక్షాలు తీవ్ర గందరగోళం సృష్టించడంతో స్పీకర్ ఓంబిర్లా సభను 12 గంటలకు వాయిదా వేశారు. అప్పుడు కూడా అదే పరిస్థితి నెలకొనడంతో సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. ఈ సమావేశాలు జరిగినన్నాళ్లూ విపక్షసభ్యులు సభ కార్యకలాపాలకు పదేపదే అంతరాయం కలిగించారని ఆయన మండిపడ్డారు. అటు రాజ్యసభ కూడా.. విపక్షాల నిరసనలతో తొలుత మధ్యాహ్నం 2 గంటల వరకూ వాయిదా పడింది. మళ్లీ సమావేశమైన అనంతరం ఆన్‌లైన్ గేమింగ్ బిల్లును ఆమోదించి సభను నిరవధికంగా వాయిదా వేశారు. రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివన్ష్.. సభలో అర్థవంతమైన చర్చ జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా.. ఈ సెషన్‌లో లోక్‌సభలో 14 బిల్లులను ప్రవేశపెట్టగా.. 12 బిల్లులను ఆమోదించారు. రాజ్యసభలో 15 బిల్లులను ఆమోదించారు.

సగం మందికి పెన్షన్ రూ.1,500 కంటే తక్కువే

న్యూఢిల్లీ, ఆగస్టు 21: ఉద్యోగుల పింఛను పథకం (ఈపీఎస్-95)లో సగానికి పైగా పింఛనుదారులకు నెలకు రూ.1,500 కంటే తక్కువే లభిస్తోంది. కేవలం 0.65% మందికి మాత్రమే నెలకు రూ.6 వేల కంటే ఎక్కువ పెన్షన్ దక్కుతోంది. ఈ వివరాలను కేంద్రం పార్లమెంటుకు తెలిపింది. నెలవారీ పెన్షన్ కనీసం రూ.9 వేలు ఉండాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కార్మిక, ఉపాధి శాఖ మంత్రి శోభా కరంద్లాజే రాజ్యసభకు లిఖితపూర్వకంగా వివరాలు తెలిపారు.

నటి ఆరోపణ.. కేరళ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడి రాజీనామా

పతనంతిట్ట/కొచి, ఆగస్టు 21: ఓ రాజకీయ పార్టీకి చెందిన యువ నాయకుడు ఒకరు తనపట్ల అసభ్యంగా ప్రవర్తించారంటూ మలయాళ నటి, మాజీ జర్నలిస్ట్ రిని ఆన్ జార్జ్ చేసిన ఆరోపణలు కేరళ కాంగ్రెస్‌లో ప్రకంపనలు రేపాయి. ఆయన పలు సందర్భాల్లో అసభ్యకరమైన సందేశాలు పంపారని, హోటల్‌కు రమ్మన్నారని ఆమె తీవ్ర ఆరోపణలు చేశారు. అయితే ఆ నేత ఎవరన్నది మాత్రం ఆమె వెల్లడించలేదు. ఈ ఆరోపణల నేపథ్యంలో పాలక్కాడ్ కాంగ్రెస్ ఎమ్మెల్యే, కేరళ కాంగ్రెస్ యువజన విభాగం అధ్యక్షుడు రాహుల్ మామ్‌కూటతిల్‌ను లక్ష్యంగా చేసుకుని బీజేపీ, సీపీఎం శ్రేణులు నిరసనలు చేపట్టాయి. ఈ పరిణామాలతో మామ్‌కూటతిల్.. యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్టు గురువారం ప్రకటించారు. తాను ఎలాంటి తప్పు చేయలేదని ఆయన అన్నారు.

కోర్టులు చేతులు కట్టుకుని కూర్చోవాలా?

(మొదటి పేజీ తరువాయి)

అభిప్రాయాన్ని కోరిన అంశంపై జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ ఏఎస్ చందూర్కర్‌లతో కూడిన ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం గురువారం కూడా తన విచారణ కొనసాగించింది. రాష్ట్రపతి, గవర్నర్ తప్పనిసరిగా తన ఉత్తర్వులు పాటించేలా న్యాయవ్యవస్థ ఆదేశాలు ఇవ్వజాలదని మెహతా ఈ సందర్భంగా పేర్కొన్నారు. కొందరు గవర్నర్లు బిల్లులను నిలిపివేస్తే.. రాష్ట్రప్రభుత్వాలు కోర్టులకు రావడం కాకుండా రాజకీయ పరిష్కారాలు కనుక్కోవాలని సూచించారు. దీనిపై జస్టిస్ గవాయ్ స్పందిస్తూ.. ఎక్కడైనా తప్పు జరిగితే దిద్దుబాటు ఉండి తీరాలన్నారు. 'రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు అకారణంగా తమ విధులు నిర్వహించకపోతే.. కోర్టులు చేతులు కట్టుకుని కూర్చోవాలా' అని మెహతాను ప్రశ్నించారు. ఆయన జవాబిస్తూ.. అన్ని సమస్యలకూ కోర్టులే పరిష్కారం కాదని.. ప్రజాస్వామ్యంలో చర్చలకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. గవర్నర్ నిష్క్రియగా వ్యవహరిస్తే.. బాధిత రాష్ట్రం కోర్టును ఆశ్రయిస్తే.. ఆ నిష్క్రియాపరత్వంపై న్యాయ సమీక్ష జరపకుండా సంపూర్ణంగా నిషేధించాలా అని జస్టిస్ సూర్యకాంత్ అడిగారు. అయితే ఈ వ్యవహారంలో కొన్ని వెసులుబాట్లు అవసరమని మెహతా అభిప్రాయపడ్డారు. 'గవర్నర్ బిల్లులు నిలిపివేస్తే ప్రతి చోటా ముఖ్యమంత్రి కోర్టుల వద్దకు పరుగెత్తడం లేదు. చర్చలు జరిపిన సందర్భాలు ఉన్నాయి. సీఎం వెళ్లి గవర్నర్‌ను కలవడం.. ప్రధాని, రాష్ట్రపతిని కూడా కలిసి పరిష్కారాలు కనుక్కోవచ్చు. వారి నడుమ ఫోన్ సంభాషణలు జరిగిన సందర్భాలూ చాలానే ఉన్నాయి. వివాదాల పరిష్కారానికి దశాబ్దాలుగా ఈ సంప్రదాయం నడుస్తోంది. రాష్ట్రప్రభుత్వ ప్రతినిధి బృందాలు గవర్నర్‌ను, రాష్ట్రపతిని కలవొచ్చు. మధ్యేమార్గాన్ని కూడా కనుక్కోవచ్చు. కేంద్ర ప్రభుత్వ ప్రతినిధి అయిన గవర్నర్, రాష్ట్రప్రభుత్వం మధ్య సంక్షోభ పరిష్కారానికి రాజనీతిజ్ఞత, రాజకీయ పరిపక్వత చూపాల్సిన అవసరం ఉంది. ప్రతి సమస్యకు కోర్టులో పరిష్కారాలు ఉండకపోవచ్చు. ఎక్కువ సమస్యలకు వ్యవస్థలోనే పరిష్కారాలు దొరుకుతాయి. బిల్లుల ఆమోదానికి గవర్నర్‌కు, రాష్ట్రపతికి రాజ్యాంగంలో ఎక్కడా నిర్దిష్ట కాలపరిమితిని నిర్దేశించలేదు' అని మెహతా తెలిపారు. సీజేఐ స్పందిస్తూ.. తప్పు జరిగినప్పుడు దిద్దుబాటు ఉండాల్సిందేనని.. సుప్రీంకోర్టు రాజ్యాంగ పరిరక్షకురాలని.. వాస్తవ అర్థం ఇవ్వడం ద్వారా రాజ్యాంగానికి భాష్యం చెప్పాల్సి ఉంటుందని తేల్చిచెప్పారు. ఆయనతో జస్టిస్ సూర్యకాంత్ కూడా ఏకీభవించారు. మెహతా స్పందిస్తూ.. న్యాయబద్ధత వేరు.. రాజ్యాంగానికి ఇతరమేదైనా జోడించడం వేరని తెలిపారు. 'ఇదే న్యాయస్థానం తన తీర్పుల్లో ప్రస్తావించకుండా.. నిర్దిష్ట విధి నిర్వహించాల్సిందిగా సొలిసిటర్ జనరల్‌ను పలుసార్లు ఆదేశించిన సందర్భాలున్నాయి. అలాగే.. ఫలానా గడువులోగా గవర్నర్ బిల్లులను ఆమోదించేలా చట్టం చేయాలని కోర్టు పార్లమెంటును నిస్సందేహంగా కోరవచ్చు. కానీ తీర్పు ద్వారా కాలవ్యవధిని నిర్ణయించరాదు' అని పేర్కొన్నారు. రాష్ట్రపతి సుప్రీంకోర్టు అభిప్రాయాన్ని కోరడానికి కారణమైన తీర్పును మెహతా ఈ సందర్భంగా ప్రస్తావించారు. రాజ్యాంగంలోని 200వ అధికరణ ప్రకారం.. బిల్లుకు ఆమోదాన్ని నిలిపివేయడం గవర్నర్ స్వతంత్ర అధికారమని.. ఇది పరిపూర్ణ విధి కూడా అని తెలిపారు. అయితే గవర్నర్ ప్రజలకు జవాబుదారీ కాదని, ఆయన్ను ఏ కారణం లేకుండానే తొలగించవచ్చని సీజేఐ గుర్తుచేశారు.

న్యాయవ్యవస్థ క్రియాశీలత.. న్యాయ ఉగ్రవాదం కారాదు: సీజేఐ

విచారణ సందర్భంగా చీఫ్ జస్టిస్ గవాయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. న్యాయవ్యవస్థ క్రియాశీలత.. జ్యుడీషియల్ ఉగ్రవాదం కారాదని స్పష్టంచేశారు. చట్టసభలకు ఎన్నికైన ప్రజాప్రతినిధులు చాలా అనుభవజ్ఞులని.. వారిని తక్కువ చేయడానికి వీల్లేదని సొలిసిటర్ జనరల్ అన్నప్పుడు ఆయనీ వ్యాఖ్యలు చేశారు. 'ఎన్నికైనవారి గురించి మేమెప్పుడూ ఏమీ అనలేదు. న్యాయవ్యవస్థ క్రియాశీలత.. జ్యుడీషియల్ ఉగ్రవాదం లేదా సాహసకృత్యంగా మారకూడదని నేనెప్పుడూ చెబుతాను' అని స్పష్టంచేశారు. రాజ్యాంగ ధర్మాసనం తదుపరి విచారణ 26వ తేదీన జరుగుతుంది.

మా సైద్ధాంతిక శత్రువు బీజేపీ

(మొదటి పేజీ తరువాయి)



సింహానికి గుంపులో ఎలా జీవించాలో తెలుసు. ఒంటరిగా ఎలా జీవించాలో కూడా తెలుసు. సింహం వేటాడేందుకు మాత్రమే వస్తుంది. వినోదం కోసం కాదు... అది ఎప్పుడూ బతికున్న జంతువునే వేటాడి, ఆహారంగా తీసుకుంటుంది. అలాగే నేనూ రాజకీయాల్లో తాడోపేడో తేల్చుకునేందుకే వచ్చా. వచ్చే ఏడాది జరిగే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, డీఎంకే పార్టీలను తరిమికొట్టడమే లక్ష్యం.

\- విజయ్, తమిళగ వెట్రి కళగం(టీవీకే) అధ్యక్షుడు, సినీ నటుడు

ఆయన ప్రసంగించారు. బీజేపీ, డీఎంకేకు వ్యతిరేకంగా తమ పార్టీ ఎన్నికల బరిలోకి దిగనుందని, ఈ విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అవినీతి, అక్రమాలకు పాల్పడిన రాజకీయ నాయకుల తరహాలో బీజేపీతో బలవంతంగా పొత్తు పెట్టుకునే సాదాసీదా నాయకుడిని కాదని పరోక్షంగా అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామిని ఉద్దేశించి ఆయన విమర్శించారు. విజయ్ తనను తాను సింహంతో పోల్చుకున్నారు. 'సింహానికి గుంపులో ఎలా జీవించాలో తెలుసు. ఒంటరిగా ఎలా జీవించాలో కూడా తెలుసు. సింహం వేటాడేందుకు మాత్రమే వస్తుంది. వినోదం కోసం కాదు. అది ఎప్పుడూ బతికున్న జంతువునే వేటాడి ఆహారంగా తీసుకుంటుంది. అలాగే నేనూ రాజకీయాల్లో తాడోపేడో తేల్చుకునేందుకే వచ్చా' అని ఆయన వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో తాము ఒంటరిగానే పోటీ చేస్తామని, ఏ పార్టీతోనూ పొత్తులు పెట్టుకోమని విజయ్ స్పష్టం చేశారు. కేంద్రంలో మూడోసారి ప్రధానిగా గెలిచిన మోదీ.. ప్రజలకు మంచి చేయడానికి అధికారంలోకి వచ్చారో, లేక మైనారిటీ ప్రజలకు వ్యతిరేకంగా కుట్రలు, కుతంత్రాలు పన్నేందుకు వచ్చారో తెలియడం లేదన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో తమిళనాట ఒక్క సీటు కూడా గెలుచుకోలేకపోయామన్న అక్కసుతో రాష్ట్రాభివృద్ధిని విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పార్టీని గెలిపించలేదన్న ఆగ్రహంతోనే కీళడి పురావస్తు తవ్వకాల్లో బయల్పడిన తమిళుల ప్రాచీన నాగరికతకు సంబంధించిన పరిశోధనలను ఆమోదించడం లేదని ఆరోపించారు. తమిళ జాలర్ల శాశ్వత పరిష్కారం కోసం కచ్చాదీవిని మళ్లీ భారత్‌లో విలీనం చేయాలని, ఇక ఏమాత్రం మొండి వైఖరి ప్రదర్శించకుండా నీట్ పరీక్షలు రద్దు చేయాలని విజయ్ డిమాండ్ చేశారు.

స్టాలిన్... వెరీ వెరీ వరస్ట్ అంకుల్

తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్‌ను ఉద్దేశించి విజయ్ మాట్లాడుతూ.. 'స్టాలిన్ అంకుల్! టాస్మాక్‌లో రూ.1,000 కోట్లకు పైగా అవినీతి, అక్రమాలు జరిగాయని అంటున్నారు. మహిళలకు వెయ్యి రూపాయలు ఇస్తే చాలా అంకుల్? తమకు భద్రతే లేదని మహిళలు చెబుతున్న మాటలు మీకు వినపడవా అంకుల్? ఇది చాలక మహిళలంతా మిమ్మల్ని 'డాడీ' అని పిలవాలని చెబుతున్నారే.. వాటీజ్ దిస్ అంకుల్.. దిస్ ఈజ్ వెరీ వెరీ రాంగ్ అంకుల్... మహిళలనే కాదు, ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, రైతులు, మత్స్యకారులను కూడా మాయ మాటలతో మోసగిస్తున్నారే.. వెరీ వెరీ వరస్ట్ అంకుల్' అని వ్యాఖ్యానించారు.

ఉగ్ర గోదావరి



పెరిగిన వరద ఉధృతి.. జల దిగ్బంధంలో 140 గ్రామాలు

ధవళేశ్వరం బ్యారేజీ వద్ద గోదావరి ఉధృతి

- పోలవరం ముంపు గ్రామాలకు రాకపోకలు బంద్
- ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ
- సముద్రంలోకి 12 లక్షల క్యూసెక్కుల నీరు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: విపత్తుల సంస్థ

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి వరద ఉధృతి అంతకంతకూ పెరుగుతూ ఉగ్రరూపం దాల్చుతోంది. దీంతో పోలవరం ముంపు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి సుమారు 140 గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. గురువారం ధవళేశ్వరం వద్ద నీటిమట్టం 11.75 అడుగులకు చేరడంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీచేశారు. ఇది ఇంకా పెరుగుతూ రాత్రి 7 గంటలకు 13 అడుగులకు చేరుకుంది. సముద్రంలోకి 12,12,773 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. వరద ఉధృతి రెండో ప్రమాద హెచ్చరిక స్థాయి(13.75 అడుగులు)కి పెరుగుతుందని అధికారులు అంచనా వేశారు. అదే సమయంలో కాళేశ్వరం, పేరూరు వద్ద గోదావరి నీటిమట్టం తగ్గుతోంది. భద్రాచలం వద్ద నిలకడగా కొనసాగుతోంది. ఏలూరు జిల్లాలోని వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో 29 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కుక్కునూరు మండలంలో 1,222 కుటుంబాలు, వేలేరుపాడు మండలంలో 2,468 కుటుంబాలు ముంపు బారిన పడ్డాయి. ప్రభావిత గ్రామాల్లో జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి పర్యటించారు. అల్లూరి జిల్లా చింతూరు, కూనవరం, వరరామచంద్రపురం మండలాల్లోనూ పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వరరామచంద్రపురం మండలంలో 40 గ్రామాలు రెండు రోజులుగా జలదిగ్బంధలోనే ఉన్నాయి. కూనవరం మండలంలోని సుమారు 47 గ్రామాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. శబరి ఏరియాలో 20 గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయి అంధకారంలో ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, చింతూరు ఐటీడీఏ పీవో శుభం నొఖ్వాల్ కూనవరం మండలంలో పర్యటించి వరద పరిస్థితిని సమీక్షించారు. వరద నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులకు సూచించారు. ఇక కొల్లేరు వరద ఉధృతి గురువారం స్వల్పంగా తగ్గడంతో రహదారులు కొద్దికొద్దిగా ముంపు నుంచి బయటపడుతున్నాయి. పోలవరం ప్రాజెక్టు వద్ద గోదావరి నీటిమట్టం అనూహ్యంగా పెరిగింది. దీంతో ప్రాజెక్టు నుంచి 10,95,616 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 33.100 మీటర్లు, దిగువన 24.630 మీటర్లు నమోదైనట్టు జల వనరులశాఖ అధికారులు తెలిపారు. కాగా, భద్రాచలం వద్ద గోదావరి వరద ఉధృతి తగ్గుముఖం పడుతోందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. కృష్ణానదిలోనూ మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతుందని తెలిపింది. ప్రకాశం బ్యారేజి గుండా 5.02 లక్షల క్యూసెక్కుల నీరు సముద్రంలోకి ప్రవహిస్తోంది. వరద పూర్తిస్థాయిలో తగ్గే వరకు లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.



వరద ప్రభావిత గ్రామాల్లో బోటుపై పర్యటిస్తున్న ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి, అధికారులు

25న అల్పపీడనం

విశాఖపట్నం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): కోస్తా, రాయలసీమ పరిసరాలు, ఇంకా బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనాలు, ద్రోణులు లేవు. దీంతో రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు బలహీనంగా ఉన్నాయి. సముద్రం నుంచి భూఉపరితలంపైకి తేమగాలులు రాకపోవడంతో గురువారం కోస్తా, రాయలసీమల్లోని చాలా ప్రాంతాల్లో పొడి వాతావరణం నెలకొంది. కొన్నిచోట్ల ఎండ తీవ్రంగా ఉంది. కావలిలో 37 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న రెండు, మూడు రోజుల్లో కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఈనెల 24వ తేదీన ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్‌కు ఆనుకుని వాయవ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఆవరించనుంది. దీని ప్రభావంతో ఈనెల 25న అదే ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడుతుందని వాతావరణ శాఖ పేర్కొంది. ఆ ప్రభావంతో ఈనెల 25, 26 తేదీల్లో ఉత్తర కోస్తాలో వర్షా లు కురుస్తాయని తెలిపింది.

అరకు కాఫీకి మరింత ప్రోత్సాహం

- జీవో 3 పునరుద్ధరణకు చర్యలు: మాధవ్



పాడేరులో అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

పాడేరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): గిరిజనులు పండించే స్వచ్ఛమైన అరకు కాఫీని ప్రోత్సహించేందుకు మరింతగా కృషి చేస్తామని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. ఆయన గురువారం అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రమైన పాడేరు పర్యటనకు విచ్చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. 'ఇప్పటికే అరకు కాఫీ ప్రపంచ ఖ్యాతి పొందింది. పార్లమెంటు ఆవరణలో స్టాల్‌ను ఏర్పాటు చేసి దేశంలోని ఎంపీలంతా అరకు కాఫీని రుచి చూసేలా కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోదీ కృషి చేశారు. కాఫీ సాగు విస్తరణ, గిరిజన రైతులను ప్రోత్సహించేందుకు సీఎం చంద్రబాబు నూతన ప్రాజెక్టును మంజూరు చేశారు. వన్ డిస్ట్రిక్-వన్ ప్రొడక్ట్ నినాదంతో అరకు కాఫీకి మరింతగా ప్రాచుర్యం కల్పిస్తున్నాం. తోటల విస్తరణ, గిట్టుబాటు ధర, రైతులకు ప్రోత్సాహం వంటి చర్యలతో అరకు కాఫీని మరింత ఎత్తుకు తీసుకువెళ్లేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. గిరిజనులకు సంబంధించిన జీవో 3 పునరుద్ధరణకు సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కృషి చేస్తుంది. గత జగన్ ప్రభుత్వం వాదనలను వినిపించని కారణంగానే జీవో 3 రద్దయ్యింది' అని మాధవ్ తెలిపారు. అంతకు ముందు ఆయన పాడేరులో విప్లవ వీరులు అల్లూరి సీతారామరాజు, గంటం దొర విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

శ్రీవారి సేవలో జస్టిస్ సంజయ్ కరోల్



తిరుమల, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కరోల్ గురువారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయక మండపంలో ఆయనకు వేదపండితులు ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదాలు అందజేశారు.

IBC, 2016 క్రింద అమ్మకం ప్రకటన

సాయిభాస్కర్ ఐరన్స్ లిమిటెడ్ (మూసివేతలో ఉన్నది)

CIN -U27100TG2007PLC056809

లిక్విడేటర్స్ కార్యాలయం, నం.6-3-249/6, ఆల్కాజర్ ప్లాజా & టవర్స్, రోడ్ నం.1, బంజారాహిల్స్, హైదరాబాద్-500 034.

లిక్విడేషన్ ఎస్టేట్‌లో భాగంగా ఉన్నట్టి CIN-U27100TG2007PLC056809 కలిగిన **M/s. సాయి భాస్కర్ ఐరన్స్ లిమిటెడ్ (మూసివేతలో ఉన్నది)** యొక్క దిగువ తెలిపిన ఆస్తులు మరియు ఆసెట్స్ దిగువ టేబుల్‌లో తెలిపిన వివరాల ప్రకారం **"ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలా", "అక్కడ ఏమున్నదో అది", "ఏది అక్కడ ఉంటే అదే", "ఎటువంటి ఆవలంబన లేని"** ప్రాతిపదికన లిక్విడేటర్ ద్వారా అమ్మకం కొరకు ఉన్నాయి. ఆప్షన్ A లేదా ఆప్షన్ B లేదా ఆప్షన్ C లేదా ఆప్షన్ D ప్రకారం.
వేలం తేదీ: వేలం తేది మరియు సమయం: 16.09.2025 మంగళవారం IST ఉ.11.00 గం.నుండి మ.1.00 గం.మరియు లేదా 17.09.2025 బుధవారం IST ఉ.11.00 గం.నుండి మ.1.00 గం. మరియు లేదా 18.09.2025 గురువారం IST ఉ.11.00 గం.నుండి మ.1.00 గం. లేదా 19.09.2025 శుక్రవారం IST ఉ.11.00 గం.నుండి మ.1.00 గం.వరకు.

వివరణ	రిజర్వు ధర (రూ)	బయానా (వాపసు రానిది) (రూ)	బిడ్ పెరుగుదల మొత్తం (రూ.)
ఆప్షన్ A **వేలం తేది మరియు సమయం: 16.09.2025 IST ఉ.11.00 గం.నుండి మ.1.00 గం.వరకు.** IBBI (లిక్విడేషన్ ప్రాసెస్) రెగ్యులేషన్స్ 2016 లోని రెగ్యులేషన్ 32A మరియు 33(1)తో చదువబడే రెగ్యులేషన్ 32(ఇ) ప్రకారం గోయింగ్ కన్సర్న్ ప్రాతిపదికన కంపెనీ అమ్మకం	2,95,24,500	29,52,450	1,00,000
ఆప్షన్ B **వేలం తేది మరియు సమయం: 17.09.2025 IST ఉ.11.00 గం.నుండి మ.1.00 గం.వరకు.** IBBI (లిక్విడేషన్ ప్రాసెస్) రెగ్యులేషన్స్ 2016 లోని రెగ్యులేషన్ 32A మరియు 33(1)తో చదువబడే రెగ్యులేషన్ 32(f) ప్రకారం గోయింగ్ కన్సర్న్ ప్రాతిపదిక ప్రకారం కార్పొరేట్ డెటార్ బిజినెస్ అమ్మకం	2,95,24,500	29,52,450	1,00,000
ఆప్షన్ C **వేలం తేది మరియు సమయం: 18.09.2025 IST ఉ.11.00 గం.నుండి మ.1.00 గం.వరకు.** భూమి: డాక్యుమెంట్ ప్రకారం ప్రకాశం జిల్లా కానీ ఇప్పుడు బాపట్ల జిల్లాలో ఉన్న మార్టూరు మండలం, నాగార్జునపల్లి గ్రామం వద్ద 9.67 ఎకరాలు (పారిశ్రామిక భూమి).	2,49,31,800	24,93,180	1,00,000
ఆప్షన్ D **వేలం తేది మరియు సమయం: 19.09.2025 IST ఉ.11.00 గం.నుండి మ.1.00 గం.వరకు.**			
భూమి కాకుండా ఇతరత్రా (ఫైనాన్షియల్ అసెట్స్ మరియు అమ్మబడని ఆస్తులు)	45,92,700	4,59,270	50,000

1. ఇవేలం **"ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలా", "అక్కడ ఏమున్నదో అది", "ఏది అక్కడ ఉంటే అదే", "ఎటువంటి అవలంబన లేని"** ప్రాతిపదికన ఎటువంటి వారంటీలు నష్టపరిహారాలు లేని అమ్మకంగా ఇ-వేలం ప్లాట్‌ఫారం https://ibbi.baanknet.com వద్ద ఆమోదిత సర్వీస్ ప్రొవైడర్ ద్వారా (ఒక్కోదానికి 5 నిమిషాల అపరిమిత విస్తరణతో) అమ్మకం నిర్వహించబడుతుంది.
2. ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్సీ బోర్డ్ ఆఫ్ ఇండియా (లిక్విడేషన్ ప్రాసెస్) రెగ్యులేషన్స్, 2016 షెడ్యూల్ I, ఆక్షన్ నోటీస్, Cl. 1(5A) ప్రకారం, సెక్షన్ 29A క్రింద వారు అనర్హత పొందలేదని మరియు అర్హతానిబంధనలు నెరవేర్చుకుండా లేమని డిక్లరేషన్ ప్రకటించాలి, తదుపరి ఈ విషయాలు కనుగొనబడినట్లయితే బయానా స్వాధీనం చేసుకోబడుతుంది.

ఈ ప్రక్రియలో పాల్గొనుటకు ముందు మరియు బయానా దాఖలు చేయుటకు ముందు పూర్తి ఇ-వేలం ప్రక్రియ డాక్యుమెంట్‌ను లేదా, IBBI వెబ్‌సైట్ లేదా IBBI ఇ-వేలం పోర్టల్ www.baanknet.com నుండి లేదా support.baanknet@psballiance.com కు వ్రాతపూర్వకంగా లేదా టోల్ ఫ్రీ నంబర్ 8291 220 220 ను సంప్రదించుట ద్వారా లేదా లిక్విడేటర్‌కు cirp.sbil@gmail.com కు ఇమెయిల్ చేయుట ద్వారా అన్ని నియమ నిబంధనలను పొంది వాటిని తప్పనిసరిగా చూడగలరు.

ప్రదేశం: హైదరాబాద్,
తేది: 20.08.2025

డా.కొండపల్లి వెంకట శ్రీనివాస్
Reg.No.IBBI/IPA-001/IP-P00520/2017-18/10945
లిక్విడేటర్, సాయి భాస్కర్ ఐరన్స్ లిమిటెడ్
ఇమెయిల్ cirp.sbil@gmail.com

శ్రీశైలం ఆలయాన్ని కాపాడే బాధ్యత మీదే

- సీఎం, డిప్యూటీ సీఎంకు తెలంగాణ ఎమ్మెల్యే రాజాసింగ్ విజ్ఞప్తి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం పుణ్యక్షేత్రాన్ని కాపాడే బాధ్యత ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రిపైన ఉందని హైదరాబాద్ గోషామహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ పేర్కొన్నారు. 'శ్రీశైలం పవిత్ర స్థలాన్ని ఆక్రమించిన వారందరినీ, ఇతర మతాల వారిని వెంటనే సున్నిపెంట ప్రాంతానికి బదిలీ చేయాలి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను ఆయన కోరారు. పవిత్ర స్థలమైన శ్రీశైలాన్ని అపవిత్రం చేసేందుకు కొంత మంది రాజకీయ నాయకులు, కొన్ని రాజకీయ పార్టీలు కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. ఆ పార్టీలు తమ ఓటు బ్యాంకు పెంచుకోవడానికి ఇతర మత స్థులను శ్రీశైలం ప్రాంతంలో స్థిరపరిచారని విమర్శించారు. పవిత్ర క్షేత్రంలో దాదాపు అన్ని దుకాణాలను ముస్లిములు, క్రైస్తవులు ఆక్రమించారని ఆరోపించారు.

చెయ్యేరులో మునిగి ముగ్గురు ఎంబీఏ విద్యార్థులు మృతి

- అన్నమయ్య జిల్లాలో విషాదం

రాజంపేట, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా రాజంపేట అన్నమాచార్య యూనివర్సిటీలో ఎంబీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ముగ్గురు విద్యార్థులు చెయ్యేరు నదిలో ఈతకు వెళ్లి ఇసుక గుంతల్లో మునిగి చనిపోయారు. గురువారం మధ్యాహ్నం రాజంపేట నుంచి సుమారు 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న రాజంపేట-రాయచోటి ఘాట్ రోడ్డులోని చెయ్యేరు నది వద్దకు 8 మంది విద్యార్థులు ఈతకు వెళ్లారు. భోజనాలు తీసుకుని గట్టు వద్ద తిని సరదాగా ఈత కొట్టేందుకు నీటిలోకి దిగారు. ఇటీవల చెయ్యేరు నదిలో బాలరాజుపల్లె వద్ద ఇసుక రీచ్ ఏర్పాటు చేశారు. ఇసుక తవ్వకాల కారణంగా పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. నాలుగు రోజుల కిందట ఎగువ ప్రాంతాల్లో అధిక వర్షాలు పడడం, దానికితోడు పింఛా డ్యాం గేట్లు ఎత్తడం వల్ల నదిలోకి వరద నీరు చేరడంతో ఇసుక రీచ్‌లోని గుంతలను వీరు గుర్తించలేకపోయారు. దీంతో ఈతకు వెళ్లిన 8 మంది విద్యార్థుల్లో రాజంపేట మండలం గాలివారిపల్లెకు చెందిన సోంబత్తిన దిలీప్ మణికుమార్(22), కడప జిల్లా ఒంటిమిట్ట మండలం కోనరాజుపల్లె గ్రామానికి చెందిన కొత్తూరు చంద్రశేఖర్ రెడ్డి(22), పోరుమామిళ్లకు చెందిన పీనరోతు కేశవ(22) ఇసుక గుంతల్లో ఇరుక్కుపోయి మృతిచెందారు. వీరికి ఈత రాకపోవడంతో మునిగిపోయి అక్కిడికక్కడే మృతిచెందారు. మన్నూరు పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి విద్యార్థుల మృతదేహాలను రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి వారి తల్లిదండ్రులకు సమాచారాన్ని అందించారు. మిగిలిన ఐదుగురు విద్యార్థులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.



ఆంధ్రప్రదేశ్ ఐటీ, మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి నారా లోకేశ్‌ను గురువారం అమరావతిలో కలుసుకుని తన మనవరాలు కాదంబరి ఎస్.విశ్వనాథన్ వివాహ వేడుక ఆహ్వాన పత్రికను అందిస్తున్న 'వేలూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ' (వీఐటీ) వ్యవస్థాపకులు, చాన్స్‌లర్ డాక్టర్ జి.విశ్వనాథన్.

VISAKHAPATNAM METROPOLITAN REGION DEVELOPMENT AUTHORITY

e-AUCTION NOTICE

Rc. No.06/2025/G1 Dt. 13-08-2025 & Rc. No.114, 115 & 24/BL/2025/F1 Dt. 20-08-2025

The VMRDA, Visakhapatnam has proposed to sell the vacant Flats & vacant other size plots in MIG layouts, regular plots in Thummapala layout and bulk land in Sy.No. 126/P of Madhurawada Village, Visakhapatnam Rural, Visakhapatnam District developed by the VMRDA to the public on "as is where is basis" and applications are invited through GOAP e-auction portal (**https://Konugolu.ap.gov.in**) as detailed below:

FLATS

Name of the Housing Scheme	No. of Flats	Receipt of applications	Date of Auction
Kapuluppada Housing Scheme	3 Flats	20-08-2025 to 03-09-2025	06-09-2025
Kurmannapalem Housing Layout	1 Flat		
TOTAL	4 Flats		

PLOTS

Name of the Layout	No. of Plots	Receipt of applications	Date of Auction
MIG layouts- Raghumanda & Jiyyannavalasa	16	21-08-2025 to 05-09-2025	08-09-2025
Thummapala Layout	14	21-08-2025 to 05-09-2025	09-09-2025
Sy.No. 126/P of Madhurawada Village	1	21-08-2025 to 08-09-2025	10-09-2025
TOTAL PLOTS	31		

For more details at VMRDA website www.vmrda.gov.in /Email e.auctionvmrda@gmail.com / (Help desk Konugolu portal) +91 9154383633/34, 7337318402/03, VMRDA, Contact details : 9848320117 & 9848716168, Land Line No.0891-2755554 & 0891-2754133/2754005.

Sd/-Metropolitan Commissioner, VMRDA

దక్షిణ మధ్య రైల్వే

ఫాలో అవ్వండి @SCRailwayIndia
ద.మ.రైల్వేలోని టెండరు ప్రకటన వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in లో చూడవచ్చును

టెండరు ప్రకటన నం: G/E.29/Tr./Tender Notice/18/2025-26 తేది:18.08.2025

భారత రాష్ట్రపతి తరఫున సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/ ట్రాక్షన్/ గుంతకల్ వారు దిగువ తెలిపిన పనుల కొరకు ఇ-టెండర్లు కోరుచున్నారు.

టెండరు నం: GTL-TRD-29-eTN-36-2025-26 **పని పేరు:** గుంతకల్ డివిజన్: 4 సంవత్సరాల కాలానికి RU-GDR, RU-KPD మరియు RU-BKPT సెక్షన్లు మరియు GTLW/TSS & NKDO/SP RTU's మధ్యన SCADA సిస్టమ్ వార్షిక నిర్వహణ కాంట్రాక్టు. **సుమారు విలువ:** రూ. 85,34,880/- **బయానా:** రూ. 1,70,700/-

టెండరు ముగింపు తేది మరియు సమయం: 09.09.2025న 15.00 గం.లకు
గమనిక: 1. టెండరుదారులు టెండరు డాక్యుమెంట్‌ను **www.ireps.gov.in** నుండి ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును.
టెండరు బిడ్డింగ్ మరియు ఇతర వివరాల కొరకు **http://www.ireps.gov.in** కు లాగిన్ కాగలరు. ఏదేని సవరణ ఆన్‌లైన్ ద్వారా మాత్రమే జారీ చేయబడుతుంది.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, ట్రాక్షన్, గుంతకల్

ఇ-టెండరు కోరుతూ ప్రకటన (https://ireps.gov.in ద్వారా)

భారత రాష్ట్రపతి తరఫున CE/C-III/SC,CE/C/Plg & Survey/SC & CE/C-V/SC నిర్మాణ సంస్థ, ద.మ.రైల్వే సికింద్రాబాద్ వారు దిగువ పనుల కొరకు ఇ-టెండరు కోరుచున్నారు.

క్ర.సం.01, NIT No. PMS 01-CAO-C-SC-2025, **తేది:** 11.08.2025, **పని పేరు:** ద.మ.రై. నిర్మాణ సంస్థ - దక్షిణ మధ్య రైల్వేలో దిగువ ప్రాజెక్టుల కొరకు ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ (PMS) ఏర్పాటు కొరకు అథారిటీ ఇంజనీర్ నియామకం. (1) విజయవాడ డివిజన్‌లో రాజమండ్రి రైల్వే స్టేషన్ యొక్క పునరాభివృద్ధి. (2) తిరుపతి రైల్వే స్టేషన్ యొక్క మేజర్ అప్‌గ్రేడేషన్ కాలం విస్తరించబడినది మరియు (3) విజయవాడ డివిజన్‌లోని నెల్లూరు రైల్వే స్టేషన్ యొక్క మేజర్ అప్‌గ్రేడేషన్ కాలం విస్తరించబడినది. **అంచనా వ్యయం:** రూ. 6,17,21,952.00/-, **బయానా:** రూ. 4,58,600.00/-, **పూర్తి చేయు కాలం:** 42 (నలభై రెండు) నెలలు, **తెరుచు తేది:** 30.09.2025న 15.00 గం.లకు

క్ర.సం.02, NIT No. 18-CAO-C-SC-2025, **తేది:** 13.08.2025, **పని పేరు:** దక్షిణ మధ్య రైల్వేలో CAO/ నిర్మాణం క్రింద కొత్త బీజి లైన్లు, డబ్లింగ్, ట్రిప్లింగ్ మరియు గేజ్ కన్వర్షన్ పనుల యొక్క నిర్మాణం కొరకు భారతీయ రైల్వే మాన్యువల్ యొక్క నిబంధనల ప్రకారం మెకానికల్ ప్రోబింగ్ ద్వారా కాంట్రాక్టర్ల RDSO ఆమోదిత ఫేస్ అరే అల్ట్రా సోనిక్ టెస్టింగ్ (PAUT) వెల్డ్ టెస్టర్ ఉపయోగించుట ద్వారా రైళ్ల యొక్క అన్ని రకాల ఫ్లాష్ బట్ (FB) వెల్డ్ జాయింట్ల యొక్క USFD టెస్టింగ్ చేపట్టుట. **అంచనా వ్యయం:** రూ. 2,32,00,133.40/-, **బయానా:** రూ. 2,66,000.00/-, **పూర్తి చేయు కాలం:** 36 (ముప్పై ఆరు) నెలలు, **తెరుచు తేది:** 09.09.2025న 15.00 గం.లకు

క్ర.సం.03, NIT No. PMS-02-CAO-C-SC-2025, **తేది:** 12.08.2025, **పని పేరు:** ద.మ.రై. నిర్మాణ సంస్థ: నాందేడ్ డివిజన్: "దక్షిణ మధ్య రైల్వే యొక్క నాందేడ్ డివిజన్‌లో మహారాష్ట్ర రాష్ట్రంలో మరియు మధ్యప్రదేశ్ రాష్ట్రంలో అకోలా-కాండ్వా గేజ్ కన్వర్షన్ ప్రాజెక్టుకు సంబంధించి ఎలక్ట్రికల్ జనరల్ సర్వీస్ పనులు కలుపుకుని ఖాక్‌నర్ కలాన్ మరియు అకోట్ స్టేషన్ల మధ్యన కి.మీ. 652.700 నుండి కి.మీ. 726.700 వరకు ట్రాక్ యొక్క గేజ్ కన్వర్షన్/కొత్త బిజి లైన్ నిర్మాణం కొరకు ఇంజనీరింగ్ పనులు" కొరకు ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ సర్వీసుల ఏర్పాటు కొరకు అథారిటీ ఇంజనీర్ నియామకం. **అంచనా వ్యయం:** రూ. 21,50,99,600.00/-, **బయానా:** రూ. 12,25,500.00/-, **పూర్తి చేయు కాలం:** 42 (నలభై రెండు) నెలలు, **తెరుచు తేది:** 18.09.2025న 15.00 గం.లకు

(i) బిడ్ డాక్యుమెంట్ మరియు ఇతర వివరాలు కొరకు వెబ్‌సైట్ **https://ireps.gov.in** కు లాగిన్ కాగలరు.
(ii) టెండరుదారు టెండరు ముగింపు కాలం అయినట్టి సదరు పదిహేను రోజుల కాలం లోగా మాత్రమే వారి ఆఫర్లను ఆన్‌లైన్‌లో దాఖలు చేయవలెను.
(iii) టెండరుదారు ఏదేని సవరణ (ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడుతుంది) కొరకు టెండరు దాఖలు ప్రారంభ కాలం తేది వరకు గమనించగలరు.

చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, నిర్మాణం, సికింద్రాబాద్

ఇ-టెండరు కోరుతూ ప్రకటన

భారత రాష్ట్రపతి తరఫున PCE, దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ వారు దిగువ పని కొరకు ఇ-టెండరు కోరుచున్నారు.

NIT No. GMWSCPAUT25-26 01, **పని పేరు:** ద.మ.రై యొక్క SC, HYB&NED డివిజన్లు: (1) RDSO ఆమోదిత టెస్టింగ్ ప్రక్రియ ప్రకారం రైళ్ల యొక్క అస్థిరకాల బ్లాక్ లేకుండా ట్రాక్‌పై సైట్ వద్ద ఫ్లాష్ బట్ (FB) వెల్డ్ జాయింట్ల యొక్క ఫేస్ అరే అల్ట్రా సోనిక్ టెస్టింగ్ (PAUT) చేపట్టుట. (2) RDSO ఆమోదిత టెస్టింగ్ ప్రక్రియ ప్రకారం PAUT చేపట్టుట కొరకు IRPWM & FB వెల్డ్ మాన్యువల్ ప్రకారం రైళ్ల యొక్క అన్ని రకాలలో బ్లాక్ లేకుండా ట్రాక్‌పై సైట్ వద్ద రైళ్ల యొక్క అస్థిరకాల ఫ్లాష్ బట్ వెల్డ్స్ యొక్క 20% వెల్డ్ ఫిన్ గ్రైండింగ్. **టెండరు విలువ:** రూ. 69059164.20/-, **బయానా:** రూ. 495300.00/-, **టెండరు ముగింపు తేది & సమయం:** 04.09.2025న 15.00గంల వరకు.

టెండరు డాక్యుమెంట్లు మరియు ఇతర వివరాలు వెబ్‌సైట్ **"www.ireps.gov.in"** నుండి పొందగలరు.
అన్ని సవరణలు వెబ్‌సైట్ **"www.ireps.gov.in"** ద్వారా మాత్రమే జారీచేయబడును.

డిప్యూటీ చీఫ్ ఇంజనీర్/ట్రాక్-II/ సికింద్రాబాద్

ఇ-టెండరు కోరుతూ ప్రకటన

భారత రాష్ట్రపతి తరఫున PCE, దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ వారు దిగువ పని కొరకు ఇ-టెండరు కోరుచున్నారు.

NIT No. GMWSCPAUT25-26 02, **పని పేరు:** ద.మ.రై యొక్క BZA, GTL & GNT డివిజన్లు: (1) RDSO ఆమోదిత టెస్టింగ్ ప్రక్రియ ప్రకారం రైళ్ల యొక్క అస్థిరకాల బ్లాక్ లేకుండా ట్రాక్‌పై సైట్ వద్ద ఫ్లాష్ బట్ (FB) వెల్డ్ జాయింట్ల యొక్క ఫేస్ అరే అల్ట్రా సోనిక్ టెస్టింగ్ (PAUT) చేపట్టుట. (2) RDSO ఆమోదిత టెస్టింగ్ ప్రక్రియ ప్రకారం PAUT చేపట్టుట కొరకు IRPWM & FB వెల్డ్ మాన్యువల్ ప్రకారం రైళ్ల యొక్క అన్ని రకాలలో బ్లాక్ లేకుండా ట్రాక్‌పై సైట్ వద్ద రైళ్ల యొక్క అస్థిరకాల ఫ్లాష్ బట్ వెల్డ్స్ యొక్క 20% వెల్డ్ ఫిన్ గ్రైండింగ్. **టెండరు విలువ:** రూ. 49108869.00/-, **బయానా:** రూ. 395600.00/-, **టెండరు ముగింపు తేది & సమయం:** 08.09.2025న 15.00గంల వరకు.

టెండరు డాక్యుమెంట్లు మరియు ఇతర వివరాలు వెబ్‌సైట్ **"www.ireps.gov.in"** నుండి పొందగలరు.
అన్ని సవరణలు వెబ్‌సైట్ **"www.ireps.gov.in"** ద్వారా మాత్రమే జారీచేయబడును.

A1233 **డిప్యూటీ చీఫ్ ఇంజనీర్/ట్రాక్-II/ సికింద్రాబాద్**

తదుపరి టెండరు నిబంధనలు/ వివరాల కొరకు మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కొరకు వెబ్‌సైట్ : https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in వద్ద దర్శించండి.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

నిట్ నెం.59/ఏ.టీ.ఓ/2025-26, తేది: 14.08.2025

పంచాయతీరాజ్ సర్కిల్, ఏలూరు, ఏలూరు జిల్లాలోని minority Welfare గ్రాంట్ నందు 1 పనికి గాను అంచనా విలువ: రూ. 192.50 లక్షలు చేపట్టుటకు www.apeprocurement.gov.in ద్వారా టెండర్లు కోరబడుచున్నవి. టెండర్లు స్వీకరణ తేది: 21.08.2025 నుండి 05.09.2025, మ.3.30 గం.ల వరకు.

సం/- పర్యవేక్షక ఇంజనీరు, పంచాయతీరాజ్ సర్కిల్, ఏలూరు

DIPR RO No.17316/CL/ADVT/1/1/2021-22, Dt: 21.08.2025

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
RWS&S శాఖ

నం.30/2025-26 ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన తేది:19.08.2025

"SPSR నెల్లూరు జిల్లాలో 55 LPCD సర్వీస్ లెవల్‌తో 100% FHTCs ద్వారా అన్ని అవసరమైన నివాసాలకు తాగు నీటి సౌకర్యాలను ఏర్పాటు" కొరకు ఆన్‌లైన్ టెండర్లు కోరుచున్నారు (1 పని). **అంచనా వ్యయం:** JJM ప్రోగ్రామ్ క్రింద రూ. 2200.00 లక్షలు. టెండర్లను ఇ-మార్కెట్ ప్లేస్ @ **www.tender.apeprocurement.gov.in** లో 25.08.2025 నుండి 08.09.2025న మ.03.00 గం.ల వరకు డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. **సంబంధిత అధికారి:** SE, RWS&S సర్కిల్, SPSR నెల్లూరు.

సం/- చీఫ్ ఇంజనీర్, RWS&S శాఖ, గొల్లపూడి, విజయవాడ

DIPR RO No.17317/CL/ADVT/1/1/2021-22, Dt.21.08.2025

ANDHRA PRADESH POWER GENERATION CORPORATION LIMITED
VIDYUT SOUDHA:: VIJAYAWADA

NOTIFICATION for APGENCO e-Procurement
NIT NO.610002039

APGENCO invites open tender for "Procurement of Suitable QUICK ERECT CUPLOK SCAFFOLDING for 600MW Boiler/Stage-IV/Dr.MVR RTPP" through APGENCO e-procurement platform. Schedule available date & time: from 13:30 Hrs onwards on 20.08.2025. Bid submission closing date & time: 15:00 Hrs on 09.09 2025. for further details visit: **www.apgenco.gov.in** or **(https://etender.apgenco.gov.in/irj/portal)**. Phone: (0866) 2526808, 2526115, 2526139.

DIPR RO No.4352PP/CL/ADVT/1/1/2021-22, Dt.21.08.2025

అఫీషియల్ లిక్విడేటర్ కార్యాలయం

1వ అంతస్తు, కార్పొరేట్ భవన్, బండ్లగూడ, నాగోల్, హైదరాబాద్-500 068.
ఫోన్ నం:040-29803086/3186,
ఇమెయిల్: ol.hyderabad@mca.gov.in.

ఫారం నం.63
(రూల్ 148(1) చూడగలరు)
తెలంగాణ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో:: హైదరాబాద్ వద్ద
(వాస్తవిక అధికారిక పరిధి)
కంపెనీస్ యాక్ట్, 1956 విషయంలో
మరియు
M/s. శ్రీ విష్ణుప్రియ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (లిక్విడేషన్‌లో ఉన్నది)
కంపెనీ పిటిషన్.నం. 168 ఆఫ్ 2002

తమ క్లెయిమ్ నిర్ధారణకు క్రెడిటార్లకు (పనివారితో కలుపుకుని) అడ్వర్టైజ్‌మెంట్ ప్రకటన

పై పేరు గల కంపెనీ (లిక్విడేషన్‌లో ఉంది) క్రెడిటార్లకు (పనివారితో కలుపుకుని) ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమేమనగా, కంపెనీల చట్టం, 1956లోని సెక్షన్ 530 క్రింద ప్రాధాన్యతకు ఏదేని టైటిల్ మరియు రుణం లేదా క్లెయిం వివరాలు మరియు వారి సంబంధిత పేర్లు, చిరునామాతో నిర్దిష్ట నమూనాలో రుణం లేదా క్లెయింను రుజువు చేస్తూ ఒక అఫిడవిట్‌తో **22 సెప్టెంబర్, 2025 న లేదా ఆలోగా అధికారిక లిక్విడేటర్ కార్యాలయం, 1వ అంతస్తు, "కార్పొరేట్ భవన్", బండ్లగూడ, నాగోలు, హైదరాబాద్-500068** వద్ద బట్వాడా లేదా సదరు తేదీన లేదా ఆలోగా అతనికి చేరువిధంగా అధికారిక లిక్విడేటర్‌కు తపాలాద్వారా పై పేరుగల కంపెనీపై తమ సంబంధిత రుణాలు లేదా క్లెయిముల రుజువులను తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థాన అధికారిక లిక్విడేటర్ కు దాఖలు చేయవల్సిందిగా కోరబడుచున్నారు. పైన చెప్పబడిన పరిమిత కాలం లోగా వారి అఫిడవిట్ రుజువు దాఖలు చేయడంలో ఎవరేని సెక్యూర్డ్ క్రెడిటార్ మరియు ఇతర క్రెడిటార్లు విఫలమైనచో, సదరు పంపిణీ ఆక్షేపణ నుండి అతని/ ఆమె / వారిని డివిడెండ్ యొక్క ఏదేని పంపిణీ ప్రయోజనం నుండి మినహాయించబడును.
ఎవరేని క్రెడిటార్ (పనివారితో కలుపుకొని) అతని/ ఆమె/వారు రుజువు పంపారో వారు అధికారిక లిక్విడేటర్ నుండి వ్రాతపూర్వక నోటీసును అందుకున్న తరువాత స్వయంగా లేదా అతని న్యాయవాది ద్వారా సదరు రుణం లేదా క్లెయిం విచారణకు సదరు సమయం మరియు ప్రదేశం సదరు నోటీసులో తెలియజేయబడిన విధంగా హాజరుకాగలరు. మరియు అతను/ఆమె/వారు సదరు రుణం లేదా క్లెయింకు తదుపరి రుజువు దాఖలు చేయవల్సిందిగా కోరబడుచున్నారు.

19 ఆగస్ట్ 2025

సం/- (యు.కె.సాహు, ఐసిఎల్ఎస్)
అధికారిక లిక్విడేటర్
తెలంగాణ రాష్ట్రం మరియు ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం, హైదరాబాద్

గమనిక: కంపెనీల (న్యాయస్థాన) రూల్స్, 1959 లోని రూలు 151 మరియు 152 మరియు ఇతర వర్తించు రూల్స్ క్రింద సిద్ధపరిచిన డాక్యుమెంట్లతో సందర్భానుసారంగా ఫారం నం.66 మరియు ఫారం నం.67 లో తగువిధంగా నోటరీ చేసిన రూ. 20/- నాన్-జుడిషియల్ స్టాంప్ పేపరుపై క్లెయింను దాఖలు చేయవలెను.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

పాత్రికేయులపై ప్రతాపం

సీనియర్ జర్నలిస్టులు సిద్ధార్థ వరదరాజన్, కరణ్ థాపర్‌ల మీద అసోం పోలీసులు దేశద్రోహం కేసు నమోదుచేయడం అమితాశ్చర్యాన్ని కలిగిస్తోంది. భారతీయ న్యాయసంహితలోని కొత్త దేశద్రోహ చట్టం (సెక్షన్ 152)ను పాత్రికేయులమీద ప్రయోగించే దుస్సంప్రదాయానికి తెరదీయవద్దనీ, ఈ కేసును తక్షణమే ఉపసంహరించుకోవాలనీ గురువారం విపక్షపార్టీలకు చెందిన ఎంపీలు అసోం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆ పార్టీల అధినేతలందరూ సామాజిక మాధ్యమాల్లో అసోం పోలీసుల దూకుడునూ, పత్రికాస్వేచ్ఛను నియంత్రించే ప్రయత్నాన్నీ ప్రశ్నిస్తున్నారు. ఇండియన్ పీనల్ కోడ్ 124ఎ కింద ఇక ఎంత మాత్రం దేశద్రోహం కేసులు కుదరవంటూ సుప్రీంకోర్టు నిలిపివేయడంతో, అంత కంటే కఠినాతికఠినమైన కొత్తచట్టాన్ని తెచ్చి పాత్రికేయులను జీవితపర్యంతం జైల్లో ఉంచేందుకు డబుల్ ఇంజన్ సర్కార్లు ప్రయత్నిస్తున్నాయని వీరంతా విమర్శిస్తున్నారు. సమన్ల జారీమీద ఎడిటర్స్ గిల్డ్ కూడా అభ్యంతరాన్ని ప్రకటిస్తూ, అసోం పోలీసులు దురుద్దేశంతో వ్యవహరిస్తున్నారన్న అపప్రథ మూటగట్టుకోకూడదని వ్యాఖ్యానించింది. ఆగస్టు 22న గువాహతి క్రైమ్‌బ్రాంచ్ ముందు హాజరుకానిపక్షంలో అరెస్టులు తప్పవంటూ అసోం పోలీసులు వీరిని హెచ్చరించారు.

ఆపరేషన్ సిందూర్‌మీద 'ది వైర్' వెబ్‌సైట్‌లో ప్రచురితమైన కథనాలు, విశ్లేషణలు, ఇంటర్వ్యూలు పాలకుల ఆగ్రహాన్ని చవిచూశాయి. కొత్తదేశద్రోహ చట్టం రాజ్యాంగ చెల్లుబాటును సుప్రీంకోర్టులో సవాలు చేస్తూ పిటిషన్ దాఖలు చేయడంతోపాటు, అసోం పోలీసులు తమపై ఎటువంటి నిర్బంధచర్యలకు పాల్పడకుండా ది వైర్ పాత్రికేయులు సర్వోన్నత న్యాయస్థానం నుంచి రక్షణ కూడా సాధించుకున్నారు. వారి పిటిషన్ మీద ఆగస్టు 12న సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసిన వెంటనే, మోరిగావ్ పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసుతో సంబంధం లేకుండా, అదేరోజున ఈ మారు గువాహతి క్రైమ్ బ్రాంచ్ పోలీసులు ఆపరేషన్ సిందూర్ గురించిన వేరొక కథనంపైన మరొక ఎఫ్ఐఆర్‌తో బరిలోకి దిగడం గమనార్హం. ఈ పరిణామాలు గమనించినప్పుడు, సుప్రీంకోర్టు నోటీసులు, ఆదేశాలు అసోం పాలకులను, వారి పోలీసులను ఏమాత్రం అడ్డలేకపోగా, నిర్దిష్టమైన లక్ష్యంతో, కక్షపూరితవైఖరితో ఇదంతా చేస్తున్నారని కూడా అనుకోవాలి. కొద్దిరోజుల తరువాత తమకు అందిన ఈ సమన్లలో కనీసం ఎఫ్ఐఆర్ నమోదు చేసిన తేదీని ప్రస్తావించకపోవడమేకాక, ఏ నేరానికి పాల్పడ్డారో, ఏ కారణంతో వీటిని జారీచేశారో కూడా తెలియజేయలేదని వైర్ అంటోంది. ఎన్నో ప్రయత్నాల తరువాత, మొన్న బుధవారంనాటికి కానీ తమమీద ఉన్న ఆరోపణలు ఏమిటో తెలియలేదనీ, సెక్షన్ 152ను ప్రయోగించారు కానీ, అందులో భాగంగా విధిగా పాటించాల్సిన నిబంధనలను మాత్రం పోలీసులు ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించారని ఆ సంస్థ ఆరోపిస్తోంది. పహల్గాం దాడి, ఆపరేషన్ సిందూర్, ముందూ వెనుకా పరిణామాలమీద వెబ్‌సైట్‌లో సుప్రసిద్ధ పాత్రికేయులు రాసిన పన్నెండు కథనాల శీర్షికలు, దౌత్య, రక్షణరంగ నిపుణులతో పాటు, పొరుగుదేశం నాయకులతో సైతం కరణ్‌థాపర్ నిర్వహించిన ఇంటర్వ్యూల ప్రస్తావనలు ఎఫ్ఐఆర్‌లో ఉన్నట్టు సమాచారం. అసోం పోలీసులు వీరందరి జోలికీ పోకపోవచ్చును కానీ, ది వైర్ సంస్థనీ, ఈ ఇద్దరు పాత్రికేయులనూ సులభంగా వదలకపోవచ్చు.

ఆపరేషన్ సిందూర్‌లో విజయాల గురించే తప్ప, జరిగిన నష్టాలమీద మన ప్రభుత్వం నోరు విప్పనందున, మన సైనికరంగ నిపుణుల వ్యాఖ్యలు, విదేశీ మీడియా కథనాల ఆధారంగా విమానాల నష్టంమీద మీడియాలో కొంత విశ్లేషణ జరగకపోలేదు. ఈ విషయంలో వైర్ మరింత దూకుడుగా ఉండటం మన పాలకులకు నచ్చకపోవడం సహజం. సదరు కథనాలు, ఇంటర్వ్యూలను శుద్ధ అబద్ధాలంటూ ఖండించవచ్చు, సవరణలూ వివరణలూ ప్రచురించని పక్షంలో చట్టప్రకారం దండించవచ్చు. కానీ, పాలకుల అభిప్రాయానికి భిన్నంగా ఒక మీడియా సంస్థ వ్యాఖ్యలు, విశ్లేషణలు చేసినంతమాత్రాన, ఒక జర్నలిస్టు ఏలికలకు నచ్చని రీతిలో తన వృత్తిని నిర్వహించినంతమాత్రాన అది దేశద్రోహమై పోదు. దేశంలో కొన్ని ప్రధాన మీడియా సంస్థలను పాలకులు పలుమార్గాల్లో తమ దారికి తెచ్చుకున్న నేపథ్యంలో, గత పదేళ్ళకాలంలో వైర్ స్వతంత్రంగా వ్యవహరిస్తూ అనేక కథనాలు ప్రచురించిన విషయం తెలిసిందే. మూడేళ్ళక్రితం ఆ సంస్థ ఢిల్లీ కార్యాలయంలో సోదాలు కూడా జరిగాయి. 152వంటి భయానక చట్టంతో పాత్రికేయుల నోరునొక్కే ఈ ప్రయత్నాలను రేపోమాపో దానిని సమీక్షించబోతున్న సుప్రీంకోర్టు దృష్టిలో పెట్టుకోవాలి.

ఓట్ల చోరీలో దొరలెవ్వరు.. దొంగలెవ్వరు!



గణితంలో మనం ఘటికులం! ఈ ఘనత ఇప్పటిది కాదు. సున్నాని కనిపెట్టటంతో ఆరంభమై దశాంశ పద్ధతిని ఉపయోగించటంతో వందల ఏళ్ల క్రితమే భారతీయుల ప్రతిభ ప్రపంచానికి వెల్లడైంది. ఇది ఒకవైపు చిత్రం. మరోవైపు చూస్తే లెక్కలను అస్తవ్యస్తంగా నిర్వహించటంలోనూ, అవసరాలకు అనుగుణంగా వాటిని అటూఇటూ చేయటంలో కూడా మనం దిట్టలమే! ప్రభుత్వానికి సంబంధించిన ఏ శాఖను చూసినా ఇప్పటికీ ఈ దృశ్యం కనపడుతుంది. ఓటర్ల జాబితాపై కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ ఎక్కుపెట్టిన విమర్శలతో మన లెక్కలు, సమాచార విశ్వసనీయతపై సందేహాలు ఇంకా ఎక్కువయ్యాయి. మన ఆర్థిక వ్యవస్థకు సంబంధించి కీలక గణాంకాలపై ఇప్పటికే చాలా వివాదాలు ముసురుకున్నాయి. ఇప్పుడు వాటికి ఓటర్ల జాబితా కూడా తోడైంది.

ఓటర్ల జాబితాలో అనర్హులను చేర్చి బీజేపీకి అనుకూలంగా ఓట్లు వేయించటంలో ఎన్నికల కమిషన్ లాలూచీ పడిందన్న రాహుల్‌గాంధీ ఆరోపణలు అసాధారణమైనవి. ఏ ఉద్దేశంతో వాటిని చేసినా, వాటిల్లో సాధికారత ఎంత ఉన్నా ప్రస్తుత సందర్భంలో అవి లేవనెత్తిన సమస్యలు వ్యవస్థల పనితీరును లోతుగా పరిశీలించేటట్లు చేస్తున్నాయి. ఓటర్ల జాబితాలు నూటికినూరుపాళ్లూ పక్కాగా నిర్వహించలేకపోవటంలో పాపం ఎవరిది? ఎన్నికల ముందు ఓటర్ల జాబితాలో పేర్లు చేర్చినంత మాత్రాన అధికారంలో ఉన్న పార్టీ ఫలితాలను నిర్దేశించ గలుగుతుందా? విపక్షాలు అధికారంలో ఉన్నచోట్ల రాష్ట్ర ప్రభుత్వాల అదుపు ఆజ్ఞల్లోనే ఉద్యోగ యంత్రాంగమంతా ఉంటుంది. కేంద్ర ఎన్నికల కమిషన్ ఢిల్లీ నుంచి హుకుం జారీ చేస్తే ఓటర్ల జాబితాను అనర్హులతో నింపివేయటానికి అది సాహసిస్తుందా? అన్న కీలక ప్రశ్నలకు జవాబులివ్వటం అంత తేలికకాదు. బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని మహదేవపుర అసెంబ్లీ సెగ్మెంట్‌లో 1,00,250 మంది అనర్హులైన వారిని ఓటర్లుగా చేర్చి ఫలితాన్ని తారుమారు చేయగలిగిందన్న ఆరోపణకు సమర్థనగా రాహుల్‌గాంధీ ఇచ్చిన సమాచారాన్ని పరిశీలిస్తే అది ఏ ఒక్క నియోజకవర్గానికో పరిమితం కాదని సులువుగానే అర్థమవుతుంది. ఒకే ఇంటి నంబరుతో పదులకొద్దీ ఓటర్లు ఉండటం, అసలు అడ్రస్సే లేకుండా ఓటర్లుగా నమోదు కావటం, ఒక వ్యక్తి రెండు మూడు ఓటరు కార్డులు కలిగి ఉండటం, కార్డుల్లో ఉన్న ఫొటోలకు అసలు వ్యక్తులకు పొంతన లేకపోవటం, నియోజకవర్గాన్ని మార్చుకోటానికీ కొత్తగా ఓటర్లుగా నమోదుకావటానికీ వెసులుబాటు కల్పించే ఫామ్–6ను దుర్వినియోగం చేయటం.. ఇట్లా అయిదు అక్రమాలను పేర్కొని మహదేవపురలో భారీగా ఓట్ల చోరీ జరిగిందని రాహుల్‌గాంధీ ఆరోపించారు.

ఆ ఆరోపణలను విచారించి నిజానిజాలను వెల్లడిస్తామని ఎన్నికల కమిషన్ హుందాగా చెప్పి ఉంటే పరిస్థితి వేరేరకంగా ఉండేది. ప్రతి ఆరోపణకూ తగిన ఆధారాలను పొందుపరుస్తూ అఫిడవిట్ దాఖలుచేయాలని ఎన్నికల కమిషన్ రాహుల్ గాంధీపై ఎదురుదాడికి దిగటంతో ఏదో కప్పిపుచ్చటానికి ప్రయత్నిస్తోందన్న భావన ప్రజల్లో బలపడింది. ఒక డోర్ నంబరులో పదులకొద్దీ ఓటర్లు ఎలా ఉంటారన్న విమర్శతో పాటు అసలు అడ్రస్సే లేని వాళ్లకు ఓటరు కార్డులు ఎలా ఇచ్చారన్న ఆరోపణకు కమిషన్ తాపీగా సుదీర్ఘ వివరణ ఇచ్చింది. ఇక ఒక వ్యక్తి రెండు కార్డులు కలిగి ఉండటం అక్రమమేననీ దానిపై మాత్రం దర్యాప్తు చేస్తామని ప్రకటించింది. ఓటర్ల జాబితాలో తప్పులను సరిదిద్దటానికే బిహార్‌లో తీవ్ర ప్రక్షాళనను చేపట్టామని చెప్పింది. దేశవ్యాప్తంగా దాన్ని అమలుచేస్తామనీ పునరుద్ఘాటించింది. గతంలో కూడా ఒకే అడ్రస్‌పై వందల ఓటర్ల కార్డులు ఉన్నాయన్న ఆరోపణలు వస్తే ఎలక్షన్ కమిషన్ ఈ తరహాలో వివరణ ఇచ్చిన సందర్భం లేదు. ఇప్పుడు మాత్రం డోర్ నంబర్ లేని వాళ్లకు సున్నా పేరుతో ఓటరు కార్డులు జారీచేశామని చెప్పుకొచ్చారు. స్థానిక సంస్థలు డోర్ నంబరు కేటాయించని ఇళ్లతో పాటు ఎక్కడో ఒకచోట తలదాచుకునే అనేక కుటుంబాలకు ఓటు హక్కుని నిరాకరించకుండా ఉండటానికే సున్నా అడ్రస్‌తో కార్డులు జారీ చేశామని వివరించారు. అలాగే సమీపంలో ఉన్న డోర్‌నంబర్‌ను పేర్కొని అర్హులకు కార్డులు ఇచ్చామని కూడా చెప్పారు. నగర ప్రాంతాల్లోని బస్తీల్లో, మురికివాడల్లో ఇది సర్వసాధారణం. రాహుల్‌గాంధీ పేర్కొన్న అయిదు అక్రమాల్లో ప్రత్యక్షంగా అడ్రసుకు సంబంధించినవే 50 శాతానికి పైగా ఉన్నాయి. ఇక నియోజకవర్గ అడ్రస్ మార్పిడికి– కొత్త ఓటరు నమోదుకు సంబంధించిన ఫాం–6 అక్రమాన్ని కూడా వీటికి కలిపితే 85 శాతం అవుతాయి. వీటిల్లో కొత్త ఓటర్ల సంఖ్యని తీసివేస్తే అడ్రసు సంబంధిత ఆరోపణలే సింహభాగం ఉంటాయి.

> ఓటర్ల జాబితాలు నూటికినూరుపాళ్లూ పక్కాగా నిర్వహించలేకపోవటంలో పాపం ఎవరిది? ఎన్నికల ముందు ఓటర్ల జాబితాలో పేర్లు చేర్చినంత మాత్రాన అధికారంలో ఉన్న పార్టీ ఫలితాలను నిర్దేశించగలుగుతుందా? విపక్షాలు అధికారంలో ఉన్నచోట్ల రాష్ట్ర ప్రభుత్వాల అదుపు ఆజ్ఞల్లోనే ఉద్యోగ యంత్రాంగమంతా ఉంటుంది. కేంద్ర ఎన్నికల కమిషన్ ఢిల్లీ నుంచి హుకుం జారీచేస్తే ఓటర్ల జాబితాను అనర్హులతో నింపివేయటానికి అది సాహసిస్తుందా?

డిల్లీ, ముంబయిల్లో 30 శాతంపైగా జనాభా మురికివాడల్లోనే నివసిస్తున్నారు. హైదరాబాద్, చెన్నై, బెంగళూరుల్లోనూ అంతే సంఖ్యలో ఉంటారు. మహదేవపురలో అక్రమ ఓటర్లుగా పేర్కొన్న 1,00,250 మందినీ ఎన్నికలకు ముందుగానే ఓటర్ల జాబితాలో చేర్చారా? లేదా? అన్న విషయం రాహుల్‌గాంధీ స్పష్టంగా చెప్పలేదు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలు 2023 మేలో జరిగాయి. అప్పటికే మహదేవపురలో 6,07,255 మంది ఓటర్లుగా నమోదయ్యారు. 2024 లోక్‌సభ ఎన్నికల నాటికి ఆ సంఖ్య 6,59,826కు పెరిగింది. రెండు ఎన్నికల మధ్య ఏడాది వ్యవధిలో పెరిగిన ఓటర్లు 52,571 మంది మాత్రమే. ఇక 2008లో మహదేవపురలో ఓటర్లు 2,75,299 మంది ఉంటే లోక్‌సభ ఎన్నికల నాటికి ఆ సంఖ్య 6,59,826కు చేరటం అసాధారణంగా రాహుల్ పేర్కొన్నారు. అంటే 140 శాతం పెరుగుదల. బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ నియోజకవర్గంలోని మిగతా అసెంబ్లీ సెగ్మెంట్లలో ఈ పెరుగుదల 26శాతం లోపే ఉంది. మహదేవపురలోనే అది 140 శాతానికి పెరగటం ఓట్లచోరీకి నిదర్శనమని రాహుల్ ఆరోపించారు. ఈ అసాధారణత వెనుక అక్రమాలు ఉన్నాయా? లేవా? అన్నది ఎలక్షన్ కమిషనే తేల్చాలి. అయితే ఇతర మెట్రోనగరాల్లోని కొన్ని నియోజకవర్గాల్లోని పరిస్థితితో పోల్చితే ఈ అసాధారణ పెరుగుదల మరోచోట లేదని చెప్పలేం. ఉపాధి సౌకర్యాలు ఉన్న ప్రాంతాలకు అధిక సంఖ్యలో ప్రజలు వలసలు పోవటం సాధారణంగా జరుగుతుంది. తెలంగాణలోని కుత్బుల్లాపూర్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఈ పరిస్థితి స్పష్టంగా కనపడుతుంది. 2009లో అక్కడ 3,13,160 ఓటర్లు ఉంటే 2024 లోక్‌సభ ఎన్నికల నాటికి 7,25,102 మందికి పెరిగారు. అంటే 131.54 శాతం పెరుగుదల. ఇదే కాలంలో శేరిలింగంపల్లి సెగ్మెంట్‌లో (3,80,856–7,58.160) పెరుగుదల 99.17 శాతం ఉంది. అదే కూకట్‌పల్లి సెగ్మెంట్‌లో ఆ పెరుగుదల (3,85,031–4,82,107) 25.22 శాతానికే పరిమితమైంది. భౌగోళిక సామీప్యత ఉన్న చోట్లే ఈ తేడాలు ఉన్నాయి.

దేశంలోని పది మెట్రో సిటీలతో పాటు 10 లక్షల జనాభా దాటిన 55 నగరాల్లో సైతం.. అనర్హులను ఓటర్ల జాబితాలో కుట్రపూరితంగా ఎన్నికలకు ముందు చేర్చి ఉంటే ప్రజాస్వామ్యంపైనే మనకు అపనమ్మకం కలుగుతుంది. ఈ మొత్తం 65 నగర ప్రాంతాల్లో దాదాపుగా 25 కోట్ల మంది ప్రజలు ఉంటున్నారు. ఇందులో ఓటర్లు 67శాతం అనుకుంటే వాళ్ల సంఖ్య 16.75 కోట్లు ఉంటుంది. అవకతవకలు భారీగా జరిగితే 94 చోట్ల ఫలితాలు ప్రభావితం అవుతాయి. మహదేవపురలో చేర్చినట్లు 20శాతం కాకుండా మిగతా చోట్ల 10శాతం మందిని అక్రమంగా చేర్చినా ఫలితాలను మార్చే అవకాశం అధికార పార్టీకి ఉంటుంది.

నిజానికి వలసలకు అనువైన ప్రాంతాల్లోనే ఓట్ల చేరికలపై ఆరోపణలు ఎక్కువగా ఉంటాయి. గ్రామాల్లో ఈ పరిస్థితి కనిపించదు. అన్ని పార్టీలు వలసజీవులను ఓటర్లుగా చేర్పించటానికి శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తాయి. వలసజీవులు కూడా ఎన్నికలప్పుడు పార్టీలు ఇచ్చే డబ్బు కోసం ఓటర్లుగా నమోదు అవుతారు. అదే కాకుండా ఓటరు కార్డును కలిగి ఉండటంతో సంక్షేమ పథకాల లబ్ధి పొందే అవకాశం కూడా ఉంటుంది. ఇక ఒక పార్టీ ప్రాపకంతో అక్రమంగా ఓటరుగా నమోదయ్యే వ్యక్తి ఆ పార్టీకే ఓటు వేస్తారనే పూచీ ఉండదు. ఎటు మొగ్గుతారో కచ్చితంగా ఎవరూ చెప్పలేరు. ఇక్కడ మరో విశేషం ఉంది. ఓట్ల చోరీతో బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ నియోజకవర్గ ఫలితాన్ని తారుమారు చేశారని కాంగ్రెస్ ఎంత గట్టిగా ఆరోపణలు చేసినా అక్కడ ఆ పార్టీ ఎప్పుడూ గెలవలేదు. మహదేవపుర అసెంబ్లీ సెగ్మెంట్‌లోనూ అదే పరిస్థితి. బెంగళూరు సెంట్రల్ నియోజకవర్గం పరిధిలో 8 అసెంబ్లీ సెగ్మెంట్లు ఉంటే, కాంగ్రెస్‌కు అయిదుచోట్ల మెజారిటీ వస్తే బీజేపీకి మూడు చోట్ల ఆధిక్యత లభించింది. కానీ మహదేవపురలో వచ్చిన 1,14,046 ఓట్ల మెజారిటీ ఫలితాన్ని తారుమారు చేసింది. కిందటి అసెంబ్లీ ఎన్నికల్లో కూడా బీజేపీకి (44,501) అక్కడ ఆధిక్యత వచ్చింది. ఇక పక్కనే ఉన్న సర్వజ్ఞనగర్ సెగ్మెంట్‌లో కాంగ్రెస్‌కు 74,244 ఓట్ల మెజారిటీ (లోక్‌సభ) లభించింది.


■ రాహుల్ కుమార్

పార్టీల ఆరోపణల్లో నిజాలు కొన్నే ఉంటాయి. వ్యవస్థలన్నిటినీ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవటం సర్వసాధారణమైన పరిస్థితుల్లో కొన్ని ఆరోపణలకు విపరీత ప్రాచుర్యం వస్తుంది. వ్యవస్థలను శాసిస్తున్నవారే వాటిపై దర్యాప్తు జరిపి నిజానిజాలను ప్రజల ముందు పెట్టటం కనీస బాధ్యత. ఇదేమీ లేనట్లుగా ఎన్నికల కమిషన్ ఎదురుదాడిని ఎంచుకోవటం, బిహార్ ఓటర్ల జాబితా ప్రక్షాళనకు సంబంధించి దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టులో సైతం అదే ధోరణిలో వాదించటంతో ప్రజల్లో అనుమానాలు ఇంకా బలపడ్డాయి. చివరికి బిహార్‌లో 65లక్షల మంది ఓట్లను ఎందుకు తొలగించారో కారణాలతో సహా ప్రజల ముందు పెట్టి వాళ్ల అభ్యంతరాలను స్వీకరించాలని సుప్రీంకోర్టు ఆదేశించటంతో ఇప్పుడు అసలు చిత్రం వెల్లడయ్యే అవకాశం ఉంది.

> నగరాల్లోని ఓటర్ల జాబితాలను నిశితపరిశీలన చేస్తే ఎన్నికల కమిషన్ బోనులో నిలబడి తన రుజువర్తనను నిరూపించుకోక తప్పదు. వ్యవస్థాపరమైన తప్పిదాలనూ, లోపాలనూ అంగీకరించకా తప్పదు.

అందరి దగ్గరా ఉన్న ఆధార్, ఓటర్ గుర్తింపు కార్డులను పరిగణనలోకి తీసుకోకుండా తల్లిదండ్రుల జనన ధ్రువీకరణ పత్రాలు, పదోతరగతి, నివాస, కుల సర్టిఫికెట్లు లాంటివి ఉంటేనే ఓటర్ల జాబితాలో పేర్లను కొనసాగిస్తామనే షరతులను విధించటంతో కలకలం చెలరేగింది. కమిషన్ నిర్దేశించినట్లుగా కింది వర్గాల ప్రజలకు వీటిని సంపాదించటం సాధ్యం కాదనీ ఫలితంగా నష్టపోయేది ఆ వర్గాలేననీ లోక్‌నీతి–సీఎస్‌డీఎస్ సర్వేలో స్పష్టమైంది. ఆధార్ కార్డుల గురించి గొప్పలు చెప్పుకొని ఇప్పుడు వాటికి విలువలేదని అనటం మొత్తం పాలనా వ్యవస్థకే నగుబాటుగా మారింది. అది చాలదన్నట్లుగా తాను స్వయంగా జారీచేసిన ఓటరు గుర్తింపు కార్డులను కూడా పరిగణనలోకి తీసుకోబోమని చెప్పటం కమిషన్ విశ్వసనీయతను దిగజార్చింది. తాను రూపొందించిన చట్టాలను సైతం గట్టిగా అమలుచేయలేని బలహీన ప్రభుత్వ వ్యవస్థ (సాఫ్ట్‌స్టేట్) భారత్‌లో ఉందని 1968లోనే ప్రఖ్యాత ఆర్థికవేత్త గనర్ మిర్డాల్ తన 'ఏషన్ డ్రామా' పుస్తకంలో చేసిన వ్యాఖ్యలు ఈనాటికీ అక్షరసత్యాలే అన్నట్లుగా కమిషన్ వైఖరి ఉంది. ఒకే వ్యక్తి రెండుచోట్ల ఓట్లు కలిగి ఉండటం ఇప్పటికీ ఉంది. ఓటర్ పోర్టల్ ద్వారా పెట్టుకున్న దరఖాస్తులపై నెలల తరబడి తాత్సారం చేయటమూ జరుగుతోంది. చనిపోయిన వాళ్లను జాబితాల నుంచి ఎప్పటికప్పుడు తొలగించలేని అశక్తతా ఉంది. నగరాల్లోని ఓటర్ల జాబితాలను నిశితపరిశీలన చేస్తే ఎన్నికల కమిషన్ బోనులో నిలబడి తన రుజువర్తనను నిరూపించుకోక తప్పదు. వ్యవస్థాపరమైన తప్పిదాలనూ, లోపాలనూ అంగీకరించకా తప్పదు. దొంగలెవరో, దొరలెవరో అప్పుడే తేలుతుంది!

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

నేతల ప్రమేయంలేని ఎన్నికల సంఘం కావాలి

ప్రస్తుతం ఎన్నికల కమిషన్‌పై వస్తున్న ఆరోపణలు చూస్తుంటే భారత ఎన్నికల సంఘం ఎంత బలహీనంగా ఉన్నదో అర్థమవుతోంది. ఎన్నికల కమిషనర్ల సంఖ్య ఒకటి నుంచి మూడుకు పెరిగినా పరిస్థితిలో ఎటువంటి మార్పూ కనిపించడం లేదు. భారత రాజ్యాంగం ప్రకారం స్వతంత్రంగా వ్యవహరించే వ్యవస్థలలో భారత ఎన్నికల సంఘం ఒకటి. కానీ ఇటీవల దీని స్వతంత్రత నేతిబీరకాయలో నెయ్యి చందంగా ఉంది.

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 1950లో భారత ఎన్నికల సంఘం ఏర్పడింది. ఒకే వ్యక్తి ఎన్నికల కమిషనర్‌గా వ్యవహరించేవారు. అయితే 1989, అక్టోబరులో భారత ఎన్నికల సంఘం చట్టంలో మార్పులు తీసుకువచ్చారు. ముగ్గురు సభ్యులతో కూడిన సంఘాన్ని ఏర్పాటు చేశారు. ముగ్గురిలో ఒకరు ప్రధాన ఎన్నికల అధికారిగా, మిగిలిన



ఇరువురు సభ్యులుగా ఉంటారు. ముగ్గురు ఎన్నికల అధికారులను నియమించడం వల్ల ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులు సమర్థంగా, ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుందని భావించారు. కానీ ఓటర్ల జాబితాలో వెలుగులోకి వస్తున్న అక్రమాలు చూస్తుంటే ఆశించిన ప్రయోజనం కలగలేదనిపిస్తోంది.

"నీతిమంతులు సింహం వలే జీవింతురు" అనే సూక్తికి నిదర్శనం మాజీ ఎన్నికల కమిషనర్ టి.ఎన్. శేషన్. ఇప్పటి వరకు 31 మంది ఎన్నికల సంఘం కమిషనర్లుగా పనిచేయగా, వీరిలో శేషన్‌కు ముందు లేదా తర్వాత పని చేసిన ఏ ప్రధాన ఎన్నికల అధికారీ ఆయన మాదిరిగా పేరు తెచ్చుకోలేకపోయారు. శేషన్ తీసుకువచ్చిన విప్లవాత్మకమైన మార్పులు, పనిచేసిన విధానం దేశం ఎప్పటికీ మర్చిపోలేదు. ఎన్నికల అధికారిగా శేషన్ కచ్చితంగా వ్యవహరించిన తీరుతో భీతిల్లిన రాజకీయవేత్తలు 1993 అక్టోబర్ 1, నుంచి దాన్ని ముగ్గురు సభ్యుల కమిషన్‌గా మార్పు చేశారు.

ఎన్నికల సంఘ సభ్యులను ఎంపిక చేయడానికి ప్రధాన మంత్రితో పాటు ప్రతిపక్ష నాయకుడు, ప్రధానమంత్రి సూచించిన కేంద్రమంత్రి వర్గంలోని ఒక సభ్యునితో ఒక కమిటీ ఏర్పడాలని భారత రాష్ట్రపతి నిర్దేశించారు. దేశానికి ఒక్కరే ప్రధాని, ఒక్కరే రాష్ట్రపతి, రాష్ట్రానికి ఒక్కరే ముఖ్యమంత్రి ఉన్నట్లుగా... ఒక్కరే చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఉండాలని ఆ సమయంలో కొంతమంది మేధావులు అభిప్రాయపడ్డారు. ఈ అంశంపై సుప్రీంకోర్టులో కేసు దాఖలైంది. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం సభ్యుల ఎంపికపై కేంద్రప్రభుత్వం నిర్దుష్టమైన చట్టం చేసే వరకు ప్రధానమంత్రితో పాటు ప్రతిపక్ష నాయకుడు, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో కూడిన కమిటీ ఎన్నికల సంఘ సభ్యులను ఎంపికచేయాలని సుప్రీంకోర్టు ప్రకటించింది.

ఎన్నికల సంఘం సభ్యుల నియామకం విషయంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉండటం ఇష్టంలేని కేంద్ర ప్రభుత్వం ఎన్నికల సంఘం సభ్యుల నియామక చట్టం సెక్షన్ 7ను సవరిస్తూ 2023లో చట్టం చేసింది. ఈ సవరణ చట్టం ప్రకారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రస్తావన లేకుండా ప్రధానమంత్రి, ప్రతిపక్ష నాయకుడితో పాటు ప్రధానమంత్రి సూచించిన కేంద్రమంత్రి వర్గంలోని సభ్యునితో ఒక కమిటీ ఏర్పడాలని భారత రాష్ట్రపతి నిర్దేశించారు. సవరించిన చట్టం ప్రకారం కేంద్ర ఎన్నికల సంఘం సభ్యులను ఎంపికచేసే ముగ్గురు సభ్యుల కమిటీలో ఇరువురు అధికార పార్టీకి చెందినవారే కావడం, ప్రతిపక్ష నాయకుడు ఒక్కరే సభ్యునిగా ఉండటం వల్ల ఆయన మాటకు విలువ లేకుండా పోయింది.

ఎలక్షన్ కమిషన్ స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థ అయినా దాని నిర్వహణకు, కమిషన్ సభ్యుల వ్యక్తిగత అవసరాలకు కావలసిన నిధులన్నీ ప్రభుత్వమే మంజూరు చేయాల్సి రావడం వల్ల వారు కఠినంగా వ్యవహరించలేకపోతున్నారు. అంతేకాకుండా ఎన్నికల కమిషన్ సభ్యులు పదవీ విరమణానంతరం ప్రభుత్వ పదవులు ఆశించడం వల్ల కూడా నిష్పాక్షికంగా వ్యవహరించలేకపోతున్నారు. ఎన్నికల సంఘానికి అవసరమైన నిధులు అధికారంలో ఉన్న ప్రభుత్వంపై ఆధారపడకుండా బడ్జెట్‌లోనే ప్రత్యేకంగా కేటాయించే విధంగా చట్టంలో ఏర్పాటు చేయాలి. అంతేకాకుండా ఎలక్షన్ కమిషన్ సభ్యుల నియామక కమిటీలో ప్రతిపక్ష నాయకునితోపాటు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని కూడా చేర్చాలి. అలాగే పదవీ విరమణ అనంతరం ఎన్నికల కమిషన్ సభ్యులు ఎటువంటి ప్రభుత్వ పదవులు స్వీకరించడానికి అవకాశం లేకుండా చట్టాన్ని సవరించాలి.

– అన్నవరపు బ్రహ్మయ్య
జర్నలిస్ట్

వీధికుక్కలపై 'సుప్రీం'ది ధర్మాగ్రహమే!

ఢిల్లీలో ఉన్న వీధి కుక్కల్ని తరలించి రక్షిత కేంద్రాల్లో ఉంచాలని సుప్రీంకోర్టు ఇటీవల తీర్పునిచ్చింది. వీధి కుక్కల బారిన పడి గాయాల పాలైన, ప్రాణాలు పోగొట్టుకున్న ఉదంతాల పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి ఈ విధంగా ఆదేశాలిచ్చింది. ఈ తీర్పు పట్ల భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నా, కారణం పరిశీలిస్తే ఇది ధర్మాగ్రహమే అన్న అభిప్రాయం కలుగుతోంది. ఇది ఢిల్లీకి మాత్రమే పరిమితమైన సమస్య కాదు. దేశమంతా ఎదుర్కొంటున్నది. సమస్య ఎంత తీవ్రమైనదంటే తీర్పు వచ్చిన వారంలోనే నాలుగైదు కుక్క కాట్లు, ఒక మరణం సంభవించినట్లు వార్తలొచ్చాయి.

దేశ వ్యాప్తంగా కుక్కల సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. ఒక్క రాజధాని నగరంలోనే అవి పది లక్షలున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం రాబిస్ మరణాల్లో 37 శాతం భారత్‌లోనే ఉన్నాయి. ఒక్క ఏడాదిలో భారత్‌లో నమోదైన కుక్క కాట్ల కేసులు 37 లక్షలంటే, సమస్య తీవ్రత ఎంతలా ఉందో తెలుస్తోంది. ఇవి నమోదైన లెక్కలు మాత్రమే. గ్రామీణ ప్రాంతాల్లో జరిగి, రికార్డ్ కానివి ఇంకా ఎక్కువగా ఉంటాయి. బాధితులు ఎక్కువగా బాలలు, వృద్ధులే.



మనిషికి నేస్తమైన కుక్క... వాటి జనాభా, ఆరోగ్యం విషయాల్లో నిర్వహణా లోపం వల్ల శత్రువుగా పరిణమిస్తోంది. అదుపులేని స్థితికి, ప్రజారోగ్యానికి సవాల్ విసిరే స్థాయికి చేరుకుంటోంది. వీటి జనాభా, ఆరోగ్యం విషయాలు రాష్ట్ర పరిధిలోని అంశాలు. ముఖ్యంగా స్థానిక సంస్థల పాత్ర అధికం. కేంద్రం చట్టాల్ని, కొంత నిధుల సాయాన్ని మాత్రమే చేయగలదు. ఉన్న చట్టాల మేరకు కుక్కల పట్ల కొంత శ్రద్ధ వహించాలి. ఒక ప్రాంతంలో ఉన్న వాటిలో డెబ్బై శాతం వాటిని పట్టుకుని, జనాభా నియంత్రణ శస్త్రచికిత్స చేసి, టీకా వేసి ఆ ప్రాంతంలోనే విడిచి పెట్టాలి. ఈ ప్రక్రియను సరిగా నిర్వహిస్తే వాటి జనాభాతో బాటు, ఆరోగ్యం కుదురుగా ఉంటుంది. అయితే కింది స్థాయిలో సిబ్బంది కొరత, అలసత్వం, నిధుల లేమితో అలా జరగడం లేదు. ప్రమాదకరంగా, వ్యాధిగ్రస్తంగా తయారైన వాటిని వెంటనే గమనించి తగు చర్యలు తీసుకోవాలి. ఇంట్లో పెంచుకునేవారు కూడా, వాటి ఆరోగ్యం పట్ల బాధ్యత వహించాలి. ఒక్క స్థానిక సంస్థలకే కాకుండా, జంతు సంరక్షణ సంస్థలకు, సామాన్య ప్రజలకు కూడా ఇందులో బాధ్యత ఉంది. సక్రమంగా వ్యవహరించని స్థానిక ప్రభుత్వాలని, సంబంధిత అధికారుల్ని జవాబుదారీ చెయ్యాలి.

ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం జంతు సంరక్షణ బోర్డు ద్వారా ఒక్కొక్క కుక్కకు శస్త్రచికిత్సకు 800 రూపాయలు చొప్పున, వెటర్నరీ ఆస్పత్రులలో సౌకర్యాలు సమకూర్చుకోవడానికి వన్ టైమ్ నిధులు విడుదల చేస్తామని రాష్ట్రాలకు తెలియజేసింది. రాష్ట్రాలు కూడా సమగ్ర కార్యాచరణ చేపట్టి, సమస్య పరిష్కారం వైపు ఆలోచించాలి. వీధి కుక్కల కోసం ప్రత్యేక సంరక్షణ కేంద్రాలు నెలకొల్పడం గానీ, నిర్వహించడం గానీ ఆచరణ సాధ్యం కాని విషయం. శాస్త్రీయంగా రుజువైన మార్గాల ద్వారా వాటి జనాభాను అదుపులో ఉంచడం, ఆరోగ్యాన్ని కాపాడడం అవసరం. ఇప్పటికే సమస్య చేయి దాటిపోతున్న కారణంగా అత్యవసరంగా ప్రణాళికల్ని అమలుచేయాలి. విలువైన మానవ ప్రాణాలు వీధి కుక్కల పాలు కాకూడదు. వీటిని సమూలంగా తుడిచిపెట్టేయడం కూడా మానవత్వం కాదు. మచ్చికయిన జంతువుతో సమాజానికి సహాయం జరగాలా, సమస్య రావాలా అన్నది మనిషి చేతిలోనే ఉంది.

– డి.వి.జి. శంకరరావు, మాజీ ఎంపీ

భారత్–చైనా: కరుగుతున్న మంచు

ఫిబ్రవరి 2014లో చైనా అధ్యక్షుడు క్సి జిన్పింగ్ మళ్ళీ క్రీ.పూ. నాటి 'సిల్క్ రూట్'ను పునరుద్ధరిస్తున్నాం, అని ప్రకటించినప్పుడు చైనాకు అదొక అత్యాశతో కూడిన కల అని ప్రపంచం అనుకుంది. ప్రపంచం అలా అనుకుని వుండొచ్చు, కానీ సరిహద్దున ఉన్న మనమూ అలాగే అనుకుని సరిపెట్టేసుకున్నాం. అప్పటికి ఒబామా రెండవసారి అధ్యక్షుడు కావడంతో ఆసియా–పసిఫిక్ కేంద్రిత అంతర్జాతీయ వ్యవహారాల్లో మనం చురుగ్గా ఉన్నాం. సరిహద్దున చైనాను నిలువరించడానికి మన దేశం 'ఆసియాన్' వాణిజ్య కూటమిలో ఉండడం 'జియో–పొలిటికల్'గా తగిన సమతూకం అని ఎన్డీఏ ప్రభుత్వం భావించింది. రేపు ఆ వెసులుబాటు ఏ కారణం వల్ల నైనా జారిపోతే, అప్పుడు మన వైఖరి ఎలావుండాలి అనే ముందస్తు ఆలోచనను అప్పట్లో మనం చేయలేదు.

ట్రంప్ వచ్చి 23 జనవరి 2017న 'ట్రాన్స్–పసిఫిక్' ఒప్పందంలో ఇకముందు అమెరికా ఉండదని ప్రకటించారు. ట్రంప్ నిర్ణయంతో చైనా తన దక్షిణ సరిహద్దున ఆగ్నేయ ఆసియా దేశాలపై ఆధిక్యత కోసం, ముడుచుకున్న కాళ్ళు కాస్తా బార్లా చాపింది! మారిన ట్రంప్ వ్యూహం వల్ల ఆసియాలో ఏమి జరుగుతోందని ఆరా తీసేంత స్థిమితం అమెరికాకు లేకపోయింది. అదను ఎంచి, మొదట 'సిల్క్ రూట్' ప్రకటించిన చైనా దాన్ని 'వన్ బెల్ట్ – వన్ రోడ్'గా మార్చింది. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ 'సిగ్నేచర్ ప్లాన్'గా ప్రపంచ మీడియా అభివర్ణించిన 'ఓబీఓఆర్' అధికారిక ప్రకటన బీజింగ్‌లో 28 దేశాల అధిపతులు, వంద దేశాలకు చెందిన ప్రతినిధుల మధ్య 2017 మే 14–15 తేదీల్లో ఘనంగా జరిగింది. రష్యా నుంచి వ్లాదిమీర్ పుతిన్, బ్రిటన్ నుంచి తెరిస్సా మే, ఫిలిప్పీన్స్ నుంచి డి రోడ్రిగో, పాక్ నుంచి నవాజ్ షరీఫ్ వంటి వారు వచ్చారు. యూఎన్ సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుట్రెస్, ప్రపంచ బ్యాంక్ ప్రెసిడెంట్ జిం యంగ్ కిం, ఐఎంఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్ క్రిస్టియోనా లెగర్డే ఆ రోజు అక్కడ ఉన్నారు. యాభైకి పైగా వాణిజ్య ఒప్పందాలు జరిగాయి. చివరికి అమెరికా, జపాన్ సైతం చైనాతో ఉన్న వాటి అభ్యంతరాలను పక్కన పెట్టి తమ ప్రతినిధులను బీజింగ్‌కు పంపాయి. అయితే భారత్ దీనికి హాజరు కాలేదు!

జరిగింది ఏమిటి? అని చూసినప్పుడు ప్రపంచీకరణ ప్రభావాన్ని సకాలంలో అంచనా వేసి, ఆసియాలో అందరి కంటే ముందుగా ఆసియా, యూరప్, ఇండో–పసిఫిక్ దేశాలతో చైనా తన వాణిజ్య బంధనాలను ముడివేసుకుంది. ఇంకా అభివృద్ధి చెందని తన మైదాన ప్రాంతానికి 'బెల్ట్' పేరుతో ఉపరితల రవాణా ద్వారా మధ్య ఆసియా దేశాలకు తలుపులు తెరిచింది. 'రోడ్' ద్వారా సముద్ర జలాల నుంచి ఆగ్నేయ ఆసియా దేశాల్లోకి నూతన వాణిజ్య ద్వారాలను తెరిచింది. ఇదిలా ఉంటే, వారం ముందు వరకు ఈ సదస్సుకు హాజరుపై మన నిర్ణయం అసందిగ్ధంగానే మిగిలింది.

> సరిహద్దున చైనాను నిలువరించడానికి మన దేశం 'ఆసియాన్' వాణిజ్య కూటమిలో ఉండడం 'జియో–పొలిటికల్'గా తగిన సమతూకం అని ఎన్డీఏ ప్రభుత్వం భావించింది. రేపు ఆ వెసులుబాటు ఏ కారణం వల్లనైనా జారిపోతే, అప్పుడు మన వైఖరి ఎలావుండాలి అనే ముందస్తు ఆలోచనను అప్పట్లో మనం చేయలేదు.




ఇంతకీ ఈ చైనా చొరవపై మోదీ ప్రభుత్వ అభ్యంతరం ఏమిటి? 'బెల్ట్'లో భాగంగా చైనాలోని ఖష్గర్ నుంచి పాక్ పశ్చిమ తీరాన అరేబియన్ సముద్రంలో ఉన్న గ్వాదర్ పోర్టుకు 'చైనా–పాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్' పేరుతో ఒక ప్రత్యేక రోడ్డును నిర్మించింది. ఇది 3 భాగాలుగా వుంది. ఇందులో మొదటిదైన 1300 కి.మీ. కారకోరం హైవే– చైనా నుంచి బయలుదేరి– పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోకి ప్రవేశించి, అక్కణ్ణించి ఇస్లామాబాద్‌లోకి ప్రవేశిస్తుంది. అలా అది పాకిస్థాన్ భూభాగాన్ని తూర్పు నుంచి పడమరకు ఆసాంతం దాటి గ్వాదర్ పోర్ట్ చేరుతుంది. మోదీ ప్రభుత్వం ఇందుకు అభ్యంతరం చెబుతున్నది.

మన సరిహద్దున ఉన్న పొరుగు దేశం మరొక దేశంలో నుంచి తూర్పు పడమరలను కలుపుతూ 3217కి.మీ. హైవే వేసుకుని వ్యాపారం చేసుకుంటుంటే– తన ప్రయోజనం కోసం పాక్ అందుకు అనుమతించింది. అయితే దాన్లో పాక్ ఆక్రమిత కశ్మీర్ ఉండడం, భారత సార్వభౌమ అధికారాన్ని ధిక్కరించడంగా మోదీ ప్రభుత్వం భావించింది. నిజానికి ఇండియా అప్పుడే దాన్ని ఒక అవకాశంగా తీసుకుని 'రికార్డు'లో అది– 'పాక్ ఆక్రమిత కాశ్మీర్' అనే 'క్లాజ్'తో దాన్ని అంగీకరించి ఉంటే, ఎలా ఉండేదో? కానీ అది జరగలేదు.

ఇది జరిగిన నెలలోపే, బీజింగ్‌లో జరగవలసిన తొమ్మిదవ 'బ్రిక్స్' సదస్సు ముందస్తు సన్నాహాలపై జూన్ 10–12న చైనా సభ్యదేశాల ప్రతినిధులను పిలిచింది. ఇండియా అప్పటి బీజేపీ జనరల్ సెక్రటరీ రాంమాధవ్‌ను చైనాకు పంపి, 'వన్ బెల్ట్–వన్ రోడ్' ఆరంభానికి భారత్ గైర్హాజరీపై మన సమర్థనకు ఆయన్ని ప్రతినిధిగా ఎంచుకుంది. ఇది జరిగాక చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ 2019 అక్టోబర్ 11–12న ఇండియాకు సౌహార్ద పర్యటనకు వస్తే, అందుకు తగిన వేదికగా మొదట వారణాసి అనుకొని, ఆ తర్వాత దాన్ని తమిళనాడు మహాబలిపురం సముద్ర తీరానికి మార్చారు. శ్రీలంక తీరంలో చైనా తిష్ఠవేసుకున్న వేళ, ఎన్డీఏ రాజకీయ అవసరాల కోసం దక్షిణాదిన ఇటువంటి స్థల మార్పు చేశారు.

వరుసగా మోదీ మూడు 'టర్మ్'ల విజయం తర్వాత 2025 నాటికి 'బ్రిక్స్' దేశాల కూటమి బలపడి, 'గ్లోబల్ సౌత్' భావన ముందుకు వచ్చింది. పైగా వచ్చే ఏడాది 'బ్రిక్స్' సదస్సుకు ఇండియా ఆతిథ్యం ఇవ్వాల్సి ఉంది. 'బ్రిక్స్' దేశాల మధ్య 'సౌత్–సౌత్ కోపరేషన్' తప్పనిసరి అయింది. ఈ కాలంలో చైనా–పాక్‌లతో 'ఎన్డీఏ' ప్రభుత్వం అనుసరించిన దౌత్య విధానం మాటేమిటి? సమాధానం చెప్పవలసిన అనివార్యత ఏర్పడడంతో ఆగస్టు 31న మోదీ చైనా వెళుతున్నారు. ఏడేళ్ల తర్వాత మన వైపు నుంచి మొదలైన ఈ కదలికతో, చైనా విదేశాంగ మంత్రి ఇండియాకు వచ్చివెళ్ళారు.

■ జాన్సన్ చోరగుడి



ఓఆర్ఆర్ సర్వే పూర్తి

ఎన్‌హెచ్ డేటాను పరిశీలించిన ఎన్టీఆర్, కృష్ణా జేసీలు

సమగ్ర నివేదిక.. త్వరలో గజిట్ నోటిఫికేషన్ విడుదల

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : అమరావతి అవుటర్ రింగ్‌రోడ్డు (ఓఆర్ఆర్)కు సంబంధించి జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్) అధికారులు అలైన్‌మెంట్ ప్రకారం ఇచ్చిన సర్వే నెంబర్ల పరిశీలన కార్యక్రమాన్ని ఎన్టీఆర్, కృష్ణాజిల్లా జాయింట్ కలెక్టర్లు పూర్తి చేశారు. ఎన్‌హెచ్ అమరావతి డివిజన్ అధికారులు పంపించిన భూ ప్రతిపాదనలకు సంబంధించిన సర్వే నెంబర్లను సర్టిఫై చేసి పంపటంతో.. త్వరలో ప్రాథమిక గజిట్ నోటిఫికేషన్ 3ఏ విడుదల కానుంది.

వేగంగా..

రెండు జిల్లాల్లో అవుటర్ రింగ్‌రోడ్డు కోసం దాదాపు 1,100 ఎకరాల భూములు కావాలి. ఓఆర్ఆర్ పరిధిలో ఎన్టీఆర్, కృష్ణాజిల్లాలే కాకుండా ఏలూరు, పల్నాడు, గుంటూరు జిల్లాలు కూడా ఉన్నాయి. మిగిలిన జిల్లాల సర్టిఫై ఇంకా కాలేదని తెలుస్తోంది. ఓఆర్ఆర్‌కు సంబంధించి నిర్దేశిత తుది అలైన్‌మెంట్ మేరకు భూములు అవసరమైన చోట ఏయే సర్వే నెంబర్లు ఉన్నాయో ఎన్‌హెచ్ అధికారులు పెగ్‌మార్కింగ్ చేసిన ప్రకారం జాయింట్ కలెక్టర్లకు వివరాలు పంపారు. ఆ సర్వే నెంబర్లు సరైనవేనా? వేరే ఏమైనా ఉన్నాయా? ఆ భూమి సహజ స్వభావం ఏంటి? ఎలాంటి కేటగిరీ భూమి? వంటి వివరాలను జేసీలు పరిశీలించి ఎన్‌హెచ్‌కు అందించాల్సి ఉంది. దీనికోసం ఐదు జిల్లాల జేసీలను కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నియమించింది. ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల జాయింట్ కలెక్టర్లు ఇలక్కియా, గీతాంజలిశర్మ వేగంగా స్పందించారు. త్వరితగతిన పరిశీలించి సమగ్ర నివేదికను పంపించటంతో త్వరలో గజిట్ నోటిఫికేషన్ విడుదల కానుంది.

పారిశ్రామిక 'పురోగతి'

రాజధాని అమరావతికి సమీపంలోని జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాలకు పారిశ్రామిక దశ తిరుగుతోంది. భారీ, మధ్యతరహా పరిశ్రమలు ఒక్కొక్కటిగా ఏర్పాటవుతున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే ఏర్పడినవి, ఏర్పడనున్న పరిశ్రమల నికర విలువ రూ.900 కోట్లు. ఇందులో రూ.300 కోట్ల విలువైన భారీ పరిశ్రమ క్రక్స్ బయో ఇథనాల్ ఫ్యాక్టరీ ఇప్పటికే ఏర్పాటు కాగా, మరో రూ.600 కోట్ల పెట్టుబడితో కూడిన యూనిట్లు అడుగులు ముందుకు వేస్తున్నాయి.

జగ్గయ్యపేట, నందిగామకు భారీ పరిశ్రమల రాక

రూ.900 కోట్ల పెట్టుబడులతో సరికొత్త రూపు

- జాతీయ రహదారుల అనుసంధానం, భూముల లభ్యత
- రాజధానికి దగ్గర, పోర్టు, ఎయిర్‌పోర్టుకు కనెక్టివిటీ
- చాలా యూనిట్లు ఈ ప్రాంతాలపైనే దృష్టి
- రూ.300 కోట్లతో పెద్దవరంలో క్రక్స్ బయో ఇథనాల్ ప్లాంట్
- తుదిదశలో రిలయన్స్, అవెంటల్, కామ ఇండస్ట్రీస్ పనులు



క్రక్స్ ఇథనాల్ ఫ్యాక్టరీ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : జగ్గయ్యపేట ప్రాంతం ఇప్పటికే పారిశ్రామికంగా అభివృద్ధి చెందింది. జగ్గయ్యపేటను ఆనుకునే నందిగామ కూడా ఉంది. రాజధాని అమరావతికి ఈ రెండు ప్రాంతాలు దగ్గర. హైదరాబాద్‌కు కూడా దగ్గరగా ఉండటంతో పాటు పలు జాతీయ రహదారులకు అనుసంధానమైనవి. ఎన్‌హెచ్-65 నేరుగా హైదరాబాద్‌కు, ఎన్‌హెచ్-30 విజయవాడ-ఛత్తీస్‌గఢ్‌కు అనుసంధానం కాగా, అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) ద్వారా విజయవాడ-నాగ్‌పూర్ కలుస్తాయి. అమరావతి-విజయవాడ బైపాస్ ద్వారా రాజధాని కూడా దగ్గరవుతుంది. బందరు పోర్టు, ఎయిర్‌పోర్టు కనెక్టివిటీ రోడ్లు ఉన్నాయి. అంతకుమించి ఈ రెండు ప్రాంతాల్లో విశాలమైన భూములున్నాయి. పరిటాల దగ్గర లాజిస్టిక్ హబ్ ఏర్పాటు దిశగా అడుగులు పడుతుండటం, ప్రభుత్వం కూడా పరిశ్రమల ఏర్పాటుకు ఈ ప్రాంతంవైపు చూస్తోంది. ఈ కారణంగా జగ్గయ్యపేట, నందిగామను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఎంచుకుంటున్నారు.

త్వరలో అందుబాటులోకి భారీ పరిశ్రమలు

- కంచికచర్ల మండలం పరిటాలలో రిలయన్స్ బయో ఎనర్జీ ప్లాంట్ ఏర్పాటు కానుంది. ఈ యూనిట్ పనులు తుదిదశకు చేరుకున్నాయి. నవంబరు నుంచి ఉత్పాదకతను ప్రారంభించనుంది. ఈ ప్లాంట్ ద్వారా 21 టీపీడీ కంప్రెస్డ్ గ్యాస్ ఉత్పత్తి అవుతుంది. రూ.30 కోట్లతో దీనిని ఏర్పాటు చేస్తున్నారు. ఉత్పాదకత ప్రారంభమైతే రూ.45 కోట్ల టర్నోవర్ సాధిస్తుందని అంచనా.
- విస్సన్నపేట మండలం కొండపర్వ గ్రామంలో రక్షణ రంగంలో ఉపయోగించే సిగ్నల్ యాంటెన్నాల తయారీ కంపెనీ అవెంటల్ లిమిటెడ్ రూ.51 కోట్లతో ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తోంది. వచ్చే ఏడాది మార్చి నాటికి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.
- జగ్గయ్యపేట మండలం వేదాద్రి వద్ద కామ్య ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.30 కోట్లతో ప్లాంట్ ఏర్పాటు చేస్తోంది. ఈ ప్లాంట్‌లో ఆజ్‌బెస్టాజ్ రూఫ్ షీట్లను తయారు చేస్తారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో అందుబాటులోకి వస్తుంది.

రూ.300 కోట్లతో పెద్దవరంలో క్రక్స్ బయో ఇథనాల్ ఫ్యాక్టరీ

నందిగామ మండలం పెద్దవరంలో రూ.300 కోట్లతో క్రక్స్ బయో ఇథనాల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఫ్యాక్టరీని ఏర్పాటు చేసింది. మే నుంచి ఉత్పాదకతను ప్రారంభించింది. మొత్తం 200 కేఎల్‌డీ సామర్థ్యం కలిగిన ఫ్యాక్టరీ ఇది. ఈ ప్లాంట్ నుంచి ధాన్యపు గింజల ద్వారా ఆల్కహాల్, స్పిరిట్ వంటివి తయారు చేస్తారు. బయో ఇథనాల్‌ను ఉత్పత్తి చేస్తుంది. దీని టర్నోవర్ మిగతా 6లో..



దోపిడీకి ఆహ్వానం

ఇన్విటేషన్ కార్డులతో సైబర్ నేరాలు

- ఆహ్వానం పేరుతో ఏపీకే లింక్‌లు
- తెలివిగా ఫోన్‌పే, గూగుల్‌పే వివరాల తస్కరణ
- క్షణాల్లో ఖాతాల్లో డబ్బు మాయం
- జిల్లాలో కొత్తగా నమోదవుతున్న కేసులు

నగరానికి చెందిన ఓ వ్యక్తికి కొద్దిరోజుల క్రితం వాట్సా‌ప్‌లో వివాహ ఆహ్వానం వచ్చింది. పోర్టబుల్ డాక్యుమెంట్ ఫార్మెట్ (పీడీఎఫ్)లో ఉన్న ఈ ఆహ్వాన పత్రికను ఏపీకే (ఆండ్రాయిడ్ ప్యాకేజ్ కిట్)లో పంపారు. తనకు తెలిసిన వారు ఎవరో ఈ ఆహ్వానం పంపారని ఆయన భావించారు. ఆ ఫైల్‌ను తెరవగానే ఆహ్వాన పత్రిక ఉంది. దాన్ని చదువుతున్న సమయంలో ఏపీకే ద్వారా పంపిన ఫైళ్లన్నీ ఫోన్‌లో డౌన్‌లోడ్ అయ్యాయి. ఫోన్‌పే, గూగుల్ పేకు అనుసంధానం చేసిన బ్యాంక్ ఖాతాలు నిమిషాల్లో ఖాళీ అయ్యాయి. కొద్దిరోజుల క్రితం జరిగిన ఘటన ఇది.

..అనేక ఎత్తులు పైఎత్తులు వేస్తూ ప్రజలకు వరుస ఝలక్‌లు ఇస్తున్న సైబర్ నేరగాళ్లు దోపిడీని కొనసాగించడానికి కొత్త వ్యూహాలు అమలు చేస్తున్నారు. ఈ-నేరాలపై పోలీసులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నా రోజురోజుకూ కొత్తగా దోచేస్తున్నారు. అందులో భాగమే ఈ ఆహ్వానాల దోపిడీ.

(ఆంధ్రజ్యోతి-విజయవాడ): ఫిషింగ్, ఓటీపీల నుంచి మొదలైన 'ఈ' నేరాల పరంపర డిజిటల్ అరెస్టుల వరకు ఎదిగింది. ఒక నేరంపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన వచ్చిందని నిర్ధారించుకుంటున్న సైబర్ నేరగాళ్లు కొత్త నేరాన్ని బయటకు వదులుతున్నారు. డిజిటల్ అరెస్టులు, పెట్టుబడి నేరాలపై ఈ నేరగాళ్లు విసిరిన బాణాలు గురి తప్పుతుండగా, తాజాగా వివాహ మిగతా 6లో..

మాయచేసి మోసం

- విశ్రాంత ఉపాధ్యాయుడికి టోకరా
- బెదిరించి రూ.18.50 లక్షలు హాంఫట్

విజయవాడ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ఓ విశ్రాంత ఉపాధ్యాయుడికి వల వేసిన సైబర్ నేరగాళ్లు రూ.18.50 లక్షలు చాకచక్యంగా లాగేశారు. వివరాల్లోకి వెళితే.. విస్సన్నపేటకు చెందిన ఓ విశ్రాంతి మిగతా 6లో..

నేడు దుర్గగుడిలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు
ఏర్పాట్లు చేసిన అధికారులు 6

యూపీఎస్సీ మెయిన్స్‌కు ఏర్పాట్లు పూర్తి
కలెక్టర్ లక్ష్మీశ వెల్లడి 8

ప్రకృతికి నచ్చేలా.. గణపతి మెచ్చేలా!
26న మట్టి ప్రతిమల తయారీలో ప్రపంచ రికార్డుకు సన్నద్ధం: కలెక్టర్

పునర్విభజన మాటేంటి?

29న ఉమ్మడి కృష్ణాలో మంత్రుల బృందం పర్యటన

- ద్విసభ్య బృందంలో నాదెండ్ల మనోహర్, పి.నారాయణ
- గన్నవరం, పెనమలూరు, నూజివీడు సందర్శన
- గ్రేటర్ విజయవాడ విలీన గ్రామాల పరిశీలన
- అదేరోజు లిఖితపూర్వకంగా ప్రజాభిప్రాయ సేకరణ
- అభ్యంతరాలు, విజ్ఞప్తులు, సలహాల స్వీకరణ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : జిల్లాల పునర్విభజన చిక్కుముడులు తేల్చటానికి మంత్రుల బృందం రంగంలోకి దిగింది. ఈనెల 29న ఉమ్మడి కృష్ణాజిల్లాలో పర్యటించనుంది. ఈ బృందంలో మంత్రులు నాదెండ్ల మనోహర్, పొంగూరు నారాయణ ఉంటారు. పునర్విభజన సమస్యలపై ఇటీవల అమరావతిలోని సచివాలయంలో మంత్రుల బృందం భేటీ అయ్యింది. జిల్లాల విభజనకు సంబంధించి ప్రజల నుంచి అభ్యంతరాలు, సలహాలు తీసుకోవాలని మంత్రుల బృందం నిర్ణయించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనల మేరకే ఈ బృందం జిల్లాల బాట పడుతోంది.

నూజివీడు విలీనంపై సాధ్యాసాధ్యాలు

నూజివీడును కృష్ణాజిల్లాలో విలీనం చేస్తామని ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అక్కడి ప్రజలకు హామీ ఇచ్చారు. అప్పట్లో నూజివీడును కృష్ణాజిల్లాలో కలపమని కోరిన ప్రజలు ఆ తర్వాత ఎన్టీఆర్ జిల్లాలో కలపమంటున్నారు. నూజివీడుకు విజయవాడ దగ్గర కాబట్టి ఈ ప్రతిపాదన చేశారు. ఈ నేపథ్యంలో మంత్రుల బృందం నూజివీడు భౌగోళిక పరిస్థితులను తెలుసుకోనుంది.

ఎవరెవరిని కలుస్తారు..?

ఈనెల 29న ఉమ్మడి కృష్ణాజిల్లాకు రానున్న మంత్రుల బృందం జిల్లా కేంద్రాల్లోని ప్రజలను కలవనుంది. వైసీపీ హయాంలో జరిగిన జిల్లాల విభజనపై అభ్యంతరాలు, ఇబ్బందులు, సలహాలను లిఖితపూర్వకంగా స్వీకరిస్తారు. ప్రజలు, మిగతా 6లో..





కృష్ణలంక రిటైనింగ్ వాల్ వద్ద వరద

నిలకడగా వరద

విజయవాడ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పులిచింతల ప్రాజెక్టు, ప్రకాశం బ్యారేజీకి వరద నిలకడగా కొనసాగుతోంది. పులిచింతల ప్రాజెక్టుకు నాగార్జున సాగర్ నుంచి 4,28,513 క్యూసెక్కుల నీరు వస్తోంది. 4,13,513 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రకాశం బ్యారేజీకి ఎగువ నుంచి 5,51,544 క్యూసెక్కుల నీరు వస్తుండగా, దిగువకు 4,87,508 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు 69 గేట్లను పూర్తిస్థాయిలోకి ఎత్తి నీటిని సముద్రంలోకి పంపుతున్నారు. తూర్పు, పశ్చిమ డెల్టా పరిధిలో కాల్వలకు 15,124 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

కోరలు చాస్తున్నాయ్



జీజీహెచ్‌కు క్యూ కడుతున్న పాముకాటు బాధితులు

- ఏడు నెలల వ్యవధిలో 214 కేసులు
- 210 మంది చికిత్స.. నలుగురు మరణం
- గత ఏడాదితో పోలిస్తే పెరిగిన రోగులు
- వర్షాల చల్లదనానికి బయటకు వస్తున్న సర్పాలు
- వరదల్లో కొట్టుకొచ్చి పొలాలు, ఇళ్లల్లోకి ప్రవేశం
- రైతులు జాగ్రత్తగా ఉండాలని వైద్యుల సూచన
- ఇంటి ఆవరణలో పరిశుభ్రత ముఖ్యమని హితవు

విజయవాడ/ప్రభుత్వాసుపత్రి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పాముకాట్ల సంఖ్య పెరుగుతోంది. ఇటీవల కొత్త ప్రభుత్వాసుపత్రికి వస్తున్న రోగుల సంఖ్యే ఇందుకు నిదర్శనం. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 214 మంది పాముకాటుకు గురయ్యారు. ఏడు నెలల్లో నలుగురు మరణించారు. గత ఏడాదితో పోల్చుకుంటే ఈ సంఖ్య అధికమే. 2023లో పాముకాటుకు 582 మంది గురికాగా, 477 మంది ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందారు. వీరిలో నలుగురు చనిపోయారు. 2024లో 444 మంది పాముకాటుకు గురికాగా, 399 మంది ఆసుపత్రిలో చికిత్స పొందారు. ఆరుగురు మరణించారు. ఈ ఏడాది ఏడు నెలలకు 214 మంది పాముకాటుకు గురికాగా, 210 మంది ఆసుపత్రిలో మిగతా 6లో..

నేడు దుర్గగుడిలో సామూహిక వరలక్ష్మీ వ్రతం

ఇంద్రకీలాద్రి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రి దుర్గామల్లేశ్వర దేవస్థానంలో శ్రావణమాసం శుక్రవారం సందర్భంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాల నిర్వహణకు రంగం సిద్ధం చేశారు. ఈసారి ఐదు శుక్రవారాలు రావటంతో చివరి శుక్రవారం వరలక్ష్మీ వ్రతాలను తలపెట్టారు. శ్రావణ మాసం చివరి శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు ఆర్జిత సేవ కింద రూ.1500లు చెల్లించిన మహిళల చేత సామూహిక వ్రతం చేయిస్తారు. అనంతరం 10 నుంచి 11.30 గంటల వరకు ఉచితంగా వ్రతాలను నిర్వహిస్తారు. తెల్ల రేషన్ కార్డు ఉండి, ముందుగా టిక్కెట్లు తీసుకున్న మహిళలకు ప్రాధాన్యం ఇస్తారు. రూ.1500లు టిక్కెట్ ఆర్జిత సేవ కింద వ్రతంలో పాల్గొన్న మహిళలకు రూ.300 దర్శనం, ఉచిత వ్రతంలో పాల్గొన్న మహిళలకు రూ.100 రుసుము టిక్కెట్ లైన్‌లో అమ్మవారి దర్శనం కల్పిస్తారు. టిక్కెట్ తీసుకున్న మహిళకు మాత్రమే దర్శనానికి అనుమతి ఉంటుంది.

పీహెచ్‌సీ ఆయా మిస్సింగ్

- యూడీసీ వేధింపులే కారణమని బంధువుల ఆరోపణ
- పోలీసులకు ఫిర్యాదు .. ఆసుపత్రి ఎదుట ఆందోళన



మందా చిరంజీవి (ఫైల్‌ఫొటో)

జి.కొండూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : జి.కొండూరు పీహెచ్‌సీలో ఆయాగా పనిచేస్తున్న మంద చిరంజీవి గురువారం ఉదయం నుంచి కనపడకుండా పోయింది. దీంతో ఆమె భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తనతో ఫోన్‌లో 'నన్ను మర్చిపోండి.. నాకు బాధగా ఉంది' అని చెప్పి ఫోన్ స్విచ్ ఆఫ్ చేసిందని భర్త ఏసు పోలీసులకు తెలిపాడు. విషయం తెలుసుకున్న ఆమె బంధువులు, దళితవాడ వాసులు పెద్దఎత్తున ఆసుపత్రి వద్దకు చేరుకొని నిరసన చేపట్టారు. 28నెలలుగా కనీస వేతనం ఇవ్వకుండా వేధిస్తున్నారని, యూడీసీ శ్రీనివాసరావు బిల్లులు చేయకుండా వేధించడం వల్లే ఆయా ఎటో వెళ్లిపోయిందని ఆమె బంధువులు, గ్రామస్థులు ఆరోపించారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు, పీహెచ్‌సీ డాక్టర్ ప్రసన్నరాణి తెలిపారు. ఈ విషయంపై యూడీసీ శ్రీనివాసరావు వివరణ ఇస్తూ ఆయాను వేధించలేదని, కొంత వేతనం ఆమె బ్యాంకు ఖాతాలో వేశామని చెప్పారు. ఎస్‌ఐ కె.సతీష్‌కుమార్ బందోబస్తు నిర్వహించారు.



చెస్ టోర్నమెంట్ చాంపియన్ షిప్‌ను ప్రారంభిస్తున్న రవినాయుడు

చెస్ చాంపియన్ షిప్ టోర్నీ ప్రారంభం

విజయవాడ(స్పోర్ట్స్), ఆగస్టు (ఆంధ్రజ్యోతి) : పాఠశాల స్థాయిలో చదరంగాన్ని ఒక పాఠ్యాంశంగా చేయాలన్న ముఖ్యమంత్రి ఆలోచనకు భవిష్యత్ కార్యాచరణ సిద్ధం చేయడం జరుగుతందని శాప్ చైర్మన్ రవినాయుడు పేర్కొన్నారు. వీబీ సిద్ధార్థ కళాశాలలో ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎస్ఆర్ఆర్ ఫిడే ఇంటర్నేషనల్ రేటింగ్ చెస్ చాంపియన్‌షిప్‌ను రవినాయుడు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రతి శాప్ ఇండోర్ స్టేడియాల్లో చదరంగ శిక్షణ తరగతులు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అదేవిధంగా పేద విద్యార్థుల శిక్షణ కోసం శిబిరాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తామన్నారు. ఈ చాంపియన్‌షిప్‌లో 15 రాష్ట్రాల నుంచి సుమారు 250మంది, నగరం నుంచి 80మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎల్‌వి చైర్మన్ శ్రీనివాసరాజు, సిద్ధార్థ కళాశాల వైస్ ప్రెసిడెంట్ శ్రీకృష్ణరావు తదితరులు పాల్గొన్నారు.

నాలా చట్టం రద్దుపై నరెడ్కో హర్షం



గద్దెచక్రధర్

భారతీనగర్, ఆగస్టు21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం గురువారం నిర్వహించిన కేబినెట్ సమావేశంలో నాలాచట్టం రద్దు నిర్ణయాన్ని ఏపీ నరెడ్కో కమిటీ స్వాగతిస్తుందని రాష్ట్ర అధ్యక్షుడు గద్దెచక్రధర్, ప్రధాన కార్యదర్శి మామిడి సీతారామయ్య తెలిపారు. ఎల్‌ఐసీ కాలనీలోని రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్(నరెడ్కో) రాష్ట్రకార్యాలయంలో ప్రతినిధుల సమావేశం గురువారం జరిగింది. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ.. నాలా చార్జీలను తగ్గించడం, బిల్డింగ్, లేఅవుట్ అనుమతులను సింగిల్ విండో సిస్టమ్ ద్వారా సులభతరం చేయడం కోసం ప్రయత్నాలు చేస్తూ వచ్చిందని, ఈ కృషికి ఫలితమే తాజాగా నాలా చట్టాన్ని రద్దు చేసి, ఎక్స్‌టర్నల్ డెవలప్‌మెంట్ చార్జెస్(ఇడిసి) విధించడం ద్వారా ప్రభుత్వం గణనీయమైన నిర్ణయం తీసుకుందని వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు పొంగూరు నారాయణ, అనగాని సత్యప్రసాద్, పయ్యావుల కేశవ్‌లతో పాటు సంబంధిత శాఖల అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఉపాధ్యక్షులు పరుచూరి కిరణ్ కుమార్, కోశాధికారి చావా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కోరలు చాస్తున్నాయ్

(5వ పేజీ తరువాయి)

చికిత్స తీసుకున్నారు. నలుగురు మరణించారు.

చల్లదనానికి బయటకొస్తున్న సర్పాలు

వర్షాలు పడుతుండటం, చల్లటి వాతావరణం, ముమ్మర వ్యవసాయ పనుల నేపథ్యంలో పాములు బయటకు వస్తున్నాయి. నివాస ప్రాంతాల్లోకి వరద నీరు ప్రవేశించడం వల్ల కూడా కొన్ని ప్రాంతాల్లో పాములు సంచరిస్తున్నాయి. ముఖ్యంగా పల్లె ప్రాంతాల్లో రైతులు, కూలీలు పాముకాటుతో మృతి చెందుతున్నారు. అలాగే, ఇళ్ల పరిసరాల్లో కలుపు మొక్కలు, గడ్డి ఏపుగా పెరగడం కూడా పాములకు నిలయంగా మారుతోంది.

పాముకాటు వల్ల కలిగే లక్షణాలివీ..

విషం ఉన్న పాము కాటువేస్తే ఒకటి లేదా రెండు గాట్లు కనిపిస్తాయి. విషం లేని పాము కాటువేస్తే రెండు కంటే ఎక్కువ గాట్లు ఉంటాయి. తాచుపాము, కట్లపాము వంటి విషపాములు కాటువేస్తే కొంత సమయం తర్వాత చేతులు, కాళ్ల కదలికలు ఆగిపోతాయి. కండరాల నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలుగుతుంది. సమయానికి వైద్యం అందకపోతే నరాలపై ప్రభావం చూపి వ్యక్తి మరణిస్తాడు. రక్తపింజర కాటువేస్తే శరీరం లోపల అవయవాల్లో రక్తస్రావం కావడంతో పాటు చెవులు, ముక్కు నుంచి రక్తం కారుతుంది. రక్తపింజర కాటు వేసిన ప్రదేశంలో వాపు, బొబ్బలు కనిపిస్తాయి. అయితే, సముద్ర పాముకాటుకు గురైన వారిలో 85 శాతం మంది మరణం నుంచి తప్పించుకున్నవారే.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ఒకటి లేదా రెండు గాట్లు ఉంటే పాము కాటు వేసిన ప్రదేశం నుంచి ఒక అడుగు పైభాగంలో గుడ్డముక్క/తాడుతో రక్త సరఫరాకు అంతరాయం కలగకుండా కట్టాలి. వెంటనే దగ్గరలో ఉన్న ఆసుపత్రిలో చేర్పించాలి. ఎట్టి పరిస్థితుల్లో నోటి ద్వారా విషాన్ని బయటకు తీయడానికి ప్రయత్నించకూడదు. విషం లేని పాము కాటు వేసిందని తెలిసినప్పటికీ అశ్రద్ధ చేయకుండా వైద్యులను సంప్రదించాలి.

ఆందోళన చెందకూడదు

పాముకాటుకు గురైన వ్యక్తి ఆందోళన చెందకూడదు. దీనివల్ల రక్త ప్రసరణ నియంత్రణలో ఉంటుంది. ఆసుపత్రికి వచ్చిన వెంటనే టెట్‌వాక్ ఇంజక్షన్ ఇస్తాం. కొన్నిసార్లు ఏ పాము కాటువేసిందో నిర్ధారించలేం. అటువంటి సమయంలో ఈ వ్యాక్సిన్ పనిచేస్తుంది. బాధితుడికి గంటకోసారి రక్తపరీక్ష చేయాలి. రక్తం ఏ స్థాయిలో గడ్డ కడుతుందో తెలుసుకోవడంతో పాటు 24 గంటల్లో 10 యాంటీ వీనం ఇంజక్షన్లు ఇవ్వాలి. బాధితుడి పరిస్థితిని బట్టి ఈసీజీ తీయాలి. మొదటి డోస్ వేసినప్పటి నుంచి 24 గంటల పాటు అబ్జర్వేషన్‌లో ఉంచాలి.

– డి.ఇందిరాదేవి, జనరల్ మెడిసిన్ హెచ్‌వోడీ, ప్రభుత్వాసుపత్రి

కృష్ణాతీరంలో వరద కల్లోలం!

- పెరుగుతున్న వరద ఉధృతి
- లంకల్లో వాణిజ్య పంటలకు తీవ్ర నష్టం
- ముంపులో పసుపు, కంద, అరటి, కూరగాయల పొలాలు



చల్లపల్లి మండలం రాముడుపాలెం వద్ద కృష్ణానదిలో ఉధృతంగా ప్రవహిస్తున్న వరదనీరు

చల్లపల్లి/తోట్లవల్లూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రకాశం బ్యారేజీ నుంచి విడుదల చేస్తున్న కృష్ణా వరద నీరు ఉధృతంగా దిగువకు ప్రవహిస్తోంది. బ్యారేజీ వద్ద ఐదు లక్షల క్యూసెక్కులకు పైగా నీటిని దిగువకు విడుదల చేస్తుండటంతో నదిలో నీటిప్రవాహం పెరిగింది. దీంతో తీరాన ఉన్న వాణిజ్య పంటల్లోకి నీరు చేరుతోంది. చల్లపల్లి మండలం రాముడుపాలెం వద్ద వరద ప్రవాహంతో పుష్కరఘాట్ నీటమునిగింది. లచ్చిగానిలంక భూభాగానికి సమాంతరంగా నదిలో వరదనీటి ప్రవాహం సాగుతోంది. నదీగర్భంలో ఉండే లంక పల్లపు ప్రాంతాల్లోకి వరదనీరు చేరే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. వరద పెరుగుతుండటంతో నదిపక్కనే ఉన్న పంటచేలల్లోకి నీరు చేరుతోంది. నడకుదురు వద్ద చేలు నీటమునిగాయి. రెండు రోజులుగా పసుపు, కంద చేలల్లో వరదనీరు ఉందని, రైతులు చెబుతున్నారు. వరద పెరిగిన కొద్దీ మరిన్ని వాణిజ్య పంటలు నీటిముంపునకు గురయ్యే ప్రమాదం ఉంది. నది పక్కనే సాగుచేస్తున్న పసుపు, బీర, బెండ తోట పూర్తిగా నీటమునిగింది. రెండు నెలల్లో కంద చేతికందే దశలో ఉందని, నెలముందుగా సాగుచేసినప్పటికీ వరదబారిన పడాల్సి వచ్చిందని రైతులు చెబుతున్నారు. రెండు, మూడు రోజులు నీరు ఉంటే కంద ఎందుకూ పనికిరాదని, పసుపు పంటను సైతం కోల్పోవాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వరద పెరిగినకొద్దీ నష్టం మరింతగా పెరిగే ప్రమాదం ఉంది.

లంకల్లో ముంపుబారిన పంటలు

తోట్లవల్లూరులో కృష్ణానదీపాయలు గురువారం వరదతో పోటెత్తుతున్నాయి. నదీపాయల్లో లంక గ్రామాల ప్రజలకు నాటు పడవలే ఆధారం అయ్యాయి. నిత్యావసర సరుకులకు కరకట్ట వెంబడి గ్రామాలకు వచ్చి వెళుతున్నారు. ప్రస్తుత వరదతో లంక గ్రామాలకు ఎలాంటి ముంపు భయం లేదని, 7 లక్షలు దాటితేనే గ్రామాల్లోకి వరద వచ్చే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. మరోవైపు కరకట్ట వెంబడి కళ్లంవారిపాలెం నుంచి ఐలూరు వరకు నది ఒడ్డున పంటలు నీట మునిగాయి. గ్రామాల్లో మోకటిలోతున వరదనీటితో రైతులు ఆందోళన చెందుతున్నారు. లంకల్లోని పల్లపు భూముల్లోకి వరద చేరటంతో కంద, పసుపు, అరటి తదితర పంటలు నీట మునుగుతున్నాయి.









నడకుదురు వద్ద నీటమునిగిన బెండ, బీరతోటలు, పసుపు కంద పొలాల్లోకి చేరిన వరదనీరు, తోట్లవల్లూరు కృష్ణాపాయలో ఉధృతంగా వరద

యూపీఎస్సీ మెయిన్స్‌కు ఏర్పాట్లు పూర్తి

- హాజరుకానున్న 106 మంది అభ్యర్థులు
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) సివిల్ సర్వీస్ మెయిన్స్ పరీక్షలకు ఏర్పాట్లను పరిశీలించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. యూపీఎస్సీ సివిల్ సర్వీస్ మెయిన్స్ పరీక్షలకు తుది ఏర్పాట్లపై గురువారం కలెక్టర్ లక్ష్మీశ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో లైజనింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ లైజనింగ్ ఆఫీసర్లు, వెన్యూ సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, యూపీఎస్సీ మెయిన్స్ పరీక్షలను నగరంలోని లబ్బీపేట రెడ్‌సర్కిల్‌లోని బిషప్ అజరయ్య బాలికల కళాశాల పరీక్ష కేంద్రంలో ఈనెల 22, 23, 24, 30, 31 తేదీల్లో ఐదురోజుల పాటు నిర్వహించడం జరుగుతుందన్నారు. పరీక్షలకు 106 మంది అభ్యర్థులు హాజరు కానున్నారన్నారు. ఈనెల 22 శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్-1 ఎస్సే, 23 శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్-2 జనరల్ స్టడీస్-1, 23 మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్-3 జనరల్ స్టడీస్-2, 24 ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్-4 జనరల్ స్టడీస్-3, 24 మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్-4 జనరల్ స్టడీస్-4, తిరిగి 30 ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్-ఎ ఇండియన్ లాంగ్వేజ్, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్-బి ఇంగ్లీష్, 31 ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్-6 ఆప్షనల్ సబ్జెక్ట్ పేపర్-1, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్-7 ఆప్షనల్ సబ్జెక్ట్ పేపర్-2 పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పై పరీక్షల నిర్వహణకు 11మంది ఇన్విజిలేటర్లను నియమించామన్నారు. ఆరుగురు విభిన్న ప్రతిభావంతులు, పరీక్షలు రాసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. పరీక్షల నిర్వహణకు ఇద్దరు వెన్యూ సూపర్‌వైజర్లు, ఇద్దరు అసిస్టెంట్ సూపర్‌వైజర్లను నియమించడం జరిగిందన్నారు. పరీక్ష కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులు కల్పించాలన్నారు. అభ్యర్థుల హాల్‌టిక్కెట్లలో నమోదుచేసిన పరీక్ష కేంద్రంపేరు అభ్యర్థి రాసిన పరీక్ష కేంద్రం ఒకే విధంగా వుండేలా జాగ్రత్త వహించాలన్నారు. ఎటువంటి ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు పరీక్ష కేంద్రంలోకి అనుమతించకుండా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రం వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేయాలని, విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని ట్రాన్స్ కో అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకొనే విధంగా ఆర్టీసీ బస్సులను నడిపేలా చర్యలు తీసుకోవాలని రవాణా శాఖ అధికారులను ఆదేశించారు. పరీక్ష నిర్వహణలో ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా పర్యవేక్షించేందుకు కంట్రోల్ రూమ్ ఏర్పాట్లు చేసినట్టు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా, యూపీఎస్సీ సెక్రటరీ, ఇన్స్‌పెక్టింగ్ ఆఫీసర్ సునీల్‌కుమార్ అగర్వాల్, డీఆర్వో ఎం.లక్ష్మీ నరసింహం, ఆర్డీవో కె.చైతన్య, బిషప్ అజరయ్య బాలికల కళాశాల ప్రిన్సిపాల్ కె.సంధ్య బి.రామకృష్ణ నాయక్ సి.లక్ష్మీనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం పవిత్రసంగమం వద్ద వరద పరిస్థితిని సమీక్షిస్తున్న సబ్‌కలెక్టర్ చైతన్య

వరదతో అప్రమత్తం

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : కృష్ణానదికి ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో అప్రమత్తంగా ఉండాలని స్థానిక అధికారులను విజయవాడ సబ్ కలెక్టర్ కావూరి చైతన్య ఆదేశించారు. ఇబ్రహీంపట్నం ఫెర్రీ ఘాట్, పవిత్ర సంగమం వద్ద వరద పరిస్థితిని ఆయన గురువారం తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లుతో కలిసి పరిశీలించారు. ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బందికి పలుసూచనలు చేశారు. ఇబ్రహీంపట్నం ట్రక్ టెర్మినల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, వరద పెరిగితే చినలంక, పెదలంకవాసులకు పునరావాస కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో స్థానిక రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

దోపిడీకి ఆహ్వానం

(5వ పేజీ తరువాయి)

ఆహ్వానాలను ఎంచుకున్నారు.

ఆహ్వానాల వల

సైబర్ నేరగాళ్లు ఇప్పుడు ఆహ్వానాల వల విసురుతున్నారు. శుభ, అశుభ కార్యక్రమాల ఆహ్వాన పత్రికలను వాట్సాప్ ద్వారా పంపుతున్నారు. సాధారణంగా ఆహ్వానాలను వాట్సాప్ ద్వారా పంపేవారు వివాహాలకు అయితే వీడియోను, శుభలేఖ ఫొటోను పంపుతారు. అదే దశదిన కర్మలకు కార్డు పంపుతారు. దీన్ని సైబర్ నేరగాళ్లు అవకాశంగా మార్చుకుంటున్నారు. ఏదో ఒక ఆహ్వాన పత్రికను పీడీఎఫ్‌లో తయారు చేస్తున్నారు. దానికి వెనుక భాగంలో మాల్‌వేర్ ఫైళ్లను అమరుస్తున్నారు. దీన్నే సాంకేతిక పరిభాషలో టెక్నోగ్రఫీగా వ్యవహరిస్తారు. అటు ఆహ్వాన పత్రికను, మాల్‌వేర్‌ను కలిపి ఒక ఏపీకేగా మారుస్తున్నారు. ఈ మొత్తం ఏపీకే ఫైల్‌కు వెడ్డింగ్ ఇన్విటేషన్ అని పేరు పెడుతున్నారు. ఆ ఏపీకే ఫైళ్లను తమ వద్ద ఉన్న డేటాలోని ఫోన్ నెంబర్లకు వాట్సాప్ ద్వారా పంపుతున్నారు. వాట్సాప్‌లో నోటిఫికేషన్ రాగానే సెల్‌ఫోన్ వినియోగదారులు ఆ ఏపీకే ఫైల్‌ను క్లిక్ చేసి తెరుస్తున్నారు. అందులో హిందీ, ఇంగ్లీష్‌లో వివాహ ఆహ్వాన పత్రిక ఉంటుంది. దాన్ని చదువుతుండగా, పత్రికకు వెనుక వైపు కనిపించకుండా ఉండే మాల్‌వేర్ డౌన్‌లోడ్ అయిపోతుంది. కొన్ని ఏపీకే ఫైళ్లలో నిర్యాణం కార్డుల పీడీఎఫ్‌లు అమరుస్తున్నారు. ఆహ్వాన పత్రికలను పంపినప్పుడు వాటిని ఓపెన్ చేసి చదవడం సాధారణంగా జరుగుతోంది. దీన్ని సైబర్ నేరగాళ్లు ఒక ఆయుధంగా మార్చుకుంటున్నారు. ఈ మాల్‌వేర్ డౌన్‌లోడ్ కాగానే, ఆండ్రాయిడ్ యూజర్ల చేతిలో ఉన్నా ఆపరేషన్ మొత్తం సైబర్ నేరగాళ్ల చేతిలోకి వెళ్తోంది. తర్వాత గూగుల్‌పే, ఫోన్‌పే యాప్‌లకు అనుసంధానం చేసుకున్న బ్యాంక్ ఖాతాల్లో ఉన్న నగదు నిల్వలను మాయం చేస్తున్నారు.

పారిశ్రామిక పురోగతి

(5వ పేజీ తరువాయి)

రూ.400 కోట్లకు చేరుకుంటుందని అంచనా.

రూ.884.70 కోట్ల టర్నోవర్ లక్ష్యంగా 44 ఇండస్ట్రియల్ యూనిట్లు

మరో 44 ఇండస్ట్రియల్ యూనిట్ల ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. ఇవన్నీ వివిధ దశల్లో ఉన్నాయి. వీటిలో ప్రధానంగా పెనుగంచిప్రోలు మండలం కొణకంచి గ్రామంలో పారామౌంట్ బిల్డింగ్ సొల్యూషన్స్, కంచికచర్ల మండలం కీసరలో ఇన్వెంటా ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, ఏ.కొండూరు మండలం వల్లంపట్లలో శ్రీకరి బయోఫ్యూయల్స్, జగ్గయ్యపేట మండలం గౌరవరంలో డాక్టర్ వర్మాస్ ల్యాబ్స్, అనుమంచిపల్లిలో ఉదయ్ ఇండస్ట్రీస్, స్పాడ్స్ పోలీ ప్లాస్ట్, జయంతిపురంలో నాల్కమ్ ఫార్మాస్యూటికల్స్, గౌరవరంలో వైజయంతి ల్యాబ్స్, తిరుమలగిరిలో అటీర్నస్ ఫార్మా, వీఎస్ఎన్ ల్యాబొరేటరీస్, ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లిలో చెన్నుపాటి ప్లాస్టిక్స్, రెడ్డిగూడెం మండలం కుదపలో నిసర్గ్ బయో సీఎన్‌జీ వంటివి తుదిదశలో ఉన్నాయి. ఫ్యాబ్రికేషన్, పుట్టగొడుగులు, బయోగ్యాస్, బల్క్ డ్రగ్స్, ఫార్మా, పేపర్, ఇంజక్షన్ మౌల్డింగ్స్, ప్లాస్టిక్ రీ ప్రాసెసింగ్ వంటి ఉత్పాదక యూనిట్లను ఇవి ఏర్పాటు చేస్తున్నాయి.

పునర్విభజన మాటేంటి?

(5వ పేజీ తరువాయి)

ప్రజా, స్వచ్ఛంద సంఘాలు, రాజకీయ పార్టీలు, నాయకులు, ప్రజాప్రతినిధులు ఇలా ఎవరైనా సరే తమ ప్రతిపాదనను లిఖితపూర్వకంగా అందజేయవచ్చు. వీటిపై అదేరోజు మంత్రుల బృందం ప్రాథమికంగా చర్చిస్తుంది. మెజారిటీ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని పూర్తిస్థాయి మంత్రుల బృందంలో చర్చించాక ప్రభుత్వానికి నివేదిక అందిస్తారు.

ప్రధాన సమస్యలివీ..

వైసీపీ హయాంలో ఉమ్మడి కృష్ణాజిల్లాను రెండుగా విభజించారు. కొత్తగా ఎన్టీఆర్ జిల్లాను ఏర్పాటు చేశారు. అయితే, ఎన్టీఆర్ జిల్లాను అసమగ్రంగా ఏర్పాటు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఎన్టీఆర్ జిల్లా పరిధిలోకి గన్నవరం, పెనమలూరు మండలాలను తీసుకురావాలని, కృష్ణాజిల్లా పరిధిలోకి కైకలూరు, ముదినేపల్లిని తీసుకురావాలన్న డిమాండ్ ఉంది. అలాగే, నూజివీడు, ఆగిరిపల్లి మండలాలను ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లో కలపాలన్న డిమాండ్లు కూడా ఉన్నాయి. వీటిని కిందటి వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. విజయవాడ గ్రేటర్ విలీన గ్రామాలను కూడా కృష్ణాజిల్లా పరిధిలోకి తీసుకొచ్చింది. తాజాగా విజయవాడను 81 గ్రామాలతో గ్రేటర్ పరిధిలోకి తీసుకురావాలన్న ప్రతిపాదనపై కసరత్తులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మంత్రుల బృంద పర్యటన ప్రాధాన్యతను సంతరించుకుంది. ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాల ప్రాతిపదికనే మండలాలను చేర్చాలా? వద్దా? అనే నిర్ణయాలను మంత్రుల బృందం తీసుకుంటుంది. కొత్త జిల్లాల ఏర్పాటుకు సంబంధించి ఆలోచన ఏమీ లేదనే తెలుస్తోంది.

పేర్ల మార్పు సంగతేంటి?

జిల్లాల పేర్లను పరస్పరం మార్చాలంటూ మంత్రుల బృందంలో ఒకరైన సత్యకుమార్ యాదవ్‌కు గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఇప్పటికే ప్రతిపాదించారు. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ స్వగ్రామం నిమ్మకూరు కృష్ణాజిల్లాలో ఉంది కాబట్టి.. ఆ జిల్లాకే ఎన్టీఆర్ పేరు సముచితమని, అలాగే, ప్రస్తుత ఎన్టీఆర్ జిల్లాలో కృష్ణానది ఎక్కువ దూరం ప్రవహిస్తుంది కాబట్టి కృష్ణాజిల్లా పేరు పెట్టాలని వెంకట్రావు సూచించారు.

మాయచేసి మోసం

(5వ పేజీ తరువాయి)

ఉపాధ్యాయుడి ఇద్దరు అబ్బాయిలు అమెరికాలో ఉంటున్నారు. ఇక్కడ ఆయన తన భార్యతో కలిసి ఉంటున్నారు. ఈనెల 17న వారు ఓ శుభకార్యానికి వెళ్లారు. కల్యాణ మండపంలో ఉండగా, ఒక వ్యక్తి ఫోన్‌చేసి ఎయిర్‌టెల్ ఆఫీసు నుంచి మాట్లాడుతున్నామని, బెంగళూరు పోలీసులు మాట్లాడతారని చెప్పి మరో వ్యక్తికి ఫోన్‌కాల్ కలిపాడు. తాను బెంగళూరు పోలీసు అధికారినని చెప్పి అత్యవసరంగా ఇంటికి రప్పించి వీడియోకాల్ చేశాడు. కుడి, ఎడమ వైపున జాతీయ జెండాలు ఏర్పాటు చేసుకుని, ఖాకీ యూనిఫాంలో ఉన్న వ్యక్తి విశ్రాంత ఉపాధ్యాయుడితో వీడియో కాల్ మాట్లాడాడు. ఆయన ఆధార్ కార్డు నెంబరుతో వేర్వేరు వ్యక్తులు సిమ్‌లు తీసుకున్నారని, వాటితో ముంబైలోని కెనరా బ్యాంక్‌లో ఖాతాలు తెరిచారని చెప్పాడు. సదాషట్కర్ అనే వ్యక్తి అమ్మాయిలను అక్రమ రవాణా చేస్తున్నాడని, అతనికి వచ్చే డబ్బు ఈ ఖాతాల్లో జమ అయ్యాయని బెదిరించాడు. ఈ మొత్తం సుమారు రూ.30 లక్షల వరకు ఉందని, ఆ డబ్బు ఎవరివో తేల్చడానికి రూ.50 లక్షలు పంపాలని చెప్పాడు. తన వద్ద అంత మొత్తం లేదని విశ్రాంత ఉపాధ్యాయుడు చెప్పాడు. ఆయనకు ఎన్ని బ్యాంక్ ఖాతాలు ఉన్నాయి, వాటిలో ఎంత నిల్వ ఉందో అడిగి తెలుసుకున్నారు. ఇంట్లో ఉన్న బంగారు ఆభరణాలను తీసుకుని బ్యాంక్‌కు వెళ్లి తాకట్టు పెట్టి డబ్బు జమ చేయాలని చెప్పారు. ఇదంతా నిజమేనని నమ్మిన విశ్రాంత ఉపాధ్యాయుడు ఈనెల 18వ తేదీన బంగారు ఆభరణాలను తనకు ఖాతా ఉన్న కెనరా బ్యాంక్‌లో తాకట్టు పెట్టి రూ.13.50 లక్షలు తీసుకున్నారు. ఈ మొత్తాన్ని సైబర్ నేరగాళ్లు ఇచ్చిన ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్ పేరుతో ఉన్న ఖాతాలో జమ చేశారు. డబ్బు జమచేసే ముందు బ్యాంక్ సిబ్బంది ఈ డబ్బంతా ఎవరికి పంపుతున్నారని ప్రశ్నించారు. అమెరికాలో తన కుమారుల విద్య కోసం పంపుతున్నానని చెప్పారు. బ్యాంక్ సిబ్బంది అడిగితే ఈవిధంగా జవాబు చెప్పాలని సైబర్ నేరగాళ్లు ముందే ఆయనకు ట్రైనింగ్ ఇచ్చారు. 19వ తేదీన ఫోన్‌చేసి మిగిలిన డబ్బు పంపాలని డిమాండ్ చేశారు. ఎంత ఉంటే అంత జమ చేయాలని చెప్పడంతో ఆయన రూ.5 లక్షలు అప్పుచేసి సైబర్ నేరగాళ్లు ఇచ్చిన ఖాతాలో జమ చేశారు. తర్వాత అనుమానం వచ్చిన విశ్రాంతి ఉపాధ్యాయుడు గురువారం రాత్రి పోలీసులను ఆశ్రయించారు.

ఆర్టీఈలో ఉచిత ప్రవేశాలకు

చివరి అవకాశం

- 31లోగా అడ్మిషన్లు ఖరారు చేసుకోవాలి
- 25న లాటరీ ఫలితాలు

విజయవాడ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : విద్యాహక్కు చట్టం కింద ప్రవేటు పాఠశాలల్లో ఒకటో తరగతి ప్రవేశాలకు విడుదల చేసిన నోటిఫికేషన్ గడువు ముగిసిందని జిల్లా విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరానికి గాను ఒకటో తరగతిలో 25శాతం సీట్లను పేద విద్యార్థులకు కేటాయించిన సీట్లు ఖాళీ ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం చివరి అవకాశం కల్పించిందన్నారు. దీనిలో భాగంగా ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 25న లాటరీ ఫలితాలు ప్రకటిస్తామని ఆయన తెలిపారు. సీటు పొందిన విద్యార్థులు ఈనెల 31లోగా పాఠశాలల్లో అడ్మిషన్ ఖరారు చేసుకోవాలన్నారు. ప్రస్తుతం ఐదు కిలోమీటర్ల పరిధిలోని ప్రైవేటు పాఠశాలల్లో సీట్లు డిస్‌ప్లే అవుతాయన్నారు. సీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఇన్ సైట్‌లో ఉంచిన దరఖాస్తు ఫారాన్ని పూర్తిచేసి, సమర్పించిన తర్వాత మార్పులు చేసుకోవడానికి ఆస్కారం ఉండదని డీఈవో తెలిపారు. అడ్మిషన్ కావాలనుకున్న వారు విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రస్తుత చిరునామా ఉన్న ఆధార్ తప్పనిసరిగా ఉండాలన్నారు. విద్యుత్ బిల్లు, డ్రైవింగ్ లైసెన్స్, రేషన్‌కార్డుల్లో ఏదో ఒకటి అప్‌లోడ్ చేయాలని తెలిపారు. ఇదివరకే అడ్మిషన్ తీసుకున్న విద్యార్థులు దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని, గతంలో బీపీఎల్ కోటాలో అనర్హులుగా ప్రకటించిన వారు దరఖాస్తు చేసుకోకూడదని డీఈవో తెలిపారు.

వర్షాలకు నష్టపోయిన అన్నదాతను ఆదుకోవాలి : సీపీఎం



శ్రీనివాసరావు

గవర్నర్‌పేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో వారం రోజులుగా కురుస్తున్న భారీవర్షాలు కారణంగా దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని సీపీఎం డిమాండ్ చేసింది. పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సమావేశం ఎంజీ రోడ్డులోని రాష్ట్ర కార్యాలయంలో కె.లోకనాథం అధ్యక్షతన జరిగింది. సమావేశంలో పలు తీర్మానాలను ఆమోదించారు. రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మీడియా సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను వివరించారు. గోదావరికి వస్తున్న వరదలతో పోలవరం ముంపు గ్రామాల్లోని ప్రజలు భయాందోళలకు గురౌతున్నారని, వర్షాల కారణంగా నష్టపోయిన పంటలకు ప్రతి ఎకరాకు రూ. 10 వేలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతుల సంక్షేమం దృష్ట్యా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంటల బీమా పథకం నిర్వహించాలని కోరారు. స్మార్ట్ మీటర్లు, ట్రూఅప్ చార్జీలు ఉపసంహరించాలని ఈనెల 28న ప్రతిజ్ఞ దినం పాటించాలని సమావేశం తీర్మానించినట్టు వివరించారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చొరవ తీసుకుని సినిమా కార్మికుల సమస్యలు పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు. రాష్ట్రంలో స్త్రీశక్తి ఉచిత బస్సు పథకం అమలును స్వాగతిస్తున్నట్టు తీర్మానించింది.

దయనీయస్థితిలో విద్యారంగం :ఏబీవీపీ

గాంధీనగర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యారంగ పరిస్థితి దయనీయంగా ఉందని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి యాగంటి వెంకట గోపీ విమర్శించారు. మంత్రి లోకేశ్ పూర్తి స్థాయిలో విద్యాశాఖను పట్టించుకోకపోవడమే అందుకు కారణమన్నారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతూ మార్చిలో ఇంటర్మీడియట్ పరీక్షలు పూర్తవగా ఇంతవరకూ డిగ్రీ ప్రవేశాలపై స్పష్టత లేకపోవడమే అందుకు నిదర్శనమన్నారు.ఇచ్చిన హామీ మేరకు జీవో 77ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కోచింగ్ సెంటర్లపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. దుర్గారావు, బాషా, రామ్, మురళి తదితరులు పాల్గొన్నారు.

దుర్గగుడి ఉచిత ప్రసాదం పంపిణీకి విరాళం

ఇంద్రకీలాద్రి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానంలో ప్రతిరోజూ జరిగే ఉచిత ప్రసాద పంపిణీకి గురువారం గుంటూరు జిల్లా రెడ్డిపాలెం, సోమిపల్లి హౌసింగ్ కాలనీకి చెందిన తిరుమలశెట్టి భార్గవ్‌తేజ, సాయిచరిత దంపతులు రూ.1,00,116లు విరాళంగా అందజేశారు. వారిని అమ్మవారి సన్నిధికి తోడ్కొని వెళ్లి దర్శనానంతరం వేద పండితుల ఆశీర్వచనాలు, అమ్మవారి చిత్రపటం, లడ్డూప్రసాదం, శేషవస్త్రం అందించారు.

దుకాణాల్లో క్లాత్‌బ్యాగ్‌లు ఉంచాలి

నగర కమిషనర్ ధ్యానచంద్ర

భారతీనగర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): నగరాన్ని ప్లాస్టిక్ రహిత నగరంగా ఉంచడానికి ప్రతి రైతుబజార్లో క్లాత్ సంచులను దుకాణంలో ఏర్పాటు చేయాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. నగర పర్యటనలో భాగంగా నగర కమిషనర్ ధ్యానచంద్ర గురువారం నాల్గో డివిజన్ పరిధిలోని ఏపీఐఐసీ కాలనీ రైతుబజార్, మహానాడు రోడ్డు, లయోలా కళాశాల రోడ్డు, ప్రభుత్వ దంతవైద్యశాల రోడ్లో అధికారులతో కలిసి పర్యటించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ ప్రతి రైతుబజార్లో స్వయం సహాయక బృందాలు తయారు చేసిన క్లాత్ సంచుల దుకాణాలు ఏర్పాటు



మాట్లాడుతున్న నగర కమిషనర్ ధ్యానచంద్ర

చేయాలని తెలిపారు. దీంతో ఒకవైపు ప్లాస్టిక్ రహిత పర్యావరణహితమైన వస్తువులను అమ్మడంతో పాటు స్వయం సహాయక బృందాలను ఆర్థికంగా బలోపేతం చేసినట్లు ఉంటుందని అన్నారు. అనంతరం లయోలా కళాశాల రోడ్డు, మహానాడు రోడ్లోని అవుట్ పాల్ డ్రెయినేజీలను పరిశీలించారు. డ్రెయినేజీల్లో పేరుకుపోయిన చెత్తను తొలిగించాలని అధికారులకు తెలిపారు. చీఫ్ ఇంజనీర్ ఆర్. శ్రీనాథ్ రెడ్డి, ప్రాజెక్ట్ ఆఫీసర్ యూసీడీపీ వెంకటనారాయణ, పర్యవేక్షణ ఇంజనీర్ పి. సత్యనారాయణ, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ చంద్రశేఖర్, సీడీవో ఉమామహేశ్వరి, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ గోపాలకృష్ణ నాయక్, ఈఈ సామ్రాజ్యం, పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరి సొంతింటి కలను నెరవేరుస్తాం

- ఎమ్మెల్యే గద్దె



ఇళ్ల పట్టాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, రెవెన్యూ అధికారులు

భారతీనగర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరి సొంత ఇంటి కలను నెరవేర్చే దిశగా కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. తూర్పు పరిధి మూడో డివిజన్ కామినేనినగర్ డొంక రోడ్డు ఏరియాలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రెవెన్యూ అధికారులతో కలిసి గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్థానికంగా ఉన్న సమస్యలను కాలనీ వాసులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ డివిజన్‌లోని డొంక రోడ్డులో పేదలు ఉంటున్న ఇళ్ల పట్టాల్లో చిన్నపాటి సమస్యలు ఉన్నాయని, వాటిని తహసీల్దారు ఆధ్వర్యంలో సర్వే చేయించి సమగ్రమైన రిపోర్టును సిద్ధం చేయిస్తున్నామని తెలిపారు. పేదల ఇళ్ల నిర్మాణాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రాంటుగా రూ.2 లక్షల మంజూరు చేస్తారని, వీటికి తోడుగా బ్యాంక్ నుంచి రుణం కూడా పొందవచ్చునని, మిగిలిన కొద్దిపాటి నగదును లబ్ధిదారుడు భరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దేవినేని అపర్ణ, తహసీల్దార్ ఎం. రోహిణి, డివిజన్ పార్టీ నేతలు గద్దెరమేష్, తాడి బాబూరావు, బండి కోమలి, కూటమి నేతలు, కార్యకర్తలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కళావిహీనంగా కాల్వగట్లు

- పిచ్చి మొక్కలు, వ్యర్థాలతో దుర్వాసన వెదజల్లుతున్న వైనం
- పట్టించుకోని అధికారులు



అడవిని తలపిస్తున్న అంబేడ్కర్ నగర్ కాల్వగట్టు, శ్మశానం గోడ పక్కన పేరుకుపోయిన వ్యర్థాలు

పటమట, ఆంధ్రజ్యోతి: ప్రజలకు పచ్చదనంతో ఆహ్లాదాన్ని పంచాల్సిన కాల్వగట్లు పెరిగిన పిచ్చిమొక్కలు, పేరుకున్న వ్యర్థాలతో కళావిహీనంగా తయారయ్యాయి. ప్రభుత్వం నగర కాల్వగట్ల సుందరీకరణకు నిధులు విడుదల చేశామని చెబుతున్నా అంబేడ్కర్‌నగర్ కాల్వగట్లు వరకు ఆ నిధులు ఇంకా చేరలేదు. అంబేడ్కర్‌నగర్‌లో కమ్యూనిటీ హాలు దగ్గర నుంచి చిన్నవంతెన వరకు ఉన్న కాల్వగట్ల మీద పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి చిన్నపాటి అడవిని తలపిస్తున్నాయి. ఉద్యానవన శాఖ అధికారులు కాల్వ గట్టు అంచున ఐరన్ గ్రిల్ వేసి చేతులు దులుపుకున్నారు. స్థానికులు వ్యర్థాలను, చనిపోయిన జంతు కళేబరాలను అక్కడ వేయడంతో ఆ ప్రాంతమంతా దుర్గంధభరితంగా తయారైంది. దీనికితోడు రోడ్డుకు ఇటుపక్కన శ్మశానం రోడ్డువైపు స్థానికులు పెద్దమొత్తంలో వ్యర్థాలను వేస్తున్నారు. అటువైపు వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సిందే. ఆ ప్రాంతాన్ని శుభ్రపరిచి పార్కును, ఆట వస్తువులను ఏర్పాటు చేస్తే నల్లూరి సత్యనారాయణనగర్, అంబేడ్కర్ కాలనీ వాసులకు ఉపయుక్తంగా ఉంటుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

ఫిర్యాదు చేశా...చర్యలు లేవు

కాల్వ గట్టును సుందరీకరించాలని పటమట సర్కిల్ 3 కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశాను. కానీ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

- బి.సత్యనారాయణ, స్థానికుడు

మానసిక ఉల్లాసానికి క్రీడలు

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొప్పన భవకుమార్



మ్యాచ్ ప్రారంభిస్తున్న బొప్పన

విజయవాడ స్పోర్ట్స్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసానికి తోడ్పడతాయని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొప్పన భవకుమార్ పేర్కొన్నారు. పటమట చెన్నుపాటి రామకోటయ్య స్టేడియంలో జరుగుతున్న యువ ఆంధ్ర చాంపియన్‌షిప్ 2025 కబడ్డీ పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. క్రీడాకారులను అభినందించారు. కర్నూల్, అమరావతి జట్ల మధ్య జరిగిన కబడ్డీ పోటీని ప్రారంభించారు. అమరావతి టీం నుంచి ప్రతిభ కనబర్చిన గోపికి కర్నూలు టీం నుంచి డిఫెడింగ్ చాంపియన్ రాజేష్‌కు భవకుమార్ చెక్కును అందజేశారు. 7వ రోజు జరిగిన మ్యాచ్‌లో తిరుపతి, వైజాగ్ , భీమవరం, కర్నూల్ జట్లు విజయాలు సాధించాయి. కూటమి నాయకులు , ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

వరద ఉధృతికి ఇళ్లలోకి ఊట

- సహాయక చర్యల్లో అధికారులు నిమగ్నం
- పునరావాస కేంద్రాలకు బాధితుల తరలింపు



ఇళ్లల్లో చేరిన నీటిని తోడుతున్న సిబ్బంది

రామలింగేశ్వరనగర్, ఆగస్టు 21 (ఆంధజ్యోతి): కృష్ణానదికి వరద ఉధృతి పెరగటం వలన ఊట ఊరి నివాసాలలోకి రావడంతో అధికారులు సహాయచర్యలు చేపట్టారు. 15వ డివిజన్ యర్రపోతు వారి వీధి, సాయిరామ్ కాలనీ, గాంధీ కాలనీల మధ్య రిటైనింగ్ వాల్ తీరాన లోతట్టు ప్రాంతాన వరద ఉధృతికి ఊట ఇళ్లలోకి చేరడంతో ఆయా ప్రాంతవాసులు గత రెండు రోజులుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికార యంత్రాంగం, సిబ్బంది అప్రమత్తమై ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. అంతే కాకుండా నీటిని ఎప్పటికప్పుడు మోటారు పైపులతో తోడి నదిలోకి పంపడంతో కొంత వరకు కుదుట పడ్డారు. అధికార యంత్రాంగం ఇసుక బస్తాలు, సిబ్బందితో అప్రమత్తంగా ఉన్నారు. వరద వచ్చిన ప్రతిసారీ



విధుల్లో ఉన్న సిబ్బంది

అయోమయ పరిసితుల్లో ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని బతుకుతున్నామని స్థానికులు అంటున్నారు. ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపాలని కృష్ణానదీ తీర ప్రాంత బాధిత ప్రజలు కోరుతున్నారు.



అమర్చిన కొత్త సిమెంట్ చప్టా

కొత్త సిమెంట్ చప్టా అమర్చారు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పటమట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): నల్లూరి సత్యనారాయణనగర్ రోడ్డు ప్రారంభంలో డ్రెయినేజీ మీద విరిగిన సిమెంట్ చప్టా స్థానంలో కొత్త సిమెంట్ చప్టాను అమర్చారు. విరిగిన సిమెంట్ చప్టా పొంచి ఉన్న ప్రమాదం పేరిట గురువారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారులు కొత్త సిమెంట్ చప్టా అమర్చడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

150 మందికి యోగా శిక్షణ సర్టిఫికెట్లు పంపిణీ



సర్టిఫికెట్ల పంపిణీలో పాల్గొన్న పతంజలి సంస్థ ప్రతినిధులు స్వామి రితేవ్, నిర్వాహకులు అశోక్ కుమార్, తదితరులు

భారతీనగర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): 150 మంది సభ్యులకు పతంజలి యోగా శిక్షణ సర్టిఫికెట్లు పంపిణీ చేసినట్లు నిర్వహకులు కావూరి అశోక్ తెలిపారు. పతంజలి యోగా పీఠ్ హరిద్వార్ వారి ఆధ్వర్యంలో గురునానక్ రోడ్లోని సాయిజ్యువెల్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహిస్తున్న ఉచిత యోగా శిబిరం గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో శిక్షణ పొందిన 150 మంది సభ్యులకు సర్టిఫికెట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పతంజలి గౌరవాధ్యక్షుడు గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్, నిర్వహకులు శ్రీనివాస రాజు, స్కై ట్రస్ట్ ప్రతినిధులు ప్రసాద్, సూర్య యోగా ఫౌండేషన్ ప్రతినిధులు కరణం లోగేంద్ర పిల్లాయ్, తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ప్రారంభం



రాణిగారితోట, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): నగరవాసులకు దేశం నలుమూలల నుంచి తెచ్చిన విశిష్ట దుస్తులను అందించేందుకు నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ఎగ్జిబిషన్ కమ్ సేల్‌ను ఏప్లస్ కన్వెన్షన్‌లో గురువారం ప్రారంభించినట్లు నిర్వాహకులు తెలిపారు. రాబోయే పండుగలు, వివాహ వేడుకల కోసం ప్రత్యేకమైన వస్త్రాలు, సంప్రదాయ ఆదునిక ఫ్యాషన్స్ సమ్మిళితమైన విభిన్న వస్త్రాలను ఈ ప్రదర్శనలో ఉంచినట్లు తెలిపారు. వివిధ డిజైన్లు నమూనాలతో చీరలు, దుపట్టాలు, సల్వార్ మెటీరియల్స్ లభిస్తాయి. వీటిలో టస్సార్, మట్కా, బీహార్ నుంచి భాగల్పూర్ సిల్క్, గుజరాత్ నుంచి బాంధిని, కచ్ ఎంబ్రాయిడరీ, పటోరా, తమిళనాడు నుంచి కాంజీవరం, జమ్మూ అండ్ కాశ్మీర్ నుంచి తాబి సిల్క్, ఉత్తర్‌ప్రదేశ్ నుంచి బనారసీ, జంథాని షిఫాన్ చీర, లక్నవి చికాన్ వర్క్, రాజస్థాన్ నుంచి బాంధిని, బందేజ్, హ్యాండ్ బ్లాక్‌ప్రింట్ చీరలు ఈ ప్రదర్శనలో లభిస్తాయని తెలిపారు. ఈ ప్రదర్శన ఈ నెల 26 వరకు అందుబాటులో ఉంటుందన్నారు. ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు సందర్శకులకు ప్రవేశం ఉచితమని నిర్వాహకులు తెలిపారు.

వృద్ధులకు ఉచిత వైద్య శిబిరం, సైబర్ నేరాలపై అవగాహన

ఘనంగా సీనియర్ సిటిజన్స్ డే

గాంధీనగర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ సీనియర్ సిటిజన్స్ డే సందర్భంగా సెంట్రల్ గవర్నమెంట్ కంట్రోల్ ఆఫ్ కమ్యూనికేషన్ అకౌంట్స్ ఆంధ్రప్రదేశ్ సర్కిల్, రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ ఆధ్వర్యంలో కార్యాలయంలో ఉచిత వైద్యశిబిరం, సైబర్ నేరాలపై అవగాహన సదస్సు గురువారం జరిగింది. పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ రీసెర్చ్ ఫౌండేషన్ వైద్య సిబ్బంది



సేవలందించారు. ఎముకల సాంద్రత, కంటి, దంత, ఈసీజీ, బీపీ, షుగర్ తదితర పరీక్షలు నిర్వహించారు. పీబీ సిద్ధార్థ కాలేజ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం.షర్మిళ, ఆయుర్వేద వైద్యుడు జీవీ పూర్ణచంద్ పలు అంశాలను వివరించారు. ఆంధ్రప్రదేశ్ కంట్రోలర్ ఆఫ్ కమ్యూనికేషన్ అకౌంట్ (సీసీఏ) ఎస్.తారాచంద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రోటర్ క్లబ్ ఆఫ్ విజయవాడ అధ్యక్షకార్యదర్శులు ఎస్.బాలగోపాల్, ఎం. రాంగోపాల్‌రావు, ఎస్.నాగభూషణం పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిపై ఉద్యమిస్తాం

ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలి

ఆటో మోటార్ ట్రాన్స్‌పోర్ట్ కార్మిక సంఘాలు

గాంధీనగర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఉద్యమిస్తామని ఆటో మోటార్ ట్రాన్స్‌పోర్ట్ రాష్ట్ర కార్మిక సంఘాలు హెచ్చరించాయి. ఉచిత బస్సు పథకాన్ని అమలు చేస్తూ ఆటో మోటార్ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడాన్ని సంఘాలు ఖండించాయి. గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో నేతలు మాట్లాడుతూ సబ్ కమిటీల పేరుతో ప్రభుత్వం కాలయాపన చేయడం అన్యాయమన్నారు. తక్షణమే ప్రతీ ఆటో డ్రైవర్‌కు ఏడాదికి రూ. 15 వేలు చెల్లించాలన్నారు. జీవో 21 రద్దు చేయాలని కోరారు.

వచ్చేవారంలో సమావేశం ఏర్పాటు చేసి రాష్ట్రవ్యాప్త పోరాటాలకు రూపకల్పన చేస్తామన్నారు. ప్రగతిశీల ఆటో మోటార్ వర్కర్స్ ఫెడరేషన్ (ఐఎఫ్‌టీయూ) నేత కె.పోలారి, దాది శ్రీనివాసరావు, ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్, సీఐటీయూ నేత దుర్గారావు, ఏపీ తెలుగునాడు డ్రైవర్స్ అండ్ ఓనర్స్ అసోసియేషన్ (టీఎన్‌టీయూసీ) నేతలు పాల్గొన్నారు.



గేట్లు బిగించకుండా అసంపూర్తిగా నిలిచిపోయిన పోలంపల్లి ఆనకట్ట

పాపం.. పోలంపల్లి!

- కొత్త ఆనకట్టకు రాజకీయ గ్రహణం
- రెండు దశాబ్దాలుగా అందుబాటులోకి రాని వైనం
- కాంట్రాక్టర్ల మధ్య వివాదం, నేటికీ పరిష్కారం కాని సమస్య
- 20 ఏళ్లుగా రైతులకు శాపం
- ప్రాజెక్టు వద్ద తుప్పుపట్టిన గేట్లు

ఖానాలు నిర్మించినా గేట్లు బిగించలేదు! ఎంతో విలువైన సామగ్రి తుప్పుపట్టిపోతోంది! రెండు దశాబ్దాలు గడుస్తున్నా పోలంపల్లి కొత్త ఆనకట్ట అందుబాటులోకి రాలేని దౌర్భాగ్య పరిస్థితి. వత్సవాయి మండలం మునేటిపై తలపెట్టిన పోలంపల్లి కొత్త ఆనకట్ట నిర్మాణం పాలకులు, అధికారుల నిర్లక్ష్యం వల్ల పూర్తిగా పడకేసింది. ఈ పాపానికి రైతులు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. కొత్త ఆనకట్టకు శంకుస్థాపన చేసి రెండు దశాబ్దాలు గడిచినప్పటికీ ఇంకా పూర్తి కాలేదు. సివిల్ పనులు (స్ట్రక్చర్ నిర్మాణం) దాదాపుగా పూర్తి కాగా, మెకానికల్ పనుల ఊసే లేదు. ఖానాలు నిర్మించినప్పటికీ వివాదం వల్ల గేట్లు బిగించలేదు. ఎంతో విలువైన గేట్ల సామగ్రి తుప్పుపట్టి పనికి రాకుండా పోతోంది. ఏయేటికాయేడు సాగునీరందక ఇబ్బందులు పడుతున్న ఆయకట్టు రైతులు తగిన మూల్యం చెల్లిస్తున్నప్పటికీ అసంపూర్తిగా నిలిచిన కొత్త ఆనకట్ట నిర్మాణంలో ఎలాంటి కదలిక ఉండటం లేదు. - ఆంధ్రజ్యోతి, కంచికచర్ల

జగ్గయ్యపేట నియోజకవర్గంలో మునేటి ఆయకట్టు రైతులకు పుష్కలంగా సాగునీరందించాలన్న లక్ష్యంతో కట్టల ఎత్తు పెంచి, పాత ఆనకట్టను పునర్నిర్మించాలని ముందు నిర్ణయించారు. రాజీవ్ పల్లెబాటలో భాగంగా 2004 జూలై 4న అప్పటి సీఎం రాజశేఖరరెడ్డి పునర్నిర్మాణ ఆనకట్ట పనులకు శంకుస్థాపన చేశారు. పునర్నిర్మాణం వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదని, కొద్దికాలం తర్వాత మళ్లీ ఇబ్బందులు తప్పవని రైతులు అభిప్రాయం వ్యక్తం చేయటంతో అప్పటి జగ్గయ్యపేట శాసన సభ్యుడు సామినేని ఉదయభాను సీఎం దృష్టికి తీసుకువెళ్లి రూ.36 కోట్లతో రోడ్డు కమ్ కొత్త ఆనకట్టను మంజూరు చేయించారు. సివిల్ పనులను జేకే కన్‌స్ట్రక్షన్ సంస్థకు, మెకానికల్ పనులను స్వప్న ఏజెన్సీస్‌కు అప్పగించారు. పాత ఆనకట్టకు 150 మీటర్ల దిగువన 2006 సెప్టెంబరులో నిర్మాణ పనులు మొదలు పెట్టారు. అగ్రిమెంట్ ప్రకారం 18 నెలల్లో పూర్తి కావాల్సిన నిర్మాణం నేటికి పూర్తి కాలేదు. పలు కారణాలతో నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. ఆనకట్ట సివిల్ పనులు మాత్రం దాదాపుగా పూర్తయ్యాయి. రోడ్డు నిర్మాణం కూడా దాదాపుగా పూర్తయింది. మునేటిలో మొత్తం 19 ఖానాలు నిర్మించారు. మెకానికల్ పనులకు సంబంధించి ఖానాలకు గేట్లు అమర్చాల్సి ఉంది. అప్పట్లో సివిల్, మెకానికల్ కాంట్రాక్టర్ల మధ్య వివాదం ఏర్పడింది. కొన్ని ఖానాల వద్ద అదనంగా వేసిన కాంక్రీట్ తొలగించాలని, తగ్గిన చోట కాంక్రీట్ వేయాలని లేకుంటే గేట్లు అమర్చటానికి వీలు పడదని మెకానికల్ కాంట్రాక్టర్ చెప్పారు. గేట్లు బిగించేందుకు అనువుగా కాంక్రీట్ సరిచేసేందుకు తొలుత అంగీకరించిన సివిల్ కాంట్రాక్టరు తర్వాత తొలగించలేదంటున్నారు. దీంతో గేట్లు బిగించకపోవటంతో ఆనకట్ట నిర్మాణ పనులు పూర్తిగా నిలిచిపోయాయి. గేట్ల సామగ్రి అంతా నిర్మాణ స్థలం వద్దనే పడి ఉంది. ఏళ్ల తరబడి వానకు తడుస్తూ, ఎండకు ఎండుతుండటంతో ఈ సామగ్రి అంతా తుప్పుపట్టి దెబ్బతింది. ఆనకట్ట నిర్మాణ పనులు నిలిచిపోయి దశాబ్దం పైబడినప్పటికీ అధికారుల్లో ఎలాంటి చలనం లేదు. ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ పాలకులలోనూ కదలిక లేదు. ఆనకట్ట నిర్మాణం సత్వరమే పూర్తి చేయాలని కోరుతూ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో అప్పటి జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య విజయవాడలో ధర్నా చేశారు.



పూర్తైన రోడ్ కమ్ ఆనకట్ట స్ట్రక్చర్



తుప్పు పట్టి పాడైపోతున్న గేట్ల సామగ్రి

మట్టికట్ట గండి కూడా పూడ్చలేదు

కొత్త ఆనకట్టకు ఖమ్మం జిల్లా పెద్ద మండవ గ్రామం వైపు 375 మీటర్ల పొడవున 9 మీటర్ల ఎత్తున మట్టికట్ట ఏర్పాటు చేశారు. 2012లో మునేటికి వచ్చిన వరదకు మట్టికట్ట కోసుకుపోయింది. 150 మీటర్ల పొడవున భారీ గండి పడింది. పంట భూములు కూడా కోసుకుపోయాయి. తర్వాత వచ్చిన వరదలకు గండి ఇంకా పెరిగింది. అదిగో ఇదిగో అంటున్నారు తప్పితే ఈ గండిని కూడా ఇప్పటి వరకు పూడ్చలేదు.

మొక్కలకు సెలైనా!

- ఆశ్చర్యపోయిన కేంద్ర పర్యావరణ అటవీ శాఖ కార్యదర్శి అమన్‌దీప్ గార్గ్
- వేసవిలో పూయాల్సిన రేల చెట్లకు పూలు ఇప్పుడెలా పూస్తున్నాయంటూ ప్రశ్న
- ఏడీసీఎల్ ఎండీ లక్ష్మీ పార్థసారథి సమాధానానికి అధికారుల బృందం కితాబు
- రాజధానిలో పచ్చదనం పరిశీలించిన గార్గ్ బృందం
- అమరావతిలో పూలమొక్కల నిర్వహణపై పూర్తి సంతృప్తి



రాజధానిలో పూల అందాల సోయగాలు.. గార్గ్‌ను కట్టిపడేసిన పూల చెట్లు ఇవే



ఏడీసీఎల్ సీఎండీ లక్ష్మీ పార్థసారథి, సీఆర్‌డీఏ కమిషనర్ ప్రవీణ్‌చంద్, అధికారులతో సమావేశంలో కేంద్ర పర్యావరణ అటవీ కార్యదర్శి అమన్ దీప్ గార్గ్ బృందం

విజయవాడ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో పచ్చదనం పెంపొందించే దిశగా అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీఎల్) చేపట్టిన చర్యలు కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ (ఎంవోఈఎఫ్‌సీసీ) అధికారులను మెప్పించాయి. రాజధాని రోడ్ల వెంబడి నాటిన గ్రీన్ బెల్టులు, శాఖమూరులో అభివృద్ధి చేస్తున్న అత్యంత భారీ జలాశయంతో కూడిన పార్కులు చూసిన అధికారుల బృందం ఏడీసీఎల్ అధికారులను అభినందించకుండా ఉండలేకపోయారు. కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ అదనపు కార్యదర్శి అమన్‌దీప్ గార్గ్ బృందం గురువారం రాజధాని అమరావతిలో పర్యావరణం, పచ్చదనం అంశాలను పరిశీలించటానికి వచ్చింది. మధ్యాహ్నం ఉండవల్లిలో నది నీటి నాణ్యత పర్యవేక్షణ కేంద్రాన్ని, ఫ్లడ్ పంపింగ్ స్టేషన్‌ను పరిశీలించారు. అలాగే ఎల్‌పీఎస్ జోన్‌లో ఎల్‌అండ్‌టీ సంస్థ చేపడుతున్న పనులను పరిశీలించింది. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్వార్టర్స్‌కు సంబంధించి ఎన్‌సీసీ సంస్థ చేపడుతున్న పనులను పరిశీలించింది. ప్రధానంగా సీడ్ యాక్సెస్ రోడ్డుతో పాటు రూ.50కోట్ల వ్యయంతో చేపడుతున్న 38 రోడ్ల వెంబడి గ్రీనరీ పనులను పరిశీలించారు. వేసవి కాకపోయిన రేల చెట్లు పువ్వులు పూయటం చూసి సెక్రటరీ గార్గ్ ఆశ్చర్యపోయారు. పూలచెట్లకు సెలైన్ పెడుతున్నామని, ఈ ప్రక్రియ ద్వారా పోషకాలను అందిస్తున్నామని అందుకనే సీజన్ కాకపోయినా పూలు పూచాయని ఏడీసీఎల్ సీఎండీ లక్ష్మీపార్థసారథి వివరించడంతో ఆయన సెలైన్ పెడుతున్నారా అంటూ ఆశ్చర్యపోయారు. మొక్కలను సంరక్షణకు డ్రోన్ల ద్వారా క్రిమిసంహారక మందులను చల్లిస్తున్నామని సీఎండీ చెప్పటంతో గార్గ్ ఆశ్చర్యపోయారు. నందనవనాలను తలపించేలా అభివృద్ధి పరిచిన గ్రీనరీపై గార్గ్ ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. సాయంత్రం కొండవీడు వాగు నుంచి వచ్చే నీరంతా శాఖమూరులోని అతి పెద్ద రిజర్వాయర్‌లో కలుస్తుంది. దీని చుట్టూ 300 ఎకరాల్లో ఏడీసీఎల్ అత్యంత భారీ ఉద్యానవనం ఏర్పాటు చేస్తోంది. ఈ ఉద్యానవనాన్ని గార్గ్ బృందం పరిశీలించింది. తర్వాత చెట్లను ఒకచోట నుంచి సజీవంగా తీసి మరోచోట నాటే ప్రక్రియను పరిశీలిచారు. అనంతరం సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ అదనపు కార్యదర్శి అమన్‌దీప్ గార్గ్ ఏడీసీఎల్ సీఎండీ లక్ష్మీ పార్థసారథిని ప్రత్యేకంగా ప్రశంసించారు. సీఆర్‌డీఏ కమిషనర్ కే కన్నబాబు, అడిషనల్ కమిషనర్ ప్రవీణ్ సూర్యసాయి చంద్ తదితర ఉన్నతాధికారులతో గ్రీన్ ట్రిబ్యునల్ ఫిర్యాదులు, తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు.

తోట నరసయ్య చిత్రాలు కావివి..!

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రముఖ దేశ నేతల చిత్రాలు అందరికీ స్ఫూర్తినిస్తున్నాయి. స్వాతంత్ర్య సమరయోధులు లాలాలజపతి రాయ్, సర్దార్ వల్లభాయ్ పటేల్, గోపాలకృష్ణ గోఖలే, గౌతు లచ్చన్న, జాతీయ పతాక నిర్మాత పింగళి వెంకయ్య, స్వాతంత్ర్య సమరయోధురాలు సరోజిని నాయుడు వంటి ప్రముఖుల చిత్రాలను ప్రదర్శించారు. రోజూ బస్టాండ్‌లో బస్సులు ఎక్కుతున్న విద్యావంతులు, విద్యార్థులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, మహిళలు ఈ చిత్రాలను చూసి వాటివద్ద సెల్ఫీలు దిగుతున్నారు. ఈ చిత్రాలు ఎంతో స్ఫూర్తినిస్తున్నాయి. అయితే జెండా వీరుడు తోట నరసయ్య చిత్రానికి మారుగా దక్షిణ భారతదేశంలో చలన చిత్ర పరిశ్రమకు ఆద్యుడైన రఘుపతి వెంకయ్య చిత్రాలను 1,2వ నెంబరు ప్లాట్‌ఫారాల్లో ప్రదర్శించారు. రఘుపతి వెంకయ్య చిత్రం కింద తోట నరసయ్య పేరును రాశారు. ఈ చిత్రం పేరును మార్చాల్సిన అవసరం ఉంది. ఏదైనా ఒక ప్లాట్‌ఫారంలో రఘుపతి వెంకయ్య చిత్రానికి మారుగా జెండా వీరుడు తోట నరసయ్య చిత్రాన్ని ప్రదర్శించడం సముచితం.

రఘుపతి వెంకయ్య చిత్రాలకు నరసయ్య పేరు



మచిలీపట్నం ఆర్టీసీ డిపోలో 3వ నెంబర్ ప్లాట్ ఫారంలో ఉంచిన రఘుపతి వెంకయ్య చిత్రం

రోగుల సహాయకులపై దురుసు ప్రవర్తన

- కొట్టేందుకు వెనుకాడని సెక్యూరిటీ సిబ్బంది
- ఆందోళన వ్యక్తం చేస్తున్న రోగులు, సహాయకులు
- పట్టపగలు లాఠీలతో బెదిరిస్తున్నారని ఆగ్రహం



రోగి సహాయకుడిపై చేయిచేసుకుంటున్న సెక్యూరిటీ సిబ్బంది

విజయవాడ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సెక్యూరిటీ సిబ్బంది ఆగడాలు పెచ్చుమీరుతున్నాయి. ఆసుపత్రికి వచ్చే రోగులకు సహాయసహకారాలు అందించడంతో పాటు దొంగతనాలు, ట్రాఫిక్ ఇబ్బందులు వంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చూసేందుకు వీరిని నియమిస్తారు. వీరు రోగులకు సహకరించాల్సింది పోయి వారి సహాయకులపై దాడులు తెగబడుతున్నారు. ఇటీవల పాత జీజీహెచ్‌కు వచ్చిన ఓ రోగి సహాయకుడిపై సిబ్బంది దాడికి యత్నించడం సంచలనంగా మారింది. దీనిపై పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి.

పాత జీజీహెచ్ ఆసుపత్రికి బాలు అనే వ్యక్తి తన భార్య డెలివరీకి ఆసుపత్రిలో చేర్పించాడు. అప్పటి నుంచి పార్కింగ్ స్థలం వద్దే ఉంటున్నాడు. 4 రోజులుగా ఆ వ్యక్తి ఆసుపత్రి బయట ఉంటూ తాగి వచ్చి అల్లరి చేస్తున్నాడని ఆరోపిస్తూ సిబ్బంది ఆ వ్యక్తిని బయటకు వెళ్లమంటే వెళ్లలేదనే నెపంతో కాలర్ పట్టుకుని ఏకంగా ఆసుపత్రి బయటకు నెట్టేయడానికి యత్నించారు. దీంతో ఆ వ్యక్తి సిబ్బందిపైకి ఎదురుతిరగగా మరో సెక్యూరిటీ రావడంతో ఇద్దరూ కలిసి అతడిని కొట్టారు. దీంతో ఓ వ్యక్తి సిబ్బందిని అడగగా న్యూసెన్స్ చేస్తున్నాడని బదులిచ్చారు. కొట్టే అధికారం ఎవరిచ్చారని అక్కడున్నవారు గట్టిగా అడగడంతో మాట్లాడకుండా బాలు అనే వ్యక్తిని విడిచిపెట్టారు. ఈ తతంగాన్ని చూస్తున్న రోగుల సహాయకులు సిబ్బంది తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం కూడా ఇదే తరహాలో ఓ ఘటన జరిగినట్టు ఆసుపత్రికి వచ్చిన రోగులు సహాయకులు చెప్పుకొచ్చారు. పాత జీజీహెచ్‌లో గర్భిణీ, బాలింతలు, చిన్నపిల్లల విభాగాలు ఉండడంతో అక్కడ సిబ్బంది పురుష సహాయకులను ఆసుపత్రి లోపలికి పంపించేందుకు నిరాకరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొంతమంది రోగులకు సహాయకులుగా వారి భర్తలే వస్తుండడం, వారిని లోపలికి పంపేందుకు సిబ్బంది నిరాకరించడంతో రోగులకు సమయానికి ఆహారం, ఇతర వస్తువులు అందడం లేదని వాపోతున్నారు. సెక్యూరిటీ పనిచేసే వారు పోలీసుల మాదిరి కర్రలతో ఎందుకున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాత్రి సమయంలో లాఠీలు పట్టుకున్నా పర్వాలేదు పగటి పూట ఎందుకంటూ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

ఖననం చేసిన 12 రోజులకు పోస్టుమార్టం

- కుమారుడి మృతిపై అనుమానాలు ఉన్నాయని తండ్రి ఫిర్యాదు



మృతుడు లక్ష్మణ్‌కుమార్ (ఫైల్)

గన్నవరం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఖననం చేసిన 12 రోజుల తరువాత ఓ వ్యక్తికి గురువారం పోస్టుమార్టం నిర్వహించిన సంఘటన గన్నవరం మండలం చిక్కవరం శివారు చింతగుంటలో జరిగింది. సీఐ బీవీ శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం చింతగుంటకు చెందిన డోలా లక్ష్మణ్‌కుమార్ (35) 14ఏళ్ల క్రితం జక్కంపూడికి చెందిన బిందు పావనిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వారికిద్దరు కుమార్తెలు. గ్రామంలోనే ఉంటుండగా 4 నెలల క్రితం కేసరపల్లి శివారు వీఎన్‌పురం కాలనీ 3వ రోడ్డులో అద్దెకు ఉంటుండన్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 10న గుండెపోటుతో మృతి చెందినట్టు బిందు పావని లక్ష్మణ్‌కుమార్ అన్న కొడుకైన సూర్యకిరణ్‌కి ఫోన్ చేసింది. వెంటనే అక్కడికి వెళ్లి మృతదేహాన్ని స్వగ్రామమైన చింతగుంట తీసుకువెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు. తరువాత లక్ష్మణ్‌కుమార్ మృతి గురించి తల్లిదండ్రులు విచారిస్తుండగా మృతి చెందిన రోజు అదే గ్రామానికి చెందిన దేవరపల్లి ప్రదీప్ అక్కడ ఉన్నట్టు తెలిసింది. బిందు పావని, ప్రదీప్‌పై అనుమానం ఉందని తండ్రి డోలా ఏసుపాదం ఈ నెల 18న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. కుమారుడు మృతదేహాన్ని బయటకి తీసి పోస్టుమార్టం చేసి మృతిపై ఉన్న సందేహాన్ని తొలగించాలని కోరారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఫిర్యాదుపై ఈ మృతదేహాన్ని బయటకి తీసి తహసీల్దారు కేవీ శివయ్య సమక్షంలో ఇద్దరు డాక్టర్లు పోస్టుమార్టం చేశారు. పోస్టుమార్టం నివేదిక తరువాత తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రాష్ట్రంపై అమెరికా సుంకాల ప్రభావం

- నష్టాల్లోకి పలు రంగాలు
- ఏపీ చాంబర్స్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు

విజయవాడ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఎగుమతులపై అమెరికా విధించిన సుంకాల ప్రభావం రాష్ట్రంలోని ఆక్వా, టెక్స్‌టైల్స్, వ్యవసాయ ఉత్పత్తులు, ఆటో కాంపోనెంట్స్ వంటి అనేక రంగాలపై పడిందని ఏపీ చాంబర్స్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు అన్నారు. ఏపీ చాంబర్స్ అనుబంధ సంఘాలతో గురువారం నగరంలోని ఓ హోటల్‌లో టారిఫ్‌ల ప్రభావంతో వివిధ రంగాలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, భారత్ నుంచి ఎగుమతవుతున్న ఉత్పత్తుల్లో సమారు 83 బిలియన్ల డాలర్ల విలువైన ఉత్పత్తులు అమెరికాకే ఎగుమతి అవుతున్నాయన్నారు. అమెరికాపై ఆధారపడడాన్ని తగ్గించడానికి ఇతర దేశాలకు ఎగుమతులు విస్తరించేలా చర్యలు తీసుకోవాలని కేంద్రప్రభుత్వాన్ని కోరారు. ఏపీ చాంబర్స్ ప్రధాన కార్యదర్శి బీ రాజశేఖర్, కోశాధికారి అక్కయ్యనాయుడు, బయాన వెంకటరావు, రాధిక తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ప్రయోజనకరంగా చేయాలి

- అంతర్ జిల్లాల బదిలీలపై టీఎన్‌యూఎస్ విజ్ఞప్తి

అమరావతి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): అంతర్ జిల్లాల బదిలీలను ఉపాధ్యాయులకు ప్రయోజనకరంగా నిర్వహించాలని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ బదిలీల కోసం ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఉపాధ్యాయులందరికీ అవకాశం కల్పించాలని టీఎన్‌యూఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మన్నం శ్రీనివాస్, రామిశెట్టి వెంకటేశ్వర్లు గురువారం ఓ ప్రకటనలో కోరారు. కేవలం భార్య/భర్తలకు, పరస్పర బదిలీలకు మాత్రమే కాకుండా అవసరమున్న టీచర్లందరూ జిల్లాలు మారే అవకాశం ఉండేలా బదిలీల మార్గదర్శకాల్లో స్వల్ప మార్పులు చేయాలని, అప్పుడే ఎక్కువమందికి ఉపయోగం ఉంటుందన్నారు. 2నెలల క్రితం జరిపిన పదోన్నతుల ప్రక్రియలో అనేక మంది ప్రమోషన్లు పొందారని, వారికి రెండేళ్లు పూర్తి కానందున ఈ బదిలీలకు క్యాడర్ సీనియారిటీని 'జీరో'గా తీసుకోవాలన్నారు.

అడ్డంగా దొరికిన రూ.కోటి టూల్ కిట్ల దొంగలు

- ఆంధ్రజ్యోతిలో కథనం వచ్చేవరకు ఉన్నతాధికారులకు రిపోర్టు చేయలేదేం?
- క్వాలిటీ కంట్రోల్ విభాగంలో కమిటీ తనిఖీలు
- బాధ్యులైన డీఈఈ వేతనం నుంచి రికవరీ!

విజయవాడ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పోయిన టూల్స్ స్థానంలో స్థానికంగా కొత్తవి కొనిపెట్టారు! కొన్ని భారీ టూల్స్ చూపించలేకపోయారు. మొత్తానికి అడ్డంగా బుక్ అయ్యారు. రెండు రోజుల్లో పోయిన టూల్ కిట్లపై సమగ్ర వివరణ ఇవ్వాల్సిందిగా బాధ్యులైన అధికారులకు ఆర్‌డబ్ల్యూఎస్ ఉన్నతాధికారుల విచారణ బృందం ఆదేశించింది. గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్) ఉమ్మడి కృష్ణాజిల్లా క్వాలిటీ కంట్రోల్ విభాగంలోని టూల్ కిట్లు మాయమైన ఘటనపై ఆంధ్రజ్యోతి ఎందుకిట్లు శీర్షికన ఇటీవల ప్రత్యేక కథనం ప్రచురించింది. ఈ కథనంపై స్పందించిన ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ గాయత్రి విచారణ కమిటీని నియమించారు. ఈ కమిటీ గురువారం విజయవాడ వచ్చి క్వాలిటీ కంట్రోల్ విభాగాన్ని పరిశీలించింది. తర్వాత పర్యవేక్షక ఇంజనీర్ కార్యాలయంలో లోతుగా విచారణ జరిపింది. ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ కార్యాలయం నుంచి డీఈ సత్యనారాయణ, క్వాలిటీ కంట్రోల్ డీఈ శ్రీనివాసరావు విచారణ బృందంలో ఉన్నారు. తొలుత క్వాలిటీ కంట్రోల్ విభాగానికి గతంలో ఉన్నతస్థాయిలో సరఫరా చేసిన టూల్‌కిట్స్ జాబితాను అధికారుల ముందుంచి వాటిని తమకు చూపాలని కోరింది. చాలా వరకు చూపలేకపోయారు. భారీ టూల్ కిట్ హెవీ కంప్రెసర్ టెస్టింగ్ మెషీన్‌ను చూపించలేకపోయారు. కొన్ని టూల్స్‌ను స్థానికంగా కొనుగోలు చేసి ఇవేనని చూపించారు. విచారణాధికారులు పట్టేశారు. ఈ టూల్‌కిట్స్ స్థానికంగా కొనుగోలు చేసినవని, సరఫరా చేసిన బ్యాచ్‌కు సరిపోవటం లేదని నిలదీసింది. దీంతో వారు తప్పును అంగీకరించారు. గతంలో పనిచేసిన డీఈఈలను రెండు రోజుల్లో వివరణ ఇవ్వాలని కమిటీ నిర్దేశించింది. 2020లో పనిచేసిన డీఈఈ ఒకరు క్వాలిటీ కంట్రోల్ విభాగానికే రాకపోవటంతో ఇదే అదనుగా కిందిస్థాయి ఉద్యోగులు దొంగతనం చేశారన్నది ప్రాథమికంగా విచారణ కమిటీ గుర్తించినట్టు తెలుస్తోంది. దొంగతనం చేసింది వేరే వారైనా బాధ్యతారాహిత్యం కారణంగా ఓ డీఈఈ వేతనం నుంచి టూల్ కిట్ల విలువను మినహాయించుకునేలా రిపోర్టులో ఉండే అవకాశం ఉంది.

ప్రకృతికి నచ్చేలా.. గణపతి మెచ్చేలా!

- 26న మట్టి ప్రతిమల తయారీలో ప్రపంచ రికార్డుకు సన్నద్ధం: కలెక్టర్

కలెక్టరేట్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాల్లో కాలుష్యానికి చెక్ పెట్టి, పర్యావరణ హితంగా పండగలు జరుపుకొనేలా ప్రజలను జాగృతం చేసేందుకు వినూత్న ఆలోచనలతో ముందుకెళ్తున్నామని, ఈసారి మట్టి ప్రతిమల తయారీతో ప్రపంచ రికార్డు నెలకొల్పేందుకు కృషి చేస్తున్నట్టు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం కలెక్టరేట్‌లో వివరించారు. కృత్రిమ రంగులు, రసాయనాలు, థర్మోకోల్ వంటి వాటి వినియోగంతో పర్యావరణానికి పెనుముప్పు ఏర్పడుతుందని, భావితరాలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించాలంటే పర్యావరణ హిత మార్గాలను అనుసరించాలన్నారు. యోగా ఔన్నత్యాన్ని చాటిచెప్పే క్రమంలో ప్రపంచ రికార్డు నెలకొల్పామని, లాగే చవితి ఉత్సవాల్లోనూ మట్టి ప్రతిమలను పూజించి ప్రకృతి శోభతో ఆధ్యాత్మిక వాతావరణంలో పండగను జరుపుకునేలా ప్రోత్సహించేందుకు కాలుష్య నియంత్రణ మండలి, విజయవాడ నగర పాలక సంస్థ, జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో ప్రపంచ రికార్డుకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. ఈనెల 26న ఒక నగరంలో అత్యధిక సంఖ్యలో మట్టి ప్రతిమలను తయారుచేసి రికార్డు నెలకొల్పనున్నట్లు వివరించారు. వివిధ పాఠశాలలతో పాటు ఐజీఎం మైదానంలో ఏర్పాట్లు చేస్తున్నామని, స్వచ్ఛంద సంస్థలు, అసోసియేషన్లను భాగస్వాములను చేస్తున్నట్టు వివరించారు. ప్రజలు కూడా మట్టి వినాయకులను తయారుచేసి ఫొటోలను 9154970454 నెంబరుకు వాట్సాప్ చేయాలని సూచించారు.

కోసూరులో నాలుగు దేవాలయాల్లో చోరీలు

- వెండి, బంగారు ఆభరణాలతోపాటు నగదు అపహరణ

కూచిపూడి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మొవ్వ మండలం కోసూరు గ్రామంలో బుధవారం అర్ధరాత్రి నాలుగు దేవాలయాల్లో గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగులకొట్టి చోరీలకు పాల్పడ్డారు. వెండి, బంగారు ఆభరణాలతో పాటు హుండీలు పగులకొట్టి నగదు అపహరించటం ఈ ప్రాంతంలో సంచలనం కలిగించింది. ఈ సంఘటనలతో గ్రామస్థులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక క్షత్రియ రామాలయంలో నాలుగు వెండి కిరీటాలు, మంగళసూత్రంతోపాటు హుండీ పగులకొట్టి నగదు అపహరించారు. అలాగే స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో ఐదు వెండి కిరీటాలు, మంగళసూత్రం, గంగానమ్మ, వినాయకుడి గుడిలో హుండీలు పగులకొట్టి నగదు అపహరించినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ, గ్రామస్థులు తెలిపారు. రూ.6 లక్షల విలువైన ఆభరణాలు అపహరించినట్లు తెలుసుకున్న పోలీసులు, క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ బృందాలు సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించాయి. ఇటీవల పెదపూడిలో రామాలయం, సాయిబాబా ఆలయంతో పాటు పెడసనగల్లు రోడ్డులోని గణపతి ఆలయంలోనూ చోరీలు జరిగాయి. వరుస చోరీలతో ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. పామర్రు సీఐ శుభాకర్, కూచిపూడి ఎస్ఐ కేవీఎస్ విశ్వనాథ్ సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు.



రామాలయం గేటు తాళాలు పగల కొట్టిన దొంగలు





పగలకొట్టిన హుండీ, చోరీకి గురైన స్వామివారి కిరీటాలు

నవ్య నివేదన

శుక్రవారం ● 22 ఆగస్టు 2025



పర్వదినం

ఎన్నో ఏళ్ళ నుంచి వినాయక చవితి రోజున మనం పూజ చేసుకొని, చివర్లో వ్రత కథలు వింటున్నాం. కానీ ఆ వ్రత కథలను సరిగ్గా అర్థం చేసుకోలేదేమో అనిపిస్తుంది. ఆ కథల్లో తెలుసుకోదగిన అంతరార్థాలు అనేకం ఉన్నాయి. ఆ విశేషాలన్నీ... లోతుగా పరిశీలించినప్పుడే తెలుస్తాయి.

గణేశ వ్రత కథ మర్మం ఇదీ!

గజుడు అనేవాడు ఒక రాక్షసుడు. అతను శివుడి కోసం తపస్సు చేశాడు. ఆ బేల శంకరుడు (అమాయకుడైన వాడు... బోళా శంకరుడు కాదు) ప్రత్యక్షమై... "ఏ వరం కావాలి?" అని అడిగాడు. అప్పుడు గజుడు తన రాక్షస బుద్ధితో "నువ్వు నా పొట్టలో లింగ రూపంలో ఉండిపోవాలి" అని కోరాడు. శివుడు సరేనని అలాగే ఉండిపోయాడు. పార్వతీదేవి తన భర్త జాడ గురించి విష్ణువును ఆశ్రయించింది. తన భర్తను తనకు ఇప్పించవలసిందిగా కోరింది. శ్రీహరి దేవతలందరినీ పిలిచి... తలొక వాద్యాన్నీ ఇచ్చాడు. ఒకరు వేణువు ఊదేవారుగా, మరొకరు మద్దెల మోగించేవారుగా, నందీశ్వరుణ్ణి నృత్యం చేసేవాడిగా... ఇలా వేషాలు వేయించాడు. గజుడు ఉండే నగరానికి వారిని తనతో పాటు తీసుకువెళ్ళి, నృత్య గీత వినోదాన్ని ప్రదర్శించాడు. గజుణ్ణి మెప్పించి... అతని ఉదరంలో ఉన్న శంకరుణ్ణి బయటకు తెచ్చుకున్నాడు. శంకరుడు కైలాసానికి వస్తూనే... తనను కైలాస ముఖద్వారం వద్ద నిరోధించిన వినాయకుడి శిరస్సును శూలంతో ఖండించాడు. దుఃఖించిన పార్వతికి ఆనందాన్ని కలిగిస్తూ... ఆ గజుడి శిరస్సుని తెచ్చి... శిరస్సు లేని వినాయకుడికి అతికించాడు. ఆ కారణంగా... వినాయకుడి శిరస్సు గజాసురుడి శిరస్సే అవుతోంది కదా! దానికే మనం పూజ చేస్తున్నాం!

ఎన్నెన్నో సందేహాలు...

ఊరికే కథ విని అక్షతలను తలపైన ధరించడం కాదు, కథలో విశేషాన్ని గమనించాలి. గజుడు రాక్షసుడు. అతను తపస్సు చేస్తే... దేవతా విరోధి అయిన అతనికి శివుడు ప్రత్యక్షం కావడం దేనికి? పోనీ ప్రత్యక్షమైనా... తన ఉదరంలో ఆత్మ లింగరూపంలో ఉండిపోవాలని ఆ రాక్షసుడు కోరినంత మాత్రాన... దానికి అంగీకరించడం దేనికి? 'లయం' అనే బాధ్యతను నిర్వర్తించేవాడు శివుడు. మరి ఆ బాధ్యతను మరెవరికైనా అప్పగించాలి కదా! భార్యకు కూడా ఒక్క మాట చెప్పకుండా... ఎంతకాలం గజుడి ఉదరంలో ఉండాలని కనీసం అడగనక్కరలేదా? తనకు లయం అనే బాధ్యతను అప్పగించిన ఆది పరాశక్తికైనా చెప్పి, అనుమతి పొందనక్కరలేదా? పైగా... లోకాలన్నిటినీ పరిపాలించే పార్వతీదేవికి తన భర్త జాడ తెలియలేదా? విష్ణువును ఆశ్రయించి ఆయనను ఇప్పించవలసిందిగా ఎందుకు కోరాలి? సరే... విష్ణువు సుదర్శన చక్రాన్ని పంపి ఉంటే... గజరాజు తల తెగి, శంకరుడు బయటకు రాగలిగేవాడు కదా! దేవతలందరితోనూ శ్రీహరి విచిత్ర వేషాలు వేయించడం ఏమిటి? వాళ్ళతో తనూ వెళ్ళడం ఏమిటి? నృత్యోత్సవం ఏమిటి? ఇలా ఆలోచించే కొద్దీ అసంబద్ధంగా అనిపించడం లేదూ? ఈ కథను తరచి తరచి చూస్తే... లోపలి విషయం అర్థమవుతుంది.

> గజాసురుడు మాత్రమే కాదు... మనం అందరం జనన మరణ చక్రంలో తిరుగాడుతూ ఉండే లక్షణం ఉన్నవారిమే. రాక్షసుడైన అతనికి... తన జీవిత లక్ష్యం ఏమిటనే పరివర్తన కలిగినట్టు... మనకు కూడా పుట్టడం, చావడం అనే చక్రంలో ఉండిపోకుండా... అంతకన్నా ఉన్నత స్థితి కలిగేలా ఆధ్యాత్మికంగా ఎదగాలనే భావన కలగాలి.

గజుడి తపశ్శక్తి...

ఆ రాక్షసుడి పేరు గజుడు కాదు గ-జుడు. 'గ' అంటే గతించడం. 'జ' అంటే జన్మించడం. చాలామంది చావడం, పుట్టడం అనే జనన మరణ చక్రంలో పడిపోతూ ఉంటే... ఇతనికి తన జన్మను శాశ్వతం చేసుకోవాలని, పునర్జన్మ లేకుండా చేసుకోవాలని ఆలోచన కలిగింది. దాంతో అతను శంకరుడి గురించి తపస్సు చేశాడు. శంకరుడు అతని తపశ్శక్తి స్థాయిని గమనించాడు. తాను ప్రత్యక్షం అయి తీరాల్సినంత తపస్సు చేశాడని గుర్తించాడు. ఆయన పరమ ధర్మమూర్తి కాబట్టి... ఆత్మ లింగ రూపంలో తన ఉదరంలో ఉండాలని గజుడు కోరగానే... అతని తపశ్శక్తి స్థాయి కారణంగా... తప్పనిసరి పరిస్థితుల్లో గజుడి ఉదరంలో ఉండిపోయాడు. శంకరుడు లింగరూపంలో తన ఉదరంలో ఉండిపోగానే... ఆ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనుకున్న గజుడు నిత్యం రుద్రాభిషేకాన్ని, మంత్ర సాధనను మరింత తీవ్ర నిష్ఠతో కొనసాగించాడు. పార్వతీదేవి ప్రార్థన మేరకు... 'శంకరుడు ఎక్కడ ఉన్నాడా?' అని శ్రీహరి దివ్య దృష్టితో గమనించి నివ్వెరపోయాడు. గజుడిది తాను సుదర్శనాన్ని పంపినా తల తెగిపడనంత తపశ్శక్తి అని తెలుసుకున్నాడు. అంతే కాదు... అంతకుముందు శంకరుణ్ణి మాత్రమే దర్శించగలిగే తపశ్శక్తి కాస్తా... శంకరుడు అతని ఉదరంలో ఉన్న సమయంలో చేసిన రుద్రాభిషేక, మంత్ర సాధనల కారణంగా దేవతలందరినీ దర్శించగలిగే స్థాయికి పెరిగిందని శ్రీహరి గ్రహించాడు. అందుకే దేవతలందరినీ వాద్యకారుల్ని చేశాడు. జన్మలక్షణం ప్రకారం గజుడు అహంకారి. తమోగుణం ఉండేవాడు. కాబట్టి అతణ్ణి ఎదిరించి, భయపెట్టడం వల్ల ప్రయోజనం ఉండదని, అతణ్ణి ఆనందపరచి, ఆ ఆనంద సమయంలో శంకరుణ్ణి బయటకు రప్పించాలని ప్రణాళిక వేశాడు. దేవతలందరూ అత్యద్భుతంగా నృత్య గీత వాద్య వినోదాల్ని ప్రదర్శించగానే... ఆ ఆనందంలో ఒళ్ళు మరచిన గజుడు ఏ వరం కావాలని అడిగాడు. విష్ణువు కోరాడు. ఆ తరువాత నందీశ్వరుడు తన కొమ్ములతో గజుడి ఉదరాన్ని చీల్చి... శంకరుణ్ణి బయటకు తెచ్చి, తన మీద ఎక్కించుకున్నాడు, కైలాసానికి చేర్చాడు. చివరకు గజుని తల వినాయకుడి ముఖం (గజముఖం) అయింది.

ఆ భావన కలగాలి...


శ్రీహరిని పార్వతి ఆశ్రయించడానికి కారణం... సృష్టి స్థితి లయాలనే మూడిటిలో స్థితి (దేవతా సమూహానికి ఏదైనా రక్షణ) విషయంలో ఇబ్బంది ఏర్పడితే... ఆశ్రయించాల్సింది శ్రీహరినే కాబట్టి! ఇక... కార్యాలయాల్లో అహంకారి, నిరంకుశుడు, పెద్దలతో బాగా పరిచయాలు ఉన్నవాడు మనకు అధికారిగా (అధిక=గొప్ప, అరి= శత్రువులా ప్రతిదానికీ 'కాదు, కూడదు, కుదరదు' అంటూ ఉండేవాడు) ఉంటే అతణ్ణి తోవలోకి తెచ్చుకొనే విధానాన్ని ఈ కథ చెబుతోంది. అతణ్ణి ఎదిరించి, బెదిరిస్తూ, లేఖలను పంపి, పై అధికారులకు చెప్పి ఏమాత్రమూ తోవలోకి తెచ్చుకోలేమట! అతణ్ణి విపరీతంగా ఆనందించేలా పొగిడి లేదా ఉబ్బిపోయేలా చేసి మాత్రమే కార్యసాధన చేసుకోగలమట! ఈ కథలో ఉన్న మరో అంతరార్థం ఇది. గజుడి తపశ్శక్తి ఎంతటిదంటే... తన ఉదరంలో ఉన్న శివలింగాన్ని ఆరాధిస్తున్న కారణంగా... గజాసురపురంలో ఉన్నవారందరికీ శివదర్శనంతో పాటు సర్వదేవతా దర్శనాన్ని కూడా చేయించగలిగాడు. కానీ అందరు దేవతల దర్శనం అయినప్పటికీ... అమ్మవారి దర్శనం మాత్రం అతనికి కాలేదు. ఎందుకంటే... శివారాధన వల్ల శివుడు వశుడు కావచ్చు, శ్రీహరితో సహా మొత్తం దేవతాగణం లొంగిపోవచ్చు. కానీ పార్వతీదేవి దర్శనానికి ఆ మాత్రపు తపస్సు సరిపోదు. ఎంతో చిక్కగా ఉండే చక్కటి కథ ఇది. వినాయకునికి నవరాత్రుల పేరిట ఉత్సవాలు చేస్తూ... తొమ్మిదిరోజుల పాటు తొమ్మిది రహస్యాలు తెలుసుకోవాలనేది పెద్దల మాట.

● డాక్టర్ మైలవరపు శ్రీనివాసరావు, 9866700425

సహజయోగ

హిందూ ధర్మంలో గణేశుడికి మహోన్నతమైన స్థానం ఉంది. ప్రతి శుభకార్యం ఆయన ప్రార్థనతో ప్రారంభమవుతుంది. ఎందుకంటే ఆయనే ప్రారంభకర్త, జీవితంలోని అన్ని దశల్లో విఘ్నాలను తొలగించేవాడు. భౌతిక, మానసిక, జ్ఞాన సంబంధమైన ఆటంకాలను తొలగించే శక్తి. ఆయన అనుగ్రహంతో బుద్ధిని, వికాసాన్ని, సరైన మార్గదర్శనాన్ని పొందగలుగుతాం.

అంతటా ఆయనే!



మనలో ఉండే ఏడుచక్రాలలో మొట్టమొదటి శక్తి కేంద్రం... మూలాధార చక్రం. అదే గణేశుడి నివాస స్థానం. ఆ చక్రానికి ఆయన అధిష్ఠాన దేవత. ఆయ చక్రం పృధ్వీతత్త్వంతో రూపొంది ఉంటుంది. గణేశుణ్ణి కూడా ఆయన తల్లి అయిన గౌరీమాత భూతత్త్వంతోనే తయారు చేసింది. మన షట్ చక్రాలలోనూ గణేశ తత్త్వం నిండి ఉంటుంది. అంటే అంతటా ఆయనే. మూలాధార చక్రంలో ఉండే ఆయన మనల్ని సదా రక్షిస్తూ ఉంటాడు. ఆత్మసాక్షాత్కారాన్ని పొందడానికి మూలమైన కుండలినీ శక్తి మేలుకొని.. ఊర్ధ్వముఖంగా పయనిస్తున్నప్పుడు... ఆ శక్తిని సదా కాపాడేది ఆయన. ఆయన ప్రమేయం లేకుండా కుండలినీ శక్తి జాగృతం కాదు. అది జాగృతం కాకపోతే మనకు ఆత్మసాక్షాత్కారం అసాధ్యం. కుండలినీ మాతయే గణేశుని తల్లి అయిన గౌరీమాతగా... మన మూలాధారంలో మూడున్నర చుట్లతో నిద్రాణ స్థితిలో ఉంటుంది. వినాయకుణ్ణి ప్రసన్నం చేసుకోవాలంటే... ఆయన గుణగణాలు, లక్షణాలు, శక్తులు మనలో స్థిరపరుచుకోవాలి.

అవి నేర్చుకోవాలి...

గణేశునిలో ప్రప్రథమంగా చెప్పుకోవలసిన ముఖ్యమైన గుణం... అమాయకత్వం. దాన్నే ఆధ్యాత్మికంగా 'అబోధిత తత్త్వం' అంటారు. అది మనలో ఉంటే... మనల్ని ఎవరూ మోసం చేయలేరు. ఎవరూ హాని కలిగించలేరు. అటువంటి అమాయకత్వాన్ని మనలో స్థిరపరుచుకుంటే ఎలాంటి సమస్యలనైనా సునాయాసంగా పరిష్కరించుకోగలుగుతాం. ప్రజల దృష్టిలో అమాయకత్వం అంటే చేతకానితనం. అమాయకత్వంతో ఉంటే ఇతరుల చేతిలో మోసపోతామనే అపోహ వారిలో ఉంటుంది. కానీ వాస్తవానికి అమాయకత్వం అంటే విచక్షణ, వివేకంతో కూడిన గణేశుని శక్తి. ఆ లక్షణం ఉన్నవారికి సదా గణేశుని రక్షణ ఉంటుంది. ఇక... ఆయన శరీరం మానవుల మాదిరిగా ఉన్నప్పటికీ... శిరస్సు ఏనుగు శిరస్సు. ఏనుగు జంతు ప్రపంచంలో అత్యంత తెలివైనది. దాని చెవులు ఎంత దూరంలోని శబ్దాన్నైనా వినగలవు, కళ్ళు చాలా దూరం చూడగలవు. నైపుణ్యం, నేర్పరితనం గణేశుని గుణాలు. ఆయన వివేకాన్ని, విచక్షణను అనుగ్రహిస్తాడు. ఆయన ఎంత మహోన్నతుడో అంత సూక్ష్మరూపుడు. పెద్ద పొట్టతో ఉన్నప్పటికీ ఎంతో తేలికగా ఉంటాడు. అందుకే అతి చిన్నదైన ఎలుక మీద కూర్చోగలుగుతాడు. ఆయన నిరాండబరతకు చిహ్నమే ఎలుక వాహనం. ఆయనకు ఉన్న గుణగణాలలో మరొకటి... తల్లిపట్ల శరణాగతి. ఎల్లప్పుడూ తల్లిని ప్రసన్నం చేసుకొనే ప్రయత్నంలో ఉంటాడు. అతనిలోని సమస్త జ్ఞానానికి, ఆనందానికి ఆ తల్లే మూలం. తల్లి పట్ల ఉండవలసిన వినయవిధేయతలు, గౌరవం ఆయన నుంచి నేర్చుకోవాలి.

ఆ శక్తిని పెంపొందించుకుందాం...

మనలో గణేశతత్త్వాన్ని సంరక్షించుకొని, అంతర్గతంగా మనల్ని మనం పరిశుద్ధంగా, కల్మషరహితంగా ఉంచుకోవాలి. తోటివారితో నిర్మలమైన సత్సంబంధాలు అభివృద్ధి చేసుకుంటే ఎలాంటి సమస్యలూ రావు. గణేశుడు బ్రహ్మాండాన్ని పవిత్రపరిచే శక్తి కలిగినవాడు. ఆ శక్తి దేనివల్లా మలినం కాదు. మీలో గణేశ శక్తిని పెంపొందించుకుంటే మీ కళ్ళు ప్రకాశిస్తూ ఉంటాయి. సచ్ఛీలమే ప్రధాన లక్షణంగా ఉన్నవారిని ఆయన ఎంతగానో ఇష్టపడతాడు. భూమాతకు ఉన్న అయస్కాంత శక్తి ఆయనలో ఉంది. ఆ శక్తితోనే అందరినీ తనవైపు ఆయన ఆకర్షిస్తాడు. మనలో అంతర్గతంగా ఉన్న గణేశ శక్తిని, తత్త్వాన్ని మేలుకొలిపాలి. తద్వారా ఆయన గుణగణాలు మనలో వాటంతట అవే స్థిరపడతాయి. అప్పుడు మనం ఆయన కృపకు పాత్రులం అవుతాం. మనలో ఉన్న నిద్రాణ స్థితిలో ఉన్న కుండలినీ శక్తిని జాగృతం చేసి... ఆత్మసాక్షాత్కారం పొంది, సహజయోగ సాధన ద్వారా శ్రీగణేశ తత్త్వాన్ని, గుణగణాలను మనలో స్థిరపరచుకోవచ్చు.



డాక్టర్ పి. రాకేష్, 8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ

దైవమార్గం

ఏలియా ప్రవక్త



దేవునికి, మానవులకు మధ్యవర్తిత్వం జరిపిన ప్రవక్తలు బైబిల్‌లో దర్శనమిస్తారు. వారు ఎప్పటికప్పుడు కొన్ని హెచ్చరికలు చేస్తూ, దైవభీతిని కలిగిస్తూ, సమాజాన్ని వెలుతురు వైపు నడిపించే వ్యక్తులుగా కనిపిస్తారు. వారిలో ఏలియా ఒకరు. అది ఇశ్రాయేలీయ దైవభూమి. క్రీస్తుపూర్వం 900 ముందటికాలం అది. అక్కడ మూఢనమ్మకం బాగా పెరిగిపోయింది. ప్రజలలో దురాచారాలు పెరిగిపోయాయి. అంతటా అంధకారం అలముకుంది. రాజును, ప్రజలను అప్రమత్తం చేయడం కోసం ఏలియా ప్రవక్తను దేవుడు ఈ భూమిపైకి పంపించాడు. ఏలియా ప్రవక్త తిష్బీయుడు... అంటే తిష్బీ ప్రాంతం వాడు. గిలాదు కుటుంబానికి చెందినవాడు. దైవభక్తుడు. ఆ ఆహాబు రాజ్యంలో పాపం పెరిగింది కాబట్టి మంచు కానీ, వర్షం కానీ పడదని ఏలియా స్వయంగా రాజు కోటకు వెళ్ళి ప్రకటించాడు. ఆ విధంగానే మంచు కురవలేదు.

తరువాత... కార్మేల్ పర్వతం దగ్గర ప్రజలను, ఉభయ మతాల ప్రవక్తలను ఏలియా సమావేశపరచాడు. ఏ దేవుని ద్వారా అగ్ని దిగివచ్చి, కొండ పీఠం మీద నిలబెట్టిన ఎద్దును దహనం చేసే అద్భుతాన్ని నిర్వహిస్తుందో... ఆ దేవుడే నిజమైన దేవుడనీ, ఆ దేవుణ్ణే అందరూ ఆరాధించాలని వారందరూ ఏకగ్రీవంగా ఒక అంగీకారానికి వస్తారు. వారి బైలు దేవత నుంచి ఎలాంటి స్పందనా రాదు. యెహోవాను ఏలియా ప్రవక్త ప్రార్థిస్తాడు. అగ్ని దిగివస్తుంది. ఎద్దును దహించేస్తుంది. బైలు దేవతను నమ్మినవారు అవమానితులయ్యారు. వధకు గురయ్యారు. ఆహాబు రాజు భార్య ఎజిబేలు పంతం ఓటమి పాలైంది. ఆమెకు ఏలియాపై కక్ష పెరిగింది. దుష్టపాలకుడైన ఆహాబు కుక్క చావు చస్తాడని, ఆయనను దుర్మార్గాల వైపు నడిపించిన అతని భార్యకు కూడా అదే దుస్థితి దాపురిస్తుందనీ ఏలియా సూచన చేసినట్టే... వారు కుక్కల చేతిలో మరణిస్తారు. ఏలియా ఎన్నో కష్టాలను ఎదుర్కొని... దేవుని పట్ల, దేవుని మాట పట్ల గొప్ప విధేయతను ప్రకటించడం వల్ల... అతని వృద్ధాప్యంలో ఒక రథాన్ని దేవుడు పంపించాడని, ఆ మహా ప్రవక్తను సశరీరుడిగా మోక్ష పథానికి తీసుకువెళ్ళాడని బైబిల్ చెబుతోంది.

● డాక్టర్ యం. సోహినీ బెర్నార్డ్, 9866755024

స్థపతి... స్థాపత్య వేదం

తెలుసుకుందాం



'దేవాలయం వినాయత్ర ఏకకాలం నవాసయేత్'.. దేవాలయం లేని చోట ఒక్క క్షణం కూడా ఉండకూడదని 'కారణాగమం' చెబుతోంది. కాబట్టి అలాంటి ఆలయాలను, అందులోని విగ్రహాలను నిర్మించడానికి సాక్షాత్తూ భగవంతుడే మహర్షులకు శిల్పశాస్త్రాన్ని ఉపదేశించాడు. కాగా పరమశివుడు కాశ్యపునికి శిల్పశాస్త్రాన్ని ఉపదేశించాడని 'కాశ్యప శిల్పశాస్త్రం' చెబుతోంది. ఈ శిల్పశాస్త్రాలను కలిపి 'స్థాపత్యవేదం' అని అంటారు. ఆలయాల నిర్మాణం గురించి తెలిపిన ఆ భగవంతుడే ఆలయాలలోని అర్చనా విధానాలను, ఉత్సవ విధానాలను తెలిపే ఆగమశాస్త్రాలను అనుగ్రహించాడు. పరమేశ్వరునిద్వారా శివాగమాలు, మహావిష్ణువు ద్వారా వైష్ణవాగమాలు, శక్తినుంచి శాక్త్యాగమాల బోధన జరిగింది. ఈ స్థాపత్య వేదాన్ని అభ్యసించినవారినే 'స్థపతి' అంటారు.

నలుగురు ముఖ్యులు...

దేవాలయాలను శిల్ప శాస్త్ర ప్రకారంగా స్థపతి ద్వారా నిర్మించాలి. ప్రజలందరూ పూజించే దేవుని విగ్రహాలు, ఆలయాలతో పాటు గ్రామాలను, నగరాలను కోటలను... వీటన్నిటినీ నిర్మించడానికి విశ్వకర్మ జన్మించాడు. సృష్టి ప్రారంభం నుంచి నేటి దాకా ప్రతి నిర్మాణానికి విశ్వకర్మ ఆశీస్సులు ఉన్నాయి. ఇంద్రుని అమరావతి పట్టణం, శ్రీకృష్ణుని ద్వారకాపట్టణం లాంటివి ఎన్నో ఆయన సృష్టించాడు. ఆయనకు మను, మయ, త్వష్ట, శిల్పి, విశ్వజ్ఞ అనే అయిదుగురు కుమారులు ఉన్నారు. కమ్మరం (ఇనుప పని), వడ్రంగం, లోహపు పని (కంచరం), శిల్పం (శిలా విగ్రహాలు నిర్మించడం), స్వర్ణం (బంగారు ఆభరణాలు తయారు చేసే పని) అనే అయిదు పనులను వారికి ఆయన అప్పగించాడు. వారిలో నాలుగో కుమారుడైన శిల్పికి శిలావృత్తిని అప్పగించి... ప్రపంచంలో సుందరమైన ఆలయాలను, విగ్రహాలను నిర్మించడం ద్వారా ప్రజలను భక్తిభావం వైపు నడిపించాలని ఆదేశించాడు. ఈ శిల్పులలో నాలుగు రకాలైన వారు ఉన్నారు. వారు స్థపతి, వర్ధకి, తక్షకుడు, సూత్రగ్రాహి.

స్థపతి: స్థపతి అంటే 'స్థాపన చేయడంలో నేర్పరి ' అని అర్థం. అతను సర్వ శాస్త్ర విశారదుడిగా, వేదాధ్యాయన పరుడిగా ఉండాలని, అన్ని శిల్ప శాస్త్రాలను ఆపోశన పట్టి ఉండాలని, వాస్తు విద్యా సముద్రాన్ని ఆకళింపు చేసుకోవాలని శాస్త్రాలు చెబుతున్నాయి. అంతేకాకుండా అతను వాస్తు, జ్యోతిషం, తత్త్వశాస్త్రం, ఖగోళ శాస్త్రం తదితర 64 కళలలో ప్రవీణుడై ఉండాలని, తన వృత్తి పట్ల మిక్కిలి శ్రద్ధ కలిగి, శీలవంతుడై, ఇతరుల పట్ల ద్వేషభావం, అసూయ లేకుండా ధార్మిక బుద్ధి కలిగినవాడై ఉండాలని' విశ్వకర్మీయం' అనే ప్రాచీన శిల్ప శాస్త్ర గ్రంథం స్పష్టం చేసింది.

వర్ధకి: ఇతను స్థపతి కుమారుడు కానీ, శిష్యుడు కానీ అయి ఉండాలి. శాంతచిత్తుడై, యంత్రకళలో ప్రవీణుడై ఉండాలి. విగ్రహ నైపుణ్యాన్ని వృద్ధి చేసేవాడు కనుక 'వర్ధకి' అని పిలుస్తారు.

తక్షకుడు: ఇతను చెక్కడంలో నేర్పరి. స్థపతి చెప్పిన పనులను తు.చ. తప్పకుండా నెరవేర్చేవాడు. ఇతనికి రేఖాశాస్త్రంలో నేర్పు ఉండాలి.

సూత్రగ్రాహి: ఇతను సూత్రాలతో విగ్రహాల కొలతలు నిర్ణయించేవాడు. ఇతను కూడా స్థపతి ఆజ్ఞాబద్ధుడే. ఇతను గణితంలో ప్రవీణుడై ఉండాలి.

ఇలా నాలుగురకాలైన వీరిని 'విశ్వకర్మలు' అని పిలుస్తారని 'మయమతం' చెబుతోంది. వీరు లేకుండా దేవాలయ నిర్మాణం కానీ, మరే ఇతర పుణ్యకార్యం కానీ జరగదు.

● దగ్గుపాటి నాగవరప్రసాద్ స్థపతి 9440525788

సందేశం

ముందే మేలుకోవాలి



పూర్వం మక్కా పట్టణం దగ్గర ఒక చిన్న గ్రామంలో ఇబ్రహీం అనే యువకుడు వృద్ధురాలైన తన తల్లితో కలిసి ఉండేవాడు. చిన్నప్పుడే అతని తండ్రి మరణించాడు. తల్లి ఫాతిమా ఎంతో కష్టపడి అతణ్ణి పెంచింది. వయసు మీదపడ్డాక... ఆమె చూపు మందగించింది. శరీరం బలహీనమైపోయింది. ఇబ్రహీం రోజూ నమాజ్ చేసేవాడు, మంచి పనులు చేసేవాడు. కానీ తల్లి విషయంలో కొంత అసహనంగా ఉండేవాడు. ఆమె చెప్పినమాట సరిగ్గా వినేవాడు కాదు.

ఒకసారి ఇబ్రహీం తన స్నేహితుడితో మాట్లాడుతూ "నా తల్లి ఎప్పుడూ మంచంలోనే ఉంటుంది. నీరు కావాలని, పాలు కావాలని, అన్నం కావాలని... ఇలా ఏదో ఒకటి అడుగుతూనే ఉంటుంది. రాత్రంతా దగ్గుతుంది. దానివల్ల నాకు నిద్ర సరిగ్గా పట్టడం లేదు" అన్నాడు. అప్పుడు ఆ స్నేహితుడు 'తల్లి పాదాల కింద స్వర్గం ఉంది' అనే అంతిమ దైవప్రవక్త మహమ్మద్ ఉపదేశాన్ని గుర్తు చేస్తూ "నువ్వు ఎన్ని నమాజులు చేసినా, దివ్య ఖుర్‌ఆన్ ఎన్నిసార్లు పఠించినా, దానధర్మాలు చేసినా, ఉపవాసాలు పాటించినా, హజ్ యాత్ర చేసినా, ఉమ్రా యాత్ర చేసినా... అవన్నీ వృథా. కన్న తల్లిని సరిగ్గా పట్టించుకోని వ్యక్తిని చూసి అల్లాహ్ ముఖం తిప్పుకుంటాడు. అతనికి పరలోకంలో కఠినమైన శిక్ష సిద్ధంగా ఉంటుంది" అని హెచ్చరించాడు.

ఇబ్రహీం భయంతో వణికిపోయాడు. తల్లిపట్ల తన ప్రవర్తనకు సిగ్గుపడ్డాడు. తన తప్పును తెలుసుకున్నాడు. వెంటనే తల్లి దగ్గరకు వెళ్ళి, తనను క్షమించాలని కోరాడు. సంతోషంతో... అతని శ్రేయస్సుకోసం అల్లాహ్‌ను ఆమె ప్రార్థించింది. ఆ రాత్రి ఇబ్రహీంకు కలలో ఒక మత గురువు కనిపించి... "ఈ ఏడాదే నీ తల్లితో కలిసి హజ్ యాత్ర చెయ్యి" అని ఆదేశించాడు. ఆ ప్రకారం... తన భుజాలపై తల్లిని కూర్చోబెట్టుకొని... హజ్ యాత్రకు ఇబ్రహీం బయలుదేరాడు. దారంతా ఆమెకు సేవలు చేశాడు. ఆరాధనలు పూర్తి చేసి, ఆమెను మోసుకుంటూ ఇంటికి చేరుకున్నాడు.

మరునాడు తల్లికి పాలు అందించడానికి వెళ్ళిన ఇబ్రహీం ఆమెను తట్టి లేపాడు. కానీ అప్పటికే ఆమె ఇహలోకం వదిలి వెళ్ళిపోయింది. ఇబ్రహీం భోరున విలపించాడు. 'కొన్నాళ్ళ క్రితం వరకూ తను ఆమె పట్ల ప్రవర్తించిన తీరునే చివరి రోజుల్లో కూడా కొనసాగించి, ఆమెను హజ్ యాత్రకు తీసుకువెళ్ళకపోతే... ఎంతో పాపం మూటగట్టుకొనేవాడినో' అనుకున్నాడు. ఆఖరి రోజుల్లో ఆమెకు సంతృప్తి కలిగించాలనే జ్ఞానాన్ని ప్రసాదించినందుకు అల్లాహ్‌కు, తన స్నేహితుడికి కృతజ్ఞతలు తెలుపుకొన్నాడు.

"మానవుడు తన తల్లితండ్రుల హక్కును గుర్తించాలని స్వయంగా అతనికి నిర్దేశించాం. తల్లితండ్రులతో మంచిగా వ్యవహరించాలి. వారిద్దరూ లేదా వారిలో ఒకరు వృద్ధులై ఉంటే వారిని విసుక్కోవద్దు. వారితో మర్యాదగా మాట్లాడండి. మృదుత్వం, దయాభావం కలిగి ఉండండి, వారి ముందు వినమ్రులై ఉండండి" అని దివ్య ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ స్పష్టం చేశాడు. కాబట్టి ఆలస్యం కాకముందే మేలుకోవాలి.

● మహమ్మద్ వహీదుద్దీన్

గీతాసారం

వ్యక్తావ్యక్తాలు



ప్రాథమిక విద్యను అభ్యసించే వారి నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదివేవారి వరకూ ఆత్మజ్ఞానం కోసం అధ్యయనం చేయాల్సిన శాశ్వతమైన పాఠ్యపుస్తకం... భగవద్గీత. దాన్ని మొదటిసారి చదివినప్పుడు చాలా తక్కువ అంశాలు అర్థమవుతాయి. కానీ 'వ్యక్తం', 'అవ్యక్తం' అనే దృష్టికోణం నుంచి సులభంగా అర్థం చేసుకోవచ్చు.

మన ఇంద్రియాల పరిధిలోకి వచ్చేవి వ్యక్తమైనవి, ఇంద్రియాలకు అతీతమైనవి అవ్యక్తమైనవి. 'బిగ్ బ్యాంగ్' (బృహత్ ప్రళయం) మొదలు నక్షత్రాల పుట్టుక, ఆ నక్షత్రాల్లోని కీలకమైన భాగాల్లో అత్యున్నత రసాయనిక మూలకాలు కలిగిన అణువుల నిర్మాణం, నక్షత్రాలు విచ్ఛిత్తికి గురైనప్పుడు ఆ మూలకాలు చెల్లాచెదురు అయ్యే తీరు, గ్రహమండలం ఏర్పాటు, భూమి మీద బౌద్ధిక జీవితం ఆరంభం లాంటి అనేక అంశాలను వ్యక్తమయ్యే వాటి కథలు వివరిస్తాయి. ఈ వ్యక్తమైన జీవరూపాలు, గ్రహాలు, నక్షత్రాలు, చివరకు ఈ విశ్వం కూడా ఒక నిర్దిష్టమైన కాలపరిమితిని కలిగి ఉన్నాయనేది శాస్త్రీయ సమాజం అంగీకరించిన సంగతే. అయితే అంచనా వేసిన కాల పరిమితుల్లో తేడా రావచ్చు. వ్యక్తమయ్యే వాటి దృక్కోణంలో మనం పుట్టినప్పటి నుంచి మరణించేవరకూ మనుగడ కలిగి ఉంటామనేది వాస్తవం.

అవ్యక్తమైన వాటి దృక్కోణంలో చూసినట్టయితే... భగవద్గీత చెప్పిన ప్రకారం... మనం పుట్టుకకు ముందు, మరణం తరువాత కూడా మనుగడ కలిగి ఉంటాం. ఈ స్పష్టతను దృష్టిలో ఉంచుకున్నట్టయితే... 'భగవద్గీత'లో వివరించినట్టు మనం వ్యక్తం, అవ్యక్తాల అనుబంధాన్ని సులభంగా అర్థం చేసుకోగలుగుతాం. అవ్యక్తమైన లక్ష్యాన్ని (మోక్షాన్ని) గుర్తించి, దాన్ని పొందగలుగుతాం. కానీ అహంకారం ఈ మార్గంలో ప్రయాణానికి అవరోధంగా ఉంటుంది. అయితే బయటి ప్రపంచంలోని సుఖదుఃఖాలకు అతీతంగా, మనలో నిండి ఉన్న ఆనందమే.. అవ్యక్తమైన అంతరాత్మ వైపు సాగే ప్రయాణంలో మనం సాధించిన పురోగతికి సూచిక.



కె.శివప్రసాద్

బిజినెస్

విజయవాడ ● శుక్రవారం 22 ఆగస్టు 2025

ప్రీ-ఐపీఓ ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్

- ప్రవేశపెట్టే ఆలోచనలో సెబీ
- ఐపీఓ షేర్ల కేటాయింపు, లిస్టింగ్‌కు మధ్య 3 రోజుల్లో ట్రేడింగ్‌కు చాన్స్
- గ్రే మార్కెట్ కార్యకలాపాలకు చెక్



ముంబై: కంపెనీల పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) ప్రక్రియల్లో అనధికారిక లేదా అనియంత్రిత (గ్రే మార్కెట్) కార్యకలాపాలకు చెక్ పెట్టేందుకు క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రీ-ఐపీఓ షేర్ ట్రేడింగ్ కోసం నియంత్రిత ప్లాట్‌ఫామ్‌ను ప్రవేశపెట్టే ఆలోచనలో ఉన్నట్లు సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే సంకేతాలిచ్చారు. ఫిక్కీ ఆధ్వర్యంలో గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. ఐపీఓ షేర్ల కేటాయింపు, లిస్టింగ్‌కు మధ్య మూడు రోజుల సమయంలో నియంత్రిత వాతావరణంలో కంపెనీ షేర్లలో ట్రేడింగ్ నెరిపేందుకు ఈ కొత్త ప్లాట్‌ఫామ్ వీలు కల్పించనుంది. ప్రస్తుతం ఈ మూడు రోజుల సమయంలో జరిగే గ్రే మార్కెట్ లావాదేవీలను కొత్త వేదిక భర్తీ చేయనుంది.

"ఏదైనా కంపెనీ స్టాక్ మార్కెట్లో షేర్లను నమోదు చేసే ముందు వెల్లడించిన సమాచారం ఆ కంపెనీలో పెట్టుబడులపై నిర్ణయం తీసుకునేందుకు సరిపోదు. క్యాపిటల్ మార్కెట్‌ను మరింత విస్తృతం చేయడంతో పాటు ఇన్వెస్టర్ల ప్రయోజనాలను రక్షించేందుకు ప్రీ-ఐపీఓ షేర్ ట్రేడింగ్‌కు నియంత్రిత వేదికను పైలట్ పద్ధతిన ప్రవేశపెట్టాలనుకుంటున్నాం. ప్రీ-ఐపీఓ కంపెనీలు నిర్దేశిత సమాచారం వెల్లడించడం ద్వారా ఈ ప్లాట్‌ఫామ్‌లో షేర్ల ట్రేడింగ్ అవకాశాన్ని ఎంచుకోవచ్చ"ని పాండే అన్నారు. ఈ ప్లాట్‌ఫామ్ అందుబాటులోకి వస్తే అనియంత్రిత వేదికలపై అన్ లిస్టెడ్ షేర్ల ట్రేడింగ్‌కు అడ్డుకట్ట పడనుందన్నారు. ప్రస్తుతం ఏదైనా కంపెనీ ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ గడువు ముగిసిన తర్వాత స్టాక్ ఎక్స్ఛేంజీల్లో షేర్ల నమోదుకు కనీసం 3 రోజులు పడుతుంది. ఈ సమయంలో గ్రే మార్కెట్‌లో ఆ కంపెనీ షేర్ల అనధికారిక ట్రేడింగ్ జరుగుతోంది. ఇందులో నష్ట అవకాశాలున్నప్పటికీ, ఇన్వెస్టర్లు ప్రీ-లిస్టింగ్ షేర్లను చేజిక్కించుకునేందుకు ఎగబడుతున్న నేపథ్యంలో సెబీ ఇందుకోసం నియంత్రిత వేదికను అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తోంది.

ఈక్విటీ డెరివేటివ్‌ల గడువు పెంపు

ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్ అండ్ ఓ) ట్రేడింగ్‌లో చిన్న మదుపరుల పాత్రను తగ్గించేందుకు సెబీ మరో చర్య చేపట్టబోతోంది. హెడ్జింగ్ అవసరాలకు, దీర్ఘకాలిక పెట్టుబడుల రక్షణకు మాత్రమే ఉపయోగపడేలా ఈక్విటీ డెరివేటివ్ కాంట్రాక్టుల కాలపరిమితిని క్రమపద్ధతిలో పెంచాలనుకుంటున్నట్లు సెబీ చైర్మన్ పాండే ఫిక్కీ సదస్సులో తెలిపారు. "దీర్ఘకాలిక సాధనాల ద్వారా డెరివేటివ్‌ల నాణ్యతను పెంచుతూనే క్యాష్ ఈక్విటీ మార్కెట్‌ను మరింత విస్తృతం చేసేందుకు సెబీ మార్గాలను అన్వేషిస్తోంది. డెరివేటివ్ సాధనాల గడువు పెంపుపై మార్కెట్ సంబంధిత వర్గాలతో సంప్రదింపులు జరపనున్న"ట్లు పాండే చెప్పారు.

కార్వీ ఇన్వెస్టర్ల క్లెయిమ్‌లకు డిసెంబరు వరకు గడువు

ముంబై: కార్వీ స్టాక్ బ్రోకింగ్ లిమిటెడ్ (కేఎస్‌బీఎల్) చేతుల్లో మోసపోయిన ఇన్వెస్టర్లు తమ సొమ్మును క్లెయిమ్ చేసుకునేందుకు గడువును డిసెంబరు 31 వరకు పొడిగిస్తున్నట్లు మార్కెట్ల నియంత్రణ మండలి సెబీ గురువారం తెలిపింది. గతంలో ప్రకటించిన గడువు ఈ జూన్ 2 తోనే ముగిసింది. 2020 నవంబరు 23న నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ కార్వీని డిఫాల్టర్‌గా ప్రకటించింది. సొమ్ము క్లెయిమ్ చేసుకునేందుకు ఇన్వెస్టర్లు 1800 266 0050 టోల్‌ఫ్రీ నంబరుకు కాల్ చేయడం లేదా defaultisc@nse.co.in కు మెయిల్ చేయడం ద్వారా ఎన్ఎస్ఈని సంప్రదించవచ్చని పేర్కొంది. ఇన్వెస్టర్ల నిధులను దుర్వినియోగం చేసినందుకు గాను కేఎస్‌బీఎల్ చైర్మన్, ఎండీ పార్థసారధిని సెక్యూరిటీస్ మార్కెట్ నుంచి 7 ఏళ్ల పాటు నిషేధించడంతో పాటు ఆయనపై రూ.21 కోట్ల జరిమానా విధిస్తూ సెబీ 2023 ఏప్రిల్‌లో ఆదేశాలు జారీ చేసింది.

'బీఎఫ్ఎస్ఐ'లో కొలువుల జోరు

2030 నాటికి అదనంగా 2.5 లక్షల ఉద్యోగాలు

ముంబై: ప్రస్తుతం ఐటీ రంగం అంత ఆకర్షణీయంగా లేకపోయినా బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా (బీఎఫ్ఎస్ఐ) కంపెనీల్లో మాత్రం నియామకాలు జోరందుకున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలలతో పోలిస్తే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల్లో ఈ కంపెనీల నియామకాలు 27 శాతం పెరిగాయి. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరంలో ఈ కంపెనీల్లో నియామకాలు 8.7 శాతం పెరగనున్నాయని నియామకాల సేవలందించే అడెకో ఇండియా గురువారం విడుదల చేసిన ఒక నివేదికలో ఈ విషయం వెల్లడించింది. 2030 నాటికి ఈ కంపెనీల్లో నియామకాలు 10 శాతం చొప్పున పెరిగి కొత్తగా 2.5 లక్షల మందికి పర్మినెంట్ ఉద్యోగాలు కల్పిస్తాయని పేర్కొంది.

నివేదిక ముఖ్యాంశాలు

- మెట్రో నగరాలతో పోలిస్తే ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లోనే ఎక్కువ కొలువులు
- డిజిటల్, కంప్లయెన్స్ విధుల్లో అధికంగా ఉద్యోగాలు
- స్థానిక భాషల్లో ప్రావీణ్యత, క్షేత్రస్థాయి అమ్మకాల్లో అనుభవం ఉన్న వారికి 15 శాతం వరకు అదనపు జీతాలు
- సంప్రదాయ ఆస్తుల నుంచి మార్కెట్ ఆధారిత యూలిప్స్, మ్యూచువల్ ఫండ్స్, పెన్షన్ ఫండ్ల వైపు మళ్లుతున్న మదుపరులు
- రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్‌లు, డిజిటల్ ప్రొడక్ట్ మేనేజర్లు, క్రెడిట్ రిస్క్ అనలిస్టులకు పెరుగుతున్న గిరాకీ
- ఫైనాన్షియల్ ప్లానర్లు, ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్లు, క్లెయిమ్స్ ఆటోమేషన్ స్పెషలిస్టుల కోసం చూస్తున్న వెల్త్, ఇన్సూరెన్స్ కంపెనీలు
- నైపుణ్యాల అభివృద్ధితో బీమా కంపెనీల్లో 30 శాతం పెరిగిన క్లెయిమ్స్ సెటిల్‌మెంట్

మళ్లీ 82,000పైకి సెన్సెక్స్

ఆరో రోజూ లాభాల్లోనే సూచీలు

ముంబై: స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు వరుసగా ఆరో రోజూ లాభాల్లో పయనించాయి. గురువారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ ఒక దశలో 373.33 పాయింట్లు ఎగబాకి 82,231.17 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి సూచీ 142.87 పాయింట్ల లాభంతో 82,000.71 వద్ద ముగిసింది. నిఫ్టీ 33.20 పాయింట్ల వృద్ధితో 25,083.75 వద్ద స్థిరపడింది. మార్కెట్ దిగ్గజాలైన రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లలో కొనుగోళ్లు ఇందుకు దోహదపడ్డాయి. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 13 రాణించాయి. బజాజ్ ఫిన్‌సర్వ్, ఐసీఐసీఐ స్టాక్స్ ఒక శాతానికి పైగా లాభపడ్డాయి. బజాజ్ ఫైనాన్స్, రిలయన్స్ 0.90 శాతం వరకు పెరిగాయి.

జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ రూ.5,000 కోట్ల సమీకరణ: సెక్యూరిటీల జారీ ద్వారా ఒకే సారి లేదా పలు విడతల్లో రూ.5,000 కోట్ల వరకు సమీకరించే ప్రతిపాదనకు జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ బోర్డు ఆమోదం తెలిపింది. అలాగే, ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలోని 50.5 ఎకరాల స్థలంలో కార్గో సిటీ ప్రాజెక్టును అభివృద్ధి చేసేందుకు కంపెనీకి పూర్తి అనుబంధ విభాగంగా ఒక స్పెషల్ పర్పస్ వెహికిల్ (ఎస్‌పీవీ)ను ఏర్పాటు చేసేందుకూ బోర్డు అంగీకరించింది.

- పునరుత్పాదక ఇంధన రంగంలోని కేపీ గ్రూప్.. 2030 నాటికి ఉత్పత్తి సామర్థ్యాన్ని 1,000 మెగావాట్లకు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా గ్రీన్ హైడ్రోజన్, బీఈఎస్ఎస్, ఫ్లోటింగ్ సోలార్, ఆఫ్‌షోర్‌లలో కార్యకలాపాలు విస్తరించేందుకు ప్రణాళికలు రచిస్తోంది. కాగా కంపెనీ ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లో ప్రభుత్వ భాగస్వామ్యంతో పలు ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తోంది.
- లగ్జరీ కార్ల దిగ్గజం లెక్సస్ ఇండియా మార్కెట్లోకి సరికొత్త ఎన్ఎక్స్ 350హెచ్ కారు తీసుకువచ్చింది. క్యాబిన్ కంఫర్ట్, డ్రైవ్ కంట్రోల్ వంటి కొత్త ఫీచర్లను ఈ కారులో పొందుపరిచింది.

అపోలో హాస్పిటల్స్‌లో బల్క్ డీల్

రూ.1,395 కోట్ల విలువైన షేర్లు విక్రయించనున్న ఎండీ సునీతా రెడ్డి

ముంబై: అపోలో హాస్పిటల్స్ ప్రమోటర్, ఎండీ సునీతా రెడ్డి కంపెనీలో 1.25 శాతం వరకు వాటాను శుక్రవారం బ్లాక్ డీల్స్ ద్వారా విక్రయించనున్నట్లు తెలిసింది. షేరు కనీస ధరను రూ.7,747గా నిర్ణయించినట్టు సమాచారం. బీఎస్ఈలో గురువారం అపోలో హాస్పిటల్స్ షేరు ముగింపు ధర రూ.7,920తో పోలిస్తే 2 శాతం తక్కువిది. కాగా ఈ వాటా విక్రయం ద్వారా రూ.1,395 కోట్ల వరకు సమకూరే అవకాశం ఉంది. ప్రస్తుతం సునీతా రెడ్డికి అపోలో హాస్పిటల్స్‌లో 3.36 శాతం వాటా ఉంది.

అవగాహనా లోపమే బీమాకు సమస్య

ఐఏసీ-లైఫ్ కో చైర్‌పర్సన్ వెంకటాచలం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దేశంలో జీవిత బీమా విస్తరణకు ప్రజల అవగాహనా లోపం పెద్ద సమస్యగా మారిందని ఇన్సూరెన్స్ అవేర్‌నెస్ కమిటీ (ఐఏసీ-లైఫ్) కో చైర్‌పర్సన్ వెంకటాచలం అన్నారు. ఇప్పటికీ మన జనాభాలో 83 శాతం మందికి సరైన బీమా రక్షణ లేని విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుంటే బీమా కంపెనీలకు 17 లక్షల కోట్ల డాలర్ల (సుమారు రూ.1,483.25 లక్షల కోట్లు) విలువైన అదనపు వ్యాపార అవకాశం ఏర్పడుతుందన్నారు. ప్రస్తుతం జీవిత బీమా తీసుకుంటున్న వారిలోనూ ఎక్కువ మంది సేవింగ్స్, చైల్డ్ పాలసీలపై ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారే తప్ప, రిటైర్మెంట్ పాలసీలపై పెద్దగా ఆసక్తి చూపడం లేదన్నారు. తెలంగాణలో మాత్రం ఇప్పుడిప్పుడే రిటైర్మెంట్ పాలసీలపై ఆసక్తి పెరుగుతోందన్నారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

22 తేదీ			
హైదరాబాద్	495	విజయవాడ	525
వరంగల్	497	గోదావరి	520
చిత్తూరు	553	విశాఖపట్నం	520
		డజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	97	విజయవాడ	114
వరంగల్	97	గుంటూరు	111
కరీంనగర్	97	ఒంగోలు	111
మహబూబ్‌నగర్	97	చిత్తూరు	85
కర్నూలు	97	నెల్లూరు	90
విశాఖపట్నం	110	అనంతపురం	90
గోదావరి	114		

'వెగోవీ' పేటెంట్‌పై నోవో నార్డిస్క్ మౌనం

న్యాయస్థానం ఆదేశాలపైనా నిర్లక్ష్యం

కోర్టుకు విన్నవించిన నాట్కో ఫార్మా

న్యూఢిల్లీ: బరువు తగ్గించే (వెయిట్ లాస్) బ్లాక్‌బస్టర్ ఔషధం 'వెగోవీ' పేటెంట్ హక్కులపై డెన్మార్క్ ఫార్మా కంపెనీ నోవో నార్డిస్క్ ఏ మాత్రం నోరు మెదపడం లేదు. వెగోవీ జెనరిక్ వెర్షన్ తయారు చేయడం నోవో నార్డిస్క్ పేటెంట్ హక్కులకు ఏ మాత్రం భంగం కాదని నాట్కో ఫార్మా ఇప్పటికే ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. దీంతో దీనికి సమాధానం ఇవ్వాలని కోర్టు నోవో నార్డిస్క్‌ను ఆదేశించింది. కొన్ని నెలలుగా దీనికి సమాధానం ఇవ్వాలని కోరుతున్నా ఈ డెన్మార్క్ కంపెనీ నుంచి ఉలుకూపలుకూ లేదని నాట్కో ఫార్మా న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. ఈ విషయంలో నోవో నార్డిస్క్ కావాలనే జాప్యం చేస్తోందని భావిస్తున్నారు.

ఎందుకంటే ?

నోవో నార్డిస్క్‌తో పాటు అమెరికా ఫార్మా దిగ్గజం ఎలీ లిల్లీ.. భారత మార్కెట్లోకి తమ పేటెంటెడ్ వెయిట్ లాస్ ఔషధాలను ఇటీవలే విడుదల చేశాయి. నెలకు రూ.17,000 నుంచి రూ.26,000 ఖర్చవుతున్నా, సంపన్న వర్గాల నుంచి వీటికి మంచి డిమాండ్ ఉంది. అయితే మన దేశంలో ఈ ఔషధాల పేటెంట్ వచ్చే ఏడాది మార్చితో తీరిపోనుంది. దీంతో జెనరిక్ వెర్షన్‌లో ఈ వెయిట్ లాస్ ఔషధాన్ని మార్కెట్లోకి విడుదల చేసేందుకు నాట్కో ఫార్మా, డాక్టర్ రెడ్డీస్‌తో సహా ఏడు దేశీయ ఫార్మా కంపెనీలు సిద్ధమవుతున్నాయి. ఈ కంపెనీల ప్రయత్నాలను ఆలస్యం చేసేందుకు నోవో నార్డిస్క్ ఇలా మౌనం పాటిస్తోందని భావిస్తున్నారు. ప్రస్తుతం రూ.700 కోట్లుగా ఉన్న భారత ఒబేసిటీ ఔషధ మార్కెట్ 2030 నాటికి రూ.8,000 కోట్లకు చేరుకుంటుందని అంచనా.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,00,750 ▲	92,300 ▲	1,26,000 ▲
విజయవాడ	1,02,150 ▼	96,000 ▼	1,15,800 ▲
విశాఖపట్నం	1,02,420 ▲	92,350 ▲	1,26,000 ▲
రాజమండ్రి	1,00,690 ▲	92,300 ▲	1,15,000 ▲
ప్రొద్దుటూరు	1,00,600 ▲	92,550 ▲	1,16,200 ▲
ముంబై	99,147 ▲	90,819 ▲	1,12,690 ▲

వచ్చే 3 నెలల్లో బీఎస్ఎన్ఎల్ 5జీ సేవలు

సీజీఎం శేషాచలం



విజయవాడ (ఆంధ్రజ్యోతి): రాబోయే మూడు నెలల్లో బీఎస్ఎన్ఎల్ 5జీ సేవలను అందుబాటులోకి తీసుకురానుందని సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్ ఎం శేషాచలం వెల్లడించారు. బీఎస్ఎన్ఎల్ 4జీ నెట్‌వర్క్ పూర్తిగా అందుబాటులోకి రాగానే. వచ్చే త్రైమాసికంలో 5జీ సేవలను ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. గురువారం నాడిక్కడ ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బీఎస్ఎన్ఎల్ రెండు కొత్త ప్లాన్లను ప్రారంభించిందన్నారు. ఇందులో భాగంగానే ఒక రూపాయికే ఫ్రీడమ్ ప్లాన్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు ఆయన చెప్పారు. ఈ ప్లాన్‌లో వినియోగదారులకు ఉచితంగా సిమ్ అందజేస్తామన్నారు. రోజుకు 2జీబీ డేటా, అపరిమిత వాయిస్ కాల్స్ రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు ఈ ప్లాన్ ప్రత్యేకతలు. దీని కాలపరిమితి నెల రోజులు. కాగా మొబైల్ నంబర్ పోర్టబిలిటీ (ఎంఎన్‌పీ)తో బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌లోకి వచ్చిన వారికి ఫ్రీడమ్ ప్లాన్‌ను ఆఫర్ చేస్తున్నట్లు ఆయన చెప్పారు. కొత్తగా రూ.400 ప్లాన్ ద్వారా హైస్పీడ్ ఇంటర్నెట్‌తో ట్రిపుల్ ప్లే సేవలను ప్రారంభించినట్లు శేషాచలం తెలిపారు. కాగా రాష్ట్రంలో ప్రస్తుతం బీఎస్ఎన్ఎల్‌కు 4,000 పైగా టవర్లు ఉండగా మరో 1,300 టవర్లను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన చెప్పారు అలాగే రాజధాని అమరావతి ప్రాంతంలో కొత్తగా బీఎస్ఎన్ఎల్ టవర్లను నెలకొల్పటానికి ప్రతిపాదనలు తయారు చేస్తున్నట్లు శేషాచలం తెలిపారు.

స్పోర్ట్స్

సలీమాకే పగ్గాలు

ఆసియా కప్ మహిళల హాకీ



న్యూఢిల్లీ: ఆసియా కప్ హాకీ టోర్నమెంట్‌లో పాల్గొనే భారత మహిళల జట్టును గురువారం ప్రకటించారు. 20 మంది సభ్యుల జట్టుకు ప్రస్తుత సారథి, మిడ్‌ఫీల్డర్ సలీమా టెటెనే కెప్టెన్‌గా ఎంపిక చేశారు. ఈ టోర్నీ వచ్చేనెల ఐదు నుంచి 14 వరకు చైనాలోని హాంగ్జౌలో జరగనుంది. టోర్నమెంట్ విజేత 2026 ప్రపంచ కప్‌నకు నేరుగా అర్హత సాధించనుండడంతో ఆసియా కప్ ఎంతో ప్రాధాన్యం సంతరించుకుంది. జపాన్, థాయ్‌లాండ్, సింగపూర్‌తో కలిసి గ్రూప్ 'బి'లో భారత్ తలపడనుంది.

ఏపీఎల్ ఫైనల్లో అమరావతి

విశాఖపట్నం-స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): హనుమ విహారి (54 నాటౌట్, 3/19) ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టడంతో.. అమరావతి రాయల్స్ ఏపీఎల్ సీజన్-4 ఫైనల్‌కు దూసుకెళ్లింది. గురువారం జరిగిన క్వాలిఫయర్-1లో అమరావతి 8 వికెట్లతో తుంగభద్ర వారియర్స్‌ను చిత్తు చేసింది. తొలుత తుంగభద్ర 20 ఓవర్లలో 8 వికెట్లకు 136 పరుగులు చేసింది. కెప్టెన్ మహీప్(56) అర్ధ శతకం నమోదు చేయగా.. చివర్లో శశికాంత్ (41) మెరుపులు మెరిపించాడు. హనుమ విహారి మూడు, వినయ్‌కుమార్ రెండు వికెట్లు పడగొట్టారు. ఛేదనలో అమరావతి 14.2 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 137 పరుగులు చేసి గెలిచింది.. కాగా, ఎలిమినేటర్ మ్యాచ్‌లో భీమవరం బుల్స్ 6 వికెట్ల తేడాతో విజయవాడ సన్‌షైనర్స్‌పై గెలిచింది. తొలుత విజయవాడ 160/8 స్కోరు చేసింది. ఛేదనలో బుల్స్ 19.2 ఓవర్లలో 166/4 స్కోరు చేసి నెగ్గింది. కెప్టెన్ హేమంత్ (71 నాటౌట్) తుదికంటా క్రీజులో నిలిచి జట్టును గెలిపించాడు.

ఒక్కరోజే నాలుగు స్వర్ణాలు

ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్స్

షిమ్‌కెంట్ (కజకిస్థాన్): ఆసియా చాంపియన్‌షిప్స్‌లో భారత షూటర్లు గురువారంనాటి పోటీలలో ఐదు స్వర్ణాలకు గాను నాలుగు పసిడి పతకాలు కొల్లగొట్టారు. దాంతో మొత్తం 26 పతకాలతో (14-6-6) పట్టికలో భారత్ టాప్‌లో ఉంది. మహిళల జూనియర్ స్కీట్ విభాగంలో మాన్సీ రఘువంశీ స్వర్ణం నెగ్గగా, యశస్వీ రాథోడ్ కాంస్యం గెలుపొందింది. పురుషుల 10 మీ. ఎయిర్ రైఫిల్ టీమ్ పసిడి పతకం దక్కించుకుంది. జూనియర్ పురుషుల 10 మీ. ఎయిర్ రైఫిల్‌లో అభినవ్ షా స్వర్ణంతో మెరిశాడు. జూనియర్ పురుషుల 10 మీ.ఎయిర్ రైఫిల్ టీమ్ విభాగంలో వరల్డ్, ఆసియా రికార్డు స్కోరుతో పసిడి పతకం చేజిక్కించుకుంది. జూనియర్ పురుషుల స్కీట్ టీమ్ విభాగంలోనూ భారత్ స్వర్ణం అందుకుంది.

ముంబై కెప్టెన్సీకి రహానె గుడ్‌బై

ముంబై: సీనియర్ క్రికెటర్ అజింక్యా రహానె సంచలన నిర్ణయం తీసుకున్నాడు. గత రంజీ సీజన్‌లో ముంబై జట్టును చాంపియన్‌గా నిలిపిన తను కెప్టెన్సీ నుంచి వైదొలుగుతున్నట్టు ప్రకటించాడు. మరోవైపు రహానె స్థానంలో ముంబై నూతన కెప్టెన్‌గా శార్దూల్ ఠాకూర్‌ను ఎంపిక చేశారు.

భారత్ 'ఎ' 93/5

బ్రిస్బేన్: ఆస్ట్రేలియా 'ఎ' జట్టుతో గురువారం ప్రారంభమైన నాలుగు రోజుల అనధికార టెస్ట్‌లో భారత్ 'ఎ' తొలిరోజే ఇక్కట్లలో పడింది. టాస్ కోల్పోయి బ్యాటింగ్ చేపట్టిన మన మహిళలు ఆట ముగిసే సరికి మొదటి ఇన్నింగ్స్‌లో కేవలం 93 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయారు. షఫాలీ వర్మ (35) పర్వాలేదనిపించింది. వర్షం వల్ల మొత్తం 23.2 ఓవర్ల ఆటే సాధ్యమైంది.

స్వర్ణ పోరుకు కాజల్

సమోకోవ్ (బల్గేరియా): మహిళల అండర్-20 వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో భారత రెజ్లర్ కాజల్ ఫైనల్‌కు చేరుకొని స్వర్ణంపై ఆశలు నిలిపింది. 72 కిలోల సెమీస్‌లో కాజల్ 13-6తో జాస్మిన్‌ను మట్టికరిపించింది. అయితే, రీనా (55 కి), ప్రియ (76 కి) ఫైనల్లో ఓడి రజతాలు దక్కించుకొన్నారు. సెమీస్‌లో ఓడిన శ్రుతి, సారిక కాంస్యం కోసం ఆడనున్నారు.

టీమిండియాకు గ్రీన్‌సిగ్నల్

- ఆసియాకప్‌లో ఆడేందుకు అనుమతి
- భారత్-పాక్ మ్యాచ్‌కు మార్గం సుగమం
- ద్వైపాక్షిక సిరీస్‌లకు అవకాశం లేదు



న్యూఢిల్లీ: భారత్-పాకిస్థాన్ క్రికెట్ జట్ల మధ్య ద్వైపాక్షిక సిరీస్‌లు ఎట్టి పరిస్థితుల్లోనూ జరగవని కేంద్ర ప్రభుత్వం మరోసారి స్పష్టం చేసింది. అయితే వచ్చే నెల 9 నుంచి జరిగే ఆసియాకప్‌లో పాల్గొనకుండా భారత జట్టును అడ్డుకోలేమని తెలిపింది. దీంతో సెప్టెంబరు 14న దుబాయ్‌లో జరిగే దాయాదుల పోరుకు అడ్డంకి తొలగినట్టయింది. ఇటీవలే పార్లమెంట్‌లో సరికొత్త జాతీయ క్రీడా బిల్లు ఆమోదం పొందిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో ఏ క్రీడలోనైనా ఇకపై భారత్‌కు చెందిన అథ్లెట్లు పాక్‌లో.. పాక్ ఆటగాళ్లు భారత్‌లోగానీ పర్యటించడం కుదరదని తేల్చింది. అంతేకాకుండా ఈ రెండు దేశాల జట్ల ద్వైపాక్షిక సిరీస్‌లు తటస్థ వేదికలపైనా జరగబోవని స్పష్టం చేసింది. అయితే ఒలింపిక్ చార్టర్‌ను అనుసరించి ఐసీసీ వరల్డ్‌కప్, ఆసియాకప్‌లాంటి మెగా టోర్నీల్లో పాక్‌తో తలపడేందుకు ఎలాంటి అభ్యంతరమూ ఉండదని క్రీడాశాఖ పేర్కొంది. వీటికి పాకిస్థాన్ ఆతిథ్యమిస్తే మాత్రం జోక్యం చేసుకోవాల్సి ఉంటుందని చెప్పింది. మరోవైపు భవిష్యత్‌లో ఇరు దేశాల మధ్య సంబంధాలు మెరుగైతే ఈ నిర్ణయంలో మార్పు ఉంటుందా? అనే ప్రశ్నకు సమాధానంగా.. ప్రస్తుతానికైతే అలాంటి ఆలోచన లేవని క్రీడా శాఖ వర్గాలు తెలిపాయి.

కొత్త చట్టం ప్రకారం బీసీసీఐ ఎన్నికలు..

వచ్చే నెల చివరి వారంలో బీసీసీఐ ఎన్నికలు జరుగనున్నాయి. అయితే వాటిని నూతన జాతీయ క్రీడా చట్టం ప్రకారమే జరపాలని క్రీడా శాఖ భావిస్తోంది. కానీ ఆ సమయానికి కొత్త చట్టం నియమ నిబంధనలు కార్యరూపం దాల్చాల్సి ఉంటుంది. లేని పక్షంలో సుప్రీం కోర్టు నియమిత జస్టిస్ లోధా కమిటీ మార్గదర్శకాలను అనుసరించే జరిగే అవకాశం ఉంది. దీని ప్రకారం బోర్డు అధ్యక్షుడి గరిష్ఠ వయస్సు 70 ఏళ్ల లోపే ఉండాలి. కానీ జాతీయ క్రీడా చట్టం ప్రకారం 75 ఏళ్లున్నా పోటీ చేసేందుకు అవకాశం ఉంది. ప్రస్తుత అధ్యక్షుడు రోజర్ బిన్నీ వయస్సు 70 దాటినప్పటికీ.. అతడు తాత్కాలిక చీఫ్‌గా కొనసాగుతున్నాడు.

దేశవ్యాప్తంగా క్రీడా ఉత్సవాలు: ఈనెల 29న జరిగే జాతీయ క్రీడా దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా ఘనంగా జరిపేందుకు కేంద్ర నిర్ణయించింది. హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా ఈ వేడుకలు నిర్వహిస్తుంటారు. అయితే దేశంలో క్రీడా సంస్కృతిని చాటేందుకు ప్రతీ గ్రామం, జిల్లా, పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూళ్లు, యూనివర్సిటీల్లో ఆటల పోటీలు, ఫిట్‌నెస్ కార్యక్రమాలను నిర్వహిస్తామని క్రీడా మంత్రి మాన్సుక్ మాండవీయ తెలిపారు.

ఆటగాళ్లకు అగ్నిపరీక్ష 'బ్రాంకో' టెస్ట్


- ఫిట్‌నెస్‌ను కొలిచేందుకు సరికొత్త ప్రమాణం
- రగ్బీ తరహా పరీక్షను ప్రవేశపెట్టిన బీసీసీఐ



న్యూఢిల్లీ: ఆటగాళ్ల ఫిట్‌నెస్ సమస్య టీమిండియాను వెంటాడుతోంది. ఎవరు ఎంత ఫిట్‌గా ఉన్నారో కచ్చితంగా తెలుసుకోలేకపోతున్నారు. కొందరైతే పెయిన్‌కిల్లర్లు తీసుకొని మ్యాచ్‌లో బరిలోకి దిగుతున్నారని వార్తలు కూడా వచ్చాయి. తాజా ఇంగ్లండ్ టూర్‌ని గమనిస్తే..మనోళ్ల ఫిట్‌నెస్ ఎంత తక్కువ స్థాయిలో ఉందో అందరికీ తెలిసిందే. దీనికి బుమ్రానే ఉదాహరణ. ఈ నేపథ్యంలో భారత జట్టు ఫిట్‌నెస్ విషయంలో బీసీసీఐ సరికొత్త ప్రమాణాలు నెలకొల్పాలనుకొంటోంది. ఇందులో భాగంగా రగ్బీ ఆటగాళ్లను పరీక్షించే బ్రాంకో టెస్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. టీమిండియా కొత్త ఫిట్‌నెస్, కండీషనింగ్ కోచ్ అడ్రియన్ లే రూ ఈ టెస్ట్‌ను ప్రవేశపెట్టగా..చీఫ్‌కోచ్ గౌతమ్ గంభీర్ దానికి మద్దతు ప్రకటించాడు. తాజాగా జరిగే ఫిట్‌నెస్ టెస్ట్‌లో యో-యో టెస్ట్‌తోపాటు బ్రాంకో టెస్ట్ కూడా పాస్ కావాలి. దీంతోపాటు 2 కిలోమీటర్ల టైమ్ ట్రయల్‌ను అధిగమించాలి.



అడ్రియన్ లే రూ



ఏమిటీ బ్రాంకో టెస్ట్?

ప్లేయర్ల సత్తువ, వేగంతోపాటు కార్డియో వాస్క్యులర్ కండిషన్‌ను కొలిచేందుకు రూపొందించిన తీవ్రమైన రన్నింగ్ డ్రిల్ ఇది. ఆటగాళ్ల శరీరానికి, మైండ్‌కు సవాళ్లు విసురుతుంది. క్రికెటర్ ఫిట్‌నెస్‌లోని సూక్ష్మమైన లోపాలు కూడా ఈ టెస్ట్‌లో బయటపడతాయి. బ్రాంకో టెస్ట్‌లో 20, 40, 60 మీటర్ల షటిల్స్ ఉంటాయి. ప్రతి దూరాన్ని ఐదు సెట్లపాటు విరామం తీసుకోకుండా పూర్తి చేయాలి. అంటే ఒక్కోటి ఐదుసార్ల చొప్పున మొత్తం 15 సార్లు... 1200 మీటర్ల దూరాన్ని ఆగకుండా పరిగెత్తాలి. దాన్ని ఆరు నిమిషాల్లోనే పూర్తి చేయాలి. కాగా రెండు కిలోమీటర్ల టైమ్ ట్రయల్‌ను బీసీసీఐ కొనసాగించనుంది.

మహిళా బాక్సర్లకు లింగత్వ పరీక్షలు తప్పనిసరి

ప్రపంచ చాంపియన్‌షిప్స్ ఎంట్రీపై వరల్డ్ బాక్సింగ్

లాస్‌ఏంజిల్స్: బాక్సింగ్‌లో లింగత్వ వివాదం ఏళ్లుగా నెలకొంది. పారిస్ ఒలింపిక్స్‌లో స్వర్ణం నెగ్గిన అల్జీరియా బాక్సర్ ఇమానె ఖెలిఫ్ మహిళ కాదనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇలాంటి వాటికి చెక్ చెప్పేందుకు 'వరల్డ్ బాక్సింగ్' నడుం కట్టింది. వచ్చే నెలలో జరిగే వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో బరిలోకి దిగేందుకు మహిళా బాక్సర్లు తప్పని సరిగా లింగత్వ పరీక్షలు చేయించుకోవాలని ఆదేశించింది. పాలిమెరైజ్ చైన్ రియాక్షన్ లేదా దీనికి సమమైన జెనెటిక్ స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా జన్మతహ లింగత్వాన్ని నిర్ధారించుకోవాలని తెలిపింది.

మరో పది నెలలు.. అగార్కర్ పదవీకాలం పొడిగింపు



న్యూఢిల్లీ: జాతీయ సీనియర్ సెలెక్షన్ కమిటీ చైర్మన్ అజిత్ అగార్కర్ పదవీ కాలాన్ని బీసీసీఐ పొడిగించింది. 2026 జూన్ వరకు అగార్కర్ చైర్మన్‌గా కొనసాగుతాడని బోర్డు గురువారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొంది. 2023 జూలైలో అగార్కర్ చైర్మన్‌గా నియమితుడయ్యాడు. అతడి పదవీ కాలంలో భారత జట్టు 2023 వన్డే వరల్డ్ కప్‌లో రన్నరప్‌గా నిలవడంతోపాటు, 2024లో టీ20 ప్రపంచ కప్, చాంపియన్స్ ట్రోఫీలలో విజేతగా ఆవిర్భవించింది. అగార్కర్ నేతృత్వంలోని కమిటీలో ఎస్ఎస్ దాస్, సుబ్రతో బెనర్జీ, అజయ్ రాత్రా, ఎస్.శరత్ సభ్యులుగా కొనసాగుతున్నారు. వచ్చే నెలలో జరిగే బీసీసీఐ ఏజీఎంలో కమిటీలో మార్పు చేర్పులపై నిర్ణయం తీసుకోనున్నారు. ఏజీఎం తర్వాత సెలెక్షన్ కమిటీ సభ్యుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానించనున్నట్లు తెలిసింది.

ఎరాని జోడీ.. వన్స్‌మోర్

ఫైనల్లో స్వియటెక్ జంటపై గెలుపు

యూఎస్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్



న్యూయార్క్: డిఫెండింగ్ చాంప్ సారా ఎరాని జోడీ పునర్ వ్యవస్థీకరించిన యూఎస్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్‌ను నిలబెట్టుకొంది. గురువారం జరిగిన ఫైనల్లో ఇటలీ జంట ఎరాని-ఆండ్రియా వవస్సోరి జోడీ 6-3, 5-7, 10-6తో మూడో సీడ్ ఇగా స్వియటెక్-కాస్పర్ రూడ్ జంటపై గెలిచింది. తుది పోరును మాత్రం రెగ్యులర్ ఫార్మాట్‌లో నిర్వహించారు. సింగిల్స్ స్టార్లతో డ్రాను నింపేసినా అంతిమంగా డబుల్స్ స్పెషలిస్ట్‌లకే టైటిల్ దక్కింది. అంతకుముందు జరిగిన సెమీస్‌లో ఎరాని-వవస్సోరి జంట 4-2, 4-2తో డేనియల్ కొలిన్స్-క్రిస్టియన్ హ్యారిసన్‌ను చిత్తు చేసింది. మరో మ్యాచ్‌లో స్వియటెక్-రూడ్ ద్వయం 3-5, 5-3, 10-8తో టాప్ సీడ్ జెస్సికా పెగుల-జేక్ డ్రేపర్‌పై పోరాడి నెగ్గింది.

రక్షకుడు వచ్చేశాడు!



మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా ఆయన నటిస్తున్న 'విశ్వంభర' చిత్రం గ్లింప్స్‌ను టీమ్ గురువారం విడుదల చేసింది. ఈ సినిమా విడుదల ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న అభిమానులకు క్లారిటీ ఇస్తూ వచ్చే ఏడాది వేసవికి ఈ సినిమా రిలీజ్ అవుతుందని ఈ సందర్భంగా మేకర్స్ స్పష్టం చేశారు. వశిష్ఠ దర్శకత్వం వహిస్తున్న ఈ సోషియో ఫాంటసీ చిత్రాన్ని విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు.

'ఈ విశ్వంభరలో అసలు ఏం జరిగిందో చెబుతావా మురా' అని ఓ బాలుడి ప్రశ్నతో గ్లింప్స్ మొదలైంది. 'సంహారం.. దాని తాలుకు యుద్ధం. కొన ఊపిరితో ఒక సమూహం తాలుకు నమ్మకం.. అలసి పోని ఆశయానికి ఊపిరి పోసే వాడు వస్తాడు.. ఆగని యుద్ధాన్ని యుగాల పాటు పిడికిలి బిగించి చెప్పుకొనేలా ముగిస్తాడు..' లాంటి డైలాగ్స్‌తో ఆసక్తికరంగా గ్లింప్స్ సాగింది. ఇందులో రక్షకుడిగా చిరంజీవి ఎంట్రీ అదిరింది. ఇంతకుముందు విడుదల చేసిన గ్లింప్స్‌లో సీజీ వర్క్ క్వాలిటీ సరిగ్గా లేదని విమర్శలు రావడంతో ఈసారి జాగ్రత్త వహించి, అందరినీ ఆకట్టుకొనే విధంగా గ్లింప్స్ సిద్ధం చేసి టీమ్ వదిలింది. చిరంజీవి బర్త్ డే గిఫ్ట్ అదిరిపోయిందని అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఈ చిత్రంలో త్రిష కథానాయిక కాగా, ఆషికా రంగనాథ్, కునాల్ కపూర్ కీలక పాత్రధారులు. వచ్చే ఏడాది వేసవికి తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో 'విశ్వంభర' విడుదల కానుంది.

నవంబర్‌లో విడుదల



రామ్ కథానాయకుడిగా మహేశ్‌బాబు పి. దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'ఆంధ్రాకింగ్ తాలూకా'. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు ఆకట్టుకున్నాయి. మేకర్స్ గురువారం విడుదల తేదీని ప్రకటించారు. 'ఆంధ్రా కింగ్ తాలూకా' నవంబర్ 28న ప్రపంచవ్యాప్తంగా విడుదలవనుంది. ఈ సందర్భంగా విడుదల చేసిన రిలీజ్ డేట్ పోస్టర్‌లో రామ్ స్టైలిష్ లుక్‌లో ఆకట్టుకున్నారు. ఈ చిత్రంలో రామ్‌కు జోడీగా భాగ్యశ్రీ బోర్సే నటిస్తున్నారు. ఉపేంద్ర కీలకపాత్ర పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: వివేక్, మెర్విన్, సినిమాటోగ్రఫీ: సిద్ధార్థ నుని.

ఉత్కంఠకు తెర.. నేటి నుంచి మళ్లీ షూటింగ్స్!



రెండు వారాలకు పైగా కొనసాగుతున్న కార్మికుల సమ్మెకు గురువారం శుభం కార్డు పడింది. నేటి నుంచి షూటింగ్స్ పునఃప్రారంభం కానున్నాయి. 30 శాతం వేతన పెంపు డిమాండ్‌తో మొదలైన ఈ సమ్మె.. చివరికి 22.5 శాతం వేతన పెంపు అంగీకారంతో ముగిసింది. గురువారం కార్మిక భవనంలో అదనపు కమిషనర్ గంగాధర్ ఆధ్వర్యంలో నిర్మాతలు, ఫెడరేషన్ నాయకుల మధ్య సుదీర్ఘంగా చర్చలు జరిగాయి. ఈ సమావేశం తర్వాత దిల్ రాజు మాట్లాడుతూ "ఫెడరేషన్ నాయకులూ.. నిర్మాతలూ.. ఒకరి సమస్యలను ఒకరు అర్థం చేసుకోవడం శుభ పరిణామం. ఫెడరేషన్ వారు నిర్మాతలు కోరింది చేయడానికి ముందుకు వచ్చారు. నిర్మాతలు కూడా కార్మికులు అడిగింది ఇవ్వడానికి ముందడుగు వేశారు. ఈ విషయంలో చొరవ తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి ఫిల్మ్ ఇండస్ట్రీ తరపున కృతజ్ఞతలు. హైదరాబాద్‌ను ఫిల్మ్ హబ్‌గా చేయాలనేది ఆయన ఆశయం. ఆ దిశగా చిత్ర పరిశ్రమ ముందుకు వెళ్తుంది' అని అన్నారు. కార్మిక శాఖ అదనపు కమిషనర్ గంగాధర్ మాట్లాడుతూ "సమ్మె మొదలైన 18 రోజులకు నిర్మాతలు.. ఫెడరేషన్ నాయకుల మధ్య ఒప్పందం కుదిరింది. ఈ సమావేశంలో ప్రధానంగా నాలుగు డిమాండ్స్‌పై సుదీర్ఘ చర్చ సాగింది. చివరకు 22.5 శాతం వేతన పెంపునకు నిర్మాతలు అంగీకరించారు. రూ.రెండు వేల లోపు వేతనాలు తీసుకునే వారికి తొలి ఏడాది 15 శాతం, రెండో ఏడాది రెండున్నర శాతం, మూడో ఏడాది ఐదు శాతం పెంచేందుకు అంగీకారం తెలిపారు. 24 యూనియన్లలో 13 యూనియన్ల వర్కర్లు ఈ వేతనాల్లోకి వస్తారు. రూ.రెండు వేల నుంచి రూ.ఐదు వేలు తీసుకుంటున్న కార్మికులకు తొలి ఏడాది ఏడున్నర శాతం, రెండో ఏడాది 5 శాతం, మూడో ఏడాది 5 శాతం పెంచనున్నారు. ఐదు వేల దినసరి వేతనం దాటిన కార్మికులకు ఎలాంటి పెంపు లేదు. కార్మిక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్ పర్యవేక్షణలో ఒక కమిటీ వేస్తున్నాం. మిగిలిపోయిన చిన్న చిన్న సమస్యల పరిష్కారం కోసం ఈ కమిటీ పని చేస్తుంది. నెల రోజుల్లో నివేదిక ఇస్తుంది. నిర్మాతలు అడిగిన 9 టు 9 కాల్షీట్‌కు ఫెడరేషన్ అంగీకరించింది. ఆదివారం పని చేస్తే ఇచ్చే డబుల్ కాల్షీట్‌ను ఇకపై ఒకటిన్నర కాల్షీట్‌గా లెక్కించనున్నారు' అని తెలిపారు. ఫెడరేషన్ అధ్యక్షుడు వల్లభనేని అనిల్ మాట్లాడుతూ 'ఎప్పుడూ మాలో మేమే చర్చించుకుని సమ్మె ముగిస్తాం. ఈ సారి సమస్యను పరిష్కరించేందుకు చొరవ తీసుకున్న ప్రభుత్వం, కార్మిక శాఖకు కృతజ్ఞతలు' అని చెప్పారు.

చిరంజీవి హర్షం

సినీ కార్మికులు సమ్మె ముగించినందుకు చిరంజీవి హర్షం వ్యక్తం చేశారు. ఈ విషయంలో చొరవ చూపించిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఇలానే నిర్మాతలు, సినీ కార్మికులు కలసిమెలసి పనిచేయాలని ఆయన కోరారు.

అన్నయ్య "విశ్వంభరుడు"



తన అన్నయ్య చిరంజీవికి జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రేమపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన జారీ చేశారు. "ఆయన తమ్ముడిగా పుట్టడం ఒక అదృష్టమైతే ఆయన కష్టాన్ని చిన్నప్పటి నుంచి చూస్తూ పెరగడం ఒక గొప్ప అనుభవం. వెల కట్టలేని జీవిత పాఠం. ఒక సాదాసీదా కుటుంబం నుంచి వచ్చిన చిరంజీవి ఒక అసాధారణ వ్యక్తిగా విజయాలు సాధించి ఎల్లలు దాటి కీర్తిప్రతిష్ఠలు సాధించి, నాలాంటి ఎందరికో స్ఫూర్తి ప్రదాతగా నిలిచారు. చిరంజీవి కీర్తికి పొంగిపోలేదు, కువిమర్శలకు కుంగిపోనూ లేదు. విజయాన్ని వినమ్రతతోనూ, అపజయాన్ని సవాలుగా స్వీకరించే పట్టుదల ఆయన నుంచే నేను నేర్చుకున్నాను. అన్నింటిని భరించే శక్తి ఆయన నైజం. అందుకే ఆయన విశ్వంభరుడు అయ్యారు. పితృ సమానుడైన అన్నయ్యకు, మాతృ సమానురాలైన వదినకు ఆ భగవంతుడు సంపూర్ణ ఆయుష్షుతో కూడిన ఆరోగ్య సంపదను ప్రసాదించాలని మనసారా కోరుకుంటున్నాను. -అమరావతి (ఆంధ్రజ్యోతి)

ఇలాంటి కథలు చాలా అరుదు

- అనుపమ పరమేశ్వరన్

"'పరదా' చాలా కొత్త కథ. ఇలాంటి కథలు తెలుగు సినిమాల్లోనే కాదు భారతీయ చిత్రాల్లో చాలా అరుదు. ఇలాంటి ప్రాజెక్టు నా దగ్గరికి ఎప్పుడూ రాలేదు' అని అన్నారు కథానాయిక అనుపమ పరమేశ్వరన్. ఆమె ప్రధాన పాత్రలో ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వంలో తెరకెక్కిన సినిమా 'పరదా' ఈ శుక్రవారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఆమె మీడియాతో చిత్ర విశేషాలు పంచుకున్నారు.



- డైరెక్టర్ ప్రవీణ్ నాకు కథ చెప్పినప్పుడు పరదాలోనే నా క్యారెక్టర్ ఎక్కువగా కనిపించింది. ఈ పాత్రను ఒక ఛాలెంజింగ్‌గా తీసుకొని నటించాను. ఇందులో సన్నివేశాలు నిశ్శబ్దంగా ఉండొచ్చు. కానీ నా పాత్రలో భావోద్వేగం ఉంటుంది. ప్రీమియర్స్ చూసిన చాలా మంది ప్రేక్షకులు నేను కేవలం కళ్లతోనే కాదు, బాడీ లాంగ్వేజ్, వాయిస్‌తో కూడా నటించగలను అని చెప్తుంటే చాలా ఆనందంగా అనిపించింది.
- ఈ కథకి నేను చాలా కనెక్ట్ అయ్యాను. ఇందులోని భావోద్వేగాలను ఒక అమ్మాయి మాత్రమే అర్థం చేసుకోగలదు. చాలా నిజాయితీగా తీసిన సినిమా ఇది. కచ్చితంగా ప్రేక్షకులు పాత్రలతో మమేకం అవుతారు.
- ప్రేక్షకులను ఆలోచింపజేసే చిత్రమిది. మా మంచి ప్రయత్నాన్ని గుర్తిస్తారనే నమ్మకం ఉంది. సినిమా చూస్తున్నప్పుడు ప్రేక్షకులు ఒక్క క్షణం ఆలోచించగలిగినా అది మా విజయంగా భావిస్తాం.
- సినిమాలో ఆత్మాహుతి సన్నివేశం ఉంటుంది. ఆ సందర్భంలో వచ్చే సంగీతం నన్ను కదిలించింది. కారులో కూర్చొని నాలో నేనే ఏడ్చేశాను. గోపీ సుందర్ అద్భుతమైన సంగీతం ఇచ్చారు. ఇందులో ప్రతీ పాట అర్థవంతంగానే ఉంటుంది.

సందేశాత్మకంగా నేనెవరు?



రాజేంద్ర ప్రసాద్ ప్రధాన పాత్రధారిగా తెరకెక్కిన చిత్రం 'నేనెవరు?'. చిరంజీవి తన్నీరు దర్శకత్వంలో అండేకర్ జగదీశ్ బాబు, భూలక్ష్మి నిర్మించారు. అభిలాష్, సాయిచెర్రీ హీరోలుగా పరిచయమవుతున్నారు. బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో నిర్మాతల మండలి అధ్యక్షుడు కే.ఎల్ దామోదర్ ప్రసాద్ టైటిల్ లోగోను ఆవిష్కరించారు. నూతన నటీనటులతో సరికొత్త తరహాలో రూపొందించిన వినోదాత్మక చిత్రమిదని దర్శకుడు చెప్పారు. సమకాలీన సమాజంలో చర్చనీయాంశంగా మారిన ఓ ముఖ్యమైన పాయింట్‌ను తీసుకొని ఈ సినిమా చేస్తున్నామని నిర్మాతలు తెలిపారు. సంగీతం: చిన్ని కృష్ణ. సినిమాటోగ్రఫీ: నాయుడు ప్రసాద్ కొల్లి.

కాలే కడుపుతో చేసేదే అసలైన యుద్ధం




విజయ రామరాజు టైటిల్ రోల్ పోషించిన స్పోర్ట్స్ డ్రామా 'అర్జున్ చక్రవర్తి'. విక్రాంత్ రుద్ర దర్శకత్వంలో శ్రీని గుబ్బల నిర్మించారు. ఈనెల 29న ప్రేక్షకుల ముందుకు రానుంది. గురువారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ని లాంచ్ చేసింది. ట్రైలర్ ఆద్యంతం ఆకట్టుకుంది. 'ఖాళీ చేతులతో...కాలే కడుపుతో చేసేదే అసలైన యుద్ధం' అనే డైలాగ్‌తో కథా నేపథ్యాన్ని ఆవిష్కరించిన తీరు ఆసక్తికరంగా ఉంది. ఈ సందర్భంగా హీరో విజయ రామరాజు మాట్లాడుతూ 'ఈ సినిమా కోసం ఎంతో కష్టపడ్డా. సిక్స్ ప్యాక్‌లో షూట్ చేసినప్పుడు రెండు రోజులపాటు ఏమీ తినలేదు. ఈ సినిమానే మమ్మల్ని ముందుకు తీసుకెళ్లింది. నా కెరీర్‌లో బెస్ట్ మూవీ చేశానని అనుకుంటున్నా' అని అన్నారు. దర్శకుడు విక్రాంత్ రుద్ర మాట్లాడుతూ 'అర్జున్ చక్రవర్తి' కేవలం సినిమానే కాదు. నా తొమ్మిది సంవత్సరాల కల. హీరో విజయ్ ఈ సినిమా కోసం ప్రాణం పెట్టి పనిచేశారు. చాలా రిస్కులు తీసుకున్నారు. అర్జున్ చక్రవర్తిగా కనిపించడానికి వంద శాతం ఎఫర్ట్ పెట్టాడు. కశ్మీర్‌లో గడ్డ కట్టే చలిలో షర్టు లేకుండా చిత్రీకరణలో పాల్గొన్నారు' అని చెప్పారు.

'జానీ ఎల్ఎల్‌బీ 3' మేకర్స్‌కు కోర్టు సమన్లు



'జానీ ఎల్ఎల్‌బీ 3' చిత్రం మేకర్స్, నటులు అక్షయ్‌కుమార్, అర్షద్ వర్సీలకు పూణే కోర్టు సమన్లు పంపింది. ఇటీవలె విడుదలైన ఈ సినిమా ట్రైలర్ న్యాయ వ్యవస్థతో పాటూ జడ్జీలను, లాయర్లను కించపరిచేలా ఉందని కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు న్యాయవాది వాజిద్ ఖాన్. ఈ విషయంపై అక్టోబరు 28లోపు వివరణ ఇవ్వాలని చిత్ర దర్శకుడు సుభాశ్ కపూర్‌కు, నటులు అక్షయ్‌కుమార్, అర్షద్ వర్సీకి ఈ నెల 18న సమన్లు పంపింది. కాగా, 'జాలీ ఎల్ఎల్‌బీ 2'కు కొనసాగింపుగా తెరకెక్కించిన ఈ చిత్రం సెప్టెంబరులో విడుదలకానుంది.



తెరపై మరో ప్రేమ కథ



పవన్ కేసరి, కావ్య కల్యాణ్ రామ్ జంటగా నటిస్తోన్న కొత్త సినిమా పూజా కార్యక్రమాలతో గురువారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సినిమాను కుంచం శంకర్ దర్శకత్వంలో టీడీఆర్ సినిమాస్ బేనర్‌పై తలారి దినకరణ్ రెడ్డి నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి రామ్ అబ్బరాజు క్లాప్ కొట్టగా, ప్రశాంత్ కుమార్ దిమ్మెల కెమెరా స్విచ్ఛాన్ చేసి గౌరవ దర్శకత్వం వహించారు. ఈ చిత్రానికి విజయ్ బుల్గానిన్ సంగీతాన్ని అందించనుండగా, కెమెరామెన్‌గా సాయి వ్యవహరించనున్నారు. ప్రేమ కథగా తెరకెక్కనున్న ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్‌ని త్వరలోనే ప్రారంభిస్తామని చిత్రబృందం పేర్కొంది.

'ఆత్మకథ' ఆరంభం



జెమినీ సురేశ్, అఖిల నాయర్ జంటగా 'ఆత్మకథ' అనే సినిమా గురువారం ప్రారంభమైంది. శ్రీనివాస్ గుండ్రెడ్డి దర్శకత్వంలో వారాహి ఎంటర్‌టైన్‌మెంట్ బేనర్‌పై సోమేశ్వరరావు నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి జెమిని సురేశ్ తల్లి జెమిని సుబ్బలక్ష్మి క్లాప్ కొట్టారు. ఈ సందర్భంగా జెమిని సురేశ్ మాట్లాడుతూ 'ఈ చిత్రానికి మా అమ్మ క్లాప్ కొట్టడం చాలా సంతోషంగా ఉంది' అని అన్నారు. చిత్ర దర్శకుడు శ్రీనివాస్ గుండ్రెడ్డి మాట్లాడుతూ 'కథనే హీరో అనుకొని 'ఆత్మకథ' అనే చిత్రాన్ని రచించాను' అని చెప్పారు.

అనుబంధాలను ఆవిష్కరించే చిత్రం



నేటి సామాజిక పరిస్థితులకు అద్దం పట్టే కథతో తెరకెక్కుతోన్న చిత్రం 'బ్యాడ్ గాళ్స్'. మున్నా ధులిపూడి దర్శకత్వంలో శశిధర్ నల్లా నిర్మిస్తున్నారు. 'ఇలా చూసుకుంటానే' అంటూ సాగే గీతాన్ని చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. చంద్రబోస్ సాహిత్యం అందించగా, అనూప్ రూబెన్స్ స్వరాలు సమకూర్చారు. సిద్ శ్రీరామ్ ఆలపించారు. ఈ సందర్భంగా మున్నా మాట్లాడుతూ 'ఇదొక కొత్తదనమున్న కథతో తెరకెక్కుతోన్న ప్రేమకథా చిత్రం. సహజత్వానికి దగ్గరగా ఉంటుంది. అనుబంధాలు, ఆప్యాయతల కలబోతగా సాగుతుంది' అని చెప్పారు.

మెగా అభిమానులను అలరించేలా



సురేశ్ కొండేటి ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'వీరాభిమాని'. రాంబాబు దోమకొండ దర్శకత్వంలో ఎస్‌కే రహ్మాన్, కే. సాంబ శివరావు నిర్మించారు. నేడు ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో సురేశ్ కొండేటి మాట్లాడుతూ 'చిరంజీవి అభిమాని పాత్ర పోషించాను. తన అభిమాన హీరో కోసం కథానాయకుడు ఎలాంటి సాహసాలు చేశాడనేది మెగాస్టార్ అభిమానులను ఆకట్టుకుంటుంది' అని అన్నారు. చిరంజీవి గారి పుట్టిన రోజు సందర్భంగా 70 థియేటర్లలో 'వీరాభిమాని' చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శిస్తున్నాం అని దర్శకుడు తెలిపారు.





యూరియా కొరతపై ప్రభుత్వం దృష్టి

అమరావతి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో యూరియా కొరతపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఆగస్టులో లక్షా 65వేల టన్నులు రావాల్సి ఉండగా, ఇప్పటివరకు 65వేల టన్నులు వచ్చింది. ఇంకా లక్ష టన్నులు రావాల్సి ఉంది. జూలైలోనూ 50వేల టన్నులు తక్కువ వచ్చింది. దీంతో రాష్ట్రంలో యూరియా కొరత ఏర్పడింది. గత నెల, ఈ నెల వర్షాలు విస్తారంగా కురవడంతో పంటల సాగు పుంజుకుంది. దీంతో యూరియాకు డిమాండ్ వచ్చింది. మరోవైపు ఐపీఎల్, సీఐఎల్ నౌకలు ఆలస్యం కావడం వల్ల రాష్ట్రంలో యూరియా కొరత తీవ్రమైంది. అందువల్ల కోటా ప్రకారం రాష్ట్రానికి రావాల్సిన మొత్తం యూరియాను ఈ నెలలోనే పంపాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. ఈ నెల 25న నౌకలపై గంగవరం పోర్టుకు వచ్చే 18వేల టన్నుల్లో సరుకు మొత్తం ఇవ్వాలని, 28న కాకినాడ పోర్టుకు రానున్న 42వేల టన్నుల్లో కనీసం 25వేల టన్నులు ఇవ్వాలని కేంద్ర ఎరువుల మంత్రిత్వ శాఖను కోరినట్లు వ్యవసాయ శాఖ డైరెక్టర్ డిల్లీరావు గురువారం రాత్రి 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. గంగవరం, కాకినాడ పోర్టుకు రావల్సిన నౌకలు.. విపత్తుల వల్ల ఆలస్యమైతే ఇబ్బంది లేకుండా ఈ నెల 23న ధమ్రా(ఒడిశా) పోర్టుకు వచ్చే ఐపీఎల్ యూరియాను రాష్ట్రానికి ఇవ్వాలని కేంద్ర ఎరువుల మంత్రిత్వశాఖను కోరారు. ఈ నెల 24న కరైకల్(పాండిచ్చేరి) పోర్టుకు వచ్చే 8,100 టన్నుల సీఐఎల్ యూరియాలో 7,800 టన్నులు 26, 27 తేదీల్లో విజయనగరం, ద్వారపూడి, కేసీ కెనాల్, తాడేపల్లిగూడెం, గుడివాడ, నంద్యాలకు చేరనుంది. రానున్న 10 రోజుల్లో రాష్ట్రానికి 31,632 టన్నుల యూరియా వస్తుందని అధికారులు చెప్తున్నారు.

నవంబరు 14, 15న 'భాగస్వామ్య సదస్సు'

అమరావతి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక భాగస్వామ్య సదస్సును నవంబరు 14, 15 తేదీల్లో ఆంధ్ర విశ్వవిద్యాలయం (ఏయూ)లో నిర్వహించాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. భాగస్వామ్య సదస్సుపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు మంత్రులు పి. నారాయణ, టీజీ భరత్, కందుల లక్ష్మీ దుర్గేశ్, కొల్లు రవీంద్ర తదితరులు మంగళగిరి ఏపీఐఐసీ కార్యాలయంలో గురువారం రెండోసారి సమావేశమయ్యారు. వ్యక్తిగత కారణాలతో మంత్రులు లోకేశ్, గొట్టిపాటి రవికుమార్ హాజరు కాలేదు. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ సదస్సులో భాగంగా అంతర్జాతీయ, జాతీయ స్థాయుల్లో రోడ్ షోలు చేపట్టాలని నిర్ణయించారు. సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో వచ్చేనెల రెండోవారంలో ఢిల్లీలో సన్నాహక సదస్సును నిర్వహించాలని తీర్మానించారు.

బ్యాంకర్లు సహకరిస్తేనే బాధితులకు న్యాయం

- దర్యాప్తు సంస్థలు సమన్వయంతో సాగాలి: సీఐడీ డీజీ అయ్యన్నార్

అమరావతి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఆర్థిక మోసాలను అరికట్టేందుకు బ్యాంకుల నుంచి పూర్తి సహకారం అవసరమని సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్ అన్నారు. దర్యాప్తు ఏజెన్సీలు, ఆర్థిక సంస్థలు ఉమ్మడి కార్యాచరణతో ముందుకు వెళితేనే ఆర్థిక నేరాలను అరికట్టి, బాధితులకు న్యాయం చేయొచ్చన్నారు. అగ్రిగోల్డ్ కేసుతోపాటు రాష్ట్రంలోని పలు ఆర్థిక నేరాల కేసుల దర్యాప్తుపై గురువారం మంగళగిరిలోని రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. పలు జిల్లాల సీఐడీ అధికారులు, బ్యాంకర్లు హాజరైన ఈ సమావేశంలో అయ్యన్నార్ మాట్లాడుతూ ప్రజల విశ్వాసం, ఆర్థిక స్థిరత్వం కోసం పోలీసులకు బ్యాంకర్లు పూర్తిగా సహకరించాలని కోరారు. ఆర్థిక నేరాల విభాగం ఎస్పీ మాట్లాడుతూ సైబర్ మోసాల బాధితులు హెల్ప్‌లైన్-1930కు ఫోన్ చేస్తే డబ్బు సీజ్ చేసేందుకు అవకాశం ఉంటుందని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.

చెరువులను పునరుద్ధరించండి

- 23న 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర' కార్యక్రమం నిర్వహించండి: సీఎస్

అమరావతి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని చెరువులను పునరుద్ధరించాలని, జిల్లాల్లో నీటి నిల్వలపై సెప్టెంబరు 1న బులిటెన్లు విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కె.విజయానంద్ కలెక్టర్లను ఆదేశించారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి కలెక్టర్లతో సీఎస్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా విజయానంద్ మాట్లాడుతూ భూగర్భ జలాలు పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాల్లోని భూగర్భ జలాలు, చెరువులు, ప్రాజెక్టుల్లోని నిల్వలతో వాటర్ బులెటిన్లు ఇవ్వాలన్నారు. ఈ నెల 23న శనివారం 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర' కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మెరుగైన సేవలు అందిస్తున్న వారికి అక్టోబరు2న అవార్డులు ప్రదానం చేయాలన్నారు. 'స్వామిత్ర' కింద గ్రామాల్లో భూముల రీసర్వే, గ్రామ కంఠాల గుర్తింపును 2026 డిసెంబరు నాటికి పూర్తి చేయాలన్నారు..

యువ ఆస్ట్రోనాట్ జాహ్నవికి కేంద్ర సహకారం

- కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ హామీ


జాహ్నవిని సత్కరిస్తున్న భూపతిరాజు

న్యూఢిల్లీ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన యువ ఆస్ట్రోనాట్ జాహ్నవి దంగేటి(23)కి అవసరమైన శిక్షణ, భవిష్యత్ అంతరిక్ష పరిశోధనలకు సహకారాన్ని వ్యక్తిగతంగా, కేంద్ర ప్రభుత్వం తరఫున అందిస్తామని కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ హామీ ఇచ్చారు. అమెరికాలోని ప్రైవేటు అంతరిక్ష పరిశోధనా సంస్థ 'టైటాన్ స్పేస్ ఇండస్ట్రీస్' 2029లో నిర్వహించే అంతరిక్ష యాత్రకు ఎంపికైన జాహ్నవి దంగేటి గురువారం ఢిల్లీలో కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మను కలిశారు. కేంద్ర మంత్రి ఆమెను సత్కరించి, అభినందించారు. జాహ్నవి లాంటి యువత దేశానికి గర్వకారణమన్నారు.

50 ఏళ్లకే పింఛన్ హామీ అమలు చేయాలి: తులసిరెడ్డి

వేంపల్లె, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనారిటీలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామని చెప్పిన హామీని కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని పీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు ఆయన గురువారం ఒక ప్రకటన చేశారు. 'దివ్యాంగుల్లో లక్ష మంది పింఛన్లకు అనర్హులుగా తేలినట్లు చెబుతున్నారు. అయితే కొందరు అర్హులను కూడా అనర్హులుగా తేల్చారు. ప్రభుత్వం పునఃపరిశీలన చేసి, అర్హులకు అన్యాయం జరక్కుండా చూడాలి. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలుకు మండలానికి ఒక సెంట్రలైజ్డ్ కిచెన్ ఏర్పాటు చేసే ఆలోచనను విరమించుకోవాలి' అని తులసిరెడ్డి కోరారు.

9 సీహెచ్‌సీలకు రూ.51.75 కోట్లు

ప్రభుత్వాసుపత్రుల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టిపెట్టిన కూటమి ప్రభుత్వం తొమ్మిది సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో అదనపు వసతుల కల్పనకు రూ.51.75 కోట్లు ఖర్చు చేయనుందని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆమదాలవలస, చోడవరం, కంకిపాడు, పొన్నూరు, కనిగిరి, ఉదయగిరి, చెన్నూరు, పత్తికొండ, కళ్యాణదుర్గం సీహెచ్‌సీల్లో అదనపు వసతుల కల్పనకు ఈ నిధులు వెచ్చిస్తారన్నారు.

ఏజీపీలుగా పలువురు న్యాయవాదుల నియామకం

అమరావతి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏపీ హైకోర్టులో వాదనలు వినిపించేందుకు మరో 8మంది సహాయ ప్రభుత్వ న్యాయవాదులు(ఏజీపీలు)గా నియమితులయ్యారు. న్యాయవాదులు చల్లా శ్రీనివాస్, కందకట్ల ఉజ్వలాదేవి, బొక్కా సమీర, పాలడుగు గణేష్, రుద్ర మల్లికార్జునరావు, ఉప్పలపాటి లోవరాజు, గాజుల నవీన్, సాయిగోపి మనోజ్ కృష్ణలను ఏజీపీలుగా నియమిస్తూ గురువారం ఉత్తర్వులిచ్చారు.

పొలాల మునకపై అంబటి మురళి విచారణ

తాడేపల్లి టౌన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): అమరావతి వరదను మళ్లించి పొన్నూరు పొలాలను ముంచారని ఆరోపణలు చేసిన వైసీపీ పొన్నూరు ఇన్‌చార్జి అంబటి మురళీకృష్ణను గురువారం తాడేపల్లి పోలీసులు విచారించారు. అనంతరం అంబటి మురళి విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 12న కుంభవృష్టికి కొండవీటి వాగు నీరు గుంటూరు చానల్‌లోకి ప్రవహించి పొన్నూరు నియోజకవర్గంలో పలుచోట్ల గండ్లు పడ్డాయని చెప్పారు.

కడప ఎస్పీని కలిసిన సునీత దంపతులు

కడప, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): వైఎస్ వివేకా కుమార్తె సునీత, ఆమె భర్త రాజశేఖర్‌రెడ్డి కడప ఎస్పీ అశోక్‌కుమార్‌ను గురువారం కలిశారు. సీబీఐ ఎస్పీ రాంసింగ్, సునీత, రాజశేఖర్‌రెడ్డిపై కేసులను సుప్రీంకోర్టు కొట్టివేయడం, వివేకా హత్య కేసుపై ఆయనతో చర్చించినట్లు సమాచారం.

లాజిస్టిక్ హబ్ ఆఫ్ ఇండియాగా ఏపీ

తీరంలో ప్రతి 50 కిలోమీటర్లకూ పోర్టు లేదా హార్బర్

వీటి నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయండి: చంద్రబాబు

ఏపీఎం టెర్మినల్స్‌తో సీఎం సమక్షంలో ఎంఓయూ


చంద్రబాబు సమక్షంలో ఒప్పంద పత్రాలతో ఏపీఎం టెర్మినల్స్ ప్రతినిధులు

అమరావతి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): సముద్ర వాణిజ్యంలో తూర్పు తీరప్రాంత గేట్‌వేగా ఆంధ్ర ప్రదేశ్‌ను మారుస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. రాష్ట్రాన్ని లాజిస్టిక్ హబ్ ఆఫ్ ఇండియాగా మారుస్తామని వెల్లడించారు. రాష్ట్రంలో పోర్టుల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన కోసం ఏపీఎం టెర్మినల్ సంస్థతో రాష్ట్ర మారిటైమ్ బోర్డు గురువారం సచివాలయంలో అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. దీనిప్రకారం రూ.9,000 కోట్ల పెట్టుబడితో రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట పోర్టుల అభివృద్ధితో పాటు మౌలిక సదుపాయాలను ఏపీఎం టెర్మినల్స్ కల్పించనుంది. కార్యక్రమంలో మంత్రి బీసీ జనార్దనరెడ్డి, మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి యువరాజ్, ఏపీఎం టెర్మినల్ యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు. పోర్టులలో అత్యాధునిక టెర్మినల్స్‌ను, కార్గో హ్యాండ్లింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేస్తామని ఏపీఎం టెర్మినల్స్ వెల్లడించింది. ఈ అభివృద్ధి కార్యక్రమాలతో ప్రత్యక్షంగా పదివేల మందికి ఉపాధి లభించనుంది. రాష్ట్ర తూర్పు తీరప్రాంతాన్ని వాణిజ్య కేంద్రంగా మారుస్తామని.. సరుకు రవాణా ద్వారా రాష్ట్రానికి ఆదాయ వనరులు పెంచేలా చర్యలు చేపడతామని ఈ సందర్భంగా చంద్రబాబు చెప్పారు. ఏపీలో 1,053 కిమీ సుదీర్ఘ తీరప్రాంతం ఉందని.. ప్రతి 50 కిమీకు ఒక పోర్టు లేదా హార్బర్ నిర్మాణం జరిగేలా కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు. ఈ ప్రణాళికల అమలుతో తీర ప్రాంతాలకు సమీపంలోని నగరాలు.. పరిశ్రమల నుంచి సరుకు రవాణా పెరుగుతుందన్నారు.

హస్తినకు సీఎం చంద్రబాబు

నేడు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ

న్యూఢిల్లీ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు గురువారం రాత్రి ఢిల్లీ చేరుకున్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో శుక్రవారం భేటీ కానున్నారు. సాస్కి(స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ కేపిటల్ ఇన్వెస్ట్‌మెంట్), పూర్వోదయ పథకాల తరహాలో కేంద్ర కార్యక్రమాల ద్వారా రాష్ట్రానికి నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేస్తారు. అనంతరం సాయంత్రం 5 గంటలకు ఢిల్లీలో ఎకనమిక్ టైమ్స్ నిర్వహించే వరల్డ్ లీడర్స్ ఫోరం సదస్సుకు హాజరవుతారు. రాత్రికి అమరావతికి తిరుగు ప్రయాణం అవుతారు.

మాకు పదోన్నతులు లేవా?

ఏళ్ల తరబడి డీడీలుగానే ఉన్నాం

- హాస్పిటల్స్ అడ్మినిస్ట్రేటర్ పోస్టులు మాకే ఇవ్వాలి
- ఆరోగ్యశాఖలో గ్రూప్-1 అధికారుల డిమాండ్

అమరావతి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశాఖలో పదోన్నతులు అందని ద్రాక్షలా మారాయి..! ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న డిప్యూటీ డైరెక్టర్ల(డీడీ)కు అతి కష్టంమీద జాయింట్ డైరెక్టర్లు (జేడీ)గా పదోన్నతి కల్పించేందుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అయితే... జేడీ స్థాయి పోస్టులు దాదాపు 15 ఉన్నా.. కేవలం 8 మందికే పదోన్నతి కల్పిస్తుండడంతో.. మిగిలిన వారు తమకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ నుంచి అధికారులను తీసుకొచ్చేందుకు చూపించే శ్రద్ధ.. ఆరోగ్యశాఖలోనే విధులు నిర్వహిస్తున్న గ్రూప్-1 అధికారులకు పదోన్నతులు కల్పించే విషయంలో చూపించడం లేదని విమర్శిస్తున్నారు.

పోస్టులు లేక డీడీలుగానే...

ప్రస్తుతం ఆరోగ్యశాఖలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పోస్టులు 88, అసిస్టెంట్ డైరెక్టర్ పోస్టులు 42, డిప్యూటీ డైరెక్టర్ పోస్టులు 11, జాయింట్ డైరెక్టర్ పోస్టులు 2, అడిషనల్ డైరెక్టర్ పోస్టులు 3 ఉన్నాయి. వాస్తవానికి కనీసం 21 డిప్యూటీ డైరెక్టర్, 11 జాయింట్ డైరెక్టర్, 5 అడిషనల్ డైరెక్టర్ పోస్టులు ఉండాలి. కానీ పై కేడర్ పోస్టులు తక్కువ ఉండడంతో కొంతమంది 18 ఏళ్ల నుంచి డీడీలుగానే ఉండిపోయారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తాజాగా 13 మంది డీడీలకు జేడీలుగా పదోన్నతి కల్పించేందుకు అవకాశం ఇచ్చింది. కానీ ఆరోగ్య శాఖ మాత్రం 8 మందికే జేడీలుగా పదోన్నతి కల్పిస్తోంది. దీంతో మరో ఐదుగురు డీడీలు పదోన్నతికి దూరమవుతున్నారు. వీరికి పదోన్నతులిచ్చేందుకు పోస్టులు లేవా అంటే.. ఆరోగ్యశాఖలో జేడీ స్థాయి పోస్టులు దాదాపు 15 ఉన్నాయి. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ)లో ఉన్న అడిషనల్ డైరెక్టర్ పోస్టుల్లో రెండింటిని జేడీ పోస్టులుగా మార్చారు. అలానే నేషనల్ హెల్త్ మిషన్‌లో ఎస్‌పీఎం (స్టేట్ ప్రోగామ్ ఆఫీసర్), సీఏవో (చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్), అర్బన్ హెల్త్ సెంటర్లు, రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) నోడల్ అధికారి పోస్టులు రెండు, నాన్ కమ్యూనబుల్ డిసీజెస్ (ఎన్‌సీడీ) స్పెషల్ జాయింట్ డైరెక్టర్‌తో పాటు భ్రూణహత్యల నివారణ చట్టం (పీసీపీ అండ్ డీటీ యాక్ట్) జాయింట్ డైరెక్టర్‌తో కలిపి 8 పోస్టులు మాత్రమే చూపిస్తున్నారు. ఇవికాకుండా ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ (ఏబీడీఎం)లో మూడు పోస్టులు, సెకండరీ హెల్త్ డైరెక్టరేట్‌లో సెక్రటరీ పోస్టు, ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్‌లో రెండు అడిషనల్ డైరెక్టర్ పోస్టులను కూడా జేడీ కేడర్‌లో భర్తీ చేసే అవకాశం ఉంది. కానీ.. ఆరోగ్య శాఖ మాత్రం 8 మందికే పదోన్నతి కల్పించేందుకు సన్నాహాలు చేస్తోంది.

సిబ్బంది అవసరాన్ని గుర్తించే నిర్ణయం: కృష్ణబాబు

ఆరోగ్యశాఖలో పదోన్నతులకు అవకాశాలు లేకపోవడం వల్ల పరిపాలనా సిబ్బంది ఎందుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం అదనంగా 6 జాయింట్ డైరెక్టర్ పోస్టులను సృష్టించాలని నిర్ణయించిందని ఆరోగ్యశాఖ స్పెషల్ సీఎస్ ఎంటీ కృష్ణబాబు చెప్పారు. అలాగే ఖాళీగా ఉన్న అడిషనల్ డైరెక్టర్ల పోస్టులను జాయింట్ డైరెక్టర్లతో భర్తీ చేయాలని నిర్ణయించిందని తెలిపారు. కేడర్ అవసరం గురించి ప్రభుత్వానికి పూర్తి సమాచారం ఉందని, భవిష్యత్తులో మరింత మంది సిబ్బంది ఆకాంక్షలను నెరవేరుస్తామని కృష్ణబాబు పేర్కొన్నారు.

ఆరోగ్యశాఖలో రెవెన్యూ సిబ్బంది..

ఆరోగ్యశాఖ పరిధిలో ఉన్న మెడికల్ కాలేజీల్లో హాస్పిటల్స్ అడ్మినిస్ట్రేటర్స్ పేరుతో 11 పోస్టులు సృష్టించారు. వాటిని రెవెన్యూ అధికారులతోనే భర్తీచేసేలా గత వైసీపీ ప్రభుత్వంలో జీవోలు జారీ చేశారు. దీనిపై ఆరోగ్యశాఖలోని గ్రూప్-1 అధికారులు తొలి నుంచీ అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు జేడీ పదోన్నతుల అంశం తెరపైకి రావడంతో హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ పోస్టులను ఆరోగ్యశాఖలోని అధికారులతో భర్తీ చేయాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలోని 11 మెడికల్ కాలేజీల్లో ఉన్న హాస్పిటల్స్ అడ్మినిస్ట్రేటర్స్ పోస్టుల్లో విశాఖలోని కేజీహెచ్, కాకినాడ రంగరాయ, విజయవాడ సిద్ధార్థ, గుంటూరు మెడికల్ కాలేజీ, తిరుపతి శ్రీ వెంకటేశ్వర కాలేజీ, కర్నూలు మెడికల్ కాలేజీల్లో పోస్టులను ఆరోగ్యశాఖలోని జేడీలతో భర్తీ చేయాలని, అనంతపురం, కడప, ఒంగోలు, నెల్లూరు, శ్రీకాకుళం మెడికల్ కాలేజీల్లో హాస్పిటల్స్ అడ్మినిస్ట్రేటర్స్ పోస్టులను డీడీలతో భర్తీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ పోస్టులను జేడీ, డీడీలుగా మార్చడం వల్ల ఆరోగ్యశాఖలో పోస్టులు పెరిగి, గ్రూప్-1 అధికారులకు పదోన్నతులు రావడంతో పాటు ప్రతి కేడర్ పోస్టులు కింద కేడర్‌లో సగం ఉంటాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పార్టీలో చర్చించి రాజధానిపై నిర్ణయం

- వినాయక చవితి తర్వాతే మిథున్‌రెడ్డితో జగన్ ములాఖత్: బొత్స



రాజమహేంద్రవరం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : రాజధాని అమరావతా.. మూడు రాజధానులా అనేది తమ పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని శాసనమండలిలో ప్రతిపక్ష నేత, వైసీపీ రాష్ట్ర సమన్వయకర్త బొత్స సత్యనారాయణ చెప్పారు. గురువారం రాజమండ్రిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వాననీరు రెండు అడుగుల వరకూ ఉన్నందునే అమరావతి మునిగిందని చెప్పామని.. దీనిపై కేసులు పెడతామంటున్నారని.. ఎలా పెడతారని ప్రశ్నించారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని.. దానిని రక్షించడం కోసం ఉద్యమిస్తున్నామన్న జనసేన.. ఈనెల 30న విశాఖలో జరిగే విస్తృత స్థాయి సమావేశంలో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. 'యోగా డే కోసం ప్రధానమంత్రి విశాఖ వచ్చి కనీసం ఉక్కు మాట ఎత్తలేదు. కూటమి ప్రభుత్వం కూడా ఒత్తిడి చేయలేదు. ప్రధాని వచ్చినప్పుడు ఆ ప్రాంతానికి ఏదో ఒకటి ప్రకటించాలి కదా! ఆయన వచ్చి ఏం లాభం.. ఏంమేలు జరిగింది? రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డిని కలవడానికి జగన్ 25న రావాలనుకున్నారు. కానీ వినాయక చవితి వెళ్లిన తర్వాత వస్తారు' అని చెప్పారు.

ఎన్డీఏ అభ్యర్థికే మద్దతు

ఉపరాష్ట్రపతి రాజ్యాంగ పదవి అని, నంబర్ గేమ్ ఉండకూడదనే ఎన్డీఏ అభ్యర్థికి మద్దతిస్తున్నామని బొత్స తెలిపారు. గతంలో కాంగ్రెస్ నుంచి ప్రణబ్ ముఖర్జీ రాష్ట్రపతి అభ్యర్థిగా ఉన్నప్పుడు కూడా జగన్ మద్దతిచ్చారని.. కోడెల శివప్రసాద్ స్పీకర్‌గా ఎన్నికయ్యేటప్పుడూ తాము పోటీ పెట్టలేదని చెప్పారు.

దరఖాస్తుల్లో ఇదేం ఫిటింగ్!

4 దరఖాస్తులు వస్తేనే బార్‌కు లాటరీ

- అంతకంటే తక్కువ వస్తే తీయరు
- దరఖాస్తు రుసుం కూడా తిరిగివ్వరు
- ఒక్కో దరఖాస్తు ఫీజు రూ.5లక్షలు
- బార్ పాలసీపై వ్యాపారుల్లో నిరాసక్తత

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఏదైనా టెండర్‌కు ఒకటి కంటే ఎక్కువ దరఖాస్తులు రావాలనే నిబంధన సహజం. కానీ కచ్చితంగా నాలుగు దరఖాస్తులు రావాలనే నిబంధన దేశంలో ఎక్కడా లేదు. అలాంటిది రాష్ట్ర బార్ పాలసీలో నిబంధన పెట్టారు. 4దరఖాస్తులు వస్తేనే లాటరీ తీస్తామని పేర్కొన్నారు. దానికి మరొక మెలిక కూడా తగిలించారు. నాలుగు కంటే తక్కువ దరఖాస్తులు వస్తే లాటరీ తీయకపోగా, ఆ దరఖాస్తుదారులకు డబ్బులు కూడా వెనక్కి ఇవ్వరు. ఉదాహరణకు ఆసక్తి ఉన్నవారు రూ.5లక్షలు వెచ్చించి ఒక బార్‌కు దరఖాస్తు సమర్పిస్తారు. కానీ 4 దరఖాస్తులు రాలేదనే కారణంతో ఆ బార్‌కు లాటరీ తీయరు. అలాంటప్పుడు దరఖాస్తుదారుకు రూ.5లక్షలు తిరిగి ఇస్తారని అందరూ అనుకున్నారు. కానీ లాటరీ తీయకపోయినా డబ్బులు తిరిగి చెల్లించకూడదని నిర్ణయించారు. లాటరీ నిర్వహించని బార్‌కు కొన్ని రోజుల తర్వాత తిరిగి నోటిఫికేషన్ జారీచేసి, రెండోసారి దరఖాస్తులు స్వీకరిస్తారు. అప్పుడు మొదట్లో దరఖాస్తు సమర్పించిన వ్యక్తిని తిరిగి దరఖాస్తుదారుగా పరిగణిస్తారు. అలా ఆ బార్‌కు లైసెన్స్ కేటాయించేవరకూ ఆ వ్యక్తి దరఖాస్తుదారుగా ఉంటారు తప్ప అతనికి రూ.5లక్షలు తిరిగివ్వరు. అయితే ఎన్ని నోటిఫికేషన్లు జారీచేసినా ఆ బార్‌కు లాటరీ నిర్వహించే పరిస్థితి రాకపోతే పరిస్థితి ఏంటనేది ప్రశ్నార్థకంగా మారింది. అలాగే ఒకసారి దరఖాస్తులు రాకపోతే ఆ బార్లకు డిమాండ్ తగ్గిపోతుంది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 50కి పైగా బార్లు ఎవరూ తీసుకోకపోవడంతో మిగిలిపోయాయి. నూతన బార్ పాలసీపై వ్యాపారుల్లో అనాసక్తి ఎక్కువగా కనిపిస్తోంది. 4దరఖాస్తులు, అదనపు ఏఆర్‌ఈటీ లాంటివి ఆర్థిక భారం అవుతాయనే కోణంలో దూరంగా ఉండాలని భావిస్తున్నారు. ఎవరైనా ముందుకొచ్చి రూ.5లక్షలు చెల్లించి దరఖాస్తు పెట్టుకుంటే, లాటరీ తీయకపోయినా ఆ నగదు వెనక్కి ఇవ్వరనే నిబంధన వ్యాపారులను నిరాసక్తికి గురిచేస్తోంది. కాగా ఎక్సైజ్ శాఖ దరఖాస్తుల కోసం నానా పాట్లు పడుతోంది. వ్యాపారులతో పదే పదే సమావేశాలు నిర్వహించాలని ఉన్నతాధికారులు జిల్లాల అధికారులను ఒత్తిడి చేస్తున్నారు. కానీ చాలా ప్రాంతాల్లో దరఖాస్తులు సమర్పించేందుకు వ్యాపారులు ముందుకు రావట్లేదు. గతంలో కల్లుగీత కులాలకు 340 మద్యం షాపులు కేటాయించిన సమయంలో గోప్యత పాటించిన ఎక్సైజ్ ఉన్నతాధికారులు ఇప్పుడు మాత్రం దరఖాస్తుల కోసం విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. మరోవైపు ఏ బార్‌కు ఎన్ని దరఖాస్తులు వచ్చాయనే వివరాలను అందరికీ అందుబాటులో ఉంచకుండా రహస్యం పాటిస్తున్నారు. దీంతో వ్యాపారులు ఈ వివరాలకోసం ఎక్సైజ్ ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారు. గతంలో షాపుల పాలసీ సమయంలో వెబ్‌సైట్‌లో ఈ సమాచారాన్ని అందుబాటులో ఉంచారని వ్యాపారులు చెబుతున్నారు.

ఇండీ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి నామినేషన్

- వెంట వచ్చిన సోనియా, రాహుల్, పవార్
- కేజ్రీవాల్ ఇంటికి వెళ్లి కలిసిన సుదర్శన్‌రెడ్డి
- గెలిపిస్తే పదవికే వన్నె తెస్తారని కేజ్రీవాల్ ప్రశంస
- ఎంపీలు నిర్భయంగా ఓటు వేయాలి
- తనది సైద్ధాంతిక పోరన్న సుదర్శన్‌రెడ్డి
- త్వరలో అఖిలేశ్, మమత, సోరేన్‌లతో భేటీ


సోనియా, పవార్, ఖర్గే, ప్రియాంక సమక్షంలో నామినేషన్ దాఖలు చేస్తున్న సుదర్శన్‌రెడ్డి

న్యూఢిల్లీ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి నామినేషన్ వేశారు. గురువారం ఉదయం 11.30 గంటలకు రిటర్నింగ్ అధికారి, రాజ్యసభ సెక్రటరీ జనరల్ పీసీ మోడీకి తన నామినేషన్ పత్రాలు సమర్పించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, ఎన్సీపీ నేత శరద్ పవార్, సమాజ్‌వాదీ ఎంపీ రాంగోపాల్ యాదవ్, డీఎంకే ఎంపీ తిరుచ్చి శివ, శివసేన(యుబిటి) ఎంపీ సంజయ్ రావత్, డీఎంకే ఎంపీ తిరుచ్చి శివ, టీఎంసీ ఎంపీ శతాబ్ది రాయ్, సీపీఎం ఎంపీ జాన్ బ్రిటాస్, ఆప్ ఎంపీ సంజయ్ సింగ్, ఇతర ప్రతిపక్ష నేతలు నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. 4 సెట్లుగా సమర్పించిన నామినేషన్ పత్రాలపై 200 మంది ఎంపీలు సంతకాలు చేశారు.

కేసీఆర్‌తో మాట్లాడతా: కేజ్రీవాల్

జస్టిస్ సుదర్శన్‌రెడ్డి గురువారం సాయంత్రం ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆమ్‌ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌ను ఆయన ఇంటికి వెళ్లి కలుసుకుని తనకు మద్దతు ప్రకటించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయనను గెలిపించేందుకు తాను శాయశక్తులా ప్రయత్నిస్తానని కేజ్రీవాల్ చెప్పారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో మాట్లాడతానని ఆయన సుదర్శన్‌రెడ్డికి చెప్పినట్లు తెలిసింది. తాను కూడా రాష్ట్రాలకు వెళ్లి జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని గెలిపించేందుకు ప్రయత్నిస్తానని కేజ్రీవాల్ అన్నారు. తృణమూల్ నేత కల్యాణ్ బెనర్జీ, కాంగ్రెస్ నేత ప్రమోద్ తివారీ సుదర్శన్‌రెడ్డితో పాటు కేజ్రీవాల్‌ను కలుసుకున్నారు. కేజ్రీవాల్ తన ఇంటి బయట మీడియాతో మాట్లాడుతూ, విప్ లేకుండా సీక్రెట్ బ్యాలట్ ద్వారా జరుగుతున్న ఎన్నికల్లో అన్ని పార్టీల ఎంపీలు నిర్భయంగా ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఆత్మగౌరవం నినాదానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ప్రాధాన్యం ఉన్నందువల్ల రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీల నేతలను జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి ఓటు వేయాలని కోరతానని చెప్పారు. తాను ఏ పార్టీ సభ్యుడిని కాదని, ఉప రాష్ట్రపతి బాధ్యత రాజకీయ బాధ్యత కాదని సుదర్శన్‌రెడ్డి అన్నారు. స్వతంత్రంగా, నిష్పాక్షికంగా నిర్వహించాల్సిన రాజ్యాంగ బాధ్యతను న్యాయమూర్తిగా కూడా నెరవేర్చానని చెప్పారు. ఉపరాష్ట్రపతిగా ఎన్నికైతే అదే బాధ్యతను నెరవేరుస్తానని చెప్పారు.

ఇది సైద్ధాంతిక పోరు

రాజ్యాంగ విలువలపై బాధ్యతతో, అచంచలమైన నిబద్ధతతో ప్రతిపక్ష ఉమ్మడి అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశానని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా, లా విద్యార్థిగా, భారత రిపబ్లిక్ ప్రజాస్వామిక సంప్రదాయాలను జీర్ణించుకున్న పౌరుడిగా భారతదేశ నిజమైన శక్తి ఏమిటో తన జీవితంలో తెలుసుకున్నానని చెప్పారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ఉన్నత సంప్రదాయాలను పరిరక్షించే బాధ్యత రాజ్యసభ చైర్మన్‌గా ఉప రాష్ట్రపతికి ఉన్నదని, నిష్పాక్షికంగా, హుందాగా, పరస్పర చర్చలు, విలువల పట్ల మొక్కవోని అంకితభావంతో విధిని నిర్వహిస్తానని చెప్పారు.

త్వరలో అఖిలేష్, మమత, సొరేన్‌లతో భేటీ

కేజ్రీవాల్‌ను కలిసిన అనంతరం జస్టిస్ సుదర్శన్‌రెడ్డి హైదరాబాద్ బయలుదేరి వెళ్లారు. శుక్రవారం సీనియర్ న్యాయవాది ప్రతాప్‌రెడ్డి అంత్యక్రియల్లో పాల్గొన్న తర్వాత ఆయన సాయంత్రానికి ఢిల్లీ తిరిగి వస్తారు. తర్వాత అన్ని పార్టీల ఎంపీలకు తనను గెలిపించాలని కోరుతూ లేఖలు పంపాలని ఆయన నిర్ణయించారు. ఈ నెల 26న సమాజ్‌వాదీ నేత అఖిలేశ్‌యాదవ్‌ను కలుసుకునేందుకు లఖ్‌నవూ వెళ్తున్నారు. బెంగాల్, జార్ఖండ్ సీఎంలు మమతా బెనర్జీ, హేమంత్ సోరెన్‌ను కూడా కలుస్తారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ సహా ఎన్డీఏ సీఎంలను కలిసేందుకు కూడా ప్రయత్నించాలని సుదర్శన్‌రెడ్డి భావిస్తున్నారు. ఆయన పర్యటన కార్యక్రమాలను ఇండియా కూటమికి చెందిన కోర్ కమిటీ సభ్యులు నిర్ణయిస్తున్నారు.

తాతను ఏం 'మాయ' చేశావే!

- 81 ఏళ్ల వృద్ధుడిపై వలపువల
- 7.11 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు



హైదరాబాద్ సిటీ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి):సైబర్ నేరగాళ్లు వేసిన వలపు వల 'మాయ'లో పడి ఓ 81 ఏళ్ల వృద్ధుడు రూ.7.11 లక్షలు పోగొట్టుకున్నాడు. హైదరాబాద్‌లోని అమీర్‌పేటకు చెందిన వృద్ధుడి(81) వాట్సా‌ప్‌కు జూన్ మొదటి వారంలో గుర్తు తెలియని నంబర్ నుంచి కాల్, మెసేజ్‌లు వచ్చాయి. వృద్ధుడు ఆ కాల్‌కు స్పందించగా.. అవతలి వైపు ఓ అమ్మాయి మాట్లాడింది. తన పేరు మాయా రాజ్‌పుత్ అని పరిచయం చేసుకున్న ఆ యువతి.. ప్రేమగా మాట్లాడుతూ వృద్ధుడిని తన మాయలో పడేసింది. కొద్దిరోజుల తర్వాత వృద్ధుడిని ఆర్థిక సాయం అడగడం ప్రారంభించింది. ఆస్పత్రి ఖర్చులు, తనఖా పెట్టిన ఆభరణాలు విడిపించడం, ప్లాట్ రిజిస్ట్రేషన్, గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు కొనుగోలు ఇలా రకరకాల కారణాలు చెప్పి వృద్ధుడి నుంచి విడతల వారీగా రూ.7.11 లక్షలు తీసుకుంది. వృద్ధుడు ఆ డబ్బులు తిరిగి వసూలు చేసే ప్రయత్నం చేయగా.. 'మాయ రాజ్‌పుత్' మాయమైపోయింది. మోసపోయానని ఆలస్యంగా గ్రహించిన వృద్ధుడు పోలీసులను ఆశ్రయించాడు. కేసు దర్యాప్తులో ఉందని డీసీపీ ధార కవిత తెలిపారు.

విదేశీ ఆన్‌లైన్ గేమింగ్ యాప్‌లను నిషేధిస్తే బాగుండేది: లావు

న్యూఢిల్లీ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి: కీలకమైన బిల్లులను ఆమోదించడం ద్వారా సమావేశాల సమయం వృథా కాకుండా చేయగలిగామని టీడీపీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. ముఖ్యంగా ఆన్‌లైన్ గేమింగ్ బిల్లును ఆమోదించడంతో ప్రజలకు ఎంతో మేలు జరిగిందని చెప్పారు. అయితే విదేశీ ఆన్‌లైన్ గేమింగ్ యాప్‌లను కూడా నిషేధించి ఉంటే బాగుండేదని ఆయన అన్నప్పుడు, ఆ విషయం కూడా పరిగణనలోకి తీసుకుంటామని మోదీ అన్నారు. ఈ సమావేశంలో హోం మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు, ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి, పౌర విమానయాన మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడుతో పాటు పలు పార్టీల నేతలు పాల్గొన్నారు.






గురువారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు, సమావేశానికి హాజరైన మంత్రులు

ఎన్నిసార్లు చెప్పినా వినరేం?

(మొదటి పేజీ తరువాయి)

తప్పటడుగు వేస్తామా అని ప్రతిపక్షం ఎదురుచూస్తుంటుందని.. వారికి ఎలాంటి అవకాశమూ ఇవ్వకుండా వ్యవహరించాలని వ్యాఖ్యానించారు. వైసీపీ ఇటీవల చేస్తున్న దుష్ప్రచారాలను ప్రస్తావిస్తూ.. 'రాష్ట్రంలో క్రిమినల్ మాఫియా తయారైంది. మనం మంచి చేసినా చెడుగా జనంలోకి తీసుకెళ్లడం వారి ప్రత్యేకత. ప్రభుత్వం చేసిన ఏ కార్యక్రమంపైనైనా బురదజల్లడమే ఆ మాఫియా పని. ఈ విషయంలో మనం అప్రమత్తంగా లేకుంటే చాలా నష్టపోతాం' అని మంత్రివర్గ సహచరులను హెచ్చరించారు. మనం చేసిన మంచిపై చర్చ జరగాల్సి ఉండగా.. ఎమ్మెల్యేల వివాదాలపై జరుగుతోందని.. ఇది మంచి పరిణామం కాదని స్పష్టంచేశారు.

ఫైళ్ల క్లియరెన్స్‌పై శ్రద్ధపెట్టండి

క్యాబినెట్ భేటీలో ఫైళ్ల క్లియరెన్స్‌పై సీఎం మంత్రులతో చర్చించారు. ఒక ఫైలు క్లియర్ చేయడానికి తాను సగటున మూడ్రోజులు తీసుకుంటున్నానని తెలిపారు. 'ఒకరోజు 10 ఫైళ్లు క్లియర్ చేయొచ్చు.. ఇంకోరోజు రెండు ఫైళ్లు మాత్రమే చేయొచ్చు. సగటు తీసుకుని ఫైళ్ల క్లియరెన్స్ ఎంత వేగంగా చేస్తున్నారో పరిగణనలోకి తీసుకున్నాం' అని వివరించారు. పౌరసరఫరాల శాఖలో ఒక్కో ఫైలు క్లియర్ కావడానికి సగటున 33 రోజుల సమయం పడుతోందని సీఎం ప్రస్తావించగా.. తానీ విషయంలో వేగంగానే ఉన్నానని.. లెక్కల్లో ఎక్కడో తేడా ఉందని ఆ శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. చెక్ చేద్దామని సీఎం అన్నారు. ఆర్థిక, రవాణాశాఖల్లో సగటున ఫైళ్ల క్లియరెన్స్‌కు సగటున 15 రోజులు పడుతోందని చెప్పారు. కార్యదర్శుల్లో బుడితి రాజశేఖర్ అత్యంత వేగంగా సగటున 18 గంటలకో ఫైలు క్లియర్ చేస్తున్నారని సీఎం తెలిపారు. సంబంధిత సెక్రటరీలతో పోల్చి చూసుకోవాలని, వేగం పెంచాలని మంత్రులకు సూచించారు.

వాట్సాప్ గవర్నెన్స్‌పై పవన్ ఆసక్తి

ఆర్టీజీఎస్ పనితీరును వివరిస్తూ కార్యదర్శి కాటంనేని భాస్కర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వగా.. మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్‌కు స్పందన ఎలా ఉందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. చాలా బాగుందని మంత్రి లోకేశ్, భాస్కర్ సమాధానమిచ్చారు.

సీఎంను మళ్లీ కలిసిన అనంత ఎమ్మెల్యే

సీఎం చంద్రబాబును అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ మరోసారి కలిశారు. బుధవారం రాత్రి సీఎంను కలిసిన ఆయన.. గురువారం మళ్లీ సమావేశమయ్యారు. జూనియర్ ఎన్టీఆర్‌పై తాను చేసిన వ్యాఖ్యలకు వివరణ ఇచ్చారు. నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ కూడా సీఎంను కలిశారు.

రేపు మంత్రులు, ఎమ్మెల్యేలతో సీఎం భేటీ

» టీడీపీ సంస్థాగత కమిటీలపై కసరత్తు

అమరావతి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సంస్థాగత నిర్మాణంపై ఆ పార్టీ అధినేత చంద్రబాబు దృష్టి సారించారు. శనివారం (23న) ఉండవల్లిలోని తన నివాసంలో పార్టీకి చెందిన మంత్రులు, పొలిట్‌బ్యూరో సభ్యులు, కొంత మంది ఎమ్మెల్యేలతో సమావేశం ఏర్పాటు చేశారు. సంస్థాగత ఎన్నికలపై ఈ సందర్భంగా చర్చిస్తారు. అసెంబ్లీ, పార్లమెంటరీ కమిటీల నియామకం ఎంత వరకు వచ్చిందన్న అంశాలతోపాటు రాష్ట్ర కమిటీ ఏర్పాటుపైనా చర్చించనున్నారు. ఈ సమావేశంలోనే స్త్రీశక్తి పథకం విజయవంతంపై జిల్లాల్లో ఏర్పాటు చేయనున్న సమావేశాలపైనా చర్చిస్తారు. సెప్టెంబరు 3న అనంతపురంలో సూపర్ సిక్స్ సూపర్ హిట్ పేరుతో ఏర్పాటు చేయనున్న బహిరంగ సభపై కూడా చర్చించనున్నారు. వాస్తవానికి ఈ సభను ఈ నెల 25న నిర్వహించాలని భావించారు.

ఏడుగురు ఎమ్మెల్యేలను కంట్రోల్ చేయలేరా?

» సానుకూలతలన్నిటినీ వెనక్కి నెట్టేలా మన ఎమ్మెల్యేల వివాదాలపై చర్చ

» ఇది చాలా ప్రమాదకర సంకేతం.. క్యాబినెట్ భేటీకి ముందు మంత్రులతో లోకేశ్

అమరావతి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): క్యాబినెట్ భేటీకి ముందు ఉండవల్లిలోని సీఎం నివాసంలో మంత్రి లోకేశ్ ఏర్పాటు చేసిన బ్రేక్ ఫాస్ట్ భేటీలోనూ ఎమ్మెల్యేల వ్యవహారశైలిపై చర్చ జరిగింది. ఇన్‌చార్జి మంత్రులు తమ పరిధిలోని ఏడుగురు ఎమ్మెల్యేలను కంట్రోల్ చేయలేకపోతే ఎలాగని ఆయన ఈ సందర్భంగా ప్రశ్నించారు. 'ఎమ్మెల్యేల వ్యవహారశైలిపై సీఎం చాలా సీరియస్‌గా ఉన్నారు. గాడి తప్పుతున్న ఎమ్మెల్యేలను కట్టడి చేయాల్సిన బాధ్యత పూర్తిగా ఇన్‌చార్జి మంత్రులపైనే ఉంది. స్త్రీశక్తి పథకానికి ఆడపడుచుల నుంచి అద్భుత స్పందన వచ్చింది. తల్లికి వందనంపై కూడా పాజిటివ్ రిపోర్టులు ఉన్నాయి. అన్నదాత సుఖీభవపై రైతుల్లో ఆనందం కనిపిస్తోంది. పులివెందులలో కూడా టీడీపీ గెలిచిందన్న విషయం ప్రజల్లోకి వెళ్లింది. ఈ సానుకూలతలన్నిటినీ వెనక్కినెట్టేసేలా రాష్ట్రమంతా మన ఎమ్మెల్యేల వివాదాలపైనే చర్చ జరుగుతుండడం చాలా ప్రమాదకర సంకేతం. వారు చేసే పనులకు పార్టీ మూల్యం చెల్లించాల్సి వస్తోంది. గాడి తప్పుతున్న ఎమ్మెల్యేలపై కఠినంగా వ్యవహరిస్తాం' అని లోకేశ్ తేల్చిచెప్పారు. శ్రీశైలం ఎమ్మెల్యే ప్రభుత్వ ఉద్యోగులపై దాడి చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఇలాంటి చర్యలతో ప్రభుత్వం చేస్తున్న మంచి అంతా పోయి చివరకు ప్రజల్లో వ్యతిరేక భావన ప్రబలే ప్రమాదం ఉంది' అని వ్యాఖ్యానించారు.

ఆ ఎమ్మెల్యేల పేర్లు ప్రస్తావిస్తూ సీరియస్

శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ పేర్లను ప్రస్తావిస్తూ లోకేశ్ సీరియస్ అయినట్లు సమాచారం. ఈ ఎమ్మెల్యేల వివాదాల్లో తప్పు ఎవరిదైనా చివరకు ప్రభుత్వంపై ప్రభావం పడిందని, ఇలాంటి విషయాల్లో ఎమ్మెల్యేలందరూ అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకొచ్చే పనులు ఎవ్వరూ చేయొద్దని.. ఇన్‌చార్జి మంత్రులు తమ పరిధిలోని ఏడుగు ఎమ్మెల్యేలకు గట్టిగా హెచ్చరికలు పంపాలని సూచించారు.

బ్యాక్‌గ్రౌండ్ చెక్ తప్పనిసరి..

నెల్లూరు లేడీ డాన్, ఆమె ప్రియుడికి పెరోల్ అంశాన్ని లోకేశ్ హోం మంత్రి అనితతో ప్రస్తావించారు. 'ఇలాంటి విషయాల్లో అప్రమత్తంగా లేకపోతే జరిగే నష్టం ఎలా ఉంటుందో గత వారం రోజులుగా చూస్తున్నాం. ఎవరు సిఫారసు చేసినా బ్యాక్‌గ్రౌండ్ చెక్ తప్పక జరగాలి. ఆ తర్వాత నిర్ణయం తీసుకోవాలి. తొందరపాటు నిర్ణయాలతో అనవసర వివాదాలు తప్పవు' అని అన్నారు.

అన్యాయం జరగనివ్వం



సచివాలయాల్లో జాబితాల ప్రదర్శన

పింఛన్లు తొలగిస్తే రీవెరిఫికేషన్ కోరవచ్చు

ప్రభుత్వం కూడా సమగ్ర పరిశీలన చేస్తుంది

దివ్యాంగుల పింఛన్లపై మంత్రి లోకేశ్ స్పష్టీకరణ

పింఛన్ల తొలగింపును లోకేశ్ దృష్టికి తెచ్చిన మంత్రులు

అమరావతి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల పింఛన్ల విషయంలో అర్హులైన ఏ ఒక్కరికీ కూడా అన్యాయం జరగనివ్వబోమని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. ఈ వ్యవహారంలో పారదర్శకతకు పెద్దపీట వేయాల్సిన అవసరం ఉందన్నారు. దివ్యాంగుల పింఛన్ల తొలగింపు విషయంపై రాష్ట్రవ్యాప్తంగా అలజడి ఉందని క్యాబినెట్ భేటీకి ముందు లోకేశ్‌కు మంత్రులు వివరించారు. అనర్హులను ఏరివేయాల్సిన అధికారులు కొన్ని చోట్ల అర్హులపైనా వేటు వేశారన్న ఫిర్యాదులు వస్తున్నాయని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ అంశం తన దృష్టికి కూడా వచ్చిందని లోకేశ్ తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో వేలాది మంది అనర్హులకు ఆ పార్టీ సానుభూతిపరులన్న ఒకే ఒక్క కారణంతో దివ్యాంగుల పింఛన్లు ఇచ్చారని వ్యాఖ్యానించారు. తొలగించిన పింఛన్ల విషయంలో మనం పారదర్శకంగా ఉన్నామన్న విషయాన్ని ప్రజలకు తెలియజేయాల్సి ఉందన్నారు. తొలగించిన పింఛనుదారుల జాబితాలను సచివాలయాల వద్ద బహిరంగంగా ప్రదర్శించాలని అధికారులను ఆదేశిస్తామని చెప్పారు. అర్హులు ఎవరైనా తమ పింఛను తొలగింపుపై రీవెరిఫికేషన్ కోరవచ్చని సూచించారు. ప్రభుత్వం కూడా తొలగించిన పింఛన్లపై పూర్తిస్థాయిలో మరోసారి పరిశీలన చేయిస్తుందని హామీ ఇచ్చారు. మొత్తం 1.20 లక్షల పింఛన్ల వరకు నిలిపివేశారని, వారిలో కొందరు టీడీపీ వారు కూడా ఉన్నారని మంత్రులు లోకేశ్ దృష్టికి తీసుకురాగా, పార్టీలకతీతంగా అర్హులకు న్యాయం చేద్దామని లోకేశ్ వ్యాఖ్యానించారు. అనర్హులు మన పార్టీవారైనా పక్కన పెడదామన్నారు. రాష్ట్రంలో అర్హత ఉన్న ఒక్క దివ్యాంగుడు కూడా పింఛనుకు దూరం కాకూడదన్నది ప్రభుత్వ లక్ష్యమని లోకేశ్ స్పష్టం చేశారు.

అర్హులైన వారి పింఛన్ రద్దు కాదు

(మొదటి పేజీ తరువాయి)

అడ్డదారిలో సదరం సర్టిఫికెట్లు తీసుకుని పింఛన్లు పొందుతున్న వారిపై ఇటీవల జరిపిన పునఃపరిశీలన వివరాలను అధికారులు ముఖ్యమంత్రి ముందుంచారు. ఈ ప్రక్రియలో అనర్హులను గుర్తించినట్లు చెప్పారు. అన్ని విధాలా పూర్తి ఆరోగ్యవంతులుగా ఉండి.. ఎలాంటి వైకల్యం లేకుండానే కొంత మంది దివ్యాంగ పింఛన్లు పొందుతున్నట్లు పరిశీలనలో తేలిందన్నారు. అనర్హులను ధ్రువీకరించడానికి ప్రత్యేక వైద్య బృందాలను నియమించి, పింఛన్ అనర్హులను నిర్ధారించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి స్పందిస్తూ.. నకిలీ పింఛన్లు మాత్రమే తొలగించాలని, అర్హులైన ఏ ఒక్క దివ్యాంగ వ్యక్తికి పింఛన్ రద్దు కాకూడదని అధికారులను ఆదేశించారు. అర్హత ఉన్న పింఛన్లన్నీ యథావిధిగా కొనసాగుతాయని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. అలాగే తాత్కాలిక సర్టిఫికెట్ల ద్వారా దివ్యాంగుల పింఛన్, హెల్త్ పెన్షన్ పొందేవారికి కూడా ఎప్పటిలా నెలనెలా పింఛన్ అందించాలని స్పష్టం చేశారు. వారికి పంపించిన నోటీసులు సైతం వెనక్కి తీసుకోవాలని చెప్పారు.

క్వాంటమ్ హబ్ భవన నిర్మాణ టెండర్లకు అనుమతి

అమరావతి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో క్వాంటమ్ కంప్యూటింగ్ హబ్‌కు క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. దీని భవన నిర్మాణానికి టెండర్లను పిలిచేందుకు కూడా క్యాబినెట్ సమ్మతించింది. ప్రభుత్వం నిర్మించే భవనానికి ఐబీఎం సంస్థ అద్దె చెల్లిస్తుంది. జనవరి ఒకటి నుంచి క్వాంటమ్ వ్యాలీ కార్యకలాపాలు ప్రారంభంకానున్నాయి. ఇదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వ కార్యకలాపాల కోసం ఇంటర్నెట్‌తో సహా సాంకేతిక సహకారాన్ని ఐబీఎం ఉచితంగా అందిస్తుంది. ఈ సేవలను రాష్ట్ర ప్రభుత్వ శాఖల సేవల కోసం ఐటీ శాఖ వినియోగించుకుంటుంది. ఇక క్వాంటమ్ హబ్‌కు క్యాబినెట్ ఆమోదం లభించడంతో అమరావతిలో ప్రత్యేక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన భవన నిర్మాణానికి రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ సిద్ధమైంది.

చెత్త కూడా సంపదే!

» వ్యర్థాల సక్రమ నిర్వహణకు ప్రోత్సాహకాలు

» వేస్ట్ రీసైక్లింగ్ పాలసీకి క్యాబినెట్ ఆమోదం

అమరావతి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): చెత్తే కదా అని పారేయవద్దు... వ్యర్థాలూ సంపదేనని గుర్తించాలంటూ పారిశ్రామికవేత్తలను, వర్తక, వాణిజ్య సంస్థలను రాష్ట్రప్రభుత్వం కోరుతోంది. వ్యర్థాలనిర్వహణను ఒక వాణిజ్య విధానంగానే పరిగణించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా "ఏపీ సర్క్యులేషన్ ఎకానమీ- వేస్ట్ రీసైక్లింగ్ 4.ఓ" పాలసీని తీసుకువచ్చింది. ఈ పాలసీకి గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశం ఆమోదముద్ర వేసింది. సాధారణంగా పారిశ్రామికవ్యర్థాల నిర్వహణపై అలసత్వం వహించే సంస్థలకు అపరాధరుసుం విధిస్తుంటారు. తాజాగా ప్రభుత్వం రూటు మార్చి.. చక్కని నిర్వహణ చేపట్టిన యాజమాన్యాలకు ప్రత్యేక ప్రోత్సాహకాలను ఇవ్వాలని నిర్ణయించింది. పాలసీలో ఇందుకు సంబంధించిన అంశాలను పొందుపరిచింది. పారిశ్రామిక, వ్యవసాయ, పశు వ్యర్థాల యాజమాన్య నిర్వహణపై ఈ పాలసీలో ప్రత్యేక దృష్టి సారించారు. కొన్ని పెద్ద పారిశ్రామిక సంస్థలు ఉత్పత్తికి పనికిరాని ప్లాస్టిక్, ఇనుపరేకులు, ఆయిల్స్‌ను బహిరంగ ప్రదేశంలో డంప్ చేస్తున్నాయి. వినియోగించని వ్యవసాయోత్పత్తులను బహిరంగప్రదేశాల్లో పారబోస్తున్నారు. అవి కుళ్లిపోయి, దుర్గంధాన్ని వెదజల్లడంతోపాటు రోగాల వ్యాప్తికి కారణమవుతున్నాయి. కబేళాలు .. పౌల్ట్రీ యాజమాన్యాలు వ్యర్థాలను చెరువుల్లోనూ, బహిరంగ ప్రదేశాల్లోనూ పారబోస్తున్నాయి. అదేగనుక వ్యర్థాలను ఒక చోటకు చేర్చి ప్రత్యామ్నాయ ఉత్పత్తులను తయారు చేయడం ద్వారా ఆదాయం సంపాదించుకోవచ్చునని యాజమాన్యాలకు సూచించనున్నారు. ఇందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తుంది. వ్యర్థాలను డంప్ చేసేందుకుగాను దీర్ఘకాలానికి చౌకగా భూములను లీజులకు ఇవ్వాలని నిర్ణయించింది. భూములను తక్కువ ధరకు లీజులకు ఇవ్వడం వల్ల .. పారిశ్రామిక, ప్రైవేటు వ్యక్తులు కూడా వ్యర్థాల నిర్వహణకు ముందుకు వస్తారని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈ పాలసీలో భాగంగా, పారిశ్రామిక వ్యర్థాల యాజమాన్య నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ చేస్తూ " రేటింగ్ "లను ప్రభుత్వం ఇవ్వనుంది. హరిత ట్యాగ్‌లను అందిస్తుంది. వీటి ఆధారంగానే ప్రోత్సాహకాలు కల్పిస్తారు.



పంచాయతీలకే 'నాలా' మార్పు ప్రయోజనం

» నాలా చట్టంపై చర్చ సందర్భంగా డిప్యూటీ సీఎం సూచన... స్వాగతించిన సీఎం

అమరావతి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): నాలా చట్టం అంశంపై గురువారం ఏపీ క్యాబినెట్ సమావేశంలో చర్చ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పలు సూచనలు చేశారు. నాలా చట్టం మార్పు వల్ల కలిగే ఆర్థిక ప్రయోజనాలను రాష్ట్రంలోని పంచాయతీలకు అందించాలని ఆయన సూచించారు. తద్వారా గ్రామాలు ఆర్థికంగా బలోపేతం అవుతాయన్నారు. గ్రామాల వృద్ధి, అభ్యున్నతికి ఆ నిధులు వెచ్చించవచ్చన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలైన తాగునీరు, పారిశుధ్యం, డ్రైన్ల నిర్మాణం, పార్కుల అభివృద్ధి, రోడ్ల నిర్మాణానికి ఈ నిధులు ఖర్చు చేయడం వల్ల గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి దోహదం చేస్తుందన్నారు. పవన్ చేసిన సూచనలను స్వాగతించిన సీఎం చంద్రబాబు... నాలాపై ఇచ్చే జీఓలో పవన్ కల్యాణ్ ప్రతిపాదనలను చేర్చాలని అధికారులను ఆదేశించారు.

సరికొత్తగా అవేర్ 2.0

» వాతావరణ మార్పులను 7 రోజుల ముందే పసిగట్టి.. ముందస్తు సమాచారం అందించే ఆధునిక వ్యవస్థ

» వాతావరణం, విపత్తుల నిర్వహణ, నదుల ప్రవాహం, భూగర్భ జలాలు, పంటల స్థితిపై హెచ్చరికలు జారీ

అమరావతి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): వాతావరణం ముందస్తు అంచనాలు, విపత్తు నిర్వహణ, జలాశయాల్లో నీటి నిల్వలపై పర్యవేక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం అత్యాధునిక సాంకేతికతను వినియోగిస్తోంది. ఇప్పటికే 'అవేర్' ద్వారా వివిధ అంశాల్లో ప్రజలకు ముందస్తు సమాచారాన్ని అందిస్తోన్న ప్రభుత్వం మరిన్ని రంగాలను కూడా ఈ వ్యవస్థ కిందకు తీసుకురావాలని నిర్ణయించింది. భారీ వర్షాలు, పిడుగులు, తుపాన్లు, తీవ్రస్థాయి ఉష్ణోగ్రతల వంటి అంశాలపై ముందస్తు సమాచారాన్ని సేకరించి, అప్రమత్తం చేయడం ద్వారా ప్రజల ప్రాణాలు, ఆస్తుల్ని కాపాడేలా ఈ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఏపీ వెదర్ ఫోర్ కాస్టింగ్ అండ్ ఎర్లీ వార్నింగ్ రిసెర్చ్ సెంటర్- అవేర్ 2.0 వ్యవస్థను ఆర్టీజీఎస్ ఏర్పాటు చేసింది. నదులు, జలశయాల్లో నీటి నిల్వలు, భూమిలో తేమ, గాలి నాణ్యత, కాలుష్యం, భూగర్భ జలాలు.. ఇలా వేర్వేరు అంశాలను పర్యవేక్షించేలా, ప్రజలకు వేగంగా సమాచారాన్ని అందించేలా 'అవేర్ 2.0'ను రూపొందించినట్టు ఆర్టీజీఎస్ అధికారులు తెలిపారు. అవేర్ 2.0 వ్యవస్థ వాతావరణంలో వచ్చే మార్పులను 7రోజుల ముందుగానే పసిగట్టి, హెచ్చరికలు జారీ చేయనుంది. దీంతో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమై ప్రజల ప్రాణాలు, ఆస్తులు, మూగజీవాలను కాపాడేందుకు అవకాశం ఉంటుంది. అవేర్ 2.0తో విపత్తు నష్టాలను తగ్గించి, మరణాలను నివారించే అవకాశం ఉంటుందని ఆర్టీజీఎస్ చెబుతోంది. కచ్చితమైన ముందస్తు సమాచారం ఆధారంగా విపత్తుల సమయాల్లో రైతుల పంటల నిర్వహణ, మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లకుండా ముందస్తు హెచ్చరికలు జారీ చేయవచ్చని ఆర్టీజీఎస్ అధికారులు తెలిపారు. మరోవైపు రాష్ట్రంలోని 109 జలాశయాలు, కృష్ణా, గోదావరి వంటి ప్రధాన నదులపై రియల్ టైమ్ మానటరింగ్‌ను కూడా చేయవచ్చని పేర్కొన్నారు. అవేర్ 2.0 ద్వారా వ్యవసాయం, మత్స్య, రవాణా, విద్యుత్, జలవనరుల వంటి 42 విభాగాలకు సేవలు అందనున్నాయని చెప్పారు. aware.ap.gov.in వెబ్‌సైట్‌లో వాతావరణ సూచనలు, జలాశయాల స్థితి, నదుల ప్రవాహాలపై లైవ్ డేటా అందుబాటులో ఉంటుందన్నారు. భూగర్భ జలాల లభ్యతతో పాటు మండల, జిల్లాల వారీగా పంటలకు వచ్చే తెగుళ్ల వంటి అంశాల్లోనూ అవేర్ హెచ్చరికలు జారీ చేస్తుందని చెప్పారు. సముద్రంలో ఏఏ ప్రాంతాల్లో చేపల లభ్యత ఎక్కువగా ఉంటుందో కూడా ఉపగ్రహ చిత్రాల ఆధారంగా తెలియజేస్తుందని వెల్లడించారు.

నాలా చట్టం రద్దుకు ఆర్డినెన్స్

» దాని స్థానంలో డెవలప్‌మెంట్ చార్జీల వసూలుకు సమ్మతి


» పర్యాటక ప్రాజెక్టులకు ప్రభుత్వ భూములు

» కుప్పం,దగదర్తిల్లో గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టులు

» రాజధాని గ్రామాలకు 904 కోట్లతో వసతులు

» క్యాబినెట్ సమావేశంలో కీలక నిర్ణయాలు

» వివరాలు వెల్లడించిన మంత్రి పార్థసారథి



అమరావతి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ వ్యవసాయభూమి (సాగేతర అవసరాలకు మళ్లింపు- నాలా) చట్టం 2006 ను ఉపసంహరిస్తూ ఆర్డినెన్స్ తీసుకురావాలన్న ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో నాలా చట్టం రద్దవుతున్న నేపథ్యంలో దాని స్థానంలో రిజిస్ట్రేషన్ శాఖ ఆధ్వర్యంలో భూమి అభివృద్ధి చార్జీలను (ల్యాండ్ డెవలప్‌మెంట్ ఫీజులు) వసూలుచేయాలన్న ప్రతిపాదననూ ఆమోదించారు. సాగేతర అవసరాలకు మళ్లించే భూమి విలువలో నాలుగు శాతాన్ని డెవలప్‌మెంట్ ఫీజుగా వసూలుచేయాలన్న సూచనకూ ఆమోదం లభించింది. గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అలాగే, వేస్ట్ రీసైకింగ్ పాలసీ, క్వాంటమ్ కంప్యూటింగ్ హబ్, సచివాలయాల్లో డిప్యుటేషన్, ఔట్ సోర్సింగ్‌ప్రాతిపదికన 2778 పోస్టుల భర్తీ, రాజధాని పరిధిలోని 29 గ్రామాల్లో రూ.904 కోట్లతో మౌలిక వసతుల కల్పన, పర్యాటక ప్రాజెక్టులకు ప్రభుత్వ భూముల కేటాయింపు.. ఇలా మొత్తం 33 ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ వివరాలను సచివాలయంలో సమాచారశాఖ మంత్రి పార్థసారథి మీడియాకు వెల్లడించారు.

ముఖ్యాంశాలు..

- పెరుగుతున్న పారిశ్రామిక వ్యర్థాల సవాళ్లు, పునఃవినియోగంలోని ఆర్థిక అవకాశాలను దృష్టిలో ఉంచుకుని 2025-30 కాలానికి తయారుచేసిన ఏపీ సర్క్యులర్ ఎకానమీ, వ్యర్థ పదార్థాల పునర్వినియోగ విధానం (4.0)కు ఆమోదముద్ర.
- ఏపీ టూరిజం భూమి కేటాయింపు విధానానికి అనుబంధ అంశాల చేర్పునకు సంబంధించిన ప్రతిపాదనకు సమ్మతి. ఇందులో భూమి కేటాయింపుకు అర్హత, లాండ్ బ్యాంక్ నోటిఫికేషన్, పర్యాటక ప్రాజెక్టుల కోసం ప్రకటించిన భూములను కేటాయించే విధానం, ప్రకటించిన పరిమితుల ఆధారంగా ప్రతిపాదనలు, డీపీఆర్‌ల మూల్యాంకనం, ప్రాజెక్టు అమలు కాలపరిమితులు వంటి ముఖ్య అంశాలు చేర్చారు.
- అధికార భాషా సంఘం పేరు 'మండలి వెంకటకృష్ణారావు అధికార భాషా కమిషన్"గా మార్పు
- గుంటూరులో 2,954 గజాల మున్సిపల్ భూమిని 33 ఏళ్ల కాలానికి 2017 జూలై 30 నుంచి ఎకరానికి రూ.వెయ్యి అద్దె చెల్లించేలా టీడీపీ కార్యాలయానికి కేటాయిస్తూ ఇచ్చిన జీవో.340కు ఆమోదం.
- అమరావతిలోని 29 గ్రామాలకు రూ.904 కోట్లతో మౌలిక సదుపాయాల కల్పనకు పరిపాలనామోదం. సీఆర్‌డీఏ ప్రాంతంలోని వివిధ సంస్థలకు చేసిన భూమి కేటాయింపులపై సమీక్షకు సంబంధించిన మంత్రివర్గఉపసంఘం సిఫారసులకు ఓకే.
- సచివాలయాల చట్టం2023లోని వార్డు విద్య, డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ అనే దానిలో.. విద్య అనే పేరు తొలగింపు. సచివాలయాల్లో డిప్యుటేషన్, ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన 2,778 పోస్టుల భర్తీ.
- ఐఎంఎఫ్ఎల్, బీర్, వైన్, ఆర్‌టీడీ , విదేశీ మద్యం బ్రాండ్లకు టెండర్ కమిటీ ద్వారా ప్రాథమిక ధరల నిర్ణయానికి చేసిన ప్రతిపాదనకు సమ్మతి.
- మాన్యువల్ స్కావెంజర్స్, డ్రైలెట్రిన్‌లను శుభ్రం చేసేవారి ఉపాధి (నిషేధ)చట్టం- 1993 రద్దు తీర్మానాన్ని శాసనసభ ముందుంచే ప్రతిపాదనకు ఆమోదం.
- ఏపీ బెగ్గింగ్ నిషేధ చట్టం 1977ను సవరించాలని, దివ్యాంగులు, కుష్ఠువ్యాధి బాధితులు, ఇతర వైకల్యం కలిగిన వారి పట్ల వివక్షను సూచించే పదాలను తొలగిస్తూ తయారుచేసిన ముసాయిదా బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టాలని నిర్ణయించారు.
- కాకినాడ జిల్లా గండేపల్లి మండలం తల్లూరు గ్రామంలో తోట వెంకటాచలం పుష్కర లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లో పీఎస్‌సీ ప్రెషర్ మెయిన్‌ను ఎంఎస్ ప్రెషర్ మెయిన్‌తో మార్చే పనికి టెండర్లు పిలవాలని నిర్ణయం. 5167.80 కోట్లకు పాలనామోదం.
- అల్లూరి సీతారామరాజు జిల్లాలోని చింతూరులో 50 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను రూ.33.94 కోట్లతో 100పడకల ఏరియా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయం. చిత్తూరు జిల్లా నారావారి పల్లెలో 30పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్.. 50 పడకల సీహెచ్‌సీగా అప్‌గ్రేడేషన్
- టెన్నిస్ క్రీడాకారుడు సాకేత్ మైనేనిని స్పోర్ట్స్ కోటా కింది డిప్యూటీ కలెక్టర్‌గా నియమిస్తూ నిర్ణయం.
- వైసీపీ హయాంలో హత్యకు గురైన పల్నాడు జిల్లాకు చెందిన చంద్రయ్య కుమారుడు వీరాంజినేయులకు జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం.
- ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలంలోని వడ్డిరాల, డొడియం గ్రామాల్లో 1200ఎకరాల ప్రభుత్వ భూమిని 33ఏళ్ల లీజుకు అదానీ సోలార్ ఎనర్జీ ఏపీ ఎయిట్ ప్రైవేట్ లిమిటెడ్‌కు కేటాయింపు.
- స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను ప్రోత్సహించే ప్రభుత్వ విధానానికి అనుగుణంగా 2006 చట్టం కింద మార్పిడికి అనుమతి పొందే ప్రక్రియను మరింత సులభతరం చేయాలని నిర్ణయం.
- డి.కేశవరావు అలియాస్ దున్నకేశవరావు అనే వ్యక్తిపై నమోదైన 16 కేసుల విచారణకు శ్రీకాకుళంలో స్పెషల్ కోర్టు ఏర్పాటుకు ఆమోదం.
- సముద్ర, అనుబంధ కార్యకలాపాలకు పెరుగుతున్న డిమాండ్లను తీర్చేవిధంగా ఏపీ సముద్ర విధానం సవరణకు ఆమోదం.
- చిత్తూరుజిల్లా కుప్పం, నెల్లూరు జిల్లా దగదర్తిలో గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయాల అభివృద్ధికి మౌలిక వసతులు, పెట్టుబడులశాఖ చేసిన ప్రతిపాదనకు సమ్మతి.
- చిత్తూరు జిల్లాలోని కుప్పం మండలం భైరుగాని పల్లె గ్రామంలోని ప్రభుత్వ భూమి కేంద్రీయ విద్యాలయ ఏర్పాటుకు ఉచితంగా కేటాయింపు.
- గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండం, నడింపాలెం గ్రామంలోని 12.96 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ప్రభుత్వ భూమిలో కేంద్రం నిధులతో సెంట్రల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఫర్ యోగా అండ్ నేచురోపతి సంస్థ ఏర్పాటుకు ఆమోదం.
- 62ఏళ్లు నిండిన అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లకు వరుసగా రూ.లక్ష, రూ.40వేలు గ్రాట్యుటీగా చెల్లించాలంటూ మహిళా,శిశు సంక్షేమశాఖ చేసిన ప్రతిపాదనకు మంత్రి మండలి ఆమోదం.

కి'లేడి' అరాచకాలపై దర్యాప్తు ముమ్మరం

» అరుణ ఫోన్‌లో రికార్డుల పరిశీలన.. రౌడీషీటర్ శ్రీకాంత్‌పైనా ఆరా

నెల్లూరు (క్రైం), ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన నెల్లూరు కి'లేడి' నిడిగుంట అరుణ అరాచకాలపై పోలీసులు విచారణ ముమ్మరం చేశారు. ఆమె ప్రియుడు, రౌడీషీటర్ అవిలేలి శ్రీకాంత్ ఆగడాలపైనా వివరాలు సేకరిస్తున్నారు. ఓ బిల్డర్ ఫిర్యాదు మేరకు కోవూరు పోలీసులు ఆమెను బుధవారం అరెస్టు చేసి, ఒంగోలు జైలుకు తరలించిన విషయం తెలిసిందే. కోవూరు స్టేషన్‌లో నమోదైన కేసుతో పాటు రాష్ట్రవ్యాప్తంగా అరుణ చేసిన అరాచకాలపై పోలీసులు లోతుగా విచారిస్తున్నారు. ఆమె ఫోన్‌లోని వాయిస్, వీడియో రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు సమాచారం. నెల్లూరులోని పోలీసు అతిథిగృహంలో అదనపు ఎస్పీ సీహెచ్ సౌజన్య గురువారం అరుణకు సంబంధించిన పలు విషయాలపై పలువురిని విచారించినట్లు తెలిసింది. అలాగే శ్రీకాంత్, అరుణలకు గత ప్రభుత్వంలో సహకరించిన పోలీసు అధికారులు, ఈ ప్రభుత్వంలో సహకరించిన అధికారులు, సిబ్బంది, ఏఆర్ సిబ్బంది ఎవరో జాబితా సిద్ధంచేస్తున్నట్లు తెలుస్తోంది. ఇది బయటకు పొక్కడంతో పోలీసు వర్గాల్లో గుబులు మొదలైంది. కాగా.. విజయవాడ నుంచి ఓ వ్యక్తి పోలీసు అధికారులకు ఫోన్ చేసి తన వద్ద అరుణ పెద్ద మొత్తంలో నగదు తీసుకుని మోసం చేసిందని, న్యాయం చేయాలని కోరారు. నెల్లూరుకు వచ్చి ఫిర్యాదు చేయాలని వారు సూచించారు. శుక్రవారం అతడు వస్తాడని తెలిసింది. కి'లేడీ'పై ఫిర్యాదు చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా బాధితులు నెల్లూరుకు రానున్నట్లు సమాచారం.

ఏడు రోజుల్లో వివరణ ఇవ్వండి

» అమరావతిపై దుష్ప్రచారం చేసిన అధికారికి మెమో

అమరావతి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు అమరావతి మునిగిపోయిందంటూ సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం చేసిన ప్రభుత్వ అధికారి ఎస్. సుభాష్‌చంద్రబోస్‌కు వాణిజ్యపన్నుల శాఖ గురువారం మెమో ఇచ్చింది. ఏడు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించింది. 'ఆంధ్రజ్యోతి' సహా ఇతర మీడియాల్లో వచ్చిన కథనాల ఆధారంగా ఈ మెమో జారీ చేసినట్టు తెలిపింది సుభాష్ వాణిజ్య పన్నుల శాఖ విభాగం తిరుపతి ప్రాంతీయ ఆడిట్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్నారు. అమరావతిపై అవాస్తవాలు ప్రచారం చేస్తూ ఫేస్‌బుక్‌లో 18న వివాదాస్పద పోస్టులు పెట్టడాన్ని క్రమశిక్షణారాహిత్యంగా ఆ శాఖ చీఫ్ కమిషనర్ బాబు.ఎ మెమోలో పేర్కొన్నారు. ఏపీ సివిల్ సర్వీసెస్ నిబంధనలు 1964లోని రూల్ 3(1), 3(2), రూల్ 17ను ఉల్లంఘించినట్టు తెలిపారు. ఈ ఉల్లంఘనలపై ఏడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించారు. ప్రతిపక్ష నాయకులు ప్రభుత్వంపైనా, ప్రభుత్వ కార్యక్రమాలపైనా దుష్ప్రచారం చేయడం సహజమే. కానీ, ఒక ప్రభుత్వ అధికారి వాళ్లకి వంత పాడడం క్రమశిక్షణారాహిత్యం... అందుకే ప్రభుత్వం వివరణ కోరుతూ మెమో జారీ చేసిందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

పిన్నెల్లి సోదరుల ముందస్తు బెయిల్‌పై తీర్పు రిజర్వ్

» పిటిషన్‌పై హైకోర్టులో ముగిసిన వాదనలు

టీడీపీ నేతలు జవిశెట్టి వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు హత్య కేసులో నిందితులైన వైసీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు పిన్నెల్లి వెంకటరామిరెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్లపై హైకోర్టులో వాదనలు ముగిశాయి. ఇరువైపుల వాదనలు ముగియడంతో తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు కోర్టు ప్రకటించింది. పిటిషనర్లపై తొందరపాటు చర్యలు తీసుకోవద్దని గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులు.. తీర్పు వరకు అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వెణుతురుమల్లి గోపాలకృష్ణారావు ఉత్తర్వులు ఇచ్చారు. పల్నాడు జిల్లా, వెల్దుర్తి పోలీసులు నమోదు చేసిన కేసులో తమకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ పిన్నెల్లి సోదరులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై గురువారం హైకోర్టు తుది విచారణ జరిపింది. పోలీసుల తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించారు. "పిన్నెల్లి సోదరుల ప్రోద్బలం, మద్దతుతోనే హత్యలు జరిగాయి. సాక్షులు వాంగ్మూలం కూడా ఇచ్చారు. హత్యలో భాగస్వాములైన వ్యక్తులతో పిన్నెల్లి సోదరుల ఫోన్ సంభాషణ రికార్డు, సాంకేతిక ఆధారాలు ఉన్నాయి. హత్యకు పిటిషనర్లే కుట్రపన్నారనేందుకు ప్రాథమిక ఆధారాలు ఉన్నాయి. వాస్తవాలు వెలికి తీయాలంటే పిటిషనర్ల కస్టోడియల్ విచారణ అవసరం. మధ్యంతర ఉత్తర్వుల కారణంగా వారిని విచారించడం సాధ్యపడలేదు. పిటిషనర్లు రాజకీయంగా, ఆర్థికంగా బలవంతులు. కేసు దర్యాప్తును ప్రభావితం చేస్తారు. ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టివేయండి" అని ఏజీ విన్నవించారు. ఫిర్యాదుదారుడు తోట అంజనేయులు తరఫున సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు వాదనలు వినిపించారు. కేసులో ఏ1గా ఉన్న పిన్నెల్లి వెంకటరామిరెడ్డి, రామకృష్ణారెడ్డి చాలాకాలంగా పరారీలోనే ఉన్నారన్నారు. వారికి ముందస్తు బెయిల్ మంజూరు చేయవద్దన్నారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది ఓ.మనోహర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. టీడీపీలో ఆధిపత్య పోరు కారణంగా హత్యలు జరిగాయన్నారు. హత్యల విషయంలో పిటిషనర్లకు ఎలాంటి పాత్ర లేదన్నారు.



శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ రైల్వే స్టేషన్‌లో గూడ్స్ వ్యాగన్‌లోకి కియ కార్లను ఎక్కిస్తున్న సిబ్బంది

కియ కార్ల తరలింపునకు డబుల్ డెక్కర్ గూడ్స్ రైలు

» పెనుకొండ రైల్వే స్టేషన్ నుంచి 264 కార్ల తరలింపు

పెనుకొండ రూరల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలోని కియ పరిశ్రమ నుంచి కార్ల తరలింపు కోసం ప్రత్యేకంగా డబుల్ డెక్కర్ గూడ్స్ రైలును ఏర్పాటు చేశారు. ఇక్కడ తయారైన కార్లను దేశ, విదేశాలకు తరలిస్తుంటారు. ఇప్పటి వరకూ ఒక విడతలో సింగిల్ వ్యాగన్‌ల ద్వారా వంద కార్లను తరలించేవారు. తాజాగా గురువారం పెనుకొండ రైల్వే జంక్షన్ మీదుగా డబుల్ డెక్కర్ గూడ్స్ వ్యాగన్ ద్వారా 264 కార్లను ఢిల్లీకి తరలించారు. పెనుకొండ వద్ద 2019లో కియ ఇండియా కార్ల ఉత్పత్తులను ప్రారంభించింది. ఇప్పటి వరకూ 17లక్షల కార్లను ఉత్పత్తి చేసినట్లు కియ ఇండియా పీఆర్‌ఓ హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఏడాదికి 3లక్షల కార్ల చొప్పున తయారవుతున్నాయన్నారు. కియ కార్లకు భారతదేశంలో డిమాండ్ పెరిగిందని, వినియోగదారులకు సత్వరమే అందించేందుకు డబుల్ డెక్కర్ గూడ్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

డీఎస్సీ మెరిట్ జాబితా నేడే!



» అధికారిక వెబ్‌సైట్లలోనే సమాచారం పొందాలి

» మెగా డీఎస్సీ కన్వీనర్ కృష్ణారెడ్డి వెల్లడి

అమరావతి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ మెరిట్ జాబితాను శుక్రవారం విడుదల చేయనున్నారు. డీఎస్సీ అధికారిక వెబ్‌సైట్‌తో పాటు జిల్లా విద్యాశాఖ అధికారుల వెబ్‌సైట్‌లో ఈ జాబితాలను అందుబాటులో ఉంచనున్నట్లు డీఎస్సీ-2025 కన్వీనర్ ఎం.వి.కృష్ణారెడ్డి వెల్లడించారు. అభ్యర్థులు ఈవెబ్‌సైట్‌ల నుంచి మాత్రమే సమాచారం పొందాలని సూచించారు. దళారుల మాటలు, తప్పుడు ప్రచారాలను నమ్మి మోసపోవద్దని అభ్యర్థులకు సూచించారు. మెగా డీఎస్సీ పరీక్షలను షెడ్యూలు ప్రకారం, సాంకేతిక భద్రతతో, పారదర్శకంగా, పకడ్బందీగా, విజయవంతంగా నిర్వహించామని పేర్కొన్నారు. తర్వాత టెట్ మార్కులను సరిచేసుకోవడానికి అభ్యర్థులకు తగిన సమయం ఇచ్చామని, అభ్యర్థుల స్కోర్ కార్డులు విడుదల చేసిన తర్వాత కూడా ప్రతిభ కనబరిచిన ఏ అభ్యర్థీ నష్టపోకూడదనే ఆలోచనతో టెట్ మార్కుల వివరాలు సవరించుకోవడానికి ఆఖరి అవకాశం కూడా ఇచ్చామని తెలిపారు. స్పోర్ట్స్ కోటా మెరిట్ జాబితా పూర్తయిన నేపథ్యంలో మెరిట్ లిస్ట్ విడుదల చేయడానికి ఏర్పాట్లు చేశామని వివరించారు. కాగా, మెరిట్ లిస్టు ఆధారంగా డీఈవోలు ఆయా జిల్లాల్లో పోస్టుల సంఖ్యకు అనుగుణంగా కటాఫ్‌ను నిర్ణయించనున్నారు. ఎంపికైన అభ్యర్థులను ఒక ఉద్యోగానికి 1:1 ప్రాతిపదికన సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు పిలుస్తారు. వెరిఫికేషన్‌కు పిలవడమంటే ఉద్యోగానికి ఎంపికైనట్లే!

వెరిఫికేషన్‌కు ముందే సర్టిఫికెట్ల అప్‌లోడ్

వివిధ కేటగిరీలకు సంబంధించిన పోస్టుల నియామక ప్రక్రియలో భాగంగా 'జోన్ ఆఫ్ కన్సిడరేషన్'లోకి వచ్చిన అభ్యర్థులకు తమ వ్యక్తిగత లాగిన్ ద్వారా కాల్ లెటర్ అందిస్తామని కృష్ణారెడ్డి పేర్కొన్నారు. వారు ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు ఇటీవల తీసుకున్న కుల ధ్రువీకరణ పత్రం, గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించిన మూడు సెట్లు జెరాక్స్ కాపీలు, 5 పాస్‌పోర్టు సైజు ఫోటోలతో సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు వ్యక్తిగతంగా హాజరుకావాల్సి ఉంటుందన్నారు. వెరిఫికేషన్‌కు హాజరుకావడానికి ముందే సంబంధిత సర్టిఫికెట్లను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయడం తప్పనిసరని తెలిపారు. వెరిఫికేషన్ సమయంలో సమర్పించాల్సిన సర్టిఫికెట్ల వివరాల చెక్‌లిస్ట్ డీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుందన్నారు. సర్టిఫికెట్ల పరిశీలన సమయంలో అభ్యర్థి హాజరు కాకపోయినా, సరైన సర్టిఫికెట్లు సమర్పించకపోయినా, తగిన విద్యార్హతలు లేనట్లుగా రుజువైనా.. మెరిట్ లిస్టులో తర్వాత ఉన్న అభ్యర్థికి అవకాశం ఇస్తారు. ఉపాధ్యాయ ఉద్యోగం ఇప్పిస్తామంటూ దళారులు చెప్పే మాటలు, సోషల్ మీడియా వేదికగా అసత్య వదంతులను నమ్మి మోసపోవద్దని డీఎస్సీ కన్వీనర్ ఎం.వి.కృష్ణారెడ్డి సూచించారు. దుష్ప్రచారం ద్వారా అభ్యర్థులను ఆందోళనకు గురిచేయడంతో పాటు వారి మనోభావాలను దెబ్బతీసే ప్రయత్నం జరుగుతోందన్నారు. ఇలాంటి వదంతులను సృష్టించి, వ్యాప్తి చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో అభ్యర్థులు కేవలం డీఎస్సీ అధికారిక వెబ్‌సైట్‌లో ఉన్న ప్రకటనలు, నోటిఫికేషన్లు, ఫలితాలను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. అభ్యర్థుల వ్యక్తిగత స్కోర్లు, మెరిట్ లిస్ట్, ఎంపిక జాబితాలు, నియామక ఉత్తర్వులు మెగా డీఎస్సీ అధికారిక వెబ్‌సైట్, జిల్లా విద్యాధికారి వెబ్‌సైట్, క్యాండిడేట్ లాగిన్‌లో, ప్రభుత్వం ద్వారా విడుదల చేసే పత్రికా ప్రకటనల ద్వారా మాత్రమే తెలియజేస్తామని తెలిపారు.

విధి ఆడిన వికృత క్రీడ..!

» రోడ్డు ప్రమాదంలో వెన్నువిరిగి 14 ఏళ్లుగా మంచంలోనే

» ప్రభుత్వం, దాతల సాయం కోసం ఎదురుచూపు

గుంటూరు (విద్య), ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఆ పిల్లాడికి ఆటలంటే పిచ్చి.. ఫుట్‌బాల్‌కు అయితే వీరాభిమాని.. క్రీడల్లో అమోఘంగా రాణించి హైదరాబాద్ స్పోర్ట్స్ స్కూల్‌లో సీట్ సాధించాడు. దాదాపు ఏడేళ్లపాటు (10వ తరగతి వరకు) అక్కడే చదివి... స్పోర్ట్స్ స్కూల్ తరఫున జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తాచాటాడు. ఫుట్‌బాల్ స్టార్‌గా ఎదగాలని ఎన్నో కలలుకన్న ఆ విద్యార్థిపై విధి చిన్నచూపు చూసింది. 14 ఏళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆ విద్యార్థి.. ఇప్పటికీ కోలుకోలేకపోయాడు. ప్రమాదంలో వెన్ను విరిగి నడుము కిందనుంచి, కాళ్ల వరకూ స్పర్శ లేకుండా మంచంపై జీవచ్ఛవంలా పడి ఉన్నాడు. గుంటూరు హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన దుగ్గిరాల ఎఫ్రాయిమ్ దత్తుబాబు దీనస్థితి ఇది..!

సర్టిఫికెట్ల కోసం వెళ్లి.. జీవచ్ఛవంలా..: ఎఫ్రాయిమ్ పదో తరగతి పాస్ అయిన తర్వాత 2012లో హైదరాబాద్ స్పోర్ట్స్ స్కూల్‌కు సర్టిఫికెట్ల కోసం వెళ్లాడు. తిరిగి ఆటోలో వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన వెన్నెముకకు తీవ్రగాయమైంది. తల్లిదండ్రులు ఎన్ని ఆస్పత్రులు తిప్పినా కనీసం లేచి నిలబడలేకపోయాడు. ఫలితంగా 14 ఏళ్లుగా మంచానికే పరిమితమయ్యాడు. నడుము నుంచి కింద అరికాళ్ల వరకు స్పర్శ లేదు. రక్త ప్రసరణ సక్రమంగా జరగక ఆ ప్రాంతం మొత్తం నల్లగా కమిలిపోయింది. ఒకవైపే తిరిగి పడుకోవడంతో మెడ భాగం నుంచి కాళ్ల వరకు పుండ్లు పడ్డాయి. ఆరుపదుల వయసు దాటిన తల్లి రూతురాణి ఓవైపు కుటుంబాన్ని సంరక్షించుకుంటూనే మరోవైపు కొడుకుని కంటికి రెప్పలా కాపాడుకుంటోంది. పెద్ద కుమారుడు కరోనాతో మరణించగా చిన్న కుమారుడిని ఈ స్థితిలో చూసి తల్లిదండ్రులు తల్లడిల్లిపోతున్నారు. ఎఫ్రాయిమ్ తండ్రి విజయ దత్తుబాబు ప్రభుత్వ శాఖలో చిరుద్యోగిగా పనిచేసి పదవీ విరమణ చేశారు. దీంతో ఎఫ్రాయిమ్‌కు పెన్షన్ కూడా అందని స్థితి. తన తండ్రికి నెలకు వచ్చే రూ.17 వేల పింఛనుతోనే కుటుంబాన్ని నెట్టుకు రావాల్సిన దుస్థితి నెలకొందని ఎఫ్రాయిమ్ వాపోతున్నాడు. ప్రభుత్వం ఆర్థిక చేయూత అందిస్తే కుమారుడిని కాపాడుకుంటామని తల్లి రూతురాణి వేడుకుంటున్నారు. భర్త కూడా శ్వాసకోశ సంబంధిత సమస్యలతో బాధతున్నాడని ఆమె వాపోయారు. సాయం చేయదలచిన దాతలు గుంటూరులోని హౌసింగ్ బోర్డ్ కాలనీ, కరెంట్ ఆఫీస్ రోడ్డు అనే చిరునామాలోగానీ, 9000980984 ఫోన్ నంబర్‌లోగానీ సంప్రదించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



మంచానికే పరిమితమైన ఎఫ్రాయిమ్ దత్తుబాబు

లిక్కర్ స్కామ్‌లో మరో 13.29 కోట్లు జప్తు

(మొదటి పేజీ తరువాయి)

చేస్తాయని తెలుస్తోంది. ఏసీబీ కోర్టులో గురువారం సిట్ అధికారులు పిటిషన్ వేయనున్నారు. తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం మాచన్‌పల్లి, దామర్లపల్లిలో రాజ్ కసిరెడ్డి పేరుతో కొనుగోలు చేసిన 27.06 ఎకరాల భూమి, అతడి తల్లి సుభాషిణి పేరుతో కొన్న 3.14 ఎకరాల భూమి జప్తునకు ప్రభుత్వం అనుమతిచ్చింది. అలాగే రాజ్ కుమార్తె పేరుతో ఉన్న ఈశానీ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ పేరిట గచ్చిబౌలిలో కొనుగోలు చేసిన 326 చదరపు గజాల స్థలాన్ని జప్తు చేసేందుకు అనుమతి మంజూరు చేసింది. ఈ రెండు ఆస్తుల విలువ ప్రభుత్వం లెక్కల ప్రకారం 10.29కోట్లు ఉంది. ఇప్పటికే సిట్ గుర్తించి అటాచ్ చేసిన భూమి కొనుగోలు వ్యవహారంలో జరిగిన లావాదేవీల్లో విక్రేతలు కౌశిక్ కుమార్, అభిషేక్ అగర్వాల్ తిరిగి చెల్లించిన సొమ్ము బ్యాంకు ఖాతాను సైతం సిట్ సీజ్ చేయనుంది. రాజ్ కసిరెడ్డి బినామీ కంపెనీల్లో ఒకటైన యూఎస్‌ఐ కార్పొరేట్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యాంకు ఖాతాకు అగర్వాల్ రూ.3కోట్లు తిరిగి పంపించారు. పైమూడు ఆస్తుల కొనుగోలుకు వినియోగించింది లిక్కర్ ముడుపులేనని సిట్ ఆధారాలు సేకరించింది. ఆస్తుల జప్తునకు ఆధారాలతో కోర్టులో పిటిషన్ వేసేందుకు సిద్ధమవుతోంది. లిక్కర్ స్కామ్‌లో సిట్ ఇదివరకే నిందితులకు చెందిన పలు ఆస్తులు, నగదు సీజ్ చేసిన సంగతి తెలిసిందే. కోర్టు ఆదేశాల మేరకు ఈ మొత్తాన్ని బ్యాంకులో డిపాజిట్ చేసింది. నిందితులతో పాటు డిస్టిలరీలు, బంధువులకు చెందిన బ్యాంకు ఖాతాల్లో నిధులను కూడా సిట్ అధికారులు ఫ్రీజ్ చేశారు. దర్యాప్తు అధికారులు ఇప్పటి వరకూ సుమారు 120 కోట్ల రూపాయల విలువైన ఆస్తులు, నగదు గుర్తించినట్లు తెలుస్తోంది. ఇందులో రాజ్ కసిరెడ్డితో పాటు సహ నిందితులు ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, బాలాజీ గోవిందప్ప బినామీ ఆస్తులు కూడా ఉన్నట్లు సమాచారం.

లిక్కర్ నిందితులకు బెయిల్‌పై 28న తీర్పు: విజయవాడ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో నిందితులు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లపై తీర్పు వాయిదా పడింది. ప్రధాన నిందితుడు కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డితో పాటు సజ్జల శ్రీధర్‌రెడ్డి, పైలా దిలీప్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లపై గురువారం వాదనలు ముగిశాయి. వాటిపై తీర్పును 28న వెలువరిస్తామని ఏసీబీ కోర్టు న్యాయాధికారి పి.భాస్కరరావు వెల్లడించారు.

కాకాణి కేసుల వివరాలన్నీ మా ముందు ఉంచండి

» పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు హైకోర్టు ఆదేశం

అమరావతి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): క్వార్ట్జ్ అక్రమ మైనింగ్ వ్యవహారంలో పొదలకూరు పోలీసులు నమోదు చేసిన కేసులో బెయిల్ మంజూరు చేస్తూ విధించిన షరతులను సవరించాలని కోరుతూ వైసీపీ నేత కాకాణి గోవర్ధన్‌రెడ్డి వేసిన అనుబంధ పిటిషన్‌పై హైకోర్టు విచారణ జరిపింది. కాకాణిపై నమోదైన కేసుల వివరాలు, ఆయా కేసుల్లో కోర్టులు విధించిన షరతులను తమ ముందు ఉంచాలని కాకాణి తరఫు న్యాయవాదిని, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను ఆదేశించింది. విచారణను నేటికి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు ఉత్తర్వులు ఇచ్చారు. అంతకుముందు కాకాణి తరఫు సీనియర్ న్యాయవాది ఓ.మనోహర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. బెయిల్ మంజూరు సందర్భంగా కోర్టు పలు షరతులు విధించిందన్నారు. కేసులో చార్జ్‌షీట్ దాఖలు చేసేవరకు నెల్లూరు జిల్లాలోకి ప్రవేశించడానికి వీల్లేదని, ప్రతి ఆదివారం దర్యాప్తు అధికారి ముందు హాజరుకావాలనే షరతులు ఉన్నాయన్నారు. ఇతర కేసుల్లోనూ బెయిల్‌కు షరతులు విధించారన్నారు. నెల్లూరు జిల్లాలో ప్రవేశించకూడదన్న షరతు కారణంగా దర్యాప్తు అధికారి ముందు హాజరుకాలేని పరిస్థితి ఉందన్నారు. ఈ వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. కాకాణిపై కేసుల వివరాలు, ఆయా షరతులను పరిశీలించిన అనంతరం షరతుల సవరణపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.